ఈ సంచికలో ...

కథలు

4. పిశాచం పిలిచింది_సుజనశ్రీ.
28. మీడియం శకుంతల_శ్యాంబాబు.
72. 10 గంటలసేపు ప్రపంచానికే ప్రమాదం
—కొమ్మూరి సాంబశివరావు.
110. నేరానికి సంకెళ్ళు_సురేఖ.
136. రక్తం పీల్చే రాకాసి_సంపత్.
160. మృగంలాంటి మనిషి_డా. పెందుర్తి మాస్టర్జీ.
176. కనపడుటలేదు_కె. నాగేశ్వరరావు.
192. అంతరిక్షయాత్ర_రమణశ్రీ.

శీర్షికలు

11. అపరాధ పరిశోధన పోటీ_77.
24. పాఠకుల ప్రశ్నలు?
53. అపరాధపరిశోధన పోటీ_75 (ఫలితాలు)
59. పాఠకుల పరిశోధన పోటీ.
66. ఈ నెల జోక్స్_కోనే నాగ వెంకట ఆంజనేయులు.
94. హమేషా_హంగామా
115. అపస సప్లిమెంట్ ఫలితాలు.
131. మీ తీర్పు ఏమిటి?
153. ఈ నెల జోక్స్_ఆడారి వెంకటరమణ.
159. హోమ్ డెలివరీ.
173. లీడర్స్ క్లబ్.
215. క్రైమ్‌లో తమాషాలు.
221. ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ. 222. లేఖలు.

ఇంకా_చంద్ర కార్టూన్లు, మీకు తెలుసా, చెప్పాలనండి, చెప్పుకోండి చూద్దాం, మరెన్నో ఆకర్షణలు!!...

ప్రాణం
పిలిచింది
సుజనశ్రీ

గోపయ్య మొక్కజొన్న చేలో మంచెమీద కూర్చున్నాడు మెళకువగా. రాత్రిపూట పందులూ, నక్కలూ వస్తాయని జాగ్రత్తగా పొలాన్ని కాపలా కాస్తున్నాడు. అతడి ప్రక్కనే వడిసెలలో రాళ్ళు ఉన్నయ్.

మొక్కజొన్న కంకులు గాలికి ఊగుతున్నయ్. పౌర్ణమి దగ్గర పడుతోంది కాబోలు చంద్రుడు వెన్నెలను ప్రపంచం మీదకు వెదజల్లుతున్నాడు.

ఉత్తరపు వేపు గట్టుమీదుగా ఎవరో స్త్రీ ఏడుస్తున్న ధ్వని వినిపించింది.

అతడు చెవులు రిక్కించి విన్నాడు. ఈవేళప్పుడు ఇక్కడకు ఏ స్త్రీ వస్తుంది? ఒకవేళ నక్క ఏదన్నా అరుస్తున్నదేమో! ఒక్కోసారి నక్కల అరుపులు అచ్చం ఆడదాని ఏడుపులాగే ఉంటుంది.

వడిసెలను చేత పుచ్చుకుని రాయి విసరటానికి రెడీగా లేచి నిలబడ్డాడు గోపయ్య మంచెమీద.

అతడి కళ్ళను అతడే నమ్మలేకపోయాడు. పొలం గట్టు మీద ఒకస్త్రీ కూర్చుని ఉంది. ఆమె సన్నగా ఏడుస్తున్నది. పాపం! ఎవరో ఏమిటో, ఇక్కడ ఎలా చిక్కుబడిపోయిందో! బహుశా పొరుగూరి మనిషి అయి ఉంటుంది. ఏదో ఊరు పోతూ దోవ తప్పిపోయి ఉంటుంది.

గోపయ్య మంచె దిగి వచ్చాడు. మొక్కజొన్న చేలో నుంచి దారి చేసుకుని నడిచి ఆమె దగ్గరకు చేరుకున్నాడు.

ఆమె గట్టుమీద కూర్చుని ఏడుస్తున్నది. ఆ మనిషికి పాతికేళ్ళు నిండి ఉండవచ్చు. నల్లగా ఉన్నా ఆకర్షణీయమైన వంపుల్తో ప్రౌఢలా ఉంది ఆమె.

"ఎవరు నీవు? ఇక్కడెలా చిక్కుబడిపోయావ్?" గోపయ్య సానుభూతిగా అడిగాడు.

ఆమె దగ్గరకు వచ్చిన వ్యక్తి వంక చూసింది. "మాది నడిగడ్డ పాలెం. రామన్నపేట బోవాల్సి దారితప్పిపోయాను. రాత్రిచూస్తే పొద్దుబోయినట్టుగా కనిపిస్తోంది. నా కెవరు దిక్కు!" అంది ఏడ్పు దిగమింగుకుంటూ.

"రామన్నపేట పోవాలా? ఇక్కడికి అయిదారు కోసు లుంటుంది. ఇప్పుడేం పోతావ్! పొలంగట్ల వెంట త్రాచు పాములుంటాయ్. నీకు అభ్యంతరం లేకపోతే నాతోపాటు మంచెమీద ఈ రాత్రి గడిపి, తెల్లారంగానే పోదువులే!" అన్నాడు గోపయ్య.

ఆమె ఒక్కక్షణం ఆలోచించింది.

"ఏం నాతో ఇక్కడ ఉండాలంటే నీకు భయమా?" గోపయ్య మళ్లీ అడిగాడు.

"ఎందుకు భయం! నీవు మాత్రం మడిసివి కావా? నన్నేం పీక్కు తింటావనా?" ఆమె ఏడ్పు ఆపి నవ్వటానికి ప్రయత్నించింది.

"మరయితే సందేహిస్తా వెందుకు?"

"మరేం లేదు! ఈ రాత్రికి ఇల్లు చేరకపోతే మా ఆయన మక్కె లిరగవంతాడు!"

"ఓస్! అంతే గదా! కాకపోయినా ఇంత రాత్రివేళ ఒంటరి దానివి ఎలా పోగలవు? కావాలంటే రేపుదయం నేను గూడ నీతోవచ్చి మీ ఆయనతో చెబుతాలే!"

ఆమె పెద్దగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావ్?" గోపయ్య అమాయకంగా అడిగాడు.

"నవ్వక ఏం చేసేది? రాత్రి రానందుకే మా ఆయన అను మాన పడ్తుంటే, నిన్నుగూడ వెంటబెట్టుకు వెళితే, నిన్నూ నన్నూ ఇద్దర్నీ నరికి అక్కడే పాతిపెడ్తాడు. రాత్రంతా

ఎవడి దగ్గరో పడుకున్నది గాక. రంకు మొగుడ్నికూడ ఎంట బెట్టుకు వచ్చావటే! అని విరుచుకు పడదూ!''

రంకు మొగుడనే సరికి గోపయ్య ఒళ్ళు పులకరించింది. అతడు పెళ్ళికాని బ్రహ్మచారి. స్త్రీ సుఖం అట్టే ఎరగని వాడు. ఎదురుగా మదించిన ఆడది మాటలు మాట్లాడుతుంటే అతడు నోరు తెరుచుకుని వింటున్నాడు. మధ్య మధ్యలో నవ్వుతున్నాడు ఆమె మాటలకు.

ఇద్దరూ మంచెమీదకి ఎక్కారు. పొలంలో వాళ్ళిద్దరూ తప్పిస్తే. చుట్టుపట్ల నరసంచారం లేదు.

''అన్నం తిన్నావా?'' గోపయ్య అడిగాడు ఆమెను.

''లేదు! సాయంకాలం అనంగా బయలుదేరాను. అయినా నా కాకలిగా లేదులే''

''ఫరవాలేదు. నేను బువ్వ తెచ్చుకున్నాను. అందులోనే ఇద్దరం తిందాం రా!'' అన్నాడు అన్నం మూట విప్పుతూ.

''నా కొద్దులే! నీవు తిను!'' అన్నది ఆమె.

''నీవు ఆకలితో ఉంటే నేను ఎలా ఊరుకోగలను? కానీయ్! నువ్వో ముద్దా, నేనో ముద్దా తిందాం! ఏం?''

''సరే కానీ! నీ ఇష్టం!'' అంది ఆమె.

గుడ్డలో వి స్తరిమీద ఇద్దరకు సరిపడా అన్నం ఉంది. ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ అన్నం తిని, తాబేటి కాయ లోని నీళ్లు త్రాగారు. త్రేవ్ అంటూ త్రేన్చాడు గోపయ్య.

''నీకు పెళ్ళయిందా?'' ఆమె అడిగింది.

''ఇంకాలేదు! నీకు పిల్లలా?'' గోపయ్య అడిగాడు.

''సరేలే! ఆభాగ్యం గూడానా? మా ఆయనకు అను మానం రోగం అయితే ఉందిగాని, పెళ్ళాన్ని సుఖపెట్టే యోగంలేదు. పెళ్ళయి ఇప్పటికి మూడేళ్ళయింది. ఇంత వరకు రెండుసార్లో లేక మూడుసార్లో కలిసి ఉంటాం.''

గోపయ్య లేచి మంచెమీద గడ్డిని విశాలంగా పరచి దాని మీద దుప్పటి పరిచాడు.

"నువ్వు పైన పడుకో! నేను వెళ్ళి ఆ గట్టుమీద పడుకుంటాలే!" అన్నాడు గోపయ్య.

"చాల్లేయ్యా! పెద్ద మొగోడివి! గట్టుమీద ఏ పురుగన్నా కరిస్తే ఏంగాను! రా! రా! ఇద్దరం ఇక్కడే సరి పుచ్చుకుందాం!" అని అతడి చేయి పట్టుకు లాగింది ఆమె.

గోపయ్య బ్యాలెన్స్ తప్పి ఆమెమీదపడ్డాడు. ఆమె రొమ్ముల స్పర్శ అతడ్ని వివశుడ్ని చేసింది. ఉలికిపాటుతో లేచి తమాయించుకోబోయాడు.

కాని ఆమె అతడ్ని లేవనీయలేదు. "రేపుదయానికి ఉంటామో ఛస్తామో! చేతికి దొరికిన అవకాశాన్ని చేతులారా పాడుచేసుకుంటామా!" అంది అతడి చెక్కిళ్లు నిమురుతూ.

ఆమె స్పర్శ తగిలిన చోటల్లా అతడి దేహం పులకించి పోతున్నది. ఒక ప్రక్క తనకు ఈ ప్రవర్తన కొత్తగా ఉంది. మళ్లి అంతలోనే గాభరా పడుతున్నాడు. ఒళ్ళు చెమటలు పట్టింది.

"ఒట్టి బెదురు గొడ్డువిలా గున్నావే! ఇదివరకెన్నడూ ఎంగిలి పడలేదా?" ఆమె కిలకిల నవ్వింది. తన పైచెంగు తీసి అతడి ముఖం మీది చెమటను తుడిచింది. ఎత్తుగా, రారమ్మని ఎగిరెగిరి పడుతున్న ఆమె వక్షోజాలు అతనిలో అగ్నిపర్వతాల్ని విరజిమ్ము తున్నయ్.

"తప్పు కదూ?" అన్నాడు గొంతు పెగలించుకొని.

"ఆడదానికి తప్పు! మగ మహారాజువి నీకేం! కొత్త అని భయపడకు! అన్నీ నేను నేర్పుతాగా! ఇలా అయితే రేపు పెళ్లాన్ని ఎలా ఏలుకుంటావు గోపయ్యా!"

"నీ పేరేమిటి?" ఆమె చెంపల్ని తన పెదాలతో స్పృశిస్తూ

అడిగాడు గోపయ్య.

"రాజమ్మ! బాగుందా?" ఆమె నవ్వింది అతన్ని తన మీదకు లాక్కుంటూ.

"బాగుంది!"

"ఏమిటి? నేనా? నా పేరా?"

"రెండూను!" అంటూ ఆమె చేతుల్లో కీలుబొమ్మ అయాడు.

కోడి కూసింది. గోపయ్యకు నిద్ర లేదు. ఆమె లేచి తన చీర సరిచేసుకుంది. జాకెట్ ముడి బిగించి కట్టుకుంది.

"తప్పదియ్యా! కుర్రాడివైనా నన్ను తినేశావ్? రేపు గూడా ఇదే వేళకు వస్తాను. ఉంటావు కదూ?"

"ఉంటాను! నేనెక్కడికి పోతాను? మరయితే మీ ఆయన కోప్పడడూ?"

"కోప్పడనీ! ఏం చేస్తాడు? నాలుగు తంతాడు. అంతేగా! నీవిచ్చే సుఖం ముందు ఆ దెబ్బలో లెక్కా! వస్తా! తూర్పు రేఖలు తెల్లారుతున్నాయ్" అంటూ ఆమె మంచె దిగి చేలగట్ల వెంబడే చకచకా నడిచి, కనుచూపు మేరలోంచి మాయమైంది.

గోపయ్య ఆమె కనుమరుగయే దాకా ఆమె వంకే చూస్తూండి పోయాడు.

రాత్రల్లా నిద్ర లేదేమో. దుప్పటి కప్పుకుని నిద్రలోకి పడ్డాడు. బారెడు పొద్దెక్కి ఎండ మీద పడి, చురుక్కు మనే సరికి గోపయ్య లేచి కూర్చున్నాడు.

అతడి కళ్లు మండుతున్నాయ్. కాళ్లు లాగేస్తున్నాయ్. పది లంఖనాలు బడ్డ వాడిలా డీలా పడిపోయాడు. అనుభవం కొత్త కదూ, కొత్తల్లో ఇలానే ఉంటుందేమో అని సరిపెట్టు న్నాడు అతడు.

దుప్పటి భుజాన పెట్టుకుని ఇంటికి చేరాడు గోపయ్య.

ఇంటి యజమానురాలు రావులమ్మ అతడ్ని చూసి ఆశ్చర్య పోయింది.

"ఏమిరా గోపిగా! అలా ఉన్నావేం?" అనడిగింది.

గోపయ్య తత్తర పడ్డాడు. "ఏమిటో నమ్మా? రాత్రంతా జ్వరం తగిలినట్టుగా ఉంది! రేపటికి అదే సర్దుకుంటుంది లేమ్మా!" అన్నాడు చివరకు.

"సరేలే! చద్ది తింటావా?"

"ఊఁ! తింటాను!" అంటూ పాకలోంచి తన సత్తు గిన్నెను కడుక్కుని వచ్చి కూర్చున్నాడు గోపయ్య.

జొన్న సంకటి, ఉల్లిపాయ, ఎండుకారం తెచ్చి ఆ గిన్నె నిండా వేసింది రావులమ్మ.

గోపయ్య ఆవురావురుమంటూ తినేశాడు. గిన్నె ఖాళీ అయిపోయింది. "అమ్మగారూ!" మళ్లీ కేకపెట్టాడు.

"ఏమిటిరా? నీళ్లు కావాలా?" అని లోపల్నుంచే కేక పెట్టింది రావులమ్మ.

"ఇంకొంచెం సంకటి కావాలమ్మా!" అన్నాడు గోపయ్య.

రావులమ్మ ఆశ్చర్యపడుతూ బయటికి వచ్చింది. ప్రతి రోజూ గిన్నె నిండకుండా పెట్టేది తను. అదే వాడికి ఎక్కువయి కొంత మిగిల్చేసే వాడు. అలాంటిది ఇవాళ గిన్నె నిండా పెట్టినా, తినేసి ఇంకా కావాలంటున్నాడే ఏమిటీ విచిత్రం అనుకుంటూనే మరికొంత తెచ్చి పడేసింది.

నిదానంగా దాన్ని గూడా తినేసి లేచాడు గోపయ్య. గొడ్ల దగ్గర చెత్త తీసి బాగుచేయటం, చెరువుకు వెళ్లి నీళ్లు తోడిపొయ్యటం ఇలాంటి ఇంటి పనులు చేయసాగాడు గోపయ్య. మెను

పొద్దు వాలుతున్న కొద్దీ గోపయ్యకు ఆలోచనలు వ

అపరాధ పరిశోధన పోటీ-77

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసలు పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హో. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-12-'74 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఫిబ్రవరి '75 నెల సంచికలో ప్రకటిస్తాము. *

1. కాలుకు గాయమైతే___? (కట్టు కట్టుతాము, కదలకుండా కూర్చుంటాము.)

2. జ్వరం వస్తే___? (మందు తీసుకొంటాము, పత్యం చేస్తాము.)

3. తేలు కుట్టితే___? (విషం ఎక్కుతుంది, బాధ కలుగుతుంది.)

4. వెర్రివాడిని చూస్తే___? (జాలేస్తుంది, నవ్వొస్తుంది.)

5. ఇతడితో సహవాసము మహా చెడ్డది___? (గారుడితో, పిసినిగొట్టుతో.)

మీద రాజమ్మ మీదకే మళ్ళు తున్నయ్. ఎప్పుడెప్పుడు రాత్రవుతుందా, ఎప్పుడు పొలానికి పోదామాని నిముషాల్ని లెక్కపెట్టుకుంటున్నాడు గోపయ్య.

సాయంత్రం కాంగానే ఇంటి పనులన్నీ పూర్తిచేశాడు. అన్నం తిని, మరికొంత మూటగట్టుకుని దుప్పటి భుజాన వేసుకున్నాడు. చేతికర్ర పుచ్చుకొని కిర్రు చెప్పులు తొడుక్కొని ప్రయాణమవుతున్న గోపయ్యను చూసి రావులమ్మ అడ్డుతగిలింది.

"ఏరా! రాత్రి జ్వరం తగిలిందంటివి గదా? పోనీ ఈ పూటకు పొలానికి పోకుండా ఇక్కడే పడుకో! ఇంటాయన పోతాడులే కాపలాకి!" అంది.

గోపయ్య గుండె గుభేలుమంది. తనకోసం రాజమ్మవచ్చే విషయం ఆయన పసిగడితే ఇంకేమన్నా ఉందా?

"ఎందుకమ్మా! జ్వరం జారిందిలే! ఈమాత్రం దానికి మీరేం బెంగపడకండి!" అంటూ సమాధానంకోసం చూడకుండా ముందుకు సాగిపోయాడు గోపయ్య.

దోవలో నడుస్తున్న గోపయ్య ఆలోచనలన్నీ రాజమ్మ చుట్టూనే పరిభ్రమిస్తున్నయ్. అంత యవ్వనవతి అయిన దానికి ఏమీ చేతకానివాడ్నెందుకు భర్తగా చేశాడో ఆ బ్రహ్మ! ఏమయితేనేం! తనలాంటివాడి అదృష్టం పండింది. వెయ్యి రంభలు వచ్చినా ఆమె తన్ను క్రితంరాత్రి సుఖపెట్టినట్టుగా ఎవరూ సుఖ మివ్వలేరనుకున్నాడు.

అంతలోనే అతడికి భయంవేసింది. రేపురాత్రి వస్తానని చెప్పింది. నిజంగా వస్తుందా? అనుక్షణం అనుమానించే ఆమెభర్త ఆమెను ఇంట్లోంచి బయటకు రానిస్తాడా? వేళ ఆమె బయలుదేరి వచ్చినా, దోవలో మరెవరన్నా ఆ మళ్ళించుకోడుగదా?

మంచెమీద కూర్చుని రామన్నపేట వైపుగా చూస్తూ కూర్చున్నాడు గోపయ్య. పొలంలోకి పంది జొరబడి కొంత భాగాన్ని పాడుచేశాకగాని అతడు ఈ లోకంలోకి రాలేక పోయాడు. కంగారుగా వడిసెలతో రాళ్ళువిసిరి దాన్ని బెదర గొట్టాడు.

పంది పారిపోయింది. జొన్నకంకులు చాలా విరిగిపోయి నయ్. తన యజమాని వాటిని చూశాడంటే తన మక్కెలు విరగదంతాడు. ఇప్పుడేం చెయ్యటం! అంటూ విరిగిపోయిన కంకులవంక విచారంగా చూస్తూ నిలబడ్డాడు.

వెనుకనించి కిలకిల నవ్వు వినిపించింది. గోపయ్య వెనుదిరిగి చూశాడు.

రాజమ్మ నిలబడి ఉంది. [illegible] [illegible] కెట్, తలలో పూలు, చేతులనిండా గాజులూ, మెళ్లో పసుపుతాడు, మరో బంగారుగొలుసు, చెవులకు రాళ్ళకమ్మలూ, రాజమ్మ నిన్నటికంటె ఎంతో అందంగా కనుపించింది అతడి కళ్ళకు.

"ఏమిటి బుల్లోడా? ఇసారంగా ఉన్నాయేంది?" అనడి గింది రాజమ్మ.

"ఏముంది? నిన్నే జపంచేస్తూ పరాకుగా ఉన్నానేమో, పంది చేలోబడి అన్నీ పాడుచేసింది" అన్నాడు గోపయ్య.

"ఉస్! ఇంతే గదా" ఆమె తేలికగా కొట్టిపారేసింది.

"నీకు తేలికగానే ఉంటది! రేపు మా యజమాని సూశా డంటే నా ఎముకల్లోకి సున్నం లేకుండా కొడతాడు."

"చూడు సిన్నోడా! రే పుదయానికి గదా మీ యజమాని వచ్చేది. ముందు పైకిరా! రేపు తెల్లారేలోగా నీకు ఉపాయం చెబుతాగదా:"

"ఏం చెబుతావో ఏమో." అంటూ అన్యమనస్కంగా ఆమెవెంటే మంచె ఎక్కాడు.

మధ్యలో అతడు ఆగాడు.

"ఏమిటి మళ్ళీ!" అంది ఆమె.

"పంది జొరబడినట్టుంది మళ్ళీ. రుచి మరిగిన పంది ఇందాక పైరుని పాడుచేసిన పంది మళ్ళీ వచ్చినట్టుంది" అంటూ గోపయ్య లేవబోయాడు.

"వద్దు! నీవు లేవకు. దాన్ని నేను పోగొడతానులే!" అంటూ ఒకచేత్తో అతడ్ని తనమీదకు హత్తుకుంటూ మరో చేత్తో వడిసెలలోని రాయినితీసి విసిరింది.

తను ఎంతో గురిచూసి కొడితేగాని రాయి పందికి తగలదు. అటువంటిది ఆమె ఆషామాషీగానే రాయి విసరంగానే అదివెళ్లి పందికి తగలటమూ, అది పెద్దగా చావుకేక పెట్టడమూ జరిగింది.

గోపయ్య తనపనిలో నిమగ్నుడయాడు మళ్లీ.

తెల్లవారుజామున కోడికూసే వేళకు ఆమె మంచెదిగి వెళ్లిపోయింది.

'అరెరె! పొలం పాడయినందుకు ఏదో ఉపాయం చెబుతాను అన్నదే! ఆమె చెప్పనూలేదు, నేనైనా అడిగాను కాను!' అనుకొన్నాడు గోపయ్య.

కళ్లు మండుతున్నాయ్! కాళ్ళు పీకుతున్నాయి. నిద్ర వస్తున్నా అతడు ఆపుకొని లాంతరు తీసుకొని నిన్నరాత్రి పంది పాడుచేసిన వైపుగా వెళ్లాడు.

అతడి కళ్లను అతడే నమ్మలేకపోయాడు, పైరులో ఒక్క కంకుగూడ పాడవలేదు. పైగా రాజమ్మ విసిరినరాయి తగిలి పంది 'ఠకీ' మని చచ్చింది. సామాన్యంగా పంది ఒకమాత్రం దెబ్బకు చావదు.

గోపయ్య ఆలోచనలు పొలం గురించి విచారించ నివ్వ లేదు. రాజమ్మ గురించిన మధురభావాలు సెంటు వాసనల్లా

అతని శరీరం చుట్టూ తిరుగుతున్నయ్.

ఇంటికి వెళ్లంగానే రావులమ్మ 'గంయ్' మని విరుచుకు పడింది. "ఏమిటిరా! రాయిలాగా ఉండేవాడివి రోజు రోజుకీ ఇలా అయిపోతున్నావ్. ఆచార్లుగారి దగ్గరకు వెళ్లి ఏదన్నా కషాయమన్నా తెచ్చుకు త్రాగు" అని అరిచింది.

"నాకేమమ్మగారూ! నేను బాగానే ఉన్నానే!" అన్నాడు గోపయ్య. అతడి మనస్సు ఎంతగానో విచారిస్తూన్నది. అతడి శరీరం మాత్రం ఉండాల్సిన స్థితిలో లేదు. అయినా ఆ పరిస్థితిని గమనించే ఎత్తులో లేడు గోపయ్య.

మధ్యాహ్నం రావులమ్మ మరోసారి పోరిన మీదట గోపయ్య శఠగోపాచారి ఇంటికి బయలుదేరాడు.

శఠగోపాచారి ఆ ఊరి విష్ణాలయంలో పూజారి. ఆయుర్వేద వైద్యం, అలోపతి వైద్యం చేస్తాడు. భూత వైద్యం, గ్రహ శాంతులూ, దయ్యం పట్టిన వాళ్ళకు బాగుచేయటం ఇవన్నీ ఆయనకు వారంలో రెండు రోజులు అదే పని.

"నమస్కారమండీ!" అన్నాడు గోపయ్య ఆచారిగారిని చూస్తూనే.

"ఏంరా గోపిగా! ఇలా వచ్చావేం?"

"మరేం లేదండీ రెండు రోజుల్నుంచి నాకు ఒంట్లో సరి లేదండీ! అమ్మగారే మీ దగ్గరకు పొమ్మని కోప్పడ్డారు."

"కూర్చో! అలా!" అంటూ అగరొత్తులు వెలిగించి అతడి చుట్టూ ధూపం వేశాడు.

"వారం రోజుల్నుంచి రాత్రి పూట ఎక్కడ పడుకుంటున్నావురా?" ఆచారి అడిగాడు.

"మొక్కజొన్న చేలో మంచెమీద కాపలా కాస్తున్నానండి!"

"నీ వొక్కడివేనా?"

గోపయ్య సిగ్గు పడ్డాడు. "మరేనండీ!"

"ఒరేయ్! అబద్ధం చెప్పకు! నీ కోసం ఒక ఆడమనిషి రావడం లేదూ?" అచారి రెట్టించి అడిగాడు.

గోపయ్య ఆశ్చర్యపోయాడు. తను ఎంతో రహస్యంగా చేస్తున్న పని ఈయనకెలా తెలుసునా అనుకున్నాడు.

"ఏంరా? మాట్లాడవేం?"

"అవునండి! ఒక ఆడమనిషి నా కోసం వస్తున్నది" గోపయ్య నిజాన్ని ఒప్పుకున్నాడు.

"ఒరేయ్! నీవు ఆరు నెలల కన్న బ్రతకవురా! నిన్ను ఆ భగవంతుడు కూడా రక్షించ లేడు!"

గోపయ్య అదిరి పోయాడు. "అదేంది ఆచ్చారిగారూ? మీ రనేదేమిటో నా కర్థం కావడం లేదు!"

"అదేరా? నీ కోసం వచ్చే ఆడది ఎవరనుకున్నావ్...."

* * *

గోపయ్య ఇంటి దోవ పట్టాడు. ఆచారిగారు తన చేతికి తాయెత్తు కట్టాడు. అది తన ఒంటిమీద ఉన్నంత కాలం తను ఎవరికీ భయపడాల్సిన పని లేదు.

అయితే ఇవాళ రాత్రితో ఆమె సంగతి, అదే రాజమ్మ సంగతి అటో, ఇటో తేల్చుకోవాలి. అదెలాగో ఆచారిగారే ఉపాయం చెప్పారు. ఈ రాత్రికి దాన్ని ఆచరించటమే తన పని.

రాత్రయింది. మంచె మీద గోపయ్య నీరసంగా పడుకుని ఉన్నాడు. రాజమ్మ నిచ్చెన మీదుగా మంచె మీదకు ఎక్కి పడుకుని ఉన్న గోపయ్య వంక ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటి అలా ఉన్నావ్?" అనడిగింది.

గోపయ్య ఆమె వంక కళ్లు పెద్దవి చేసి చూస్తూ అడిగాడు. "ఇప్పుడే గదా నీవు వెళ్లింది. అప్పుడే తిరిగి వచ్చా

వేం? ఇంటికి పోలేదా,''

ఈ తడవ రాజమ్మ ఆశ్చర్యపోయింది. "నువ్వు ఏం మాట్లాడుతున్నావ్ గోపయ్యా! నేను రావడమేమిటి? పోవడమేమిటి? నేను ఇప్పుడే గదా వస్తూంట!''

"ఇదిగో! నీ ఆటలు నా దగ్గర కాదు. ఇంతకు ముందు ఒక గంట ముందు వస్తివి! ఇద్దరం సుఖాన్ని పంచుకున్నాం. మీ ఆయన ఇంటి దగ్గర చింతబరికెలు పట్టుక్కూర్చుని రంకెలు వేస్తున్నాడంటివి. అందుకే రాత్రికి ఉండటానికి వీల్లేదని వెళ్ళిపోతివి గదా?''

"చాల్లే నీ పరాచికాలు! సరసమాడటానికి నీకు ఇదా అదను!"

"పోనీ నామాట అబద్ధమయితే నాఒళ్ళు చూడు! ఎంత నీరసంగా ఉందో! గంటలో రెండుసార్లు పనిముగించుకొని పోతివి. నాపని ఎలా ఉంటుంది ఇంక?''

రాజమ్మ నమ్మినట్టుగానే ఉంది. "ఏమిటీ? అచ్చం నా లాగే ఉందా ఆ వచ్చిన మనిషి! ఆశ్చర్యంగా ఉందే!''

"నాకూ ఆశ్చర్యంగానే ఉంది. ఇందాక వచ్చిన మనిషే అసలురాజమ్మ కాబోలు. నీవే రాజమ్మ వేషంలోవచ్చిన మరో ఆడదానివేమో అని యిందాకట్నుంచి మధనపడి వస్తున్నాను.''

రాజమ్మ అతడ్ని ప్రేమగా తనకేసి హత్తుకొంది. "నీకో నిజం చెబుతాను, భయపడవుకదూ?'' అంది.

"నీవు నాప్రక్క నుండగా నాకేం భయం!''

రాజమ్మ అతడి చెక్కిళ్ళను ముద్దాడింది. వ్రేళ్లతో మెటికలు విరిచింది. "నేనంటే నీకెంత ప్రేమ?'' అని.

"ఏమిటి నీవు చెబుతానన్నది!''గోపయ్య అడిగాడు మళ్ళీ.

"ఈ ప్రాంతాల కామినీ పిశాచం ఒకటి తిరుగుతోందట. పెళ్లికాని బ్రహ్మచారుల్ని మామూలు స్త్రీరూపంలో వచ్చి అనుభవించిపోతున్నదట. అయితే దానివలలో చిక్కుకొన్న వాడు ఆరునెలల్లో చనిపోతాడు."

"అమ్మయ్యో! అయితే ఇందాక నీరూపంలో వచ్చిన ఆడమనిషి ఆ పిశాచే నంటావా?"

"అనే నా అనుమానం! ఇదివరకే నీకు ఈ హెచ్చరిక చేద్దాం అనుకున్నాను. కాని వీలుపడలేదు."

"అయ్యో! అలా గయితే అదిగూడ రోజూ ఇలా దొంగ చాటుగా వచ్చి నా ఊపిరి తోడేస్తుంటే నా పని ఆఖరే! రాజమ్మా! నేను నీతో సుఖాన్ని వదులుకోలేను. ఎలాగైనా దానిపీడ వదిలేమార్గం చెప్పు!" ఆమె గడ్డం పుచ్చుకొని బ్రతిమాలుతున్నట్టుగా అడిగాడు గోపయ్య.

రాజమ్మ ఒక్క నిముషం ఆలోచించింది. "లే! చెబు తాను. నాతో రా!" అంది.

రాజమ్మ మంచెదిగి పొలం గట్లమీదుగా నడిచింది. ఆమె వెనకాలే గోపయ్యగూడ నడుస్తున్నాడు.

మర్రిచెట్టుకు ఇవతలగా పెద్దపుట్ట ఉంది. ఆ పుట్టమీదకు సన్నని తీగెచెట్టు ప్రాకుతోంది. రాజమ్మ ఆ చెట్టుకేసి చూపిస్తూ "ఆ తీగె మూరెడు తెంచు" అంది.

"అమ్మయ్యో! ప్రక్కనే పుట్ట! అందులో త్రాచుపాము ఉన్నా వుండచ్చు. అది మీదపడితేనో" గోపయ్య భయంగా అన్నాడో లేదో, పుట్టలోంచి త్రాచుపాము పైకిలేచి పడగ విప్పింది.

గోపయ్య అదిరిపడ్డాడు. నాలుగడుగులు వెనక్కువేశాడు.

"ఏం భయంలేదు!" అంటూ రాజమ్మ తనచేతిని గాలిలో ఆడించింది.

పాము కిక్కురుమనకుండా పుట్టలోకి జారుకుంది. గోపయ్య ఆశ్చర్యంతో భయంతో, అనుమానంగా ఆమెవంక చూశాడు. ఈమె మనిషా లేక....

గోపయ్య పుట్టమీదకు వంగి మూరెడు లతని తెంచాడు.

"ఇంక మంచెమీదకు పోదాం పద!" అంది రాజమ్మ.

గోపయ్య ఆమె చెయ్యి పుచ్చుకోబోయాడు. ఆమె అతనికి అందకుండా తప్పుకొంది.

"కాసేపు నన్ను ముట్టుకోకు!" అంది రాజమ్మ భయంగా.

"ఏం?"

"పైకి వెళ్ళాక చెబుతాను. అరవకుండా నడు!"

ఇద్దరూ మంచెమీదకు ఎక్కారు. రాజమ్మ తనను తాకుతూ కూర్చునేది ఎప్పుడూ. అలాంటిది ఇప్పుడు ఆమె దూరంగా కూర్చుంది.

"ఈ చెట్టుతీగను దగ్గరుంచుకుంటే నీదగ్గరకు ఏ కామినీ పిశాచీ రాలేదు. నేను లేనప్పుడు దీన్ని ఎప్పుడూ నీ దగ్గర వుంచుకో!" అన్నది రాజమ్మ.

చెట్టుతీగను తనచేతికి చుట్టుకున్నాడు గోపయ్య. రాజమ్మ కళ్ళలోకి చూస్తూ కూర్చున్నాడు.

"దీంతో ఆ పాడుపిశాచం అటకట్టు. లేకపోతే బంగారంలాంటి కుర్రాడ్ని పాడుచేయటానికి తయారవుతుందా? ... ఇక ఆ చెట్టుతీగను కాసేపు ప్రక్కన ఉంచు."

"ఏం? అది దగ్గరుంటే మాత్రం! నీవు మనిషివే గదా?" అన్నాడు గోపయ్య.

"ఆ తీగెకు మైల సోకగూడదు! అందుకని మనిద్దరం సుఖించేటప్పుడు దాన్ని తీసి ప్రక్కను పెట్టు!" అన్నది రాజమ్మ నవ్వుతూ.

గోపయ్య ఆ తీగ ఊడదీయలేదు. "నాకు భయం! మాయదారి పిశాచం మళ్ళీ ఎక్కడొస్తుందో!"

"అబ్బబ్బ! రాదని నేను చెబుతున్నాను గదా! ఇక ఆలస్యం చేయకు! నేను ఆగలేను!" రాజమ్మ వగలు పోయింది.

"ఆగాల్సిందే! మన స్నేహం నిన్నటితోనే అయి పోయింది" గోపయ్య తాపీగా అన్నాడు.

"మళ్ళీ ఏమొచ్చింది!" రాజమ్మ చిరుకోపంగా అడి గింది.

"నీవు మాత్రం మనిషివా? నీవూ కామినీ పిశాచానివే. ఆరునెలల్లో నన్ను యమధర్మరాజు దగ్గరకు పంపవని నమ్మకం ఏమిటి?"

రాజమ్మ విస్తుపోయింది తన రహస్యం బయటపడి పోయినందుకు. అంతలోనే తమాయించుకుని నవ్వింది.

"మొత్తానికి అసాధ్యుడివే! నా రహస్యం నా ద్వారానే కనుక్కున్నావ్! నిజమే! నేను కామినీ పిశాచాన్ని! కామ వాంఛలు తీరకుండానే అర్థాంతరంగా చనిపోయిన వాళ్ళం ఇలా తిరుగుతుంటాం! బ్రహ్మచారుల్ని వెదికి పట్టుకుని మా కోరికలు తీర్చుకుంటాం!

"అయితే మనుష్యుల్లో మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ ఉన్నట్టే మాలోనూ రెండు రకాల వాళ్ళూ ఉంటారు. మంచివాళ్ళు తమ కిష్టమయినంతకాలం తమకు దొరికిన ప్రియుడితో సుఖించి చివర్లో వాళ్ళకేదైనా మేలు చేసిపోతారు. చెడ్డ వాళ్ళేమో ఆరునెలలు సుఖాన్ని జుర్రుకుని ఆ తర్వాత వాడి రక్తం త్రాగేసిపోతారు" రాజమ్మ అసలు రహస్యాన్ని వెల్లడించింది.

"నీవు మాత్రం చెడ్డ దానివి కాదని నమ్మకం ఏమిటి?

అందుకే మన స్నేహానికి దండం పెట్టేశాను. వెళ్లి మరె వరినన్నా చూసుకో: నా మానాన నన్ను బ్రతకనీయ్!" అన్నాడు గోపయ్య.

రాజమ్మ గోలుగోలున ఏడ్చింది. "చూశావా? మీ మగ వాళ్లు ఎంతటి కృతఘ్నులో. కాకపోతే ఆడదాని ముఖం ఎరగని వాడికి, నీకు స్వర్గాన్ని చూపించానా? ఇప్పుడు నన్ను ఆ మొహమాటంగూడ లేకుండా, నిర్దాక్షిణ్యంగా వెళ్ల గొడతావా?"

గోపయ్య ఆమె ఏడ్పుకు మోసపోలేదు మళ్లీ.

ససేమిరా చెట్టు తీగను చేతినుంచి విప్పనన్నాడు.

రాజమ్మ బ్రతిమాలింది మళ్లీ. ఏడ్పుమాని. "చూడు గోపయ్యా! నీకు ఏ అపకారం జరగదని మా పిశాచ నాయ కుడిమీద ప్రమాణంచేసి చెబుతున్నాను. నీతో ఆరునెలలు. లేదా అయిదునెలలు. కాదూ నాలుగు నెలలు అనుభవించిన తర్వాత నేను శాశ్వతంగా వెళ్లిపోతాను. అప్పుడు నీకో మేలు చేస్తాను. ఈ పొలానికి కొద్ది దూరంలో భూమిలో రెండు లంకె బిందెలున్నయ్. వాటినిండా బంగారు కాసు లున్నయ్. అవి నీ పరంచేసి వెడతాను. నీవు లక్షాధికారివై పోతావ్. అందమైన పిల్లనుచూసి పెళ్ళాడి సుఖంగా జీవించ వచ్చు. ఏమంటావ్!"

"నీ మెరమెచ్చు మాటలతో నన్ను మోసపుచ్చలేవు. నీదారి నీవు చూసుకో!"

రాజమ్మ మరోసారి బ్రతిమాలింది. పమిట తొలగించి తన యవ్వనాన్ని చూపించి అతన్ని ఊరించింది. వగలు పోయింది. ఎన్ని చేసినా గోపయ్య లొంగిరాలేదు.

రాజమ్మ ఆశవదులుకుంది. తన చేతికి చిక్కిన పిట్ట చేతు ల్లోంచి జారిపోయినట్టుగా బాధపడింది.

"గోపయ్యా! పోనీ నీవు చెప్పినట్టుగానే మనం శాశ్వతంగా విడిపోదాం! నిన్నటిదాకా మనిద్దరం స్వర్గ సుఖాల్ని అనుభవించాం. రేపట్నుంచీ ఆ చెట్టు తీగను భద్రంగా చేతికి చుట్టుకో. లేదా? చేతికి మురుగులు చేయించుకుని ఈ తీగను అందులో వేయించుకో. నీకు శాశ్వత రక్షణగా ఉంటయ్.

"ఎటూ మనం విడిపోతున్నాం గదా! ఇదే మనకు ఆఖరి రాత్రి. ఈ ఒక్క రాత్రి చివరిసారి సుఖిద్దాం! రేపు రాత్రికి నేనెవరినన్నా వెతుక్కుంటాను. ఇప్పుడు నీవు కాదంటే ఇంత అపరాత్రివేళ నాకు ఎవరు దొరుకుతారు? నా ఒళ్ళు విరహంతో కాగిపోతోంది. ఈ రాత్రికి నా తాపాన్ని తీర్చు! ఏమంటావ్?"

గోపయ్య ఒక్కనిముషం ఆలోచించాడు. ఆమె చెప్పింది సబబుగానే ఉంది. ఈ ఒక్క రాత్రికి ఆమెను అనుభవిస్తే పోయిందేముంది? ఎటూ ఆమె ఇంతదూరం వచ్చింది గదా అనుకుని మెత్తపడ్డాడు.

"నాకేం అపకారం తలపెట్టవు గదా?" అని మరోసారి అడిగాడు.

"దేనిమీద ప్రమాణం చేయమంటే దానిమీద చేస్తాను. నీకే ప్రమాదమూ జరగదు. రా! త్వరగా! నన్ను కౌగలించుకో! ఈ తాపానికి తట్టుకోలేకుండా ఉన్నాను" అంటూ ఆమె తన పమిటను జార్చింది. ఉద్రేకంతో ఆమె వక్షోజాలు ఎగిరెగిరి పడుతున్నయ్.

గోపయ్య ఇక ఆగలేకపోయాడు. చేతికున్న చెట్టుతీగను విప్పి ప్రక్కనే పెట్టాడు.

సుడిగాలిలావచ్చి రాజమ్మ అతడ్ని వాటేసుకుంది. అతడి శరీరాన్నంతా ముద్దులతో ముంచెత్తింది. "నా బంగారు గనూ!

నీ అంతటి మంచివాడు దొరుకుతాడా నాకు మళ్లీ!" అని ఒళ్ళంతా తన చేత్తో తడిమింది.

గోపయ్య పరవశంతో, కట్టలు తెంచుకున్న ఉద్రేకంతో ఆమె మీదకు దూకాడు.

అర్ధరాత్రి దాటింది. ఎక్కడో. గుడ్లగూబ అరుపు వినబడింది. తీతువు పిట్ట వికృతంగా కూస్తూ వాళ్ల మీదుగా ఎగిరిపోయింది.

అలసటగా పడుకున్నాడు గోపయ్య. రాజమ్మ అతడి మీదుగా వంగి చూస్తోంది. గోపయ్య కళ్లు తెరిచి ఆమె వంక చూశాడు.

చూస్తూండగానే ఎంతో అందంగా. ఆకర్షణీయంగా, తన పాలిట రంభలాగా ఉన్న రాజమ్మ వికృతంగా మారిపోయింది. విరబోసుకున్న జుట్టు. ఎర్రటి కళ్ళు, గద్దముక్కు, ఎత్తుపళ్లు. నాలుక బయటకు జాపి గుండెలవిసేలా భయంకరంగా ఉంది.

"చేతికొక్కిన సుఖాన్ని జుర్రుకోలేని అసమర్థుడివి నీవు. ఆరునెలలపాటు అమరసుఖం ఇచ్చేదాన్ని. ఆ స్వర్గసౌఖ్యాల్ని కాలదన్నుకున్నావ్ చేతులారా. ఎప్పుడో వచ్చే మృత్యువుని ఇప్పుడే పిలిచి తెచ్చుకున్నావ్!" అంటూ తన గోళ్ళతో అతడి కంఠాన్ని నొక్కింది.

గోపయ్య కళ్లు తేలవేశాడు. నాలుక బయటకు వెళ్ళబెట్టాడు. బాధతో గిలగిల తన్నుకున్నాడు. ప్రాణం పోయిన గోపయ్య శరీరం చూసేందుకు భయంకరంగా తయారైంది.

వికృతంగా అరుస్తూ ఆమె గాలిలోకి లేచింది. ఆకాశంలో తేలుతూ ఎటో వెళ్లిపోయింది.

★

పాఠకుల ప్రశ్నలు

జె. కృష్ణారావ్, అశ్వారావు పేట.

పోస్టులు చార్జీలు రు. 1-00, కన్వెషన్ రు. 1-00, ఇతర అనేక ఖర్చులు కలిపి రు. 2-00ల పైగా ఖర్చవుతుంది. 'హోమ్ డెలివరీ' స్కీమ్ వలన మీకు లాభించినదేమిటి? ప్రతి పోటీకి ప్రవేశ రుసుము పెడితే సరిపోయేది-?

'హోమ్ డెలివరీ' మా లాభాల కోసం కాకుండా పాఠకుల సౌకర్యం కోసం ఏర్పాటు చేయబడింది. పాఠకులకు తగ్గింపు ధరలో, అతిత్వరితంగా, గ్యారంటీగా మీ ఇంటిదగ్గరనే మీ అభిమాన "అపరాధ పరిశోధన"ను అందించడం ఈ స్కీమ్ ముఖ్యాశయం.

వి. నాగేశ్వరరావు, మల్లెపల్లి.

ఇది అన్యాయం! నేను కొన్ని జోక్స్ పంపాను. ఒక్కటే ప్రచురించారు. మిగిలిన జోక్స్ త్రిప్పి పంపలేదు-?

జోక్స్ త్రిప్పి పంపబడవు.

ఎమ్. జి. మూర్తి, విశాఖపట్టణం-8.

"సప్లిమెంట్" ఎన్ని నెలలు ముందుగా తయారవుతుంది?

సుమారు 3 నెలలు.

కడలి వీరవెంకట సత్యనారాయణ, పుల్లేటికుర్రు.

శ్యామ్‌జీ! మీరు తిరిగి పోస్టుకార్డు పద్ధతిని ప్రవేశ పెడితే, ధరలు పెరిగిన ఈ రోజుల్లో చాలామంది పాఠకులకు ఇబ్బంది కల్గదంటారా?

ఇబ్బంది అవుతుంది. కాని పాఠకులు పోటీ నియమాలు

సక్రమంగా పాటించనప్పుడు మాకూ ఇబ్బందే కదా!

కొండపల్లి వెంకటేశ్వరరావు, హైదరాబాదు.

రెడ్డిగారూ! అపన ఆర్టిస్ట్ ప్రభాకర్, అపన పోటీ విజేత అలిశెట్టి ప్రభాకర్ ఒకరేనా?

కాదు.

వి. శ్యామలాజ్యోతి, కందుకూర్తి.

అన్నయ్యా! నేడు ఈ సమాజంలో అల్పుడు అభివృద్ధి లోకి వస్తున్నాడు. కాని మంచి మనిషి అన్ని విధాల అణగ ద్రొక్కబడుతున్నాడు. ఎందుకన్నయ్యా?

అల్పుడి కిచ్చిన గౌరవం మనం అధికుడి కివ్వటం లేదు గనుక.

హవంతీ రఘువిమల్ ప్రసాద్, బోర్గాం.

"అపరాధ పరిశోధన" ప్రారంభించి ఎన్ని సంవత్సరా లవుతుంది?

10 సంవత్సరాలు.

ఎస్. వాసుదేవాచార్, ఆలూరు.

"సప్లిమెంట్"లో క్రొత్తగా ప్రవేశపెట్టిన పోటీ అంత ఉత్సాహకరంగా లేదు. 'అపన' లోని పోటీ అంటే మెదడుకు పదును పెట్టేదిగా యుండాలి గాని, అదృష్టం మీద ఆధారపడి యుండరాదు.-?

అన్నీ మెదడుకు పదునుపెట్టే శీర్షికలైతే పాఠకులందరిలో ఉత్సాహం కనిపించక పోవచ్చును. కావున ఒకటి సులభ మైన పోటీ అందరూ పాల్గొనటానికి వీలుగా వుండాలని దీనిని ప్రవేశపెట్టాము.

మర్రి సూర్యనారాయణ, పుల్లేటికుర్రు.

ప్రపంచ ప్రసిద్ధినొందిన జ్యోతిష్కులు 9 సంవత్సరాల్లో ప్రపంచానికేదో 'ఆపద' వాటిల్లుతుందని జోస్యం చెప్పారుట.

ఆ ఆపద ఏమిటి? అసలు జోస్యం కరెక్ట్ అవుతుందంటారా?

జోస్యం కరెక్టుగా చెప్పగలిగేవాడు ప్రపంచానికే అధినేత కావచ్చు! మన ఊహలే జోస్యాలు.

గుంటూరి సుబ్బరాజు, తాడిపూడి.

శ్యామ్‌జీ! మేము సామాన్య ప్రజలము కాబట్టి కొంత థ్రిల్, ఎక్సైట్‌మెంట్‌కోసం 'అపస' మీద ఆధారపడుతున్నాము. కాని నిత్యజీవితంలో కూడా నేరాలు - పరిశోధన మొదలగు విషయాలలో మునిగితేలే పోలీసు ఆఫీసర్లు, జడ్జీలు, న్యాయవాదులుకూడా మన "అపస" వైపు ఆకర్షింపబడడానికి కారణమేమిటి?

వారు నిత్యమూ ఎదుర్కొనే, ఎదుర్కొనబోయే అనేక నేరాలను, వాటి పరిశోధనలను "అపస"లో చూస్తున్నారు. వారి నిత్యజీవితానికి దగ్గర మిత్రుడు 'అపస'! అటువంటి మిత్రుడిని వారు అభిమానించడంలో ఆశ్చర్యమేముంది?

ఎం. ఏ. గోపాల్, కరాచసపల్లి.

శ్యామన్నయ్యా! శీర్షికలలో పాఠకుల పేర్లు ప్రచురించే బదులు, వారివారి సభ్యత్వం నెంబరు ఉదహరిస్తే చాలనుకుంటాను?

పాఠకులు ఒప్పుకొంటారా?....

చాగాపురం నాగేశ్వరరావు, మద్దికల్.

మీరు నాలాటి చిన్నరచయితలను ప్రోత్సహించరు. నిజమేనా?

మీలాంటి చిన్నరచయితలు వేలకువేలున్నారు. అందరినీ ప్రోత్సహించాలంటే "అపస"లాంటి పత్రికలు మరికొన్ని వేలు కావాలి. అవకాశమున్నంతవరకు సమర్థులైనవారిని ప్రోత్సహిస్తూనే వున్నాము. ★

ప్రతి భ్రష్టుడైనవాడూ
జైల్లోకొచ్చి మన పరువు తీస్తున్నార్రా
తమ్ముళ్లూ!

ఆ దయ్యాల
భూతాల సిన్మాలు
చూడద్దంటే
విన్నారా?!
చంద్ర


చంద్ర

ఆ రోజు వుదయం బ్రేక్ ఫాస్ట్ ముగించి, రిసెప్షన్ రూములో విశ్రాంతిగా డొనాల్డ్ గ్రే పుస్తకంలో మునిగిపోయి చుట్టూ వున్న ప్రపంచాన్ని మరిచి పోవాలని ప్రయత్నిస్తున్నాను.

"గుడ్ మార్నింగ్!"—అన్నారెవరో గుమ్మలోపలికివస్తూ.

"గుడ్ మార్నింగ్!" అన్నాను ఆటోమేటిక్‌గా వచ్చిందెవరో చూస్తూ. నరహరిరావు నవ్వుతూ నేనున్న వైపు అడుగులు వేస్తున్నాడు.

అయిదడుగుల రెండంగుళాలకు మించని ఎత్తు. స్థూలకాయం, వంకీలు తిరిగిన దట్టమైన జుత్తు, చురుగ్గాచూసే తెలివైన చిన్న కళ్లు, పెద్దపొట్ట. ఎప్పుడూ తెల్లని షర్టు, తెల్లని పాంట్‌లోకి టక్ చేస్తాడు

నరహరిరావును చూడగానే ఏ మార్వాడీయో, బాంకు మానేజరో అనిపిస్తుందిగాని, అతనెవరో తెలియని వాళ్లు అతనో పేరుమోసిన క్రిమినల్ లాయరని అనుకోరు.

అతను నవ్వుతూ నా టేబిల్ అంచుకు బొజ్జ ఆనిస్తూ నిలబడ్డాడు. అతని శరీరానికి, టేబిల్‌కి మధ్య కనీసం అడుగున్నర దూరమైనా వుంటుందని నా అంచనా. చదువుతున్న పుస్తకం డ్రాయర్లో పడేసి లేచి నిలబడ్డాను.

"రండి! సిన్హాగారు కన్సల్టింగ్ రూములోనే వున్నారు"—అన్నాను సిన్హాగారి గదివైపు దారితీస్తూ.

ఒక్కక్షణం నరహరిరావు కళ్ళల్లో ఆశ్చర్యం చూసి ఆనందపడ్డాను అంత ఉదయమే సిటీలో లీడింగ్ క్రిమినల్ లాయర్ సిన్హాగారితో అర్జెంట్ పనివుంది కాక, సరదాగా కబుర్లు చెప్పుకోవడానికి వస్తాడని ఎవరనుకొంటారు?

డిటెక్టివ్ సిన్హా, విశాలమైన టేబిల్ వెనుక రివాల్వింగ్ చెయిర్లో చిత్రమైన భంగిమలో విశ్రాంతిగా ఉదయం దినపత్రిక చదువుతున్నారు. దట్టమైన కనుబొమల క్రింద దీపాల్లా

వెలిగే ఎక్స్‌రే కళ్ళు, సూదైన ముక్కు, బిస్మార్క్ మీసం, బిగించిన పెదిమల మధ్య తప్పని సరిగా వెలుగుతున్న 'మొరాకో' చుట్ట... నవ్వుతూ మా వైపు చూశారు సిన్హా.

పలకరింపులు అయ్యాక, వరహాల్రావు సిన్హాగారికి ఎదురుగా కుషన్ చైర్లో సుఖంగా సర్దుకొని కూర్చున్నాడు.

"వరహాల్రావ్! విషయం ఏమిటి?"—అన్నారు సిన్హాగారు రైలింజన్లా పొగవదుల్తూ.

వరహాల్రావు సిన్హాగారి నోట్లో 'మొరాకో' వంకా, గదిలో మేఘంలా కదుల్తోన్న పొగ వంకా ఓ క్షణం సందేహిస్తూ చూశాడు. మెల్లిగా జేబులోనుండి 'మంగుళూరు' బీడీ తీసి నోట్లో పెట్టుకొన్నాడు. జేబులు తడుముకొని నావైపు నిస్సహాయంగా చూశాడు.

"సారీ! అగ్గిపెట్టె మర్చిపోయాను!—" అన్నాడు.

పురుగులా అనిపించాడు వరహాల్రావు. బీడీలు కాల్చే వాళ్ళంటే నాకు పరమ అసహ్యం. తలదించుకొని అగ్గిపెట్టె అతని వైపు తోశాను. వరహాల్రావు బీడీ అంటించుకొని తృప్తిగా రెండు గుక్కల పొగపీల్చి గొంతు సవరించుకొన్నాడు.

"ఓ కేసులో మీ సహాయం కావలసి వచ్చాను—"

సిన్హాగారు మాట్లాడలేదు. మొరాకో పొగ పీలుస్తూ అర్ధ నిమీలిత నేత్రాలతో అతని వైపు చిద్విలాసంగా చూస్తూ వుండి పోయారు.

"ఇలాంటి సంఘటన నా ముప్పై ఐదేళ్ళ అనుభవంలోనూ ఎప్పుడూ జరగలేదు. లాయరుగా నాకున్న పేరు ప్రతిష్టలు, నిజాయితీ, వృత్తి రీత్యా నాలో ఆణించే కర్తవ్య పరాయణత ప్రజలు శంకించే పరిస్థితి ఏర్పడింది. నేరం జరిగింది అనే విషయంలో ఏ అనుమానం లేకపోయి నప్పటికీ,

నాకళ్ళ ముందే, నా సమక్షంలోనే ఎలా చెయ్యగలిగారనేది నాకు ఏ మాత్రం అర్థం కావడంలేదు''—వరహాల్రావు ఒక్క క్షణం ఆగాడు.

అతనింతవరకూ చెప్పిన దాంట్లో నాకు తలాతోక కని పించలేదు. నుదురు చిట్లించి ఇక ఉపోద్ఘాతం చాలునన్నట్లు చూశాను.

''సరిగ్గా పదిరోజుల క్రితం నా క్లయింట్ జానకిరామయ్య చౌదరి దగ్గరనుండి, తన్ను అర్జెంట్‌గావచ్చి కలుసుకొమ్మని ఉదయం తొమ్మిదిగంటల ప్రాంతంలో నాకు కబురొచ్చింది. చౌదరిగారి కన్సల్టింగ్ లాయర్ని నేను. ప్రతి ఏటా ఆయన ఎస్టేటు వ్యవహారాలు చూడడంద్వారా, లావాదేవీలలో సల హాలు ఇవ్వడంద్వారా నాకు చాలా ఆదాయం వస్తోంటుంది. అంచేత ఆయన కబురుపెట్టగానే ఆరోజు వాయిదాలు ఏమీ లేకపోవడం వలన వెంటనే చౌదరిగార్ని కలుసుకోడానికి వెళ్ళాను.''-ఒక్కక్షణం ఆగాడు వరహాల్రావు.

కబురుపెట్టగానే వరహాల్రావు పరిగెత్తుకెళ్ళాడంటే, ఆ చౌదరి ఎస్టేట్‌ద్వారా ప్రతిసంవత్సరం చాలా మొత్తం ఫీజుల రూపంలో అందుతూ వుండాలి. అనుకున్నాను.

''ఇక్కడ చౌదరిగారిగురించి కొన్నివిషయాలు చెప్పాలి మీకు. చౌదరిగారు దాదాపు నలభై లక్షల ఆస్థికి యజమాని. ఆయన మొదటిభార్య పోయిన దాదాపు పదిహేను సంవత్స రాల తర్వాత ఆర్నెల్లక్రితం మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే ఆలో చన కలిగినట్లు తెలిసింది.

మొదటిభార్యద్వారా ఆయనకు ముగ్గురు సంతానం కలి గారు. పెద్దబ్బాయి 'నేషనల్ కెమికల్ లాబొరటరీ' లో సైంటిస్ట్‌గా కలకత్తాలో పనిచేస్తున్నాడు. రెండవ సంతానం అమ్మాయి. రెండేళ్లక్రితమే ఓ ఐ. ఏ. యస్. ఆఫీసర్‌కిచ్చి

చాలా ఘనంగా పెళ్ళిచేశారు. రెండవకొడుకు అందరికన్న చిన్నవాడు. 'మానేజ్‌మెంట్ సైన్స్' స్టేట్స్‌లో చదివి తండ్రితోపాటే బిజినెస్ మానేజ్‌చేస్తూ వుంటున్నాడు.

జానకిరామయ్యచౌదరికి మొదటి భార్యంటే చాలాప్రేమ. ఆమె చనిపోయిం తరువాత చాలాకాలం తర్వాత కూడా ఆమెను మరిచి పోలేకపోయేవాడు. అంచేతే మళ్లీ పెళ్లి చేసుకోలేదాయన. కాని హఠాత్తుగా చౌదరికి మళ్లీ పెళ్లిచేసుకోవాలనే ఆలోచన కలిగింది.''—ఆగాడు వరహాల్రావు బీడీ ఆర్పేసి మా వంక పరిశీలనగా చూస్తూ.

''గో ఆన్ వరహాలూ! ఆపకుండా చెప్పు'' అన్నారు పిన్నాగారు కళ్లుమూసుకొని తదేకంగా వింటూ.

''సంవత్సరం క్రితం జానకిరామయ్యా చౌదరికి శకుంతలా దేవితో పరిచయ మయ్యింది. ఆమెతో ఆయన పరిచయం ఎలా మొదలయిందో ఎవరూ చెప్పలేకపోతున్నారు గాని, ఓ రోజు ఉదయం చౌదరి ఆహ్వానంమీద శకుంతలా దేవి ఇంట్లోకి వచ్చినట్లు మాత్రం తెలిసింది.

శకుంతలాదేవి పుట్టుపూర్వోత్తరాల గురించి, ఆమె గురించి వ్యక్తిగత వివరాలుగాని ఎవరికీ సరిగ్గా తెలియవు. వయసు ముప్పై, ముప్పై అయిదు మధ్య వుంటుంది. చెప్పుకోదగిన అందం ఏమీ లేకపోయినా, ఎలాంటి మగ వాణ్ణయినా మోహంలో ముంచెత్తించే అవయవ సౌష్టవం మాత్రం వుంది.''

నేను ఉత్సాహంగా ముందుకు వంగి వినసాగాను. వరహాల్రావు మాత్రం శకుంతలాదేవి అంగ సౌష్టవాన్ని కళ్ళ ముందు ఊహించి ఆనందిస్తున్నట్లు కాసేపు ఎటో చూస్తూ వుండి పోయాడు.

"ఈ శకుంతలాదేవి వృత్తికి ఒక 'మీడియం' అంటే కంటికి కనిపించని ఆత్మలను, మానవాతీత శక్తులను, తన శక్తి ద్వారా ఆహ్వానించి మామూలు మనుషులతో మల్లే మాట్లాడుతుందన్నమాట. ఇందులో వివిధ పద్ధతుల్లో ఆత్మలతో సంభాషించడం వుంటుందట లెండి. ఈ శకుంతలాదేవి అలాంటి మనిషి. వచ్చిన రోజు సాయంత్రమే చనిపోయిన చౌదరి భార్య సావిత్రితో ముఖాముఖీ మాట్లాడే ఏర్పాట్లు చెయ్యడానికి ప్రయత్నం మొదలెట్టింది—"

అవును: ఇలా చనిపోయిన వారి ఆత్మలతో వివిధ పద్ధతుల్లో మాట్లాడే వాళ్ళని 'మీడియమ్స్' అని అంటారు ఇంగ్లీషులో. చనిపోయిన వాళ్లు బ్రతికున్న వాళ్ళతో మాట్లాడాలన్నా, బ్రతికున్నవాళ్ళు, చనిపోయిన తమ మనుషుల్తో మాట్లాడాలన్నా ఈ 'మీడియం'లు దుబాసీల్లా వ్యవహరిస్తారన్న మాట. పాశ్చాత్య దేశాలలో ప్రొఫెసర్ గాడ్విన్, మైకెల్ డ్యురన్ మొదలయిన ప్రఖ్యాత మీడియంల పరిశోధనలు నమ్మశక్యమైనవని శాస్త్రవేత్తలు కూడా అంగీకరించారు. ప్రఖ్యాత భారతీయ ఆంగ్ల రచయిత ఆర్. కె. నారాయణ్ కూడా తనకు అత్యంత ప్రియమైన భార్య రాజమ్ ఆత్మతో, మిష్టర్. రావ్ అనే ఒక మీడియం సహాయంతో సంభాషించినట్లు 'మై డేస్—' అనే పేరుతో వ్రాసిన తన ఆత్మకథలో వ్రాశాడు.

"కారీ ఆన్ మిష్టర్ వరహాలూ! వెరీ ఇంటరెస్టింగ్"— అన్నారు సిన్హాగారు ఆరిపోయిన 'మొరాకో'ను మళ్లీ వెలిగించుకొంటూ.

"ఇలా ఆత్మతో మాట్లాడ్డానికి ఏకాగ్రతగా కూర్చొనే సమయాన్ని 'సెషన్స్' అంటారు.

శకుంతలాదేవి, చౌదరి ఏకాంతంగా, ఏకాగ్రతతో దాదాపు నాలుగైదు 'సెషన్స్' గడిపిన తరువాత శకుంతలాదేవి సావిత్రి ఆత్మను కాంటాక్ట్ చేసిందట.

సావిత్రి ఆత్మను కాంటాక్ట్ చెయ్యడానికి ఓ చిత్రమైన పద్ధతి ఉపయోగించిందట శకుంతలాదేవి. ప్రతి శుక్రవారం సాయంత్రం, చౌదరి ఇంట్లో మూలన వున్న ఓ చీకటి గదిలో చౌదరి, శకుంతల ఒక టేబిల్‌కు అటూ ఇటూ కుర్చీలు వేసి ఎదురెదురుగా కూర్చునే వాళ్లట అయిదు-ఆరు గంటల మధ్య.

శకుంతల ఒక తెల్ల కాగితాల కట్ట, సూదిగా మొన చెక్కిన పెన్సిల్ తీసుకొని కూర్చునేదట. తర్వాత ప్రశాంత మైన మనసుతో ఆ తెల్లకాగితం వంకే చూస్తూ కూర్చో మని చెప్పేదట. తెల్ల కాగితం మీద పెన్సిల్ మొన ఆనించి వ్రాయడం మొదలెట్టేదట. అలా వ్రాస్తుపోతూ వుండగా మధ్యలో ఎక్కడో సావిత్రి ఆత్మ చెబుతున్న మాటలు ఆ చెయ్యి వ్రాయడం మొదలు పెడుతుందన్న మాట.

చౌదరి మనసులో కలిగే రకరకాల ప్రశ్నలకు సమా ధానాలు, సందేహాలకు జవాబులు, అతను అడగకుండానే శకుంతల చేతివ్రాత ద్వారా లభించేవి. ఈ విషయం చౌదరి చిన్నకొడుకు రమేష్ ఒకసారి నా దృష్టికి తెచ్చి, చౌదరి ఈ ఆత్మతో సంభాషణ మాయలో పడి, బిజినెస్ వ్యవహారాలు, ఇంటి వ్యవహారాలు ఏమీ పట్టించుకోవడం లేదని, నన్నొక సారి తండ్రి స్నేహితుడిగా నచ్చచెప్పమని కోరాడు.

ఈ విషయం విన్నప్పుడు నేనూ నమ్మలేక పోయాను. మీడియమ్స్ గురించి నేను ఇదివరలో విని వుండడం తప్ప కళ్ళతో ఎప్పుడూ చూళ్లేదు. వెంటనే వీలు చూసుకొని జానకి రామయ్య చౌదరిని కలుసుకొన్నాను. అప్పటికి శకుంతల

ఆ ఇంట్లో మకాం వేసి దాదాపు నాలుగు నెలలవుతుంది.

జానకిరామయ్య ఆ ఇంట్లో శకుంతలకు ఏ రకమైన లోటు జరక్కుండా అన్ని ఏర్పాట్లూ చేశాడు. శకుంతల ఆ ఇంట్లోకి వచ్చి నాలుగు నెలలు దాటుతున్నా, ఆమె వచ్చిన పనేమిటో ఇంట్లో సభ్యులకు తప్ప మరెవరికీ తెలియకుండా ఏర్పాట్లు జరిగాయి. ఇంట్లో నౌఖర్లు కూడా నమ్మకస్తులు కావడంతో లోపల జరుగుతోన్న ఈ 'సెషన్స్' గురించి ఎవరికీ తెలియలేదు.

జానకిరామయ్యలో మార్పు చూసి చాలా ఆశ్చర్య పోయాను నేను. చాలా భారీగా, ఆరోగ్యంగా కనిపించే వ్యక్తి, సగానికి తగ్గిపోయాడు. కాని కళ్ళల్లో మాత్రం చిత్ర మైన మెరుపు కనిపించింది నాకు. మొదట శకుంతలాదేవి ఎక్కడా ఇంట్లో వున్నట్లు కనిపించలేదు నాకు. మెల్లిగా మాటల్లో పెట్టి ఈ విషయం గురించి అడిగాను చౌదరిని.

నా నోటినుండి శకుంతల గురించి వినగానే ఆశ్చర్య పోయాడు చౌదరి.

"నీకెలా తెలుసు ఆవిడను గురించి"—అన్నాడు.

"ఊళ్లో ప్రజలంతా మీ ఇంట్లో ఆవిడ వుండడం గురించి రకరకాలుగా అనుకొంటున్నారు. కొంతమంది ఆవిడ్ని మీరు వుంచుకొన్నారని కూడా చెప్పుకొంటున్నారు" అన్నాను నేను చౌదరినుండి అసలు విషయం రాబట్టడానికి.

చౌదరి నా వైపు కోపంగా చూశాడు. "లోకులు కాకులని అందుకే అన్నారు. అసలు విషయం చాలా మందికి తెలి యదు. నాకు జీవితంలో శకుంతల తారసపడ్డం గొప్ప అదృష్టం. నేను జీవితంలో ఏదైతే శాశ్వతంగా పోగొట్టు కొన్నాననుకున్నానో, అది అబద్ధం అని నిరూపించింది శకుంతల. ఆమె గొప్ప తపస్విని-తత్వవేత్త. అలాంటి

మనిషిని వుంచుకొనే తాహతు నాకు లేదు. ఆ విషయం ఆలోచించడమే మహా పాపం''-అన్నాడు బాధగా.

దీన్ని బట్టి చౌదరికి శకుంతల అంటే గొప్ప గౌరవం, అభిమానం వున్నాయని అర్థమయింది నాకు. అయినా ఇంకా విషయం రాబట్టాలని ''ఏమిటావిడ గొప్పతనం'' అన్నాను మంకుగా.

చౌదరి నన్ను పసిపిల్లాడిని చూసినట్లు చూసి మొదటి నుండీ జరిగిన విషయాలన్నీ చెప్పాడు. సావిత్రి ఆత్మతో తను శకుంతల ద్వారా ఎలా సంభాషించిందీ మొదలయిన వివరాలు చెప్పాడు. తనకూ సావిత్రికీ తప్ప మరెవరికీ తెలియని అంతరంగిక విషయాలు ఎలా శకుంతల చేతి వ్రాత ద్వారా వ్రాయబడినవో ఓపిగ్గా వివరించాడు.

నేనదంతా విని, ''అన్‌బిలీవబుల్. చనిపోయిన వాళ్ళ ఆత్మలతో మాట్లాడ్డం అనే విషయం నేను వినడం ఇదే మొదటిసారి''—అన్నాను జరిగిన విషయం నమ్మలేనట్లు నటిస్తూ.

జానకిరామయ్య మారు మాట్లాడకుండా బీరువా తెరిచి ఓ పెద్ద కాగితాల కట్ట నా ముందు పడేశాడు. ప్రతీ కాగితం నిండా పెన్సిల్‌తో వ్రాసిన అక్షరాలు వున్నాయి. ప్రతి కాగితంలో కొన్ని వాక్యాలు ఎర్ర సిరాతో అండర్ లైన్ చెయ్యబడి వున్నాయి.

''ఏమిటివి?'' అన్నాను ఆ కాగితాలవైపు తిరగవేస్తూ.

''సెషన్స్‌లో శకుంతల చేయివ్రాసిన మేటర్. అందులో సావిత్రి మాటలన్నీ నేను తర్వాత ఎర్రసిరాతో అండర్ లైన్ చేశాను''—అన్నాడు చౌదరి. అతని పెదవులు వణుకుతోన్నయ్.

నేను పావుగంటసేపు ఆ కాగితాల్లో అండర్లైన్ చేసిన

వాక్యాలన్నీ పరిశీలనగా చదివాను. అవి చదువుతోంటే నిజంగా సావిత్రి మాట్లాడుతున్నట్టే అనిపించింది నాకు. చౌదరి చెప్పింది నిజమే. సావిత్రికి, తనకు తప్ప మరెవరికీ తెలియని విషయాలు అందులో వున్నాయి. ప్రతీ 'సెషన్స్' చివర సావిత్రి, చౌదరిని తను అక్కడ లేనని బాధ పడ వద్దని, అతన్నెప్పుడూ తను కనిపెట్టుకొనే వుందనీ, బ్రతికి నంతకాలం సుఖంగా బ్రతకమనీ, వ్రాసినట్లువుంది. ఎందుకో నాకు తెలియకుండానే ఆ కాగితంలో మాటల్ని నమ్మ మంటుంది మనసు. నోట మాటలేకుండా ఆ కాగితాలవంకే తేరిపార జూస్తూ వుండిపోయాను.

"లాయర్‌గారికి ఇంకా నమ్మకం కలుగలేదా?"—

ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను. ఎప్పుడు గదిలోకి వచ్చిందో తెలియదు- ఆమె అక్కడ నిలబడి వుంది. మీడి యమ్స్ కూడా ఆకర్షణీయంగా వుంటారని నే నెప్పుడూ అనుకోలేదు. ఎర్రబోర్డరున్న నల్లచీర, నల్ల రవిక వేసు కొంది. నల్లని వత్తైన జుట్టు. తెల్లటి వొంటిరంగు. ముఖాన కాటుకబొట్టు, కళ్ళకు కాటుక వెడల్పుగా పెట్టుకొంది. నే నావిడవంక సంభ్రమంతో చూస్తూ వుండిపోయాను.

''ఈవిడే శకుంతలాదేవి!'' అన్నాడు చౌదరి.

మర్యాదలు పాటించే స్థితిలో లేదు నా మనసు. మంత్రించ బడిన మనిషికి మల్లే ఆమె వైపే చూస్తూ వుండిపోయాను.

"మీరు నమ్మలేకపోతే వచ్చే శుక్రవారం మాతోబాటు మీరు-సెషన్స్‌కు కూచోకూడదూ?''—

శకుంతలాదేవి కంఠం మృదువుగా వుంది

''కాని శకుంతల....''-అంటూ చౌదరి అడ్డం చెప్ప బోయాడు.

చిన్ని ముంజేతి కదలికతో చౌదరి అభ్యంతరాన్ని

ప్రక్కకు నెట్టింది శకుంతల.

"సత్యాన్వేషికి సహాయం చెయ్యడం వేదాంతుల కర్తవ్యం. ఆయన వచ్చినందువల్ల సెషన్స్‌కు వచ్చే నష్టం ఏమీ లేదు లెండి''-అన్నది శకుంతలాదేవి.

చౌదరి ఆమెను ఏకవచనంలో సంబోధించడం గమనించాను నేను. శుక్రవారం నాడు వాళ్ళతోపాటు సెషన్స్‌కు కూర్చోవడానికి అంగీకరించాను.''

మొదట్లో వరహాల్రావు కధనం పెద్దగా పట్టించుకోకపోయినా, నెమ్మదిగా నాలో ఇంట్రెస్ట్ కలుగసాగింది. పిళ్లై గారు చివరికంటా కాలిన 'మొరాకో'ను ఆష్ట్రేలో పారేసి మరోటి వెలిగించారు. కూజాలోనుండి నీళ్లు గ్లాసులో వంపి తీసుకొచ్చి వరహాల్రావు కిచ్చాను. వరహాల్రావు సగం త్రాగి, గ్లాసు బల్లమీద పెట్టి, మళ్ళ బీడీ వెలిగించాడు. ఏమిటీ ఆలశ్యం అన్నట్టు చూశాను అతని వంక.

''అనుకొన్నట్లుగా మరుసటి శుక్రవారం సాయంత్రం అయిదు గంటలకు చౌదరి ఇంట్లో సెషన్స్‌కు కూర్చున్నాను. మేము కూర్చొన్న గది తూర్పువైపున వుండడంవలన వెలుతురు తక్కువగా వుంది. దానికి తోడు కిటికీలకువున్న అద్దాల తలుపులు మూసేసి కర్టెన్స్ వేసేశారు. గుండ్రని బల్లచుట్టూ మూడు కుర్చీలు వేశారు.

శకుంతలాదేవి తలస్నానం చేసి, నుదుట పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొని, నల్లని చీరె కట్టుకొంది. జాకెటు వేసుకోలేదు. పమిటను భుజాలచుట్టూ త్రిప్పి వంటిని కప్పుకొంది. బరువైన ఆమె పెద్ద వక్షోజాలు సన్నని ఆ చీరె పొరలోనుండి బయటికి తన్నుకొస్తున్నాయి. చౌదరి భక్తిగా ఆమె వంకే చూస్తూ కూర్చొన్నాడు.

సరిగ్గా అయిదు గంటలకు శకుంతలాదేవి తెల్ల కాగితం మీద సూదిగా మొన చెక్కిన పెన్సిల్ పెట్టింది. నేను ఊపిరి బిగబట్టి ఏం జరుగుతుందోనని చూస్తూ కూర్చున్నాను.

"దయచేసి ఏమీ మాట్లాడవద్దు. సాధ్యమైనంత వరకూ మనసులోకి ఏ ఆలోచనా రానియ్య వద్దు. మీకు అలవాటు లేదు గనుక పూర్తి ఏకాగ్రత సాధించ లేరనుకోండి. కాని మనస్సు ఖాళీగా వుంచి కాగితాన్ని చూడ్డానికి ప్రయత్నించండి"-అన్నది శకుంతలాదేవి సెషన్ మొదలుపెట్టే ముందు.

నా మనసులో రకరకాల ఊహలు, ఆలోచనలు గిర్రున తిరుగు తున్నాయి. ఎదురుగా జాకెట్ లేకుండా పమిటలో నుండి ముందుకు దూకుతున్న శకుంతల వక్షోజాలు ఏకాగ్రతను కుదరనివ్వడం లేదు. కాని ఏం జరుగుతుందో చూడాలనే క్యూరియాసిటీ వల్ల కొంతవరకూ నా ఆలోచనల్ని అదుపులో పెట్టుకో గలిగాను.

ఊపిరి పీల్చలేనట్లు శకుంతల చేతివంకే చూస్తున్నాను. చౌదరి ఏకాగ్రతగా అర్ధనిమీలిత నేత్రాలతో కాగితానికి ఆనించి వున్న పెన్సిల్ మొన వంకే చూస్తున్నాడు. గదిలో అంతా నిశ్శబ్దంగా వుంది. సగం సగం చీకటిగా వున్న ఆ వాతావరణంలో ఎందుకో ఒళ్లు ఝల్లుమంది నాకు. పెన్సిల్ కాగితం మీద మెల్లిగా కదలడం ప్రారంభించింది. కాగితం మీద ఏం వ్రాయబడుతుందో చూడ్డానికి ఆత్రంగా ముందుకు వంగాను.

మొదటి వాక్యం పూర్తయింది. అర్థం పర్థం లేని పిచ్చి వ్రాత. అలా దాదాపు పేజీ అంతా వ్రాసింది. ఆ పేజీ మొత్తంలో అర్థం చెప్పుకో గలిగిన వాక్యం ఒక్కటి కూడా కనిపించలేదు. మళ్లీ క్రొత్త పేజీమీద వ్రాయడం మొదలు పెట్టింది శకుంతల.

అప్పుడే చిత్రమైన మార్పు వచ్చింది గదిలో. ఎందుకో నాకు తెలియకుండానే వంటిమీద రోమాలు నిక్కబొడుచుకొని, వెన్నులోంచి వణుకు పుట్టింది. మేం ముగ్గురం కాక గదిలో మరో వ్యక్తి ఎవరో వున్నారనే చిత్రమైన భావం కలిగింది నాకు. కళ్ళప్పగించి కాగితం వైపే చూస్తూ వుండి పోయాను.

అప్పుడే మరో విషయం గమనించాను. శకుంతల చెయ్యి అతివేగంగా కాగితం మీద వ్రాసుకు పోతోంది. చూస్తుండగానే కాగితం నిండిపోయి, మరో కాగితం మీద వ్రాయ సాగింది. మామూలు పరిస్థితుల్లో 'టాప్‌స్పీడ్' స్టెనోలు కూడా అంత వేగంగా వ్రాయలేరు. సరిగ్గా చూస్తుంటే శకుంతల వ్రాస్తున్నట్లు లేదు ఆ వ్రాత. ఎవరిదో అదృశ్య హస్తం చకచకా ఆ కాగితాల మీద వ్రాసుకు పోతున్నట్లు వుంది. అప్పటి వరకూ వ్రాసిన దాంట్లో చెప్పుకోదగిన అర్థం కనిపించలేదు నాకు.

నాలుగో కాగితం వ్రాయడం మొదలయేప్పటికి ఎందుకో గదిలో చీకటి మరింత హెచ్చయిందనిపించింది. తెల్ల కాగితం, దాని మీద పెన్సిల్ వ్రాస్తున్న అక్షరాలు తప్ప మరేమీ కనిపించడం లేదు. నమ్మలేనట్లుగా అక్షరాల వైపు చూశాను. సావిత్రి మాట్లాడుతోంది.

'....లోకులంతా మీరు నాతో సంభాషిస్తున్నారని అపోహ పడి మీ మీద రకరకాల నిందలు వేస్తున్నారని మీరు చింతిస్తున్నారు. ఆ విషయంలో నిజం లేదు. ఈ ఇంట్లో వున్న వాళ్ళకు తప్ప బయటి వాళ్ళెవరికీ ఈ విషయం తెలియదు....

....పెద్ద బాబు కూడా మీరేదో పిచ్చిలో పడ్డారని మీ గురించి ఆందోళన చెందుతున్నాడు. పిల్లల గురించి మీరు

బాధ పడవలసిన అవుసరం లేదు. వాళ్లు సుఖంగా బ్రతుకుతారు. మీరు కూడా సుఖంగా వుండాలి. వివాహం సుఖానికి నాంది....

....ఎవరో క్రొత్త వ్యక్తిని తీసుకు వచ్చారు గదిలోకి. ప్రత్యక్షంగా నేనున్నానని నిరూపించడానికి మీరెందుకు వృధా ప్రయాస పడతారు? ప్రజలు నన్ను గురించి నమ్మవలసిన అవుసరం లేదు. మీకు నేను మీకోసం ఇక్కడ వున్నానని తెలిస్తే చాలు. ఇంకెప్పుడూ ఇలా వృధా ప్రయాస పడకండి. కాని వచ్చిన వ్యక్తి అన్వేషణ వృధా కాకుండా అతనితో సత్యాన్ని చెపుతాను. నగర పాలకుడి ఆత్మ త్వరలో మా దగ్గరకు వస్తుంది....

ఆ తర్వాత శకుంతల దాదాపు మూడు పేజీలు ఆరు గంటల వరకూ వ్రాసినా ఏమీ అర్థమున్న మాటలు లేవు పై మాటలు వ్రాయడం పూర్తవగానే గదిలో చలి హఠాత్తుగా పోయి ఉక్క పెడుతున్నట్లు అనిపించింది. టైము చూసుకున్నాను. అయిదున్నర అయింది. తర్వాత అరగంట శకుంతల వృధా ప్రయత్నం చూస్తూ గడిపాను. సావిత్రి ఆత్మ తిరిగి రాలేదు.

ఒక మీడియం చనిపోయిన వ్యక్తి ఆత్మతో కమ్యూనికేట్ చెయ్యడం ప్రత్యక్షంగా చూడడం అదే మొదటిసారి. నిజంగా ఒక అరుదైన అనుభవం అది నాకు. ఆత్మలు, దెయ్యాలు గురించి నేనెప్పుడూ నమ్మలేదు. కాని ఆ రోజు సంఘటనతో మానవాతీత శక్తులు, ఆత్మలు అనేవి మన చూట్టూవుండి మనల్ని గమనిస్తాయి అనే అభిప్రాయం నాలో స్థిరపడిపోయింది. దానికి తోడు ఈ సెషన్ జరిగిన రెండ్రోజులకు పిటీమేయర్ మరణించడంతో నా నమ్మకం బలపడింది.

తర్వాత రమేష్‌ను కలుసుకొని మాట్లాడాను. శకుంతలా దేవి మీడియం అనే విషయంలో ఏ రకమైన అనుమానం లేదని; చౌదరిగారు, సావిత్రి ఆత్మతో సంభాషించడం నిజమే నని, నాకు కలిగిన అనుభవం వివరిస్తూ చెప్పాను.

రమేష్ నా వంక విసుగ్గా చూశాడు. "సారీ మిస్టర్ వరహా ్రావ్! షి ఈజ్ ఎ విచ్. అందులో సందేహంలేదు. ఏదో మంత్ర తంత్రాల భ్రమలోపెట్టి, నాన్నగారిని పిచ్చాణ్ణిచేసి మా ఆస్థి అంతా కాజెయ్యాలని చూస్తోందని నా నమ్మకం. మీరు విషయాన్ని అర్థం చేసుకొని మీ తర్కబలంతో, వాద నతో నాన్నగారి మనసు మారుస్తారని అనుకొన్నానుగాని, ఇలా మీరూ దాని మాయలో పడిపోతారనుకోలేదు"— అన్నాడు.

"సారీ రమేష్! నాకు కలిగిన అభిప్రాయం అది"— అన్నాను అపోలజిటిక్‌గా.

శకుంతలాదేవి మీడియం అనే విషయంలో ఏమీ అను మానం లేకపోయినా, ఆవిడ గురించి కొన్ని విషయాలు నాకు అర్థం కాకుండా వుండిపోయాయి. చౌదిరి ఆమెను ఏక వచనంతో సంబోధించడం, సెషన్స్‌లో ఏమాత్రం సంకోచం లేకుండా రవిక లేకండా తన సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ కూర్చోవడం నా మనసులో ఓ మూల కెలుకుతోనే వున్నాయి.

తర్వాత మరోనెల రోజులకే మరో వార్త విన్నాను రమేష్ ద్వారా. జానకిరామయ్య చౌదరి శకుంతలాదేవిని పెళ్లి చేసుకోబోతున్నట్లు. ఎందుకో ఆశ్చర్యం అనిపించ లేదు నాకు. వాళ్ళ పరిచయం నాచురల్‌గా పెళ్లికే దారితీస్తుం దని నాకు ముందే అనిపించింది. పైగా ఒక సెషన్‌లో సావిత్రి ఆ సలహా ఇచ్చిందట.

ఈ వివాహం జరగడం కుటుంబంలో ఎవరికీ ఇష్టంలేదు.

పెద్ద కొడుకు సురేష్ తండ్రితో వాదించి ఫలితం లేక వెళ్ళిపోయాడు. కూతురు ప్రమీలకూడా నెమ్మదిగా తన అసమ్మతి తెలియజేసింది. ఇక రమేష్ సంగతి సరేసరి. తన ఇష్టానికి వ్యతిరేకమైన వాళ్ళకు ఆస్థిలో చిల్లి గవ్వకూడా రాదని ప్రకటించారు చౌదరి. ముగ్గురిలో ఎవరూ దగ్గర లేకుండానే చౌదరి శకుంతలను పెళ్ళి చేసుకొన్నాడు.

పెళ్ళి చేసుకొన్న రెండు నెలలకే పార్షియల్ పెరాలిసిస్, గుండె పోటుతో మంచాన పడ్డాడు చౌదరి"—ఆగాడు వరహాల్రావు.

వరహాల్రావు వృత్తి గౌరవానికి భంగం కలిగించేది ఇందులో ఏం జరిగిందో నాకు అర్థం కాలేదు. ఏమిటీ సోది అన్నట్లు సిన్హాగారి వైపు చూశాను.

సిన్హాగారు మొరాకో మేఘాల మధ్యనుండి వరహాల్రావును చూసి ఆప్యాయంగా నవ్వారు.

"ఎవెరీబిగ్ ఇంట్రోడక్షన్ వరహాలుభాయ్! అసలు కథకు రానేలేదు నువ్వు"—అన్నారు సిన్హాగారు.

"యస్. యస్. ఇట్జ్ ట్రూ! కాని నే చెప్పబోయే సమస్యకు ఈ ఉపోద్ఘాతం అంతా చెపితేగాని పూర్తి రూపం రాదు. ఎందుకంటే నా సమస్యలో ఈ ఆత్మల ప్రమేయం కూడా ఏమన్నా వుందేమోనన్న అనుమానం నాకుంది. అంచేతే ఆ విషయం అంతా మీకు వివరంగా చెప్పాను"—అన్నాడు వరహాల్రావు.

సిన్హాగారు తలవూపి, "గో ఆన్ దెన్"—అన్నారు మళ్ళీ సమాధిలోకి వెళ్లిపోతూ.

నేను విసుగ్గా నా సిగరెట్ వెలిగించుకొని తృప్తిగా పొగ పీలుస్తూ వుండిపోయాను.

"పది రోజుల క్రితం జానకి రామయ్యచౌదరి నన్ను

అర్జెంట్‌గా రమ్మని కబురుపెట్టాడు. హడావిడిగా వెంటనే బయల్దేరి వెళ్లాను. పడకమీద అచేతనంగా పడివున్న చౌదరిని చూస్తే జాలేసింది నాకు. శకుంతల చౌదరి పేరున అర్చన చేయించడానికి దుర్గగుడికి వెళ్లిందట. ఇంట్లోలేదు.

మంచం ప్రక్కనే డాక్టరు, నర్సు వున్నారు. ఫానుగాలి చౌదరికి పడక పోవడంవలన ఇంట్లో పనిచేసే ఆయా రమ ణమ్మ విసనకర్రతో విసురుతూ తల దగ్గర నిలబడివుంది.

నన్ను చూడగానే బలహీనంగా నవ్వడానికి ప్రయత్నించాడు చౌదరి. ముఖంలో జీవకళ లేదు. దయ్యం పట్టిన మని షిలా వున్నాడు.

"వరహాల్రావ్! వెంటనే ఓ వీలునామా వ్రాయాలి"- అన్నాడు చౌదరి తిన్నగా అసలు విషయానికి వస్తూ.

చౌదరి మాటలు చాలా తగ్గు స్వరంలో బలహీనంగా వున్నయ్. ఎడమచెయ్యి, ఎడమకాలు పూర్తిగా స్వాధీనంలో లేవు.

"ఆల్‌రైట్! చెప్పండి ఎలా వ్రాయమంటారో! రేపు తయారుచేసి తీసుకు వస్తాను. సంతకం పెడుదురుగాని"- అన్నాను.

ఎందుకంటే, చౌదరిలాంటి ఆస్థిపరుడి వీలునామా చాలా జాగ్రత్తగా తయారు చెయ్యాలి. లక్షల ఆస్థి తన తదనంతరం అనేకమందికి చెందేట్లు వ్రాసేప్పుడు, ఎవరికి ఏవి చెందాలో వివరంగా ఓపిగ్గా, అతిజాగ్రత్తగా వ్రాయాలి.

"లాభంలేదు వరహాల్రావ్! నేను రేపటివరకూ బ్రతుకు తాననే నమ్మకం లేదు. ఇప్పటికే ఆరుసార్లు విపరీతమైన గుండెపోటు వచ్చింది. వెంటనే వ్రాయాలి-" అన్నాడు చౌదరి.

గుండెపోటు మూడుసార్లకన్నా ఎక్కువ వస్తే బ్రతకడం అసంభవం అంటారు. మూడోసారి తర్వాత వచ్చే ప్రతీ పోటూ ప్రాణాంతకమే. ప్రక్కనేవున్న డాక్టర్ అవునన్నట్లు తలవూపాడు.

"సరే వివరాలు చెప్పండి చిత్తు ప్రతి తయారు చేస్తాను. తరువాత మీ స్వహస్తంతో దాన్ని కాపీచేసి సంతకం చేద్దురుగాని"-అన్నాను బ్రీఫ్‌కేస్‌లో నుండి తెల్ల కాగితాలు బయటికి తీస్తూ.

బలహీనంగా నవ్వాడు చౌదరి. ఆయా రమణమ్మకు కళ్ళతోనే సైగ చేశాడు. రమణమ్మ దిండుక్రిందనుండి మడత పెట్టిన కాగితంతీసి చౌదరికి అందించింది. చౌదరి కుడిచేత్తోనే కాగితాన్ని మడతలు విప్పి ఓ సారి చదువుకుని, నాకు అందించాడు.

"అందులో లీగల్ మిస్టేక్స్ ఏమన్నావుంటే చెప్పండి-" అన్నాడు.

పావుతావు కాగితంమీద వ్రాసిన ఆ డ్రాఫ్ట్ చూసి ఆశ్చర్యపోయాను. ఆ పద్ధతిలో వీలునామా వుంటే వివరంగా పేర్లు, ఆస్తులు వ్రాయాల్సిన పనిలేదు. తనకున్న యావదాస్తి భార్య శంకుతలాదేవి పేర్న వ్రాసేశాడు చౌదరి. అయితే శంకుతల తదనంతరం మాత్రం, ఆస్థి తన ముగ్గురి సంతానానికి సమానంగా చెందుతుంది అని వుంది.

ఎందుకిలా చేశాడు చౌదరి? తన స్వంత బిడ్డలకు చిల్లికానీకూడా లేకుండా ఎందుకు చేశాడు? ఎందుకు వాళ్ళంటే అంతకోపం అతనికి? పరిచయమయి సంవత్సరమైనా కాలేదు శకుంతలమీద అంత ప్రేమ వుందా చౌదరికి? ఒక్కక్షణం నమ్మలేనట్లు కళ్ళప్పగించి ఆ వీలునామా డ్రాఫ్ట్‌వంక చూస్తూ వుండిపోయాను.

"ఏమిటి వరహాల్రావ్? ఆ రకంగా వ్రాస్తే సరి పోతుందా?"-అన్నాడు చౌదరి.

కుదరదన్నట్లు తలాడించాను. "కొన్ని విషయాల్లో క్లారిఫికేషన్ లేదు. 'నా భార్య శకుంతలాదేవి' అని వ్రాశారు. మీ తదనంతరం ఆవిడ పెళ్లి చేసుకొంటే, ఆస్థిమీద హక్కు పోయే అవకాశం వుంది. అలాగే శకుంతలాదేవికి విక్రయాధికారం వుందోలేదో సూచించలేదు మీరు. ఈ రెండు విషయాలు స్పష్టంచేస్తే డ్రాఫ్టులో ఏమీ లోపం వుండదు"-

రెండు నిముషాలు శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు జానకి రామయ్య చౌదరి. తరువాత అతని చూపు నా వైపు తిరిగింది.

"సరే వరహాల్రావ్! నా తదనంతరం మళ్ళీ వివాహం చేసుకొన్నా, చేసుకొనకపోయినా యావదాస్థి విక్రయ హక్కు లేకుండా శకుంతల పేర్న వ్రాస్తున్నాను. శకుంతల తదనంతరం మాత్రమే సురేష్, ప్రమీల, రమేష్‌లకు ఆస్తిపై హక్కు సంక్రమిస్తుంది. ఒకవేళ శకుంతల పెళ్ళి చేసుకొని ఆమెకు సంతానం కలిగితే, ఆస్థిలో నాలుగోవంతు ఆమె సంతానానికి చెందుతుంది. ఆరకంగా వెంటనే వీలునామా డ్రాఫ్టు తయారు చెయ్యండి"—అన్నాడు చౌదరి చివరికి.

నేను కాసేపు ఆలోచించి వెంటనే ఆయనకోరిన విధంగా వీలునామా డ్రాఫ్టు తయారుచేశాను. చౌదరి విని అంగీకారంగా తలాడించాడు.

"మీరు స్టాంప్ పేపర్‌మీద వ్రాయడంలేదు కాబట్టి, వీలునామా మీ స్వహస్తంతో వ్రాయడం మంచిది"- అన్నాను నేను ఆయనతో.

చౌదరి డాక్టర్, నర్సుల సహాయంతో వ్రాయడానికి వీలయ్యే పొజిషన్‌కు మారాడు. పక్షవాతంతో ఎడమచెయ్యి, కాలు

పడిపోయిన వ్యక్తి వ్రాయాలంటే చాలకష్టం. అయినా అతికష్టంమీద ఆపని చెయ్యగలిగాడు.

డాక్టర్ తెల్లకాగితంవున్న క్లిప్‌బోర్డు పరుపుమీద చేతి కందేట్టు కదలకుండా పట్టుకొంటే చౌదరి బాగావున్న కుడి చేత్తో వీలు వ్రాయడానికి సిద్ధపడ్డాడు.

"రమణమ్మా! డ్రాయర్లో నా పెన్ ఇలా ఇవ్వు!"—అన్నాడు చౌదరి.

రమణమ్మ గదిలో ఓ ప్రక్కవున్న డ్రాయర్ తెరచి చౌదరికి పెన్ తెచ్చి అందించింది. అరగంటసేపు కష్టపడి మెల్లిగా చౌదరి వీలునామా వ్రాయడం పూర్తిచేశాడు. సంతకంచేసి అలసటగా కళ్లుమూసుకొన్నాడు. తర్వాత మెల్లిగా కళ్లుతెరిచి వీలునామా కాగితం, పెన్ చూపిస్తూ డాక్టర్‌కు సైగచేశాడు.

డాక్టర్, అతని తర్వాతనర్స్ వీలునామామీద సాక్షి సంతకాలు చేశారు. నేను రమణమ్మను కూడా సాక్షి సంతకం చెయ్యమన్నాను. ఆ తర్వాత వీలునామాను నా బ్రీఫ్‌కేస్‌లో నుండి ఓ పసుపు రంగు కవరుతీసి దాన్లో పెట్టి అతికించాను. నేను వ్రాసిన డ్రాఫ్టును. అదివరకు చౌదరి వ్రాసింది చించి చెత్త బుట్టలో పారేశాను.

"థాంక్స్ వరహాలరావ్! నీ ఫీజు మొత్తానికి మా మేనేజర్ చెక్కు పంపిస్తాడు"—అన్నాడు చౌదరి నన్ను ఇక వెళ్ళమన్నట్లు సూచిస్తూ.

నేను వెంటనే అందరికీ ఓసారి కృతజ్ఞతలు తెలిపి గదిలోంచి బయటికి వచ్చాను. నేను గదిలోంచి బయటకు వస్తూండగా శకుంతల పూజనుండి తిరిగివచ్చి చౌదరి దగ్గరికి వెళుతోంది.

"నమస్కారం లాయరుగారూ"—అన్నది నన్ను చూసి. ఆమె కట్టుకొన్న పట్టు చీరె ఖరీదు వెయ్యి రూపాయలకు తక్కువుండదు. నేను ఇదివరలో చూసినప్పటికి, ఇప్పటికి శకుంతలలో చాలా మార్పు వచ్చింది. డబ్బుతోపాటు వచ్చే దర్పం కనిపిస్తోంది ఆమెలో.

"నమస్కారం!"—ముభావంగా అని బయటకు వచ్చేశాను.

పోర్టికోలో అప్పుడే కారుదిగి వస్తున్న రమేష్ కనిపించాడు. నన్ను చూడగానే నవ్వుతూ పలకరించాడు.

"ఏమిటి ఇలా వచ్చారు?"—అన్నాడు షేక్ హాండ్ ఇస్తూ.

"మీ నాన్నగారు వీలునామా వ్రాశారు"—అన్నాను అతని ముఖంలోకే చూస్తూ.

ఒక్కక్షణం ఆశ్చర్యపోయినట్లు కనిపించాడు. "ఐసీ!" అన్నాడు ఉదాసీనంగా.

నేను మాట్లాడలేదు.

"రండి! నా గదిలో కూర్చొని మాట్లాడుకొందాం!"—అన్నాడు చివరికి.

వృత్తి రీత్యా వీలునామాలో ఏముందో నేను చెప్పకూడదు. వ్రాసినప్పుడు గదిలో రమణమ్మ, డాక్టరు, నర్సు వున్నారు కాబట్టి రమేష్‌కు ఎలాగూ తెలుస్తుంది. నేను బ్రీఫ్ కేసు హాలులో బల్లమీదపెట్టి రమేష్ గదిలోకి వెళ్ళాను.

"బహూశా ఆస్థంతా ఆ మాయలాడికి వ్రాశాడనుకొంటాను ముసలాడు?"—అన్నాడు గదిలోకి వెళ్ళాక.

నేను మాట్లాడలేదు. నవ్వి వూరుకున్నాను.

ఒక్కక్షణం నా వైపు తీక్షణంగా చూశాడు రమేష్. తరువాత చటుక్కున నవ్వి, "ఓ డిహెల్ విత్ ఇట్! మీ లీగల్

మనుషుల్తో అన్నీ చిక్కులే''-అన్నాడు.

''ఎలాగూ నే వెళ్ళిం తరువాత మీకు తెలుస్తుంది లెండి''-అన్నాను నవ్వి. ఎందుకో అతన్ని చూస్తే జాలేసింది.

తర్వాత ఓ పదినిముషాలు అవీ ఇవీ మాట్లాడుకొన్నాక నేను సెలవు తీసుకొన్నాను. బయట హాల్లో కొచ్చేప్పటికి శకుంతల అప్పుడే నా బ్రీఫ్ కేస్ మూత మూస్తోంది.

''ఏమిటి?''-అన్నాను తీక్షణంగా.

''మీ బ్రీఫ్ కేస్ మూత తెరచివుంటే మూస్తున్నాను''-అన్నది శకుంతల నిశ్చలంగా.

నేనా బ్రీఫ్ కేస్ తెరిచి చూశాను. కవరు నేను పెట్టిన చోట అలాగే వుంది. మూత తీసినట్లుగానీ, ఏమీ గుర్తులు లేవు. తలవూపి ఇంటికి వచ్చేశాను.

వీలునామా వ్రాసిన వారం రోజులకు ఏదోసారి గుండె పోటువచ్చి జానకిరామయ్యా చౌదరి మరణించారు'' తన డైలాగ్ ఎఫెక్టుకోసం మా ముఖాలు పరిశీలనగా చూశాడు వరహాల్రావు.

'హమ్మయ్య! పీడవదిలి పోయింది' అనుకొన్నాను మనసులోనే.

''జానకిరామయ్యా చౌదరి పోయాక నేచురల్‌గా విల్లు బయట పెట్టాలి నేను. చనిపోయిన రెండవరోజు చౌదరి ఇంట్లో అందరూ సమావేశమయి వుండగా, ఆ రోజు ఆ ముగ్గురి సమక్షంలో సీలు వేసిన పసుపు రంగు కవర్ని చించి వీలునామా కాగితాన్ని బయటికి తీశాను. వీలునామాలో ఏ ముందో అందరికీ తెలిసినా హాలులో హఠాత్తుగా ఎందుకో టెన్షన్ పెరిగినట్లనిపించింది. అందరి వంకా ఓసారి డ్రమెటిక్‌గా చూసి నాలుగు మడతలుగా మడిచిన వీలునామాను తెరిచాను.

అంతే!!! ఒక్క-క్షణం నా కళ్ళను నేను నమ్మలేక పోయాను. చౌదరి స్వహస్తంతో విల్లు వ్రాసిన కాగితానికి బదులు ఓ అరఠావు కాగితం నన్ను వెక్కిరిస్తూ తెల్లగా కనిపించింది. నేను నా కళ్లను నమ్మలేనట్లు ఆ కాగితం వంక చూస్తూ వుండిపోయాను. జనంలో కలిగిన అలజడి వర్ణనాతీతం.

''మిష్టర్ వరహాల్రావ్! వాటీజ్ దిస్ జోక్?''-అన్నాడు డాక్టర్ అసహనంగా.

నాకు ఓ నిముషంపాటు నోటమ్మట మాట రాలేదు. ''ఎక్కడో పొరపాటు జరిగివుండాలి....క్షమించండి బహుశా ఓ కవరుకు బదులు మరో కవరు తెచ్చేనేమో!''-అన్నాను.

కాని అందులో నిజం లేదని నాకు తెలుసు. ఎందుకంటే విల్లు వ్రాసినరోజు చౌదరి ఇంటి దగ్గర్నుండి రాగానే ఆ పసుపు కవరుమీద చౌదరి పేరు వ్రాసి నా సేఫ్‌లో పెట్టి తాళం వేశాను. కాబట్టి కవరు మరొకరిది అయివుండడానికి వీలులేదు. నేను చించిన కవరుమీద జానకిరామయ్య చౌదరి పేరు వ్రాసివుంది.

అయినా వెంటనే ఇంటికి వచ్చి నా సేఫ్ అంతా వెతికాను. ఇల్లంతా గాలించాను. కాని చౌదరి పేరుతో వున్న కవర నేది ఇంట్లో కనిపించలేదు.

చౌదరి చనిపోగానే శకుంతల బంధువుల మంటూ ఇద్దరు మగాళ్ళు, ఒక ఆడమనిషి శకుంతల దగ్గరికి వచ్చారు. వాళ్ళంతా ఈ విషయంమీద పెద్ద దుమారం లేవదీశారు. చౌదరి బిడ్డల దగ్గర డబ్బు తిని నేను విల్లు మాయంచేసేనని అంటున్నారు. ఈ విషయం గురించి వెంటనే పోలీసు రిపోర్టు ఇచ్చారు. డాక్టరు, నర్సు, రమణమ్మ విల్లు మాయమయిందని తెలియగానే వీలునామా ఒకటి ఆ రోజు వ్రాయ

బడిందనే విషయమే తెలియదన్నట్లు మాట్లాడుతున్నారు. గత రెండ్రోజులనుండీ ఇది గొప్ప మిష్టరీగా తయారయింది.

పోలీస్ ఎంక్వయిరీలో సాక్షి సంతకాలు పెట్టిన ముగ్గురూ తనకేమీ తెలియదని, చౌదరి తాము దగ్గరుండగా వీలునామా ఏమీ వ్రాయలేదనీ అంటున్నారు. వాళ్ళు ముగ్గురూ అబద్ధం చెపుతున్నారనే విషయంలో సందేహంలేదు. నేను మాత్రం ఏం చెయ్యాలో తోచడంలేదు. పోలీస్ ఇన్వెస్టిగేటర్‌కు ఏం చెయ్యాలో అర్థంకాక తల బద్దలు కొట్టుకొంటున్నాడు.

సో! సిన్హాజీ! ఈ మిష్టరీ ఏమిటో మీరు కనుక్కోవాలి. చౌదరి తాలూకు మనుషులు ఆ వీలునామా ముట్టుకోవడానికి ఏమాత్రం అవకాశం లేదు. నా వీలునామా ముట్టుకోవడానికి ఆ రోజు రమేష్ గదిలో మాట్లాడు తున్నప్పుడు శకుంతల తీయడానికి వీలుందని అనుకొన్నా. విల్లు తీసి తెల్ల కాగితం పెడితే నష్టపోయేది శకుంతలే..." అన్నాడు వరహాల్రావు నిస్సహాయంగా సిన్హాగారి వైపు చూస్తూ.

సిన్హాగారు మొరాకో ఆర్పేసి మరోటి వెలిగించారు. "వరహాలుభాయ్! ఆ రోజు రమేష్‌తో మాట్లాడుతున్నప్పుడు హాలులో బ్రీఫ్‌కేస్ వున్న చోట, శకుంతల కాక మరెవరైనా వుండడానికి అవకాశం వుందా?"—అన్నారు.

"నో....ఆ పాసిబిలిటీ లేదు. ఎందుకంటే విల్లు మాయమైందని తెలిసిం తరువాత నేను శకుంతలను అడిగాను. నేను రమేష్ వెనక గదిలోకి వెళుతుండగా, తను హాలులోకి వచ్చిందని, నేను రమేష్‌తో పాటు కూర్చున్నానని నిశ్చయం చేసుకొన్నాక క్యూరియాసిటీతో నా బ్రీఫ్‌కేస్ ఓపెన్ చేశానని, కవర్ అతికించి వుండడం వలన తను మళ్ళీ మూత వేస్తుండగా, నేను గదిలో నుండి బయటకు వచ్చాననీ, నేను గదిలో వున్నంత సేపు తను హాల్లోనే

వున్నట్లు ఒప్పుకుంది. పైగా నేనే ఆ విల్లు మార్చానని నన్ను దూషిస్తోంది."

"వెరీ ఇంటరెస్టింగ్! రియల్లీ!" అన్నాను ఏం జరిగుంటుందో ఆలోచించడానికి తల బద్దలు కొట్టుకొంటూ.

"చౌదరి కొడుకులు ఏమంటున్నారు?" అన్నారు సిన్హా.

"ఏమంటారు? రమేష్ ఆ రోజు మేమిద్దరం విల్లు గురించి మాట్లాడిన విషయమే గుర్తు లేనట్లు ప్రవర్తిస్తున్నాడు. చౌదరి తమను వదిలి ఆస్తి అంతా ఎప్పటికీ శకుంతలకు వ్రాయడనీ, నేనే శకుంతల దగ్గిర డబ్బు తిని చౌదరి విల్లు వ్రాశాడని అంటున్నానని తిడుతున్నారు. విల్లు నా దగ్గర నుండి ఎలా మాయమైనా, ఆ విషయంలో చౌదరి కొడుకుల పాత్ర వుందని ఘంటాపథంగా చెప్పగలను. ఎందుకంటే చౌదరి ఏ విల్లూ వ్రాయకపోతే, ఆస్థంతా చౌదరి సంతానానికి లాభిస్తుంది. శకుంతలకు మనోవర్తి తప్ప ఏమీ మిగలదు"-అన్నాడు వరహాలరావు కళ్ళ నీళ్ళ పర్యంతంగా.

ఎందుకో వరహాలరావును చూస్తే జాలేసింది.

"వరహాలరావ్ ఆ పసుపు కవర్లో వున్న తెల్ల కాగితం నీ దగ్గర వుందా?" అడిగారు సిన్హా.

"లేదు. కేసు రిజిస్టరు చేసిన వెంటనే ఇన్స్పెక్టర్ కృష్ణ మోహన్ ఆ తెల్ల కాగితాన్ని తీసుకున్నారు."

"ఐ. సీ!"-అని ఒక క్షణం ఏదో ఆలోచిస్తూ వుండిపోయారు.

"ఇదంతా చూస్తుంటే నాకొకటి అనిపిస్తోంది. తన సంతానానికి చౌదరి ఆస్థి ఇవ్వనందుకు సావిత్రి ఆత్మ కోపగించి విల్లును మాయం చేసిందేమోనని"- అన్నాడు వరహాలరావు.

"అబ్సర్డ్!"-అన్నాను కోపంగా,

అపరాధ పరిశోధన పోటీ—75 [ఫలితాలు]

అక్టోబర్ '74 నెల "అపరాధ పరిశోధన పోటీ_75" కి సరియైన సమాధానాలు:

1. వ్యభిచారిణులు.
2. సలహాదారులు.
3. జయప్రకాష్ నారాయణ.
4. మానవాతీత శక్తులు.
5. ప్రభుత్వ విధానాలు.

పైజవాబుల ప్రకారం ముగ్గురు మాత్రం ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జనవరి' 74 నెలనుండి ఒక ఏడాది పాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక గాని, "సప్లిమెంట్" గాని ఉచితంగా పంపబడుతుంది. "సప్లిమెంట్" పొందగోరిన విజేతలు ఆ విషయం ఈ నెల 15 వ తేదీలోగా మాకు తెలియచేయ గోర్తాము.

(1) శ్రీమతి టి. ఆర్. కాత్యా,
కేరాఫ్_టి. రమేష్,
15_8_400, ఫీల్ఖానా,
హైద్రాబాద్_500 012.

(2) శ్రీమతి కలువశ్రీ, వి. కె. మూర్తి ఇల్లు,
జనార్దన్ స్ట్రీట్,
కందుకూరు, ప్రకాశం (జిల్లా.)

(3) శ్రీ కె. వి. సత్యనారాయణ,
హౌం. డో. నెం_56,
శ్రీ వెంకటేశ్వర మీల్స్ హోటల్,
మెయిన్ రోడ్, అనకాపల్లి.
(విశాఖ జిల్లా.)

"అంతకన్నా వీలునామా మాయమవడానికి నాకు కారణం కనిపించడం లేదు. చౌదరి సంతానానికి విల్లు మాయం చెయ్యడం వలన లాభం వున్నా, అవకాశం లేదు. నా ఇంట్లో సేఫ్ తీసి విల్లును మాయంచేసే అవకాశం లేదు. జెనెట్ & కోల్‌మన్ బగ్లర్ ప్రూఫ్ సేఫ్ అది. ఎవరన్నా దాన్ని తెరవ గలిగినా, తిరిగి యథాతథంగా మూయలేరు.

శకుంతలకు విల్లు మాయం చేసే అవకాశం వున్నా, దాని వల్ల నష్టపోయేది శకుంతలే. అంచేత శకుంతలకు ఇందులో ప్రమేయం లేదని నిశ్చయంగా చెప్పొచ్చు. అలాంటప్పుడు ఈ వీలునామా మాయమవడం ఏ మానవాతీత శక్తి పనో అయ్యుండాలి. ఆత్మ చేతి వ్రాత ద్వారా మనిషితో మాట్లాడి నప్పుడు, వీలునామా ఎందుకు మాయం చెయ్యలేదు?"— అన్నాడు వరహాల్రావు.

"దట్సిట్"—అన్నారు సిన్హాగారు చటుక్కున లేచి నిల బడుతూ.

నాకు తెలుసు. ఆయన కేదో ఐడియా వచ్చిందని.

"ఏమిటి!"— అంటున్నాడు వరహాల్రావు అర్థంకాక.

"వరహాలుభాయ్! షాలోమీ!"—అన్నారు సిన్హాగారు గదిలోంచి బయటకు నడుస్తూ.

* * *

"ఇటీస్ రియల్లీ ఫెంటాస్టిక్? వెరీ పజిలింగ్!"—అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెల్లకాగితంతీసి మాకు చూపె డుతూ.

చాలా సామాన్యమైన తెల్లకాగితం అది. అరఠావు సైజులో వుంది. ఏ స్టేషనరీ షాపులో నయినా దొరుకుతుంది. కాస్త నలిగినట్లు కనిపిస్తున్న దానిమీద ఏమీ వ్రాసినట్లు కని

పించడంలేదు. కాగితాన్ని అటూ ఇటూ త్రిప్పిచూపి ఓసారి నవ్వారు చిన్నగా సిన్హాగారు.

"వరహాల్రావ్! చౌదరి విల్లు వ్రాసింది ఇలాంటి కాగితం మీదేనా?"—అన్నారు.

అవునన్నట్లు తలవూపాడు వరహాల్రావు.

సిన్హాగారు నన్ను దగ్గరికి పిలిచి చెవిలో ఏదో చెప్పారు. నేను తలవూపి ఆ కాగితం తీసుకొని బుల్లెట్‌లా బయటికి పరిగెత్తాను.

అరగంట తర్వాత నేను మళ్ళీ తిరిగి ఇన్‌స్పెక్టర్ గదిలోకి వచ్చేప్పటికి, కృష్ణమోహన్ అసహనంగా గదిలో పచార్లు చేస్తున్నాడు. కాలుస్తోన్న బీడీ పారేసి నావంక ఆశగా చూశాడు వరహాల్రావు.

"వెల్! ఎక్కడికి వెళ్ళావు?"—అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ విసుగ్గా.

నేను మాట్లాడకుండా ఓ అరఠావు కాగితాన్ని వాళ్ల ముందు టేబిల్‌పైన పడేశాను. వరహాల్రావు చటుక్కున ఆ కాగితం అందుకొన్నాడు. తెరిచిచూచి ఆశ్చర్యంగా చూశాడు.

"డిసీజిట్! ఎక్కడ దొరికింది మీకీ వీలునామా?"—అన్నాడు నమ్మలేనట్లు.

అవును, నేను తెచ్చింది చౌదరి వ్రాసిన వీలునామా!

వీలునామా సాంతం చదివి కృష్ణమోహన్ ఆశ్చర్యంగా చూశాడు. "చౌదరి వ్రాతేనా అది?"—అన్నాడు.

"అవును....ఇదే చౌదరి వ్రాసిన వీలునామా. అదే వ్రాత. అదే నీలరంగు అక్షరాలు. ఆ మూలవున్న మూడూ వాళ్ళ సాక్షి సంతకాలు"—అన్నాడు వరహాల్రావు గొప్ప ఎక్సయిట్‌మెంటు ధ్వనిస్తున్న గొంతుతో.

సిన్హాగారు కుర్చీలో వెనక్కు వాలి చిద్విలాసంగా 'మొరాకో' కాల్చుకొంటున్నారు.

"వెల్ ఎక్కడ దొరికింది మీకిది? ఎవరు తీసిదాచారు?"—అన్నాడు కృష్ణమోహన్ కుర్చీలో కూలబడి సిగరెట్ వెలిగిస్తూ.

వరహాల్రావు మళ్లీ మళ్లీ పైనుండి క్రిందవరకూ ఆవీలునామా చదువుకొంటున్నాడు.

సిన్హాగారు నవ్వుతూచూశారు. "ఇటీజ్ క్వాయిట్ సింపిల్! ఆ వీలునామా ఎవరూ దొంగిలించలేదు"—అన్నారు.

"వాట్??" అన్నాడు వరహాల్రావు అర్థం కానట్టు.

"యస్! వరహాలుభాయ్, ఆ వీలునామా ఎవరూ మార్చ లేదు. చౌదరి వ్రాసిన దగ్గర్నుండీ అది నీదగ్గరేవుంది"—

కృష్ణమోహన్ నుదురు చిట్లించి మావైపు చూశాడు.

"అవును! నీవు కవర్లో పెట్టి సీలువేసిన వీలునామా ఎవరూ ముట్టుకోలేదు. ఇప్పటివరకూ మనందర్నీ ఫూలిష్ చేసిన ఆ తెల్ల కాగితమే వీలునామా. కాకపోతే దానిమీద అక్షరాలు మనం చూడ లేకపోవడం వలన, అందరం వీలునామా మాయమయిందని భ్రమపడ్డాము"—

"వాట్ డూయూ మీన్! దానిమీద ఏమీ వ్రాసి లేకపోతే, చదవకపోయే సమస్య ఏముంది?"-అన్నాడు వరహాల్రావు అర్థం కానట్టు.

సిన్హాగారు జరిగిన విషయం చెప్పమన్నట్లు నా వైపు చూశారు.

"విషయం మొదటినుండీ చెపితేగాని అర్థంకాదు. చౌదరి వాడిన సిరా గమనించారా! ముదురు నీలం రంగు సిరా....ఆ సిరాయే అందర్నీ మోసం చేసింది. చౌదరి శకుంతల వలలోపడి ఆస్తి శకుంతలకు వ్రాసేస్తాడని అనుమానం వచ్చుండాలి చౌదరి కొడుకులకు. బలవంతాన చౌదరిని విల్లు వ్రాయ

కుండా ఆపడం వీలుకాదు. అంచేత చాలా తెలివిగా తమకు తప్ప ఎవరికీ ఆస్తి దక్కకుండా వుండే ఏర్పాటు చేశారు.

బహుశా ఇది చౌదరి పెద్దకొడుకు సురేష్ ఆలోచన అయ్యుండాలి. సురేష్ నేషనల్ కెమికల్ లేబొరేటరీలో కెమిస్ట్ అని మరిచిపోవద్దు. నమ్మకమైన రమణమ్మ సహాయంతో ఈ పని జయప్రదంగా చెయ్యగలిగాడు సురేష్.

స్టార్చ్‌తో ప్యూర్ అయోడిన్ కలిపితే ముదురు నీలం రంగులో వుండే సిరాలాంటి ద్రవం తయారవుతుంది. ఆ ద్రవాన్నే చౌదరి పెన్‌లో సిరాలా పోశారు. చౌదరి ఎప్పుడూ ముదురునీలం సిరా వాడడం వాళ్ళకు తెలిసివుండాలి. ఆ అల వాటును వాళ్ళు బాగా ఉపయోగించుకొన్నారు. చౌదరి వీలు నామా వ్రాయడానికి పెన్ అడగగానే అదివరకే రెడీగా వుంచిన పెన్ అందించింది రమణమ్మ. సాక్షి సంతకాలు కూడా అందరూ అదే పెన్‌తో చేయడంతో వీలునామా అంతా ఒకే పెన్‌తో వ్రాయబడింది.

చౌదరి అవసానదశకు వచ్చాడు కాబట్టి, వీలునామా వ్రాస్తాడని వూహించి, అలా రమణమ్మ సహాయంతో తను తయారు చేసిన సిరా పోసి వుండాలి సురేష్ చౌదరి పెన్‌లో. చాలా తెలివిగా ఆలోచించి చేసిన పని ఇది.

అయోడిన్‌కు ఏ రూపంలోవున్నా ఆవిరయిపోయే గుణం వుంది. అంచేతే ఆ నీలరంగు ద్రవంతో వీలునామా వ్రాసి నప్పుడు స్పష్టంగా రంగు కనిపిస్తున్నా, సిరా బాగా ఆరి పోయేప్పటికి, అయోడిన్ ఆవిరయిపోయి, నీలరంగుపోయి కాగితం ఎప్పటిలాగే తయారయింది. మామూలుగా ముప్ఫై నుండి నలభై గంటల్లో అయోడిన్ కలిపిన స్టార్చ్ నీలం కోల్పోతుంది. అంచేతే వరహాలావు కవరు చించేప్పటికి-పది రోజుల తర్వాత, నీలం రంగు పూర్తిగా పోయి, తెల్ల

కాగితం మిగిలింది" అన్నాను నోరు తెరుచుకు వింటున్న వరహాలరావు పైపు చూస్తూ.

"అయితే మళ్ళీ ఆ అక్షరాలు ఎలా వచ్చాయి?"—అన్నాడు కృష్ణమోహన్.

"సింపిల్! నేను బయటకు వెళ్ళి చేసిన పని అదే! తిన్నగా పోలీస్ లాబ్‌కు వెళ్ళి ఓసారి అయోడిన్ సొల్యూషన్‌తో బ్రష్ చేశాను. రంగు కోల్పోయి అక్షరాల రూపంలో వున్న స్టార్చ్ మళ్లీ అయోడిన్‌ని పీల్చుకొని నీలం రంగుగా మారింది. అందుచేతే వీలునామా మళ్లీ యధాప్రకారంగా ఎప్పటిలా కనిపిస్తోంది"-

"మైగాడ్! దట్ క్లవర్ బాస్టర్డ్ సురేష్! డిసీట్ ఆఫ్ లా క్రింద వాడిమీద కేసు పెడతాను"— అన్నాడు వరహాలరావు కోపంగా.

"వరహాలరావ్! ఒక విషయం నీవు మరిచిపోతున్నావు. ఆ వీలునామా చెల్లదు. మళ్లీ రేపటికి నీ చేతిలో అయోడిన్ ఆవిరయిపోయిన తెల్లకాగితం మిగులుతుంది. పైగా ఆ సిరా సురేష్ పెన్నులో పోశాడనిగాని, మరెవరయినా పోశారనిగాని సాక్ష్యం లేదు మనకు"-అన్నారు పిన్నిగారు గంభీరంగా. ★

ఒక నిరుద్యోగి ఉద్యోగం కొరకు ముఖ్యమంత్రిగారి వద్దకు వెళ్ళాడు.

ముఖ్యమంత్రి:- నీకు మంచి క్వాలిఫికేషన్లు లేవు. అసలే నిరుద్యోగుల సంఖ్య ఆకాశాన్ని అంటుకుంటున్న ఈ రోజుల్లో నీకు ఏ పనట ఇప్పిస్తాడయ్యా.

నిరుద్యోగి:- అందుకనే కదండీ, మీ దగ్గరకు వచ్చింది!

—సి హెచ్. ఎల్. నరసింహారావు, గుడివాడ.

పాఠకుల పరిశోధన పోటీ

—కె. విజయలక్ష్మి

పచ్చి నేరానికి ఇనప సంకెళ్లు

(బహుమతి రూ. 50-లు నగదు)

లాంబ్రెటా నున్నటి రోడ్డు మీద పరుగులు తీస్తోంది. నా ఆలోచన్లు వేగంగా పరుగెడుతున్నాయి.

రాజామణిగారి ఇనప్పెట్టెలో రెండు లక్షలు సరికొత్త నోట్లు, వెండి బంగారం వున్నట్లు రాజామణి మేనల్లుడు గిరి చెప్పినప్పుడే, తనకో ప్లాన్ స్ఫురించింది.

గత నెల నుంచీ ఆ ప్లాన్ అమల్లో పెట్టటానికి తగిన జాగ్రత్తలు ఆలోచించి, కావలసిన వస్తువులు కూడా సేకరించాడు.

నా కళ్ళ ముందు రెండే కనబడుతున్నాయి.

రెండు లక్షల రూపాయలు! శ్రీ కృష్ణ జన్మస్థానము!!

గిరి స్నేహితుడు కావటం కూడా సిరి రాబోవటానికి ఆస్కారం అయింది.

గిరి అన్నీ చెప్పుకుంటాడు, అదో బ్యాడ్ హేబిట్.

నవ్వుకుంటూ లాంబ్రెటా ఆపాను లాంబ్రెటా ట్రబుల్ యిచ్చినట్లు దారిన పోయేవాళ్లు అనుకునేటట్లుగా దాని పక్కనే ఏదో రిపేర్ చేస్తున్నట్లు నుంచున్నాను.

రోడ్డుమీద జనం కాస్త ఎక్కువయ్యారు. కొందరు నన్ను చూస్తూ పోతున్నారు. అదే నాకు కావలసింది.

అరడజనుమంది మిత్రులు ఏదో సినిమా చూచి కామాలు వెళుతున్నారు. సినిమా ఖబుర్లే చెప్పుకుంటున్నారు.

నా పక్కనుంచే నన్ను చూచి ముందుకు వెళ్లారు.

పది గజాలు వాళ్లు అటు వెళ్ళంగానే లాంబ్రెటా ఎక్కి స్పీడ్‌గా ముందుకు పోనిచ్చాను.

వాళ్ళ పక్క నుంచి లాంబ్రెటా దూసుకు పోయింది.

ఇరవై గజాలు వెళ్లింది లాంబ్రెటా.

అక్కడ జనం పల్చగా వున్నారు.

లాంబ్రెటాని సడన్‌గా పక్కకు తిప్పి గోడకు గుద్దించాను ఆ లోపలే ఎగిరి ఓ పక్కకు పడ్డాను.

లాంబ్రెటామీద ఉన్నప్పుడే బ్లేడుతో ముఖాన చేతుల మీద కోసుకోవటం దానికితోడు ముఖాన కంకరరాయి ఒకటి ముద్దు పెట్టుకోవటంతో రక్తం కారింది. రెండు అరచేతులు కూడా గీసుకుపోయి రక్తం కారసాగాయి. నేను చలనం లేనట్లు కళ్ళు మూసుకున్నాను. నా చుట్టూ జనం గుమిగూడారు.

సినిమానుంచి వస్తున్న మిత్రద్వయం ఎవరితోనో అంటున్నారు.

"ఇంతకుముందు లాంబ్రెటా దగ్గర ఏదో రిపేరు చేస్తున్నారు. ఇంతలోనే ప్రమాదం జరిగిపోయింది."

కీస్‌మంటూ సోడాకాయ మోగింది.

ఎవరో నా ముఖాన సోడానీళ్లు చల్లారు.

మెల్లగా కళ్ళు తెరిచాను. అందరి వంకా అయోమయంగా చూచాను.

"నాకేమయింది?" నీరసంగా అడిగాను.

చెప్పారు. చెపుతూ ఉండగానే "అబ్బా!" అన్నాను.

"ఏమయింది? ఎక్కడయినా నెప్పిగా వుందా?"

"నడుం కదలనీయటం లేదు. కళ్లు తిరుగుతున్నాయి" అన్నాను గట్టిగా కళ్లు మూసుకుంటూ.

ఆ తరువాత, నేను మనసులో కోరుకున్నట్లే అక్కడి వాళ్ళంతా తలో చెయ్యేవేసి ఆ వీధిలోనే వున్న డాక్టర్ జంబులింగం హాస్పిటల్లో చేర్చారు.

"మిష్టర్! మీకేం పెద్దగా దెబ్బలు తగలలేదు. నడుం కూడా విరగలేదు. కాకపోతే బాగా దెబ్బ తగిలినందున, ఆ బాధవల్ల విరిగిందని భ్రమ పడుతున్నావు. తెల్లవారేసరికి తగ్గిపోతుంది."

డాక్టర్ జంబులింగం చేతులకు, తలకు కట్లుకట్టి, ఇంజక్షనిస్తూ అన్నాడు.

బాధ మరచిపోవటానికి గార్డినాల్ టాబ్లెట్లు, స్పెషల్ రూమ్ అడగడంతో వెంటనే సప్లయి చేశాడు.

గార్డినాల్ టాబ్లెట్ పాంట్ జేబులో పడేసుకున్నాను.

రాత్రి ఒంటిగంటదాకా మేలుకున్నాను.

హాస్పిటల్ అంతా నిశ్శబ్దంగా నిద్ర పోతున్నది.

ఎవరూ చూడకుండా బైటపడ్డాను. బయటంతా చీకటిగా వుంది. రాజామణి ఇంటి వెనుకసైడ్‌కి చేరాను. మరో అర గంట తరువాత, ప్రహారీగోడ అవలీలగా దూకి లోపలికి ప్రవేశించాను.

పిసినారి రాజామణి కిందంతా ఆఫీసులకి అద్దెకు యిచ్చి, పైన తను, మేనల్లుడు గిరి, నౌకరు రంగయ్య, బొచ్చు కుక్క జాలీ మాత్రమే వుండటం నా అదృష్టమే.

పంపు పట్టుకుని పైకి ఎగబాకాను. వరండాలో కాలు పెడుతూనే జూలీ చటుక్కున నుంచుంది. ముందే జాగ్రత్త పడ్డ నేను, "కమాన్ జూలీ!" అంటూ బిస్కెట్ అందించాను.

జూలీ నన్ను గుర్తు పట్టింది. తోక వూపుతూ నా చెయ్యి నాకింది.

ఇంతవరకూ నా ప్లాన్ సక్సెస్ అయింది.

మెల్లగా రాజామణిగారి గది సమీపించాను.

"మామయ్యా! మామయ్యా!" తలుపుమీద మునివేళ్ళతో తడుతూ గిరి స్వరం అనుసరిస్తూ పిలిచాను.

గిరి, రంగయ్య మరో గదుల్లో వుండటంవల్ల వాళ్లు లేవకుండా వుండటమేగాక చీమ చిటుక్కుమంటే లేచే రాజామణి లేచిరావాలి. నే వూహించినట్లే రాజామణి లేచాడు. "వస్తున్నారా గిరీ, వూరినుండి అప్పుడే వచ్చావా?" అనటం, తలుపు తెరవటం ఒకేసారి జరిగింది.

క్షణం ఆలశ్యంచేయటం కోరి ప్రమాదం తెచ్చుకోవటమే.

ఒక్కదూకున ముసలివాడైన రాజామణిమీద పడ్డాను. ఓచేత్తో నోరుమూసేసాను. జేబులోంచి గిరి యాపిల్స్‌కోసే కత్తి తీశాను. ముసలాడయినా నన్ను తోసేస్తూ వ్యర్థ ప్రయత్నం చేస్తున్నాడు.

బలంగా కత్తితో పొడుస్తే నెత్తురు మీద చిమ్ముతుంది కాబట్టి మెల్లగా యాపిల్‌కాయ కోసినంత తేలికగా మెడపై కోశాను. ప్రాణం పోలేదుకాని యిహ అరవలేడు. అందుకే నోటిమీద చెయ్యివేశాను. కోసినదానిమీద పొడిచేను. వెంటనే లేచి నుంచున్నాను.

తలుపు లోపల గడియ వేశాను.

తలగడాకింద తాళం చెవులకోసం వెతికాను. లేవు.

పిచ్చిపట్టినట్లు గదంతా వెతికాను.

తాళం చెవులు కనపడలేదు. ఇనప్పెట్టె పగలబడి నవ్వుతున్నట్లు అనిపించింది. రెండులక్షలు దక్కకపోగా హత్య చేయటం తప్పలేదు.

"ముసలి వెధవ" అక్కసుగా యీడ్చి తన్నాను శవాన్ని.

మరుక్షణం నాముఖం వెయ్యి కేండిల్స్ బల్బులాగా వెలిగింది.

రాజామణి పంచెలాగి అవతల పారేశాను. మొలత్రాడుకి ఉన్న తాళంచెవులగుత్తి ఆతృతగా అందుకున్నాను.

ఇనప్పెట్టె తలుపులు తెరుచుకున్నాయి.

రెండులక్షల నోట్ల బొత్తులు. బంగారం నగలు సంచిలో సర్దేశాను. వెండిసామాను వదిలేశాను.

ఇనప్పెట్టె తలుపులేసి తాళంచెవులు మొలత్రాడుకి కట్టాను.

కత్తిమీద ఇనప్పెట్టె, పిడిమీద నా వేలిముద్రలు గ్లవుజ్ వేసుకున్నందున పడవు కాబట్టి భయంలేదు.

జేబులోంచి తీసి గిరి వాడే కర్చీఫ్ తలుపు పక్కగా పడేశాను.

గిరి కాల్చే బర్కిలీ సిగరెట్ సగం ముక్క ఇనప్పెట్టె పక్కన పడేశాను.

యిరవై రోజుల క్రితమే జాగ్రత్త పరిచిన గిరి క్రాఫింగ్ లోని నాలుగు వెంట్రుకలు రాజామణి గుప్పెటలో యిరికించాను.

మరోసారి క్షుణ్ణంగా గదినంతా పరిశీలించి బైటకు వచ్చేశాను.

డబ్బు దాచేసి హాస్పటల్లో ప్రవేశించాను.

ఎవరూ నన్ను చూడలేదు.

బెడ్ మీద దొర్లుతూ పొరపాట్లు ఏమయినా చేశానేమో ఆలోచించాను.

అంతా సవ్యంగానే వుందనిపించింది?

కాని, ఆ మర్నాడు ఇన్‌స్పెక్టర్ వచ్చి నన్ను అరెస్టు చేయడంతో, నేను చేసిన పొరబాట్లేమిటో తెలిసి, నిలువునా

నేల కూలాను. బాడ్ లక్. దురదృష్టం అంటే ఇదేనేమో?-

* * *

[ఇదీ కథ. దీనిలో హంతకుడు చేసిన పొరబాట్లేమిటో వివరంగా ఒక పోస్టుకార్డుపైగాని, పోస్టుకార్డుసైజు తెల్ల కాగితంపైగాని వ్రాసి, యీనెల 20వ తేదీలోగా మాకు చేరేటట్లు పంపండి. 'హోమ్ డెలివరీ' సభ్యులు మాత్రమే పాల్గొనాలి. కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన ఐదుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి పంపబడుతుంది. ఫలితాలు ఫిబ్రవరి '75 నెల సంచికలో ప్రచురిస్తాము. —ఎడిటర్]

పోటీ నెం. 55 [ఫలితాలు]

హంతకుడు—ముఖేష్‌బాబు.

కారణాలు:—1. ప్రొద్దున నాలుగు గంటలకు లేచి గుమ్మం దగ్గరనుండి శవాన్ని చూశానని చెప్పాడు ముఖేష్‌బాబు. శవంమీద కంఠందాకా దుప్పటి కప్పబడివుంది. అలాటప్పుడు శవంలో దిగబడిన కత్తిని ఎలా చూడ గలిగాడు అతను?

2. శవం గుండెల్లోవున్న కత్తి పిడిమీద ముఖేష్‌బాబు ముద్రలు స్పష్టంగా వున్నాయి. ఆర్నెల్ల క్రితంపడ్డ వేలి ముద్రలు అంత స్పష్టంగా వుండవు.

* * *

మాకు వచ్చిన జవాబులలో యీ కేసుని అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింది ఐదుగురు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 10/-లు చొప్పున నగదు బహుమతి యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

(1) శ్రీమతి డి. శ్యామలాదేవి, బి.ఎస్‌సి., బి.ఇడి., హోం. డె. నెం—421, కేరాఫ్: డి. మోహనదాసు, బి.ఇ., 104 ఏరియా, బిహైండ్ ఏ. టి. రెడ్డి స్టోర్స్, మర్రిపాలెం, విశాఖపట్టణం—7.

(2) శ్రీ కె. మోహన్‌రావు, హోం. డె. నెం—286, స్టేషన్ మాస్టర్, జట్కానహార్, రాజనంద్‌గాన్‌జిల్లా (మధ్య ప్రదేశ్.)

(3) శ్రీ కొమ్మూరి జె. స్టాలిన్, బి.ఎస్.సి., హోం. డె. నెం—337, 19/97-డి, వరాస్ మియా స్ట్రీట్, కడప.

(4) శ్రీ వై. బ్రహ్మయ్యగుప్త, బి. కాం., హో. డె. నెం—166, మదనపురం (మహబూబ్‌నగర్ జిల్లా.)

(5) శ్రీ ఎన్. రాజు, బి.ఎస్‌సి., హోం. డె. నెం—313, ఇంటి నెంబరు డి/55, రుద్రంపూర్, కొత్తగూడెం తాలూకా (ఖమ్మం జిల్లా.)

★

ఒక ఇల్లాలు గుళ్లో "రామాయణం" పురాణం వినడానికి రోజూ వెళుతోంది.

అక్కడ కూర్చున్నంతసేపు ఆమె కళ్లు ఒత్తుకుంటూనే ఉంది చివరకు పట్టాభిషేక సమయంలో కూడా ఆమె ఏడుస్తూంటే పక్కన కూర్చున్నవాళ్ళు అడిగారు.

"ఎందుకమ్మా శుభమాని పట్టాభిషేకం జరుగుతుంటే ఏడుస్తావు?"

"ఆయన చెప్పేదేదీ నాకు తెలియదు. ఆ రామాయణ పుస్తకానికి కట్టిన మొలత్రాడు చూస్తే మా ఆయన గుర్తొచ్చి ఏడుస్తున్నాను," అని చెప్పిందా ఇల్లాలు.

—కళాలక్ష్మి, విజయనగర్ కాలనీ.

ఈనెల జోక్స్

—కోనే
నాగవెంకట
ఆంజనేయులు

వంటింట్లో నుంచి గాజుగ్లాసు క్రిందపడి పగిలిన చప్పుడు వినిపించింది.

బయట కూర్చున్న బాబు, ''ఆ గ్లాసు అమ్మ చేతిలోంచి పడి పగిలి పోయింది'' అన్నాడు పాపతో.

''అమ్మ చేతిలోంచి అని ఎలా చెప్పగలవు? నాన్న కూడా వంటింట్లోనే ఉన్నాడుగా?'' అడిగింది పాప.

''గ్లాసు నాన్న చేతిలోంచి పడిఉంటే అమ్మ యిప్పటి వరకూ మౌనంగా ఉంటుందా?'' అన్నాడు బాబు.

* * *

''ఏమండోయ్ ఈ వార్త విన్నారా? ఒకమ్మాయి తను నదిలో పడ్డప్పుడు తనను రక్షించిన అబ్బాయినే పెళ్లి చేసుకుందట.''

''ప్చ్! అతనెవరో అమాయకుడులా వున్నాడు. తన దారిన తను పోక అనవసరంగా కష్టాలు కొనితెచ్చుకున్నాడు.''

* * *

ఒక వ్యక్తి సూట్ విప్పి సముద్రంలో స్నానం చేస్తున్నాడు. అతను స్నానం ముగించి బయటికి వచ్చేసరికి అతని బూట్లలో ఒక కుర్రాడు యిసుక పోస్తూ కనిపించాడు.

ఆ వ్యక్తి కోపంగా ఆ కుర్రాడి పక్కనే ఉన్న ఆవిడని, ''చూడండి. వీడు మీ అబ్బాయేనా?'' అనడిగాడు.



"కాదండి. వీడు మా వారి తమ్ముడు. అదిగో అటు చూడండి. అక్కడ మీ టోపీలో నీళ్లు పోస్తున్నాడే వాడు మా అబ్బాయి," చెప్పిందామె సగర్వంగా.

*   *   *

"ఏమిటి లూసీ! ఆఫీసు కింత ఆలస్యంగా వచ్చావ్?" ప్రశ్నించాడు వాళ్ళ బాస్.

"క్షమించండి బాస్! వస్తుంటే దార్లో నా వెనుక ఒక కుర్రాడు పడ్డాడు."

"అయితే నీకెందుకు ఆలస్యం అయింది?"

"ఆ బ్రూట్ చాలా నెమ్మదిగా నడిచాడు బాస్."

*   *   *

పరంధామయ్యగారు యింటికి తాళం వేసి బయటికి వెళ్తూ గుమ్మానికొక నోటీసు తగిలించారు. అందులో యిలా ఉంది:

"పోష్టుమెన్ గారికి. బెల్లు నొక్కితే లోపల ఉన్న నా కుక్క మొరుగుతుంది. దాన్ని చూసి పక్కింటి వాళ్ళ కుక్క కూడా మొరుగుతుంది. పక్కింటి సుబ్బారావు చెవిటి వాడు. అయినా తన కుక్క మొరగడం తెలుసుకుని బయటికి వస్తాడు. అతనికి నా పేర వచ్చిన ఉత్తరాలు యివ్వండి. థాంక్స్!"

*   *   *

"నాన్నా! నీ కోసం ఎవరో వచ్చారు."

"ఎవర్రా అది?"

"ఎవరో మీసాలాయన."

"వెళ్ళమను. మనకి మీసాలక్కర్లేదు."

*　　　*　　　*

"ఏమిటయ్యా నీ జబ్బు?" అడిగాడు డాక్టర్ హిప్పీ కుర్రాడిని.

"అదేమిటోనండి. వారం రోజుల్నుంచీ స్నానం చెయ్యాలనీ, క్షవరం చేయించుకోవాలనీ వెధవ కోరికలు పుట్టుకొస్తున్నాయి." విచారంగా జవాబిచ్చాడు హిప్పీ కుర్రాడు.

*　　　*　　　*

"రావోయ్‌రా! సమయానికొచ్చావ్! ఒక పెగ్గు వేసుకొందువు గాని!"

"అబ్బ వద్దోయ్!"

"కారణం?"

"రెండు కారణాలున్నాయి. ఒకటి డాక్టర్ తాగొద్దన్నాడు. రెండు యిప్పుడే తాగొస్తున్నాను."

*　　　*　　　*

ఓ నలుగురు మూర్ఖులు పల్లెటూరు నుండి పట్నాని కొచ్చారు. పట్నం వింతలన్నీ చూస్తూ ఒక పదంతస్థుల బిల్డింగ్ దగ్గర కొచ్చారు.

"అబ్బ! ఎంత పెద్ద మేడో! మనూళ్లో యిలాంటి మేడ ఒక్కటయినా లేదు కదూ? దీన్ని మనూరు తీసుకు పోదామా?" అన్నాడొక మూర్ఖుడు.

మిగతా ముగ్గురు మూర్ఖులూ 'సై' అన్నారు.



నలుగురూ చొక్కాలు విప్పి పక్కన పెట్టి, బిల్డింగ్‌ని "తోసుకు" పోసాగారు. ఇంతలో వాళ్ల చొక్కాలు ఎవడో దొంగ ఎత్తు కోయాడు.

బిల్డింగ్‌ని తోసి తోసి అలసి పోతున్నారు నలుగురు మూర్ఖులు. ఇంతలో ఒక మూర్ఖుడు వెనక్కి తిరిగి చూసి, "ఇక ఆపండిరా! చాలా దూరం వచ్చేశాం. మన చొక్కాలు అక్కడే వదిలేశాం! తెచ్చుకుందాం పదండి," అంటూ "వెనక్కి" పరుగు తీశారు నలుగురు మూర్ఖులు.

*　　　*　　　*

ఇంటర్వ్యూకొచ్చిన అభ్యర్థిని ఈ విధంగా ప్రశ్నించా డొక ఆఫీసర్:

"నీది ఉత్తరమా! దక్షిణమా?"

"అబ్బే! నేను భూగోళం చదువుకో లేదండి!" జవా బిచ్చాడు అభ్యర్థి సిగ్గుపడుతూ.

*　　　*　　　*

రాజుకు,

నన్ను పెళ్ళి చేసుకుంటానని మోసం చేశావు. నా ఫోటో

కూడా తీసుకున్నావు. నాకిప్పుడు పెళ్ళయిపోయింది. నా ఫోటో నాకు పంపించి వేయగలవు.

—రాధ.

రాధకి,

నీ ఉత్తరం చేరింది. కొన్ని ఫోటోలు పంపుతున్నాను. వాటిలో నీ ఫోటో ఏదో తీసుకుని మిగిలినవి వెంటనే పంపించి వేయగలవు.

—రాజు.

* * *

"ఏమయ్యా పంతులూ! మా కుర్రాణ్ణి కొట్టావట ఎందుకు?"

"అది కాదు సార్! మీ వాడు కూడికల్లో ఒక పదిహేను

పైసలు తక్కువ కూడాడండి ..."

"ఇవిగోనయ్యా, నీ బోడి పదిహేను పైసలు తీసుకో. ఇంకెప్పుడూ కుర్రాణ్ణి కొట్టమాకు."

★

మీకు తెలుసా?

1. ఒక కప్పు వేడి కాఫీ మీరు త్రాగగానే-మీ ఊపిరితిత్తులు మామూలుకన్న 13% అధికంగా పని చేస్తాయి. గుండె వేగం 15% పెరుగుతుంది. కడుపులో ఉష్ణోగ్రత 10-15° F పెరుగుతుంది. నోటిలో లాలాజలం రెట్టింపు అవుతుంది. మూత్రపిండాలు రెట్టింపు పనిచేస్తాయి. కడుపులో ఉండే హైడ్రోక్లోరికామ్లం 4 రెట్లు పెరుగుతుంది. మెదడులోని రక్తనాళాలు సంకోచిస్తాయి. గుండెవద్ద రక్తనాళాలు వ్యాకోచిస్తాయి. ఇదంతా కాఫీలోని కెఫీన్ ప్రభావం.

2. ఆహార పదార్థాల కల్తీవల్ల మనదేశంలో 1972 సంవత్సరంలో 1000 మందికి పైగా మరణించారు.

3. నూనెబావులు తగలబడుతున్నప్పుడు ఆర్పటానికి పెట్రోలు, కిరోసిన్ ఉపయోగిస్తారు. ఇక్కడ నీరు నిరుపయోగం. నూనెబావులు గట్టిగా పాక్ చేయబడి వుండటంవల్ల నీరు లోపలకు చొచ్చుకొని పోలేదు. పెట్రోలు, కిరోసిన్ లోపలకు చొచ్చుకొనిపోయి మంటను ఆర్పగలవు. లోపల ఆక్సిజన్ వుండదు కనుక అవి మండుతాయనే భయంలేదు.

4. ఒక డబ్బా తెల్ల పెయింట్‌లో నల్ల పెయింట్ నాలుగైదు చుక్కలు కలిపితే ఆ తెల్ల పెయింట్ మరింత తెల్లబడుతుంది.

5. సింహం గుండెకాయ, అన్ని జంతువుల గుండెకాయలకన్న చిన్నది.

—జోకర్

సీరియల్

10 గంటలసేపు ప్రపంచానికి ప్రమాదం

కొమ్మూరి సాంబశివరావు

సీరియల్

(గత సంచిక తరువాయి)

14

సిగ్నల్స్ పాటించడం లేదు; ట్రాఫిక్ కానిస్టేబుల్స్. రివ్వున వస్తున్న జీపుకారుని చూసి, దడుసుకుని, పక్కకి పారిపోయి, నెంబర్ వ్రాసుకుందామని, డైరీ తీసి అది పోలీస్ కారని గుర్తించి, వూరుకుంటున్నారు.

సైరన్ ఆన్ చేసి, వెళుతున్నాడు రాజు. ఎదురు వస్తున్న ట్రాఫిక్ తొలగిపోతోంది. పక్కనించి, ఏ కారూ, ఓవర్ టేక్ చెయ్యడంలేదు. ఆక్సిలేటర్ని, కిందవరకూ నొక్కిపెట్టాడు. ఎనభయి అయిదు మైళ్ళ స్పీడున వెళుతోంది జీపు.

రాజు మెదడులో ఆలోచనలు; పథకాలూ; ఎనిమిది లక్షల మైళ్ళ స్పీడులో వెళుతున్నాయి.

అది ఒక ప్రయివేట్ ఆస్పత్రి అనీ, అంబులెన్స్ డ్రయివర్ చెప్పాడు. మూలిగే మనుష్యుల ముఠావారిది- అంతా వారి అధీనంలో వుంది ఆ ఆస్పత్రి. నిజమైన రోగులు, యీ కేసుకీ, యీ దౌర్జన్యానికీ సంబంధించని రోగులు చాలా మంది వున్నారుట అందులో; కాని, నర్సులు, వార్డుబాయిస్; హాస్పిటల్ స్టాఫ్; డాక్టర్లు; అందరూ 'మూ. మ' కి సంబంధించినవారు. వారిలో ఏ ఒక్కరూ తనకి సహాయం చెయ్యరు సరికదా-తను యుగంధర్ని రక్షించడానికి ప్రయత్నిస్తే-తనని ప్రతిఘటిస్తారు. యుగంధర్తో పాటు తనూ ప్రాణం విడుస్తాడు—

అదే నయం. తనని ఆపదలోంచి తప్పించేందుకు యుగంధర్ ఎన్నిసార్లు తన ప్రాణాన్ని; ప్రమాదంలోకి

తెచ్చుకోలేదు; యుగంధరే సమయానికి రాకపోతే, ఎన్నేళ్ళ క్రితమో తను చచ్చిపోయి వుండేవాడు-ఒక చావు కాదు; వంద చావులు. యుగంధర్ని రక్షించడానికి తను పూను కోవడం, కేవలమూ విశ్వాసంవల్ల-తనకి యుగంధర్ చేసిన సహాయానికి ప్రత్యుపకారంగా కాదు తను వెళుతున్నది. యుగంధర్ లేని బతుకు-తను వూహించుకోలేడు. పది గంట లలో ప్రపంచానికే ప్రమాదం-తన ప్రాణానికి కొన్ని గంటల ముందు ప్రమాదం జరిగితే ఏం?

పోలీస్లకి ఫోన్ చేసి, ఆ ఆస్పత్రిని చుట్టముట్టి, అందులో వున్న వారినందర్ని పట్టించవచ్చు. అది సులభం. సులభమైన మార్గం సామాన్యంగా ఫలితాలు యివ్వదు. పోలీస్ వాన్లు రాగానే, పోలీసులు దిగి ఆస్పత్రిని చుట్టు ముడుతున్నారని చూశాక, లోపల వున్న 'మూ. ము' మనుష్యులకి కారణం-తెలిసిపోతుంది.

ఒక యింజక్షన్; స్పృహలేని యుగంధర్ నోటిలోకి ఒక సైనయిడ్ పలుకు. లేదా ఒక చుక్క నోటిలో వేస్తే-యింకెక్కడ యుగంధర్! 'మూ. ము' మనుషులు కొందరు చిక్కినా; యుగంధర్ ప్రాణాలతో దొరకడు. శెక్రటరియేట్ గేటు ముందుకాక, ఆస్పత్రిలో యుగంధర్ శవాన్ని చూడవలసివస్తుంది. యుగంధర్ని రక్షించాలంటే ఎవరి సహాయమూ లేకుండా; తను ఒక్కడే పూనుకోవాలి. ఆలోచిస్తున్నాడు-పథకం వేస్తున్నాడు.

జీపు ఎనభయి అయిదు మైళ్ళ స్పీడున వెళుతోంది.

* * *

బండార్కార్ గదిలో మళ్ళీ పసుపురంగు, ఫోన్, డిఫెన్స్ మంత్రిది మోగింది. "డిఫెన్స్ మినిస్టర్ నెంబర్ టు రిపో ర్టింగ్!" అన్న మాటలు వినిపించాయి.

"ప్రొసీడ్!" అన్నాడు బండార్కర్.

" 'మూ. ము' మళ్ళీ ఫోన్ చేశాడు. ప్రధానికి యుగంధర్ విషయం చెప్పావా అని; ప్రధాని ఏమన్నారు అని!"

"మీరేం జవాబు చెప్పారు?" అడిగాడు బండార్కర్.

"ప్రధాని చాలా బిజీగా వున్నారు. ఇంటర్వ్యూ యివ్వ లేదు. ఫోన్ కూడా ఎంగేజ్ అయ్యున్నది. కాస్సేపట్లో ఫోన్ చేసి చెపుతానన్నాను."

"వెరీగుడ్. మళ్లీ ఫోన్ చేస్తే-యుగంధర్ శవం, సెక్రటేరియేట్ గేటుదగ్గిర చూసిన తర్వాత కాని, ప్రధాని ఏ నిర్ణయమూ చెయ్యనన్నారు అని చెప్పు" అన్నాడు బండార్కర్. రిసీవర్ పెట్టేశాడు. యింకో నెంబర్ తిప్పాడు "స్పెషల్ బ్రాంచి డైరక్టర్ బండార్కర్. ఐ వాంట్ టెలిఫోన్ విజిలెంస్ డైరక్టర్-అత్యవసరం" అన్నాడు.

"నేనే విజిలెంస్ డైరక్టర్ని. మీరు ఫోన్ చేస్తారని తెలుసు. అందుకే మీ కాల్ డైరక్టుగా నాకు వచ్చే ఏర్పాటు చేశాను" అన్నాడు టెలిఫోన్ విజిలెంస్ డైరక్టర్ కుమరవేలు.

"థాంక్ యు! కొన్ని నిమషాల క్రితం డిఫెన్సు మినిస్టర్‌కి వచ్చిన కాల్ ఎక్కణ్ణించి వచ్చిందో తెలిసిందా?" అడిగాడు బండార్కర్.

"కన్నాట్ సర్కస్ వద్దనున్న పబ్లిక్ టెలిఫోన్ బూత్ నించి. అది పబ్లిక్ కాల్ ఆఫీసు. మీరు చెప్పకుండానే మా డిపార్టుమెంట్ మనుషుల్ని పంపాను-బూత్‌లో వున్న వాళ్లని పట్టుకోమని. మా మనుష్యులు వెళ్లేటప్పటికి అక్కడ ఎవరూ లేరు" అన్నాడు కుమరవేలు.

"థాంక్ యు." అని బండార్కర్; రిసీవర్ పెట్టేసి, మళ్ళీ యింకో ఫోన్ తీసి, "ఐ. వాంట్ ఎస్. బి. ఏజంట్

ఒన్ క్విక్'' అన్నాడు.

''నేనే-ఒన్ స్పీకింగ్.''

''వెరీ గుడ్. అవసరమైతే, సిటీ క్రిమినల్ యిన్వెస్టి గేటింగ్ పోలీస్ ఫోర్సుని అంతా వుపయోగించు. ఐ వాంట్ రిజల్ట్స్.''

''చెప్పండి.''

''సిటీలో వున్న పబ్లిక్ టెలిఫోన్ కాల్ బాక్సులు అన్నీ కాపు వేయాలి. 'మూ ము' ముఠాకి చెందిన మనిషి, డిఫెన్సు మంత్రికి ఏదో టెలిఫోన్ బూత్‌లోంచి, యింక కాస్సేపట్లో ఫోన్‌చేస్తాడు. అతను ఫోన్ హుక్ మీద పెట్టగానే, టెలిఫోన్ బెల్ నిర్విరామంగా మోగే ఏర్పాటు నేను టెలిఫోన్ హవు సలో ఏర్పాటు చేస్తాను. అలా టెలిఫోన్ మోగగానే; ఆ బూత్‌లోంచి బయటకి వచ్చిన మనిషిని పట్టుకోవాలి. జాగ్ర త్తగా వుండాలి. బహుశా ఏ రివాల్వరో వుంటుంది. షూట్ చెయ్యడానికి సంకోచించడు. తెగించిన మనుష్యులు వాళ్లు. వాణ్ణి పట్టుకుని వెంటనే నా దగ్గరకి తీసుకు రావాలి'' అని చెప్పి బండార్కర్ టెలిఫోన్ హవుస్ మానేజర్‌తో మాట్లాడి; డిఫెన్సు మంత్రితో ఎవరయినా. ఏ పబ్లిక్ కాల్ ఆఫీసునించి మాట్లాడినా, రిసీవర్ హుక్ మీద పెట్టిన క్షణంనించీ, టెలి ఫోన్ అలారంలా నిర్విరామంగా మోగే ఏర్పాటుచేశాడు.

'ము. ము,' నెంబర్ 3 ని యిక కాస్సేపట్లో పట్టుకో వచ్చు అనుకున్నాడు తృప్తిగా. కాని, ఆ తృప్తి తృటికాలం కూడాలేదు.

గంటలో యుగంధర్ శవాన్ని సెక్రటరియేట్ గేటు ముందు పడేస్తా మన్నారు. రాజా వెళ్ళాడు ఒక్కడూ; ఏం చేస్తాడు! ఆ ఘోరం జరగకుండా ఎలా ఆపగలడు! యుగంధరే-ఆవులిస్తే పేగులు లెఖ్ఖపెట్టే యుగంధరే-శత్రువు

లకి చిక్కిపోయి. నిస్సహాయ స్థితిలో; తీవ్రంగా గాయపడి. ఎక్కడో కొనవూపిరితో వుండగా-దుడుకుతనంగా అనాలోచితంగా ప్రమాదాలలోకి పరిగెత్తే రాజు ఏం చెయ్యగలడు! అతనూ, యుగంధర్‌తోపాటు; శవంగా, సెక్రటరియేట్ గేటు ముందరికి రావడం తప్ప!

నిస్పృహ; నిస్సహాయత్వం; దిగులు; జుట్టు పీక్కొని; తల బాదుకోవాలనేటంత. విచారం: అయినా-యుగంధర్ ఆఖరి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"ఎవరో కొందరు దుర్మార్గులు, ఏదో విధంగా కొన్ని అణుబాంబులు చేజిక్కించుకుని, దేశాన్ని; ప్రపంచాన్ని, బ్లాక్ మెయిల్ చేస్తే; ఆ బ్లాక్ మెయిలర్స్‌ని ఎదిరించి, ప్రజా స్వామ్యాన్ని కాపాడే నాధుడే లేకపోయాడు అని అనిపించు కుంటామా? నా సర్వశక్తులా ప్రయత్నిస్తాను." జ్ఞాపకం తెచ్చుకుని, కుర్చీలోంచి కదలలేదు. మళ్లీ పసుపు రంగు ఫోన్. డిఫెన్స్ మంత్రిది మోగింది.

"బండార్కర్ హియర్—"

"డిఫెన్స్ మినిస్టర్ టు రిపోర్టింగ్-మళ్లీ ము. ము. నెంబర్ 3 ఫోన్ చేశాడు."

"ఏమని?" అడిగాడు బండార్కర్.

* * *

ఆస్పత్రి ఫర్లాంగు దూరంలో పోలీస్ స్టేషన్ వుందని, రాజుకి తెలుసు. రాజుకి ఢిల్లీనగరం-వీధులు; తన చేతిలో గీతలంత బాగా పరిచయం. పోలీస్ స్టేషన్ ముందు జీపు ఆపి: లోపలికి వెళ్ళి, యినస్పెక్టర్‌కి; తన ఐడింటిటీ కార్డు చూపించి, "ఒక డ్రయివర్ని జీపులో రెడీగా వుంచండి. అంతే కాదు. జీపు పెట్రోలు టాంక్ నింపండి. ఇంజన్ ఆన్ చేసి వుంచమనండి డ్రైవర్ని. నేను కాస్సేపట్లో వస్తాను.

ఒక గంటలో నేను రాకపోతే; యీ విషయం స్పెషల్ బ్రాంచ్ డైరక్టర్ బండార్కర్‌కి ఫోన్‌చేసి చెప్పండి.'' అన్నాడు రాజు.

''యస్ సర్. మీ ఆదేశాలను తు. చ. తప్పకుండా పాటిస్తాను'' అన్నాడు యిన్‌స్పెక్టర్.

రాజు పోలీస్ స్టేషన్‌లోంచి బయటికి వెళ్ళాడు. యుగంధర్ వున్న ఆస్పత్రి వైపు నడుస్తున్నాడు. తను ఏం చెయ్యాలో? తన పథక మేమిటో తనకే తెలియదు. ఒక్కటే తృప్తి. సామాన్యంగా. తను డేంజరెస్ కేసుమీద వెళు తున్నప్పుడు కూడావుండే ఆయుధాలు; పనిముట్లు; మందులు; రహస్యంగా, తన వొంటిమీద. తన బట్టలలో రకరకాల చోట్ల వున్నాయి. తను యుగంధర్ని రక్షించి తీసుకువస్తాడో- యుగంధర్‌తోపాటు తనూ - వెళుతున్నాడు పద్మవ్యూహం లోకి వొంటిగా.

*　　　*　　　*

''ము. ము. నెంబర్ 3 ప్రధానికి చెప్పావా అని అడిగాడు. ఇంకా చెప్పలేదని. ప్రధాని యింకో పదినిమషాలలో నన్ను పిలుస్తారనీ; చెపుతాననీ, చెప్పాను'' అన్నాడు నకిలీ డిఫెన్స్ మంత్రి.

''మూ, ము. నెంబర్ 3 ఏమన్నాడు?''

''త్వరగా ప్రధానితో మాట్లాడి ప్రధాని నిర్ణయం తెలుసుకోమన్నాడు. కాస్సేపట్లో మళ్ళా టెలిఫోన్ చేస్తానన్నాడు.''

బండార్కర్ రిసీవర్ పెట్టేశాడు—కొంతలో కొంత తృప్తి-యీపాటికి మూ.ము. నెంబర్ 3 ని పట్టుకునుంటారు. పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోంచి బయటకి రాగానే తన ఏజంటు నెంబర్ ఒన్ ఫోన్ చేస్తాడని ఆశతో టెలిఫోన్

వైపు చూస్తున్నాడు.

అయిదు నిమషాలు గడిచిపోయాయి. టెలిఫోన్ కాల్ రాలేదు. బండార్కర్, టెలిఫోన్ విజిలెన్స్ డైరక్టర్ కుమరవేలుకి ఫోన్ చేశాడు.

"యస్. మిస్టర్ బండార్కర్. డిఫెన్స్ మంత్రికి ఎవరు ఎక్కణ్ణించి టెలిఫోన్ చేసినా, ఆ టెలిఫోన్ డిస్కనెక్ట్ కాగానే, నిర్విరామంగా మోగే ఏర్పాటు చేశాము. ఇప్పుడే రిపోర్టు వచ్చింది. చాందినీ చౌక్‌లోవున్న మిలాప్ రెస్టారెంటు టెలిఫోన్‌లో ఏదో ఫాల్ట్‌వున్నదనీ; బెల్ నిర్విరామంగా మోగుతున్నదని ఎవరోవచ్చి, టెలిఫోన్‌చేసి, హుక్ మీద రిసీవర్ పెట్టినప్పట్నుంచీ, మోగుతూనే వుందని కంప్లెయింటు చేశారు. రిపేర్ సర్వీస్ వెళ్ళారట" అన్నాడు కుమరవేలు.

ము. ము నెంబర్ 3 ఎత్తుకి పైఎత్తు వేస్తున్నాడు. పబ్లిక్ కాల్ బాక్సునించి ఫోన్‌చేస్తే పట్టుకుంటారేమోనని, ఏదో హోటల్‌నించి ఫోన్‌చేశాడు.

ఇప్పుడిక ఏం చెయ్యాలి? ఆలోచిస్తున్నాడు బండార్కర్. మళ్ళా పసుపు రంగు టెలిఫోన్ మోగింది.

"డిఫెన్స్ మినిస్టర్ నెంబర్ 2. ము. ము. నెంబర్ 3 ఫోన్‌చేశాడు. తనను పట్టుకునేందుకు వలపన్నారనీ; తను తరుచు నాకు యిక ఫోన్ చెయ్యడానికి వీలులేదనీ; ఆపరేషన్ టూ (2) చర్యలోకి దింపమనీ ఆజ్ఞాపించాడు. ఆపరేషన్ టూ ఏమిటో నాకు తెలియదు. అతన్ని ఎలా అడగను. సరే నన్నాను."

"వెరీగుడ్. మీరు అక్కడే వుండండి. నానించి తప్ప, ఇక ఎక్కణ్ణించి ఫోన్ కాల్ వచ్చినా రిసీవర్ తియ్యవద్దు" అని చెప్పి కుర్చీలోంచి లేచాడు.

తప్పదు- కేంద్ర రక్షణ మంత్రే కావచ్చు- తప్పదు - నయానో, భయానో: ప్రధానమంత్రి-అధ్యక్షులూ వుంటారు కనుక, అసలు డిఫెన్స్ మంత్రి చేతే ఆపరేషన్ టూ ఏమిటో చెప్పించాలి.

బండార్కర్ వెళుతున్నాడు ప్రధాని గదికి - కాబినెట్ గదికి.

15

"యస్ సర్. వాట్ కెన్ ఐ డూ ఫర్ యు?" అడిగింది, మాడరన్ మెడికల్ అండ్ సర్జికల్ క్లినిక్, ముందు గదిలో; టెలిఫోన్ బల్ల వెనక, కూర్చున్న అందమైన యువతి.

"డాక్టర్ని చూడాలి" అన్నాడు రాజు.

"ఏ డాక్టర్! ఇక్కడ చాలామంది డాక్టర్లున్నారు? ఏ సందర్భంలో?" అడిగింది మళ్ళా.

"రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్."

"వాట్ యీజ్ యువర్ కంప్లయింట్ - యీ కాయితం మీద వ్రాసి యివ్వండి!" అన్నదామె.

రాజు నవ్వాడు. "నా కంప్లయింటు, మీలాటి అందమైన ఆడదానికి చెప్పే కంప్లయింటు కాదు. నా రోగాన్ని గురించి, డాక్టర్తో తప్ప ఎవరితో చెప్పను-వ్రాయను" అన్నాడు.

ఆమె నవ్వింది. "సచ్ ఏన్ యంగ్ మాన్! ఆరోగ్యంగా, బలంగా, పుష్టిగా వున్నారు. మీకు అటువంటి కంప్లయింటు వుండడం ఆశ్చర్యం?" అన్నది యింటర్నల్ రిసీవర్ తీస్తూ.

"ఎటువంటి కంప్లయింటో గ్రహించారా? తక్కువ

కాదు-చాలా ఎక్కువ. మీలాటి స్త్రీని చూస్తే; మీ బట్టలు...''

''దట్ యీజ్ వెరీ డేంజరెస్-అయితే పిచ్చి అన్న మాట-'' నవ్వుతోనే ''డాక్టర్-ఏ పేషంట్ ఫర్ యు'' అన్నది.

క్షణం తర్వాత, కుర్రాణ్ణి పిలిచి, ''వీర్ని డాక్టర్ నంద లాల్ దగ్గరకి తీసికెళ్ళండి'' అన్నది.

కుర్రాడు రాజుని, నాలుగు వసారాలలోంచి నడిపించుకుని తీసుకుని వెళ్లాడు.ఓ గది-స్ప్రింగ్ తలుపు తెరిచి ''వెళ్ళండి!'' అన్నాడు.

''కమ్ యిన్-'' అని డాక్టర్ నందలాల్ పేషంటు రిపోర్టు కార్డు తీసి, ''పేరు? కంప్లయింటు?'' అడిగాడు.

''ఇది చాలా పర్సనల్-''

''నేను డాక్టర్ని....రోగి చెప్పే విషయాలు ఎవరికీ చెప్పను. అది మా వృత్తి నియమం'' అన్నాడు డాక్టర్.

''బయట ఆ వార్డు బాయ్ విని, అందరికీ చెప్పితే.''

''మైడియర్ యంగమాన్. ఎందుకు అంత సర్వసనెస్ ఐ థింక్ యువర్ కంప్లయింట్ హాజ్ సమ్థింగ్ టు డూ విత్ సెక్స్. ఈ గదితలుపు—గోడలు; అన్నీ సౌండ్ప్రూఫు.''

''తలుపు తెరిచే వుంది'' అన్నాడు రాజు.

''వాట్ ఏ పర్సిస్టెంట్ మాన్ యు ఆర్. తలుపు గడియపెడతాను- మీ మనస్సు కుదుటపడుతుందంటే- ఆ తర్వాత డోంట్ వేస్ట్ యువర్ టయిమ్'' అన్నాడు నంద లాల్. అంటూ లేచి వెళ్ళి తలుపు గడియపెట్టి వెనక్కి తిరి గాడు. తిరిగాడో లేదో తెల్ల కళ్ళగుడ్లు కెళ్ళుకు వచ్చాయి భయంతో. రాజు రివాల్వర్ డాక్టర్ నందలాల్ ఛాతీమీదకి ఆనించి పెట్టాడు.

"కిక్కురు మన్నావో-అరిచావో-చిన్న చప్పుడు చేశావో కాలుస్తాను. నేను అన్నిటికీ తెగించాను" అన్నాడు రాజు.

డాక్టర్ నందలాల్ నోటమాటరాలేదు. గజగజ వొణుకు తున్నాడు.

"నా పేరు రాజు. నేను డిటెక్టివ్ యుగంధర్ అసిస్టెంటుని-" డాక్టర్ నందలాల్‌కి ఏమీ అర్థంకానట్టు చూశాడు.

"బిగ్గరగా కాక, రహస్యంగా నా ప్రశ్నలకి జవాబులు చెప్పు. యుగంధర్ ఎక్కడున్నారు? ఆయన పరిస్థితి ఎలా వుంది?" అడిగాడు రాజు.

"యుగంధర్ ఎవరు?"

రాజు రివాల్వర్ డాక్టర్ ఛాతీ మీదకి యింకా గట్టిగా పొడిచాడు.

"తెలియదా! మీరు రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్. అర గంట క్రితం. మోటారు కారు ఆక్సిడెంట్ కేసు-"

తల వూపాడు నందలాల్. "రూం నెంబర్ ఎనిమిదిలో వున్నారు. కండిషన్ డేంజరస్. రక్తస్రావం చాలా ఎక్కువగా వుంది. తలకీ, చేతులకీ, కాళ్ళకీ, గాయాలు. దవడ ఎముక విరిగిపోయింది. కళ్లల్లో గాజు పెంకులు గుచ్చుకున్నాయి."

"ఏం చేశారు-చికిత్స?"

"ఏమీ చెయ్యనివ్వలేదు. ఒక గంటలో అతన్ని చంపుతారుట. కనుక బతికించడం వృథా అని నన్ను పంపేశారు."

"రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ అయిన మీ మాట కాదని, ఒక పేషంటుకి ట్రీట్‌మెంటు యివ్వకుండా, చావనివ్వమని మీకు చెప్పగలిగిన మనిషి ఎవరు?"

"మూ. ము. నెంబర్ 2. ఈ ఆస్పత్రి అతనిది."

"అయినా అది అలా ఒక రోగిని చావనివ్వడం మీ వృత్తి ధర్మానికి విరుద్ధం కదా?"

నందలాల్ కళ్ళల్లో నీళ్ళు నిండాయి. "నా భార్యా, ఇద్దరు పిల్లలు-వాళ్ళ చేతుల్లో వున్నారు. వాళ్ళ మీద అపేక్ష కొద్దీ, వాళ్ళ ప్రాణాలు బలి యివ్వలేక-నా వృత్తి ధర్మానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాను" అన్నాడు నందలాల్.

"యుగంధర్ని- ఎప్పుడు- ఎలా తీసుకుని వెళతారో తెలుసా?"

"తెలియదు."

"తక్షణం-ఈయనకి చికిత్స చేస్తే బతుకుతారా?"

"బతుకుతారు."

"థాంక్స్-మీకూ, మీ వాళ్ళకీ ఏ ఆపదా రాకూడదని ప్రార్థిస్తున్నాను."

అంటూ, రాజు పిస్తోలు వెనక్కి తిప్పి, పిడితో డాక్టర్ నందలాల్ని తల మీద-వెనక బలంగా కొట్టాడు. చావదు, చావకుండా, స్పృహ పోయేటట్టు కొట్టడం యుగంధర్ నేర్పించారు. నందలాల్ కింద పడిపోతోంటే- పట్టుకుని, నెమ్మదిగా చప్పుడు కాకుండా; నేల మీద పడుకో పెట్టాడు.

తర్వాత డాక్టర్ బట్టలు; చేతి గడియారం; ఉంగరం, తను పెట్టుకున్నాడు. తన బట్టలు, అతని కేశాడు. ఆ తర్వాత, జేబులోంచి, చిన్న మేకప్ బాక్స్ తీసి, తన మొహం డాక్టర్ నందలాల్లా మార్చుకున్నాడు. డాక్టర్ నందలాల్ మొహం తన మొహంలా మార్చాడు. తన ఆయుధాలు, పరికరాలు, అన్నీ తన జేబులోకి మార్చుకున్నాడు.

ఆ తర్వాత, డాక్టర్ నందలాల్కి యింజక్షన్ యిచ్చాడు. రెండు క్షణాలు డాక్టర్ నందలాల్నే పరీక్షగా చూశాడు రాజు.

నందలాల్కి స్పృహ పోయింది. కనీసం యింకో రెండు

గంటలు కళ్లు తెరవడు.

బల్ల దగ్గిరకి వెళ్ళి, టెలిఫోన్ తీశాడు. "యస్. సర్."
అన్నది రిసప్షన్ అమ్మాయి.

"నువ్వు పంపిన రోగి, మెంటల్లీ యింబాలెంసుడు. స్ట్రాంగ్ ట్రాంక్విలయిజర్ యిచ్చాను. రెండు గంటల తర్వాత మళ్లీ పరీక్ష చేస్తాను. అతన్ని పడుకో పెట్టడానికి ఏ గది ఖాళీగా వుంది?"

"రూం నెంబర్ 10."

"గుడ్. టేబిల్ పంపు-రోగిని తీసుకెళ్లేందుకు!" అని క్షణం ఆగి, "బాస్ వున్నారా?" అడిగాడు.

"మూ. ము. 2 లేరు. అరగంటలో వస్తానన్నారు."

"రాగానే నేను కలుసుకోవాలని చెప్పు" అని రాజు రిసీవర్ పెట్టేశాడు.

మూ ము. 2 లేడు. అరగంట వరకూ రాడు. ఆలోగా యుగంధర్ని యిక్కణ్ణుంచి బయటకి తీసికెళ్ళాలి. ఎలా? ఆలోచిస్తున్నాడు.

* * *

చీఫ్ ఆఫ్ ఆర్మీస్టాఫ్; ఎర్మార్షల్; అడ్మిరల్, దేశరక్షణ మూడు సైనిక విభాగాల నాయకులు. ప్రధాని గది ముందు. తలుపుకి అడ్డంగా కుర్చీలు వేసుకుని, కూర్చున్నారు. బండార్కర్ రావడం చూశారు. బండార్కర్ చిరపరిచితుడే. కాని, పలకరించేందుకూ; మర్యాదకీ, మాట్లాడేందుకూ, ఎవరికీ మనస్సు బాగాలేదు.

"నేను వెంటనే కేబినట్ గదిలోకి వెళ్ళి ప్రధానితో మాట్లాడాలి" అన్నాడు బండార్కర్.

"సారీ" అన్నాడు ఆర్మీ చీఫ్.

"ఇది చాలా అవసరం. అత్యవసరం. దేశ రక్షణకి.

సంబంధించిన విషయం. క్షణం కూడా ఆలస్యం చెయ్యకూడదు.''

''సారీ-'' అన్నాడు ఏర్‌మార్షల్.

''మీరు వూహించలేరు నేను చెప్పబోయే విషయం ప్రాముఖ్యం. నేను లోపలికి వెళ్ళి తీరాలి'' అన్నాడు బండార్కార్.

''సారీ!'' అన్నాడు అడ్మిరల్.

''మీరు చాలా మూర్ఖంగా, మొండిగా; వివేకం లేకుండా, ప్రవర్తిస్తున్నారు. దేశ క్షేమం గురించీ, కాబినెట్ మంత్రుల క్షేమాన్ని గురించీ, మీకెంత బాధ్యతవున్నది నాకూ అంతే బాధ్యత వున్నది. రాంక్‌లో కూడా.''

''మిస్టర్ బండార్కార్ మీ దేశభక్తి కాని; మీ సదుద్దేశం కాని మేము ఎవరమూ శంకించడంలేదు. మేము డిఫెన్స్ ఫోర్సెస్ వుద్యోగులము. ఆజ్ఞలు పాటించడమే మా విధి. డిటెక్టివ్ యుగంధర్‌కి సర్వాధికారాలు యిచ్చి; యుగంధర్ ఆజ్ఞలని కంబయిన్‌డ్ ఆర్మడ్ ఫోర్సెస్ సుప్రీం కమాండర్ అయిన అధ్యక్షుడి ఆజ్ఞలు పాటించమని, అధ్యక్షులు, ప్రధాని చెప్పారు. ఎటువంటి పరిస్థితులలోనూ; ఎవరు వచ్చినా, ఏం చెప్పినా; రాత్రి పన్నెండు గంటలకి మూడు నిమషాల ముందువరకూ, లోపలికి ఎవరినీ వెళ్ళనివ్వవద్దనీ, లోపల్నుంచి, ఎవర్నీ రానివ్వవద్దనీ, యుగంధర్ ఆజ్ఞాపించారు మమ్మల్ని.

ఏ క్షణాన్న అయితే అధ్యక్షులు తన అధికారాలు, స్వయంగా తనే యుగంధర్‌కి యిచ్చి, యుగంధర్ ఆజ్ఞలు పాటించమని చెప్పారో ఆ క్షణాన్నించి, మళ్ళా యుగంధర్ చెప్పేటంతవరకూ వారి ఆజ్ఞలే పాటిస్తాము. ఆ మాటకివస్తే, అధ్యక్షులే యీ తలుపు, తియ్యమన్నా: ఎవర్నయినా లోప

లికి రానివ్వమన్నా వెళ్లనివ్వము. రాత్రి పన్నెండు గంటలకి మూడు నిమిషాలు ముందువరకూ-అంటే 11-57 వరకూ'' అన్నాడు ఆర్మీ ఛీఫ్.

''ఐయామ్ సారీ. మీతో ఏకీభవించలేను. యుగంధర్ మరణించారు. ఈ విషయం ప్రధానికి చెప్పాలి'' అన్నాడు బండార్కర్.

''యుగంధర్ శవాన్ని చూస్తే కాని మేము ఆ వార్త యథార్థంగా అంగీకరించము'' అన్నాడు అడ్మిరల్.

బండార్కర్ చటుక్కున జేబులోంచి రివాల్వర్ తీశాడు.

''ఐయామ్ వెరీ సారీ. మీరు నన్ను వెళ్లనివ్వక పోతే దేశ క్షేమం దృష్ట్యా....'' అన్నాడు రివాల్వర్ వాళ్ళ వైపు గురిపెట్టి.

''డోంట్ బి ఏ ఫూల్. రివాల్వర్లు పేల్చడంలో మేము, ముగ్గురం ప్రవీణులం. మాలో ఒకర్ని మీరు గాయపరిచినా, యింకా యిద్దరం వుంటాం-'' అన్నాడు ఆర్మీ ఛీఫ్.

''యు ఆర్ ఫూల్స్. నా ట్రయినింగ్ వేరు. మీరు కాలు కదిపే లోపున-'' అంటున్నాడు ఢాం అని చప్పుడయింది. ఎప్పుడు తీసాడో-ఎలా తీసాడో, ఆర్మీ ఛీఫ్, హోల్స్టర్ లోంచి తన రివాల్వర్ తీసి, బండార్కర్ చేతిని షూట్ చేశాడు. రివాల్వర్ కింద పడింది. బండార్కర్ చేతికి రక్తం కారుతోంది.

''సారీ-మిస్టర్ బండార్కర్, ఆవేశంలో మీరు మమ్మల్ని ఎవర్నయినా కాలుస్తారని, నేను కాల్చాను తప్పలేదు. క్షమించాలి. పెద్ద గాయం కాలేదు. వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి కట్టు కట్టించుకోండి. మరొకసారి క్షమాపణలు'' అన్నాడు ఆర్మీ ఛీఫ్.

బండార్కర్ మొహం పాలిపోయింది. యుగంధర్ తప్ప-

ఎవరూ ప్రధాన మంత్రి గదిలోకి వెళ్ళలేరని తేలిపోయింది. అడ్మిరల్ బండార్కర్ చేతికి రక్తం కారకుండా కట్టుకట్టాడు.

"పోనీ మీరు నా గదికి రండి-మీకు కొన్ని విషయాలు చెపుతాను. అవి విన్న తర్వాత-" అంటున్నాడు బండార్కర్.

ఆర్మీ ఛీఫ్ నవ్వి- "మేము యిక్కణ్ణించి కదలము. మీరు ఏం చెప్పినా; అమెరికన్; రష్యన్; అధ్యక్షులు వచ్చారన్నా కూడా యీ గదిలోకి వెళ్ళనివ్వము యుగంధర్ అనుమతి లేనిదే-" అన్నాడు.

"యు ఆర్ ఫూల్స్-యు ఆర్ స్టుపిడ్స్-మీవల్ల మన దేశం-" తిట్టుకుంటూ బండార్కర్ వెళ్ళిపోయాడు.

"ఈ సంఘటనవల్ల, మన డిపార్టుమెంట్సులో వైషమ్యాలు రాకుండా వుంటా-"అంటున్నాడు అడ్మిరల్.

"అందరం బతికి వుంటే- విరోధాలు, వైషమ్యాలు, ధరించవచ్చు" అని నవ్వాడు ఆర్మీ ఛీఫ్.

*　　　*　　　*

రూం నెంబర్ ఎనిమిది ముందు, తలుపుకి అడ్డంగా వార్డుబాయ్ నిలుచున్నాడు. నందలాల్ వేషంలో వచ్చిన రాజుని చూసి, అతనికి ఏమీ అనుమానం కలుగలేదు.

"అడ్డంలే-తలుపుతియ్యి-" అన్నాడు రాజు.

"తను వచ్చేటంతవరకూ తలుపు తెరవవద్దని బాస్ చెప్పారు" అన్నాడు వార్డుబాయ్.

"నాన్ సెన్స్ పేషంటు బతికి వున్నాడో లేడో చూడమని నాకు బాస్ చెప్పారు. తెరు" కోపంగా అన్నాడు.

వార్డుబాయ్ భయపడి, గది తలుపు తెరిచాడు.

రాజు గుండె దడదడమంటున్నది. గదిలో మధ్య మంచం-మంచం మీద మనిషి. ఒక కట్టుకాని; దూదికాని లేదు. అంతా రక్తం; కళ్ళల్లోంచి, తల వెనకనించి, చేతుల

లోంచి_రక్తం సన్నని-అతిదీనమైన; హీనమైన మూలుగు వినిపిస్తోంది. రాజు స్టెతస్కోప్ తీసి, పరీక్ష చేశాడు-నాడి చూశాడు. గుండె చాలా బలహీనంగా కొట్టుకుంటోంది. నాడి అందడం లేదు. ఎక్కువ వ్యవధి లేదు. మృత్యువు ద్వారపు గడపమీద వున్నాడు యుగంధర్.

"వెళ్ళి రిసప్షనిస్టుని పిలుచుకునిరా" అన్నాడు రాజు వార్డుబాయ్‌తో.

వార్డుబాయే వెళ్లాడు. తిరిగివస్తాడు నిమిషంలో. నిమిషమే తనకి వ్యవధి. చటుక్కున జేబులోంచి; సిరింజ్ తీసి ఇంట్రా మస్కులర్ యాంజక్షన్ యిచ్చి, సిరంజ్ జేబులో వేసుకున్నాడు.

అది విచిత్రమైన మందు. కొన్ని పరిస్థితులలో మనిషిని బతికించేందుకు పనికివస్తుంది. కాని ఇప్పుడు రాజు యింకో వుపయోగానికి వాడాడు. ఆ మందు యిచ్చిన రెండు క్షణాల తర్వాత గుండె కొట్టుకోవడం వినిపించదు. ఎలక్ట్రానిక్ స్టెతస్కోప్‌తో పరీక్షిస్తే తప్ప: నాడి అసలు అందదు. ఊపిరి తీస్తున్నట్టు: కన్పించదు. డాక్టర్ అయితే: క్లినికల్‌గా పరీక్ష చేసి, మనిషి బతికే వున్నాడని చెప్పగలుగుతాడు. సామాన్యుడయితే మనిషి మరణించాడని అంటారు. అదీ ఆ మందు చేసే పని.

రిసెప్షనిస్టు - వార్డుబాయ్ లోపలకి వచ్చేటప్పటికి రాజు యుగంధర్ని పరీక్ష చేస్తున్నాడు. రిసెప్షనిస్టు తనని గుర్తు పడుతుందేమోనని, జాగ్రత్తపడి, ముక్కుకీ, నోటికీ, పాడ్ కట్టుకున్నాడు రాజు.

"డాక్టర్. మీరు ఎందుకు యీ గదిలోకి వచ్చారు? బాస్ ఆర్డర్_"

"డాక్టర్‌గా నా విధి. అందుకని వచ్చాను. ఈ పేషంటు

చనిపోయాడు. ఈ విషయం బాస్‌కి తెలియచెయ్యి'' అన్నాడు రాజు.

''ఆర్ యు షూర్?'' అడిగింది.

''ఐ థింక్ ఐ నో మై జాబ్. నువ్వు వచ్చి చూడు'' అన్నాడు రాజు. ఆమె వార్డుబాయ్ పేషంటు దగ్గిరకి వచ్చారు. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు కన్పించడంలేదు. ఆమె చెయ్యి ముట్టుకుని చూసింది.

''అవును పోయాడు బాస్‌కి రిపోర్టు చేస్తాను'' అన్నది.

16

అయిదు నిమిషాల తర్వాత ఆమె తిరిగి వచ్చింది.

''శవాన్ని బయటికి పంపే ఏర్పాటు చేస్తున్నారు బాస్. ఆయన రావడానికి వీలులేదుట యిప్పుడు. డాక్టర్ ఇక మిగతా పని, మేము చూసుకుంటాము. మీరు వెళ్ళవచ్చు. నేను ఆంబులెంస్‌కి ఏర్పాటు చేస్తాను'' అని ఆమె వెళ్ళిపోయింది.

ఇక క్షణాలు అమూల్యమైనవి. ఆలోచనకీ - ఆచరణకీ మధ్య వ్యవధి వుండకూడదు. రాజు వార్డు బాయ్‌ని దగ్గిరకి రమ్మన్నాడు. వార్డుబాయ్ ఎందుకో అని దగ్గిరకి వచ్చాడు.

అంతే-అదే కిటుకు- అదే పద్ధతి- ఒకే దెబ్బ, చెవి వెనక కొట్టాడు. ఆ వార్డుబాయ్ మైనం ముద్దలా రాజు చేతుల్లో పడ్డాడు.

వాడి నిక్కరు, కోటు, టోపీ తీసేసి, తన కోటు,పాంటు వూడతీసి; వార్డుబాయ్ వేషం తను వేసుకుని, తన బట్టల్ని, వార్డుబాయ్‌నీ, మంచం కిందకి, కన్పించకుండా తోసేశాడు రాజు. తను కొట్టిన దెబ్బకి వార్డుబాయ్ అరగంటవరకూ లేవడని రాజుకి తెలుసు.

వార్డుబాయ్, టోపీ సర్దుకుంటుండగా, రిసెప్షనిస్టు మళ్లీ

వచ్చింది "అంబులెంస్ బేరర్స్ వస్తున్నారు. శవాన్ని తీసు కుని వెళతారు. వాళ్ళకి సహాయం చెయ్యి" అని చెప్పి వెళ్ళిపోయింది.

నిమషం తర్వాత స్ట్రెచ్చర్ తీసుకుని యిద్దరు వచ్చారు. యుగంధర్ని స్ట్రెచ్చర్మీదకి తోశారు. రాజుకూడా సహాయం చేశాడు. స్ట్రెచ్చర్ తనూ ఒక పక్కన పట్టుకుని వెళ్లాడు.

అంబులెంస్ తలుపులు తెరిచి వున్నాయి. స్ట్రెచ్చర్ లోప లికి తోసి, ఆ యిద్దరూ లోపలికి ఎక్కారు. తలుపులు మూసు కున్నాయి. డ్రయివర్ స్టార్టు చేస్తున్నాడు.

"బండీ ఎటు వెళుతుంది?" అడిగాడు రాజు అంబులెంస్ డ్రయివర్ని.

"పార్లమెంట్ హౌస్ వైపు."

"నా యిల్లు లోడీ కాలనీ దగ్గిర. నేను ఆ ప్రాంతాల ఎక్కడయినా దిగేస్తాను. ఎక్కనా?" అడిగాడు రాజు.

"చాలా ప్రమాదకరమైన పనిమీద వెళుతున్నాము-" అంటున్నాడు డ్రయివర్.

"తెలుసు-ఫర్వాలేదు" అన్నాడు రాజు.

"అయితే ఎక్కు" అన్నాడు డ్రయివర్.

అంబులెంస్ కదిలింది. డ్రయివర్ నెమ్మదిగా తోలు తున్నాడు.

"ఎందుకు యింత నెమ్మదిగా-" అడిగాడు రాజు.

"ఇది ప్రయివేటు అంబులెంస్. ప్రస్తుతం మనం పేషంటుని ఆస్పత్రికి తీసుకు రావడానికి వెళ్ళడం లేదు. శవాన్ని అంద చెయ్యడానికి వెళుతున్నాం. ట్రాఫిక్‌లో యిరుక్కుని, ఏ చిన్న ఆక్సిడెంట్‌లో అయినా యిరుక్కో వడం మంచిది కాదు. అంతే కాదు. ఓ అయిదు నిమషాలు ఆలస్యంగా వెళ్ళినా మన పాసంజర్‌కి కోపం రాదు. అతనికి

టయిం తెలియదు. అతని వాచి శాశ్వతంగా ఆగిపోయింది" అని డ్రయివర్ నవ్వాడు.

డ్రైవర్ వాగుడుకాయ అని రాజుకి అర్థమైంది. డ్రైవర్ మాట్లాడుతూండగా; జేబులోంచి సిగరెట్ తీస్తున్నట్టు, తీస్తూ రాజు, సిరంజ్ తీశాడు. చటుక్కున డ్రయివర్ తొడలో పొడిచాడు.

"ఏమిటి! అబ్బ! గుచ్చుకుంది!" అన్నాడు డ్రయివరు.

"సీటు మీద గుండుసూది వుంది. ఇందాక నాకూ గుచ్చు కున్నది" అన్నాడు రాజు. ఇంజక్షన్ మందు; వొంట్లోకి వెళ్ళాక, అయిదు క్షణాల తర్వాత డ్రయివర్ కళ్ళకు కట్లు కమ్ముతున్నాయి. సెకెండ్ షాప్ మెకానిక్.

"ఏదో అయింది-" అంటున్నాడు. రాజు సీరింగ్ తీసుకున్నాడు. అలాగే, అక్సిలేటర్ మీద కాలు పెట్టి, స్పృహ తప్పి, పడిపోతున్న డ్రయివర్ని పక్కకి తీసి, అతన్ని దాటి, తను డ్రయివర్ సీటులోకి వెళ్ళాడు.

అంతే-ఏక్సిలేటర్ నొక్కాడు. సైరెన్ వేశాడు; రెడ్ లైట్ వెలిగించాడు. ముప్ఫయి-నలభయి-యాభయి-అరవై. డభయి, ఎనభయి; క్రమంగా, క్రమంగా బ్రేక్ వేసి ఆపాడు కారు వెల్లింగ్‌డన్ ఆస్పత్రి పోర్టికోలో. ఆపి, ఆపడంతో, దిగి, వెనక్కి పరిగెత్తాడు.

ఏం జరిగింది అర్థం కాక. అంబులెన్స్‌లో వున్న యిద్దరూ తలుపు తెరుచుకుని, దిగారు. రాజులో ఆ క్షణాన్న. దయ, సహనం, అనేవి లేవు. చెయ్యి బిగించాడు. తన శరీరంలో వున్న శక్తినంతటినీ కూడ దీసుకున్నాడు. పిడికిలి బిగించి, ముందు ఒకడి తలమీద, తర్వాత యింకొకడి తల మీద కొట్టాడు. ఆలోగా, ఆస్పత్రిలోంచి, నలుగురు వచ్చారు.

"ఏమిటీ గోల? ఏమిటి?" అరుస్తున్నారు.

"అంబులెంస్‌లో పేషంటు వున్నారు. కొన ప్రాపిరితో-యిప్పటికే ప్రాణం పోకపోతే-త్వరగా లోపలకి థియేటర్లోకి తీసి కెళ్ళండి! రండి!" అని అరిచి, లోపలకి పరిగెత్తేడు. తను ఎవరో- రోగి ఎవరో చెప్పాడు అక్కడ డ్యూటీమీద వున్న డాక్టర్‌కి.

గణ గణ గణ గణ గంట మోగింది.

"డాక్టర్ సుఖాడియా-న్యూరో సర్జన్; డాక్టర్ మహాదేవన్, ఆర్థో పేడిక్ సర్జన్; డాక్టర్ భగత్, ఐ సర్జన్; డాక్టర్ సిద్ధానంద్; హెడ్ ఆఫ్ క్లినికల్ డిపార్టుమెంటు-అందరూ వెంటనే థియేటర్ నెంబర్ రెండుకి రావాలి. ప్రమాద స్థితిలో పేషంటు-వి. ఐ. పి. వచ్చారు" లౌడ్ స్పీకర్లోంచి చెపుతున్నారు. ఆ ఆ డాక్టర్లు పరుగెత్తుతున్నారు థియేటర్ నెంబర్ 2 కి. యుగంధర్ని అప్పటికే ఆ థియేటర్‌కి చేర్చారు.

రాజు థియేటర్ బయట నిలుచున్నాడు.

"సిస్టర్-ఎలా వున్నారు యుగంధర్!" అడిగాడు రాజు.

"ఆక్సిజన్ టెంట్‌లో పెట్టాము. బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చెయ్యాలి, బ్లడ్ గ్రూప్ చేయించాలి-" అంటోంది.

"నాకు తెలుసు. యుగంధర్ బ్లడ్ గ్రూప్ 0. పాజిటివ్ యూనివర్సల్. నాదీ 0 పాజిటివ్ డొనార్ అండ్ రెసిపెంట్. మేము యిద్దరము, ఎవరి రక్తమైనా మా యిద్దరిలో యింకొకరికి యివ్వవచ్చు. ఎవరి రక్తమైనా మేము తీసుకోవచ్చు" అన్నాడు రాజు.

"అయితే తక్షణం లోపలకి రండి!" అన్నది థియేటర్ నర్సు. రాజు లోపలికి వెళ్లాడు. చూడలేకపోయాడు యుగం

ధర్ని. రాజుని యింకో పక్కమీద పడుకోపెట్టారు; రాజు రక్తం తీస్తున్నారు-అతని రక్తం బొట్లుబొట్లుగా యుగంధర్ శరీరంలోకి ఎక్కిస్తున్నారు.

"డాక్టర్! యుగంధర్?" అడిగాడు రాజు.

"యస్!" అడిగాడు డాక్టర్.

రాజు పడుకునే వున్నాడు - రక్తం-తనది పోతోంది. రక్తం పోతోందని, నీరసంలేదు. ఆ రక్తం యుగంధర్ శరీరంలోకి వెళుతోందని తనకి ఏదో బలం వచ్చినట్లున్నది.

"బతుకుతారా?" అడిగాడు.

"చెప్పలేము. ఇంపాజిబుల్. ఒక అరగంట క్రితం అయితే వేరు. ఇప్పుడు-ఆయన బతికేదీ లేనిదీ దేవుడి నిర్ణయం. భారం ఆయనది" అన్నాడు డాక్టర్.

దేశానికి యుగంధర్ అవసరమైతే-భగవంతుడు యుగంధర్ని బతకనిస్తాడు. యుగంధర్‌వల్ల యిక వుపయోగం లేక పోతే తీసుకుపోతాడు. అవును, భగవంతుడికే వదిలి పెట్టాలి-అని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాడు రాజు.

"సారీ మిస్టర్ రాజూ!" అన్నాడు డాక్టర్.

"ఏమిటి!"

"కారణం తెలియడంలేదు. ఎంత రక్తం ఎక్కించినా, బ్లడ్ ప్రజర్ పడిపోతోంది. ఐ థింక్ వి ఆర్ లూజింగ్."

"అంటే-యుగంధర్ ఇక-" రాజు గొంతు బొంగురుపోయింది. ఏడుస్తున్నాడు.

—(సశేషం)

హాసిషా హంగామా

నోట్ల కట్టల మేడ

రచన: కొండపల్లి వెంకటేశ్వరరావు

"మన వూరికి క్రొత్త ఎస్. ఐ వచ్చాడండీ. ఇదే మొదటి పోస్టింగట. వచ్చి వారం రోజులుకూడ కాలేదు. అప్పుడే లాడ్జింగులమీద దాడి జరిపి, అందమైన అమ్మా యిల్ని అరెస్టుజేసి, కేసులు బనాయిస్తున్నాడట. నిద్రలేకుండా నిఘావేసి, నేరస్థులని బంధిస్తున్నాడట. మరి, మరి....నా సంగతి....'' నీళ్ళు నమిలాడు బ్లూస్కై హోటల్ యజ మాని భుజంగరావు.

"నా సంగతి కూడ ఆలోచించండి" అన్నాడు, బ్లాక్ మార్కెట్ చేసి, కల్తీ వస్తువులు అమ్మే పెద్ద రేషన్‌షాపు యజమాని రాఘవయ్య.

"మీరే మమ్మల్ని కాపాడాలి, మన వ్యవహారం తల క్రిందులవుతుందో ఏమో" ప్రాధేయపూర్వకంగా అడిగాడు సారా కొట్టు యజమాని సారంగధర.

ఆ వూరిలోని చిన్న కేసులను తనచేత తొక్కించుకొని, పెద్ద మొత్తాలు సేకరించే ముత్తుసామి. అందమైన అమ్మా యిల సప్లైజేసే అప్పలసామి, దేవుడి పేర భక్తులిచ్చే ముడు పుల గుటకాయస్వాహా చేసే పూజారి పురుషోత్తమాచారి, ఇంకా ఎందరో కోటి విద్యలు చేసేవారు, తమ వ్యాపారాల

కెక్కడ ఆటంక మేర్పడుతుందోనన్న భయంతో పంచాయతీ సమితి ప్రెసిడెంట్ ప్రజారంజనరావు శరణు జొచ్చారు.

"ఆఁ....క్రొత్తొక వింత.... ఆరంభశూరత్వ—మెంత కాల ముంటుందిలే. మీకేం భయం లేదు. నేనున్నానుగా. ఇంతవరకు ఏ. ఎస్. ఐ కూడ నా చేతుల్లోంచి జారిపోలేదు. ఇతను కూడ గొప్పా! కాని....కాని...." అన్నాడు ప్రజా రంజన్‌రావు.

"కాని. ఏమిటండీ కాని, ఆ సంగతి మాకు తెలియ దనుకుంటున్నారా" అంటూ, అటూ, ఇటూ ఒక్కసారి చూచి ఒక్కొక్కరూ టేబిల్ మీద 'దక్షిణ'లు సమర్పిం చారు.

"ఇహఁ...మీకేమీ ఫర్వాలేదు. అభయ మిస్తున్నాను. వెళ్ళండి" అంటూ, గుప్పు. గుప్పున పొగ వదిలాడు నోట్లోని చుట్టను తీస్తూ.

*   *   *

"రాత్రి లాకప్పులోని అమ్మాయిలు ఏవిధంగా తప్పిం చుకు పోయారు?" గ్రుడ్లురిమాడు ఎస్. ఐ.

"...................."

"ఏం! ఎవ్వరూ మాట్లాడరేం! నేను ఒక్కరోజు హెడ్ క్వార్టర్సులో లేనంత మాత్రాన ఇలా జరగాలా? దీనికెవరు బాధ్యులు, చెప్పండి. లేదా అందరినీ సస్పెండ్ చేయి స్తాను" గద్దించాడు.

"సార్! రాత్రి మన సెంట్రీ వారిని కాలకృత్యాలకని స్టేషన్ వెనుకకు తీసుకుపోతే ఎవరో ఒక ముఠా వారి నందర్నీ దాడి జరిపి, తీసుకువెళ్ళారట" చెప్పాడు హెడ్డు.

"ఏం! 'అట' అంటున్నావ్. రాత్రి నీవు డ్యూటీలో లేవా?"

"నేనేనండీ ఇన్‌ఛార్జిని."

"అయితే ఇంట్లో నిదురపోతూవున్నా వున్నమాట. లేదా ఆ ముఠా నీకు ఎంత ముట్ట జెప్పారేమిటి?" వ్యంగ్యంగా అన్నాడు ఎస్. ఐ.

"ఏంటి సార్. మీరంటున్నది!!'

"ఉన్నమాటే అంటున్నాను."

"సార్! ఏమనుకోనంటే ఒక్కమాట" అన్నాడు హెడ్డు.

"ఏంటది?"

"మీరింత స్ట్రిక్టుగా వుంటే ఏమంత మంచిది కాదు. మన కెన్నో ఖర్చులు. మన స్టాఫ్ భార్య బిడ్డ లెలా బ్రతకాలి. మీరాలోచించి చూడండి" నెమ్మదిగా అన్నాడు హెడ్డు.

"అయితే లంచాలు తీసుకోమంటావా?" కోపంగా అన్నాడు. ఎస్. ఐ.

"మీ ఇష్టం. లేకపోతే ఇక్కడ లీడర్లు బ్రతకనివ్వరు. ఇదివరకొక ఎస్. ఐ గారు ఈ విధంగానే వుంటే ట్రాన్స్‌ఫర్ చేయించారు...."

"ట్రాన్స్‌ఫర్ అంటే భయపడతా ననుకున్నావా?"

"ట్రాన్స్‌ఫరే కాదు. ఉద్యోగం నుండి తొలిగే పరిస్థితి ఏర్పడుతుంది."

"పోతే పోని. ఈ అవినీతిని నిర్మూలించందే నేను నిద్రపోను. నా ఆజ్ఞను మీరు పాటిస్తారా లేదా!, లేదంటే మాత్రం ఎస్. పికి రిపోర్ట్‌వ్రాసి సస్పెండ్ చేయిస్తాను. జాగ్రత్త" హెచ్చరించాడు ఎస్. ఐ.

"తొందర పడకండి సార్! మరొక్కసారి ఆలోచించండి. మన పిల్లలు బాగా చదువుకోవాలి. ఆడపిల్లలు ఎదిగితే, కానీ కట్నం ఇవ్వందే రేపు వారికి వివాహం కాదు. మన ఆశలన్నీ అడియాశలే అవుతవి."

"నాకు పాఠాలు నేర్పుతున్నావా! యూ గెటవుట్ బ్రూట్" అరిచాడు ఎస్. ఐ.

*　　　*　　　*

"ఏంటీ! సారాకొట్టు యజమాని సారంగధర అరెస్టు అయ్యాడా. ఏం చేశాడని?" ఆదుర్దాగా అడిగాడు ప్రజారంజన్.

"కల్తీ సారా అమ్మిన నేరానికి" వచ్చిన ఆసామీ జవాబిచ్చాడు.

"ఇప్పుడెక్కడున్నాడు?"

"లాకప్పులో."

"సరే మంచిది. విడిపించడానికి ట్రై చేస్తాను" భరోసా ఇచ్చాడు ప్రజారంజన్.

ఫోన్ రిసీవరెత్తుకుని ప్రజారంజనరావు "కెన్ ఐ స్పీక్ టు ఎస్. ఐ" అన్నాడు.

"యస్. ఐయామ్ ఎస్. ఐ సుధీర్ స్పీకింగ్."

"గుడ్‌మార్నింగ్ అమీన్ సాబ్! నేను ప్రజారంజన్‌ని మాట్లాడుతున్నాను."

"యస్. చెప్పండి."

"నాకొక సహాయం కావాలి."

"సాధ్యమైతే చేస్తాను."

"మీకు సాధ్యమయ్యేదే."

"అయితే చెప్పండి."

"ఏం లేదు. మీరు అరెస్టు చేశారే, ఆ సారంగధరను వదిలి పెట్టాలి."

"ఏం! ఎందుకు విడిచి పెట్టాలి."

"ఆఁ....ఏదో మొదటి పొరపాటు."

"పొరపాటు, పొరపాటే. సమయానికి చూడబట్టి సరి

పోయింది కాని, లేకపోతే చాలా మంది చచ్చిపోయి వుండే వాళ్లు."

"ఎవరూ చావలేదుగా ఇప్పుడు?" అన్నాడు ప్రజారంజన్.

"చావాలా ఏంటి?"

"ఆఁ....అది కాదులెండి. అతను మనకు ముందెంతో ఉపయోగపడేవాడు."

"ఏ విషయంలో."

"డబ్బు విషయంలో. మీకెంత డబ్బు కావాలో అంత ఇస్తాడు" అన్నాడు ప్రజారంజన్.

"అయితే మీరు ఇప్పుడెంత ఇస్తారు?"

"పది వేలు."

"పది వేలా. ఎవరిక్కావాలండీ డబ్బు. డబ్బు ఎరజూపి నన్ను వల్లో వేసుకోవాలని జూస్తున్నారా. ఇటువంటి పిచ్చి వేషాలు వేశారా, జాగ్రత్త!!" గద్దించాడు ఎస్. ఐ.

"మిస్టర్, ఇన్స్పెక్టర్!! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా-నేను ఎక్స్-ఎమ్. ఎల్. ఏని, ఎమ్. పిని, మినిస్టర్ని, ఇప్పుడు పంచాయతీ సమితి ప్రెసిడెంట్ని. వకాల్తా చదువు కున్న వాడిని."

"ఏం! భయ పెడ్తున్నావా?"

"నీకు నిలువ నీడ లేకుండా చేయగలను. ఈ జిల్లాలో ఉన్నంత కాలం, నిన్ను మూడు చెరువుల నీళ్లు త్రాగించ గలను. అంతదాకా ఎందుకు. నీ కీ ఉద్యోగం లేకుండా, మరో ఉద్యోగం దొరకకుండా చేయగలను" ఫోన్ మారు మ్రోగేలా అరిచాడు ప్రెసిడెంట్ ప్రజారంజనరావు.

"అంత కోపమెందుకండీ. ఇప్పుడేం చెయ్యమంటారు?" అడిగాడు ఎస్. ఐ సౌమ్యంగా.

"అలా రండి దారికి. పదివేలే కాదు. ఏభై వేలు ఇస్తాను.

సారంగధర్‌ని వదిలి పేయాలి. ముందెన్నడూ మా జోలికి రానని కూడా మాట ఇవ్వాలి."

"మంచిది" అన్నాడు ఎస్. ఐ.

"థాంక్యూ వెరీమచ్. ఆఁ మరచా. సాయంకాలం నాలుగు గంటలకు మీ ఇంటికి వస్తాను. డబ్బు తేవడం మరచిపోను లెండి. మీరు వుంటారుగా?"

"యస్సస్. ఉండక తప్పుతుందా" ఫోన్ డిస్‌కనెక్ట్ చేశాడు.

* * *

సాయంకాలం నాలుగు గంటలవుతోంది. ప్రజారంజనరావు కొరకు ఎదురు చూస్తున్నాడు ఎస్. ఐ.

'అబ్బా! ఏభై వేలే. ఇంత డబ్బు మరో జన్మలోనైనా చూడగలడా. బ్రతికి వుంటే బలుసాకు తినమన్నారే కాని, ఈ నోట్ల ఆకులు తినమనలేదే?' కళ్ళ ముందు నోట్ల కట్టలతో పెద్ద మేడ కట్టినట్లూ, ఆ మేడలో తన భార్యా పిల్లలూ, ఎంతో ఆనందంగా భోగ విలాసాలతో తేలిపోతున్నట్లు, కల గంటున్నాడు.

"నమస్కారం ఎస్. ఐ. గారూ?"

ఆ పిలుపుతో అతని నోట్లకట్టల మేడ కూలిపోయింది.

"ఏంటండీ! అంత దీర్ఘాలోచనలో వున్నారు?" అడిగాడు ప్రజారంజన్.

"అబ్బే! ఏం లేదండీ!" చిరునవ్వుతో అన్నాడు ఎస్.ఐ.

"ఇదిగోనండి మీ డబ్బు. పువ్వుల్లో పెట్టి తెచ్చాను. ఏభై వేలు" సూట్‌కేస్ అందించాడు.

తీసుకున్నాడు ఎస్. ఐ. వణుకుతున్న చేతులతో.

"మీ చేతులలా వణుకుతున్నాయేమిటి? అఫ్‌కోర్స్ ఇది మొదటి అనుభవం అనుకుంటా" నవ్వుకుంటూ అన్నాడు

ప్రజారంజన్.

"యాఁ.....యాఁ"

"సారంగధర్‌ని వదిలి పెట్టారుగా. ఇక ముందు మా జోలికి రారుగా?" నొక్కి చెప్పాడు ప్రజారంజన్.

"ఈ రోజే అధికారులతో మాట్లాడి, రేపటికి సారంగ ధర్‌ని వదిలి పెట్టా, సరేనా" అన్నాడు ఎస్. ఐ.

"వస్తా" నంటూ వెళ్ళిపోయాడు ప్రజారంజన్.

అతను పోతూవున్న వైపే చూస్తూండిపోయాడు ఎస్.ఐ.

'ఇదీ లోకం' అనుకున్నాడు మనసులో.

* * *

ప్రజారంజనరావ్ అగ్గిమీది గుగ్గిలమైపోతూ వున్నాడు.

"ఈ వెధవ ఎస్. ఐ. తనను మోసం చేస్తాడా. ఏభై వేలు తిని సారంగధర్‌ని జైలుకు పంపిస్తాడా. ఈ డబ్బు వాడి అబ్బ సొత్తనుకున్నాడా. వాడి నోట్లోంచి కక్కిస్తాను. అది కాకుండా బ్లూస్కై హోటల్ ఓనర్ భుజంగరావును, పూజారి పురుషోత్తమాచారిని, ముత్తుస్వామిని, అప్పల స్వామిని, అరెస్ట్‌చేసి వారిపై కేసులు మోపుతాడా? లంచం తిన్నది కాకుండా, ఏమి ఎరగనట్లు నటిస్తాడా! వీడి అంతు తేలుస్తాను" ప్రజారంజనరావు అరికాలు మంట నెత్తికెక్కి భగ్గు, భగ్గున మండిపోతున్నాడు.

టెలిఫోన్ ట్రింగ్ ట్రింగ్‌న మ్రోగింది.

"యస్. ప్రజారంజన్ మాట్లాడుతున్నాను."

"కొంప మునిగిందండి. మన రేషన్ షాపు యజమాని రాఘవయ్యను కూడ అరెస్టు చేశారట. అతనిప్పుడు లాక ప్పులో వున్నాడు" అవతలి కంఠం అదుర్దా చెందింది.

పుండుమీద కారం జల్లినట్లయింది ప్రజారంజన్‌కు.

"ఏమైనా కొంప మునుగుతుందో ఏమోనని, రిజర్వ్

పోలీసునుకూడ తెప్పించాడు. మిమ్మల్నిగూడ రచ్చకీడ్వాలని ప్రయత్నం చేస్తూన్నట్లుతెలిసింది. ఇంకా... ఏ అఘాయిత్యం చేస్తాడో ఏమో....'' చెప్పుకుపోతున్నాడా ఆవతలి వ్యక్తి.

రిసీవర్ క్రెడిల్ చేశాడు.

''చేతులు కాలకముందే జాగ్రత్తపడాలి. మోసాన్ని మోసంతోనే జయించాలి'' కర్కశంగా పళ్లు నూరాడు ప్రజారంజన్.

*　　　　*　　　　*

''నమస్కారమండీ ఇన్స్పెక్టర్‌గారూ'' పోలీస్‌స్టేషన్ హౌస్‌లో అడుగెడ్తూ అన్నాడు ప్రెసిడెంట్ ప్రజారంజనరావు.

ప్రతి నమస్కారం చేశాడు ఎస్. ఐ. చేతిలోని దండాన్ని ఊపుకుంటూ.

''రాఘవయ్యను అరెస్ట్ చేశారట?'' కుర్చీలో కూర్చుంటూ అన్నాడు ప్రజారంజన్. ''అతనే నేరం చేశాడని?''

''ఏం చేశాడా? ఆహారపదార్థాలను కల్తీ చేశాడు. వంట నూనెల్లో ప్రాణాపాయకరమైన పిచ్చి ఉమ్మెత్తకాయ గింజల నూనెను, మసాల ద్రవ్యాల్లో చింతగింజలపొడిని, పసుపు పొడిలో పశువుల పేడను, నెయ్యిలో మృతిచెందిన ఆవు శరీరంలోని క్రొవ్వును కలిపి అమ్ముతున్నాడు. సంఘం లోని ఇటువంటి చీడపురుగులను కూకటివ్రేళ్ళతో పెకలించి వేయాలి. అప్పుడే ఈ సంఘం బాగుపడుతుంది....'' చెప్పుకు పోతున్నాడు ఎస్. ఐ.

''సారీ....ఇన్స్పెక్టర్‌గారూ! మీరు మహానాయకులు కావ ల్సినవారు. పొరపాటున పోలీసుల్లో చేరిపోయారు. మీరు దంచిన లెక్చర్ అద్భుతంగా వుంది'' వెక్కిరించాడు ప్రజా రంజన్.

''ముందర వేదికలపై లెక్చర్లు దంచిన మహానాయ

కులే, వెనుక గోతులు తీస్తున్నారు. అయినా, నేను పొరపాటున పోలీసుల్లో చేరినా, వారికంటె మిన్నగానే వున్నాను లెండి'' ఎదురుదెబ్బ దీశాడు ఎస్. ఐ.

''అంటే మీరంటున్నది, మీరు చెప్పే మాటలు, చేసే చేతలు ఒక్కటే నంటున్నారా?''

''ముమ్మాటికి నిజం.''

''అయితే, మీరు ఆ రోజు తీసుకున్న ఏభై వేలు ఏమయినట్లు. ముందు ముందు మా జోలికి రానని, మా అనుచరుల్ని వదిలిపెడ్తానని. ఆ డబ్బు తీసుకుని మోసం చెయ్యలేదా? మహానాయకుల్నే విమర్శిస్తున్నావు. మరి నీ సంగతి ఏమన్నట్లు?'' పెద్దగా అరిచాడు ప్రజారంజన్.

''ఆ(....అదా మీ అనుచరుల్ని వదిలిపెట్టాలని, మీరిచ్చిన ఆ డబ్బు ఆఫీసర్లకు వెదజల్లాను కాని, ఎవరూ సహాయం చేయకపోగా, నన్నే మోసం చేశారు. నేనేం చేయను?!''

''ఇదిగో ఇన్స్పెక్టర్‌గారూ! జరిగిందేదో జరిగింది. ఇక ముందు అలా జరగకుండా చూడండి. మొదటి పొరపాటు కాబట్టి మన్నిస్తున్నాను.''

''అయితే, నన్నేం చేయమంటారు.''

''రాఘవయ్యను వదిలివేయాలి. అతనిపై కేసు రద్దు చేయాలి.''

''సాధ్యపడదు'' అన్నాడు ఎస్. ఐ.

''నీది తినమరిగిన నోరని నాకు తెలియదనుకున్నావా. మరో ఇరవై వేలు ఇస్తాను. మరి గుట్టురట్టుగా కూడా చెయ్య. ఈ రోజే హైద్రాబాదుకెళ్ళి బ్యాంకునుండి డబ్బు తీసుకు వస్తాను. రేపురాత్రి మా యింటికి ఎనిమిది గంటలకురండి. డబ్బు ఇస్తాను. మరి రాఘవయ్యను వదలడం మరచి

పోరుగా!!'' అందంగా నవ్వాడు ప్రజారంజనరావు.

''అలాగే!'' హామీ ఇచ్చాడు ఎస్. ఐ.

ఎస్. ఐ. దగ్గర సెలవు తీసుకొని, అక్కడి నుండి నేరుగా పట్నం బయలుదేరాడు అవినీతి శాఖ అధికారులను కల్సుకోడానికి.

* * *

'ఈ రోజు ఆట రసపట్టులోనికి వస్తోంది' అనుకున్నాడు ఎస్. ఐ.

మరో ఇరవై వేలు రాబోతున్నాయి. తను అనుకున్నట్లు రొట్టె విరిగి నేతిలో పడింది. ఇప్పుడతని మనసు మహదానందంగా వుంది. వాచీ చూసుకున్నాడు. 7-50 నిముషాలయింది. ప్రజారంజనరావు ఇంటికి దారితీశాడు.

''మనం అనుకున్నట్లు 8 గంటలకే వచ్చేశారే. ఏ మాట తప్పినా, ఈ మాట తప్పనట్లుందే?'' ఎస్. ఐ. ని లోనికి ఆహ్వానిస్తూ అన్నాడు ప్రజారంజనరావు.

''థాంక్యూ'' అన్నాడు ఎస్. ఐ కుర్చీలో కూర్చుంటూ.

''మీరిదివరకొకసారి ఏభై వేలు డిమాండుచేసి వసూలు చేశారు. మరల ఈసారికూడ నన్ను భయపెట్టి ఇరవై వేలు డిమాండు చేశారు. కాని, ఇవ్వక తప్పడంలేదు. మరి, మా కేసులేం చేస్తారో ఏమో?'' మొసలి కన్నీరు పెట్టాడు ప్రజారంజనరావు.

''ఏంటీ! నేను ఇంతక్రితం డబ్బు ఇవ్వమని నిన్ను డిమాండు చేశానా?''

''అవును లేకపోతే నీకు నేనే లంచం ఎందుకు ఇస్తాను. నా కేసుల్లో సహాయం చేస్తానని, ఏభై వేలు, ఇప్పుడు ఇరవై వేలు డిమాండు చేయలేదూ?''

''డిమాండుతోనే ఇస్తున్నావన్నమాట. సరే—మంచిది

ఆ డబ్బు ఇలాతే!"

ఇరువదివేల నోట్లకట్టలు ఎస్. ఐ. ముందుంచి-

"లంచం తీసుకుంటున్నందుకు ఇతన్ని అరెస్టుచేయండి సార్" పెద్దగా అన్నాడు ప్రజారంజన్.

వెంటనే ఏంటి కరెప్షన్ డి. ఎస్. పి లోపలినుండి బైటకి వస్తూ "లంచం తీసుకోవడమే నేరంగాదు, ఇవ్వడం కూడ నేరమే!! కాబట్టి నువ్వూ నేరస్తుడివే!" అన్నాడు ప్రజా రంజన్‌రావు వైపు తిరుగుతూ.

"అతని డిమాండ్‌వల్లనే నేను డబ్బుఇవ్వవలిసివచ్చింది" అన్నాడు ప్రజారంజనరావు.

"నువ్వు లంచం ఈ రోజు ఇవ్వబూనినట్లు, జిల్లా ఎస్. పి. ద్వారా, ఈ ఎస్. ఐ కంప్లైంటు ఇచ్చాడు. ఇతనెప్పుడూ డబ్బు ఇవ్వమని డిమాండు చేయలేదు. అలాచేసేవాడయితే, నీ మీద రిపోర్ట్ ఇచ్చేవాడే కాదు" అన్నాడు డి. ఎస్. పి.

"అయితే, ఇంతకు ముందుకూడ ఇతడు డబ్బు నన్ను డిమాండు చెయ్యలేదా! ఆ డబ్బు ఏమయింది?"

"ఓ! అదా!! ఆ రోజు నువ్వు అతనికి ఏభై వేలు ఇస్తా నని, మీ అనుచరుల జోలికి ముందెన్నడూ రావద్దని, సారంగ ధరని వదిలి పెట్టమని టెలిఫోన్‌లో మాటలు ట్రాప్‌చేయించి, రికార్డు చేశాడు. ఇదిగో" అంటూ టేప్ ఆన్ చేశాడు డి. ఎస్. పి. "నువ్వు ఇచ్చిన ఏభై వేలుకూడ ఆ రోజే పోలీస్ కమీషనర్‌కు అందజేసి, రిపోర్టిచ్చాడు."

తలవంచుకున్నాడు ప్రజారంజన్.

"అదేకాదు. నువ్వు చేసిన, చేయించిన నేరాలు ఋజువు లతోసహా సేకరించాడు. అవన్నీ కోర్టులో తెలుసుకుందువు గాని" అంటూ డి. ఎస్. పి. తన సిబ్బందితో ప్రజారంజన రావ్‌ను జీపులో కూర్చోబెట్టుకుని వెళ్ళిపోయాడు.

న్యాయం తన వైపే మ్రొగ్గుతున్నందుకు గర్వపడ్డాడు ఎస్. ఐ. సుధీర్.

★

కేసు కావాలి!

రచన: కొండపేటి సుధాకర్ రెడ్డి

డిటెక్టివ్ ఏకాంబరం కాళ్ళను డొక్కు టేబిల్ మీద పెట్టుకొని తీవ్రమైన ఆలోచనలో వున్నాడు. అసిస్టెంట్ పీతాంబరం కడుపులో గుర్రు పెడ్తున్న ప్రేవుల్ని ఓదార్చలేక నీరసంతో పడక్కుర్చీలో వాలి వీధిలోకి చూస్తున్నాడు, ఎవరయినా క్లయింటొస్తాడేమో నని.

"గురూ!" అసిస్టెంట్ పిలిచేడు.

ధ్యాన ముద్రలో మునిగివున్న డిటెక్టివ్ ఏమిటన్నట్లుగా చూసేడు.

"నేను చచ్చిపోయేట్టున్నాను గురూ!" నూతిలోంచి వచ్చిన మాటలా అతి చిన్నగా విన్పించింది అసిస్టెంట్ గొంతుక.

"ఎందుకు? ఎవరైనా నిన్ను చంపాలని ప్రయత్నిస్తున్నారా?" డిటెక్టివ్ టెన్షన్‌తోకొచ్చి అడిగేడు.

"ఖర్మ! దికారి వెధవను నన్నెవడు చంపుతాడు. మీ దగ్గఱ అసిస్టెంట్‌గా చేరిన పాపానికి ఆకలితో చచ్చేట్టున్నాను. ఇంతకన్నా ఏ మంగలి షాపులో కుదిరినా నాలుగు గెడ్డాలు గీసి హాయిగా బ్రతికే వాణ్ణి."

"ఛ! ఛ! నిన్ను అసిస్టెంట్‌గా పెట్టుకోవడం నా బుద్ధి తక్కువ. ఆకలిని ఓర్చలేని వాడివి రేపు భవిష్యత్తులో సాహస కార్యాల నెలా సాధిస్తావోయీ? కొన్ని కేసుల్లో శత్రు గూఢచారులు మనల్ని బంధించి, కొన్ని రోజులపాటు

నీళ్లు, నిప్పులు యివ్వకుండా బాధ పెట్టవచ్చు. ఇప్పట్నుండీ ట్రెయినింగ్ అవుతే గాని ఈ ఫీల్డ్‌కి పనికి రావు" అని యాష్‌ట్రే మూత తీసి ముప్పాతిక వంతు కాల్చి పడేసిన సిగరెట్ పీకలు రెండు తీసి, అసిస్టెంట్ కొకటిచ్చి, ఒకటి తను వెలిగించేడు.

"అసలు మన దగ్గరకి ఏ వెధవైనా ఈ కేసు టేకప్ చేయండి అంటూ వస్తాడా? అని నా అనుమానం. ఇప్పటికే మనం ఈ వీధిలో బోర్డు కట్టి ఆర్నెల్లు కావస్తుంది. మన కున్న రిస్టు వాచీల్లాంటివి తాకట్టు పెట్టి ఈ దొక్కు ఫర్నిచర్ సంపాదించేం. వీలైనన్ని చోట్ల అప్పులు చేసి వారం రోజుల క్రితం వరకు ఎలాగోలా కాలం గడిపేం. వారంనుండి మన పేరు చెప్తే కిళ్లీ కొట్టువాడు సిగరెట్లు అరువివ్వక పోతే పోయింది- కాని మంగలాడు గడ్డం కూడా గీయట్లేదు. తిండి మాటెలావున్నా, సిగరెట్లు, టీలు లేనిదే రోజు గడవదు గదా."

అసిస్టెంటు పీతాంబరం ప్రస్తుత గడ్డుపరిస్థితిని వివరించేడు.

"ఆ విషయం గూర్చే నేను ప్రొద్దుట్నుండీ ఆలోచిస్తు న్నాను. ఈ సమస్య లన్నిటికీ పరిష్కారం కేసు కావాలి. కనీసం ఒక్క కేసు వస్తే బ్రహ్మాండంగా సాల్వ్‌చేసి పారే ద్దును. అప్పుడు మన ప్రతిభ నలుమూలలా ప్రాకిపోయి, క్లయింట్లు మనల్ని వెతుక్కుంటూ వచ్చేవారు. కానీ ఆ ఒక్క కేసే రావట్లేదే?" డిటెక్టివ్ దాదాపు పూర్తిగా కాలిన సిగ రెట్ పీకను యాష్ ట్రేలో పడేస్తూ అన్నాడు.

"సుబ్బారావులూ, కుటుంబరావులూ, వుండే ఈ వీధిలో హత్యలు జరుగుతాయా? మర్డర్ కేసుల్లేకపోతే మానె, కనీసం చిన్న దొంగతనం కేసు దొరికినా బావుండేది?" అసిస్టెంట్ అవులిస్తూ అన్నాడు.

"ఈ విషయంలో నాకో ఐడియా తట్టింది. మన దగ్గరికి కేసులు రాకపోతే మనమే కేసుల్ని వెతుక్కుంటూ వెళ్దాం ఆ మార్గంలో ప్రయోజన ముండవచ్చు." డిటెక్టివ్ చెప్తున్న మాటల్ని తదేకంగా వినసాగేడు అసిస్టెంట్.

* * *

మర్నాడుదయం డిటెక్టివ్ ఏకాంబరం, అసిస్టెంట్ పీతాంబరం పెద్దిబొట్లవారి వీధిలో నడుస్తున్నారు. అరవయ్యేదో నంబర్ యింటి ముందు జనం గుంపుగా ప్రోగవడం వారి దృష్టి నాకర్షించింది.

"వాట్ హేపెండ్?" హడావిడిచేస్తూ గుంపులోకి చొచ్చుకు పోయేడు డిటెక్టివ్. దొర టోపీతోవున్న డిటెక్టివ్‌ను చూసి 'ఎవడో పగటి వేషగాడు' అనుకుంటున్నారు జనం.

"ఈయన ప్రఖ్యాత డిటెక్టివ్ ఏకాంబరం. నేను ఆయన అసిస్టెంటు పీతాంబరాన్ని" అని గొప్పగా అందరికీ ప్రచారం చెయ్యడంలో మునిగిపోయేడు అసిస్టెంటు.

ఇల్లుగలాయన డిటెక్టివ్‌తో జరిగిన దంతా చెప్పడం ప్రారంభించేడు:

"డిటెక్టివ్‌గారూ! అర్ధరాత్రి ఉన్నట్టుండి తలుపు తట్టిన చప్పుడయింది. యింత రాత్రివేళ ఎవరొచ్చుంటారబ్బా! అని అనుకొంటూనే తలుపు తీసేను. ఇంకేముంది! లైటు వెలుగులో వాణ్ణి చూసేసరికి నాకు చెమటల్లు గ్రమ్మేయను కొండి" ఊపిరి పీల్చుకోడాని కన్నట్లుగా ఆగేడా పెద్దమనిషి.

"ఎలా వుంటాడతను? రూపు రేఖలు వర్ణించగలరా?" డిటెక్టివ్ ప్రశ్నించేడు.

"నా మొహం! ఎలా గుర్తిస్తానండీ! నిండా నల్లటి ముసుగు వేసుకున్నాడు. కళ్ళ దగ్గరున్న చిన్న కంతల్లోంచి అంతా చూస్తున్నాడు గామోసు. పైగా నా ప్రాణాల్తీయ

డానికి వాడి చేతిలో నల్లగా నిగనిగలాడే పిస్తోలొకటి.''

''అలాగా! తర్వాతేం జరిగింది'' చుట్టూ మూగిన జనం వంక చూస్తూ అడిగేడు డిటెక్టివ్.

''అనడానికేం? చాలా అన్నాడు. 'నీ యింట్లోవున్న విలువైన నగలన్నీ యిస్తావా? చస్తావా?' అన్నాడు. 'దొంగగారూ మా యింట్లో విలువైన వేవీ లేవండీ' '' అని వినయంగా చెప్పేను.

ఇది జరుగుతున్నప్పుడు మా ఆవిడ మంచంమీద పడుకొనే వుందనుకోండి. ఆవిడ నిద్రలో కుంభకర్ణుడిని మించింది. ఆ దొంగ వెధవచూపు ఆ ఆవిడ మెళ్లోపడింది. దాంతోవాడు అగ్గి బుగ్గయిపోయి, ''నీ పెళ్ళాం మెడలో బంగారు గొలుసు ధగధగ మెరుస్తోంటే ఏమీలేవని బుకాయిస్తావా? ఆఁయ్? వెంటనే దాన్ని తీసుకురా'' అన్నాడు.

''అదిగాదు దొంగగారూ!'' అన్నాను నేను సణుగుతూ

అంతే! వాడు ఛరాలున ముందుకు వచ్చి మా ఆవిడ మెళ్లోని గొలుసు తీసుకొని వెళ్ళిపోయేడు'' చెప్పడం ముగించేడా ఆసామి.

డిటెక్టివ్ తీవ్రంగా ఆలోచిస్తున్న వాడిలా మొహంపెట్టి ''చూడండి. మీరేం దిగులు పడకండి. నేను ఇరవై నాలుగ్గంటల్లోనే ఆ దొంగను పట్టి, మీ గొలుసును మీ కప్పగిస్తాను'' అన్నాడు నిశ్చయంగా.

''వద్దండీ బాబూ! వెధవ నగ పోతేపోయింది. మీకు ఫీజివ్వాలేమో? ఎందుకులెండి'' అన్నాడా పెద్దమనిషి.

''అంత విలువైన నగపోతే వెధవ ఫీజుకోసం భయపడి ప్రఖ్యాత డిటెక్టివ్‌ను పరిశోధించ వద్దంటారా?'' అసిస్టెంట్ పీతాంబరం కలగజేసుకొని అన్నాడు.

''పరిశోధనా వద్దు! పాడూ వద్దు! వెళ్ళిరండి బాబూ!

అయినా పోయింది వెధవ రోల్డుగోల్డు నగేగా? మళ్ళీ పాతిక పెడితే కొత్తదే కొనుక్కోవచ్చు!''

''రోల్డుగోల్డ్ నగా?'' అని డిటెక్టివ్, అసిస్టెంటూ తెల్ల బోయేరు.

*　　　*　　　*

''ఛ! ఛ! నీకు బుద్ధిలేదు పీతాంబరం! వేషంమాత్రం గజదొంగలా వేసుకెళ్ళి, తెచ్చింది రోల్డుగోల్డు నగా? ఛ! ఛ! అదే బంగారు నగైతే మనమీ కేసు టేకప్ చేసేవాళ్ళం. దొంగ పారిపోయాడు, కాని నగ చిక్కిందని చెప్పి కేసును మూసేసే వాళ్లం. దాంతో మన ప్రతిష్ట, విలువ నలుగురికీ తెలిసి, కేసులు మనల్ని వెతుక్కుంటూ వచ్చేవి. కాని నీవు చేసిన ఈ చచ్చు దొంగతనంతో ఫస్టు కేసును టేకప్ చేసే అవకాశం పోయింది'' డిటెక్టివ్ అసంతృప్తిగా అన్నాడు.

''నేనేం చేయను గురూ! అసలేదో? నకిలీ ఏదో? నాకు తెలిసి చస్తేగా? పైగా ఎవరైనా వస్తారేమోనని భయం.''

''జరిగిందేదో జరిగింది! ఈ వేళ రాత్రికి ఈ వెధవ రోల్డుగోల్డు నగను తీసికెళ్ళి, వాడింట్లోనే విసిరేసిరా!'' అని యాష్‌ట్రేలో సిగరెట్ పీకకోసం వెదకసాగేడు డిటెక్టివ్ ఏకాంబరం. ★

''మాంఛారాం! చూంఛారాం! నేను గయ్యాళి గంపనట?'' సుందరి, భర్తతో అంది.

''ఎవరన్నారు?''

''ప్రక్కింటి మీనాక్షి!''

''ముత్తానికి ఆవిడ హరిశ్చంద్రుడి చెల్లెలిలా వుంది?'' అన్నాడు భర్త.

—కొండవీటి సుధాకర్ రెడ్డి, హిమాయత్‌నగర్.

"కమిన్" గంభీరంగా అన్నాడు ప్రఖ్యాత డిటెక్టివ్ కిశోర్.

ఆ యువతి కొద్దిగా తటపటాయించింది. మెల్లిగా అడుగులు వేస్తూ లోనికి వచ్చింది.

"అలా కూర్చోండి!" మళ్లీ అన్నాడు కిశోర్.

ఆమె సోఫాలో కూర్చుంది. ఒక్కసారి బెరుకుగా చుట్టూ చూసింది.

అది ఒక పెద్ద గది. నీటుగా ఉన్నది. గది మధ్యలో మెత్తటి సోఫా సెట్. మధ్య టీపాయ్. ఒక చిన్న స్టూలుపై అష్ట్రే. సోఫా సెట్‌కు ఎదురుగా రోజ్‌ఉడ్ టేబిల్, టేబిల్‌పైన ఒక ప్రక్కగా కొన్ని లావుపాటి ఫైళ్ళు. ప్రక్కనే పెన్‌స్టాండు. దానికి ఎడమ ప్రక్కగా చిన్న అష్ట్రే. ఫైళ్ళకు కుడిప్రక్క బ్లూ ఇంక్ బాటిల్. టేబిల్ వెనుకగా రివాల్వింగ్ ఛైరు. దానికి వెనుకగా నీలం కర్టెన్ ఉన్న పెద్ద కిటికీ. టేబిల్‌కు రెండు, మూడు అడుగుల దూరంలో మరో టేబిల్. పూర్తిగా అవే అరేంజిమెంట్సు. టేబిల్స్‌కు కుడివైపు అంచున గ్రే కలర్ టెలిఫోన్స్, టేబిల్ ఫాన్స్. మొత్తంమీద గది ఎంతో నీటుగా, నిండుగా ఉన్నది.

ఆ యువతి ఒక్కసారి సర్దుకుని కిశోర్‌వైపు చూసింది.

ఆరున్నర అడుగుల ఎత్తు. విశాలమైన నుదురు. ప్రకాశవంతంగా కనుపించే తీక్షణమైన కళ్లు. కండలు తిరిగి పహిల్వానులా ఉన్న ఒళ్లు. ఇనుప కడ్డీల్లాంటి చేతులు. ఒక ప్రక్కగా పైకి ఎగ దువ్విన ఒత్తైన వెంట్రుకలు. నల్లని ఆ వెంట్రుకలలో అక్కడక్కడా కనీ కనిపించనట్లున్న ఒకటీ అరా తెల్ల వెంట్రుకలు. మనిషి చాలా గంభీరంగా ఉన్నాడు.

"నేను .... నేను ...." అంటూ కొద్దిగా ఆగింది ఆ యువతి.

"చెప్పండి" అన్నాడు కిశోర్ ఆమెవైపు సూటిగాచూస్తూ.

"బ్యూటీ ఎస్టేట్సు, జమీందారు కుమార్‌రాజాగారి కుమా

త్తెను. నా పేరు యామిని....యామినీ జయరాజ్'' కొద్దిగా ఆగింది ఆమె.

''బ్యూటీ ఎస్టేట్సు, జమీందారు కుమార్ రాజాగారి కుమార్తెవా?'' అంటూ కొద్దిగా ఆశ్చర్యపడ్డాడు డిటెక్టివ్ కిశోర్. అసిస్టెంటు రాజు కూడా క్యూరియాసిటీతో కొద్దిగా ముందుకు వంగాడు.

''అవును. భారత దేశంలో చెప్పుకోదగిన ధనవంతులలో ఒకరైన కుమార్ రాజాగారు మా తండ్రిగారు. ఆయన రాత్రి హత్య చేయబడ్డారు'' అన్నది యామిని దుఃఖాన్ని ఆపుకుంటూ.

ఆమెవైపు పరీక్షగా చూశాడు కిశోర్. ఇరవై రెండు ఇరవై మూడులోపలే ఉంటుంది వయసు. కొద్దిగా పసుపు మిక్స్డ్ రెడ్ కలర్‌లో పొడుగ్గా, నాజూగ్గా చాలా అందంగా ఉన్నది. ఆమె నల్లని కళ్లలో బాగా ఏడ్చినట్లుగా సన్నని ఎఱ్ఱ జీరలు ఉన్నాయి. బ్లూకలర్ శారీ, రెడ్ మిక్స్డ్ పింక్ కలర్ బ్లవుజ్, మెడలో మెరుపు లీనుతున్న చంద్రహారం, చెవులకు బంగారు రింగులు, కొద్దిగా చిందర వందరగా ఉండి, పొడుగ్గా క్రిందికి వదిలి వేయబడిన తలవెంట్రుకలు, ఏడ్చి, ఏడ్చి కొద్దిగా ఉబ్బిన కళ్లు.

''నావల్ల మీకేమి సహాయం కావాలి?'' ప్రశ్నించాడు కిశోర్.

యామిని తనవైపు క్యూరియాసిటీతో చూస్తున్న రాజు వైపు అనుమానంగా చూసింది.

ఆమె భావం గమనించి నవ్వాడు కిశోర్. ''మీరే మీ అనుమానించవలసిన అవసరంలేదు. అతడు నా అసిస్టెంటు రాజు. మీరే విషయం చెప్పినా అది మా ఇద్దరినుంచీ బయ టకుపోదు. నేను హామీ ఇస్తున్నాను'' అన్నాడు.

''నా భర్త జయరాజ్‌గారిని మీరు కాపాడాలి. మా నాన్న గార్ని చంపారనే నేరంమీద ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు.''

''విపులంగా చెప్పండి. మీ నాన్నగార్ని హత్య చేయవలసిన అవసరం మీవారికేముంది?'' ప్రశ్నించాడు కిశోర్.

''చెబుతాను. విపులంగా చెబితేగాని ఈ కేసు మీ కర్థం గాదు.'' అంటూ ఆగింది యామిని.

కిశోర్, రాజువైపు చూశాడు. రాజు పెన్ను, పుస్తకం తీసుకుని సిద్ధంగా కూర్చున్నాడు.

''మా నాన్నగారు కుమార్ రాజాగారు. ఆయనకు నేనూ, మా అన్నయ్య కిషన్ రాజా ఇద్దరమే సంతానం. మా అన్నయ్య ఫారిన్‌లో భారతదేశం తరపున బ్రైన్ రిసెర్చిలో జాయిన్ అయ్యాడు. జయరాజ్‌గారు ఒక పెద్ద ఐరన్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన్ని నేను లవ్ చేసి పెళ్లి చేసుకున్నాను. అది మా తండ్రిగారికి ఇష్టంలేదు. నాకు జమీందారు ఫామిలీలో సంబంధాలు తేవాలని ఆయన కోరిక. ఆయనకు తెలియకుండా మేమీ సాహసం చేశాము.

''మామ్యారేజీ సంగతి మా అన్నయ్యకు కూడా తెలియదు. ఆ తరువాత మా నాన్నగారికి తెలిసింది. మొదట్లో ఆయన ఎంతో మండిపడ్డారు. తరువాత కొంతకాలానికి సర్దుకుని జమీందార్ కుమార్‌రాజాగారి అల్లుడు ఏదో ప్రైవేటు కంపెనీలో పనిచేయడం తనకు అవమానమని- కనుక ఆ ఉద్యోగానికి రాజీనామాచేసి తన ఎస్టేటులోనే తనకు సహాయంగా ఉండి పొమ్మని మావార్ని తన ఎస్టేటులోకి ఆహ్వానించారు. మొదట్లో మావారు అంగీకరించలేదు. చివరికి

నా బలవంతంమీద ఆయనా, నేనూ బ్యూటీ ఎస్టేట్సుకు వచ్చేశాము.

"మా నాన్నగారే ఈ విషయాలన్నీ ఫారిన్‌లో ఉన్న మా అన్నయ్యకు తెలియజేశారు. తనకు సెలవలు లేవనీ, త్వరలోనే వస్తానని మా అన్నయ్య 'కేబిల్' పంపాడు.

"మా పెండ్లి జరిగి ఇప్పటికి నాలుగునెలలైంది. ఆయన ఎంతో మంచివారు. నన్ను ప్రాణంలో ప్రాణంగా చూసుకునేవారు. కానీ....మా నాన్నగారికి ఆయనంటే ఎందుకో లోపల్లోపల ద్వేషం ఉండేది. తన ఆస్తిని కాజేయాలనే దుర్బుద్ధితో తన కుమార్తెను వలలో వేసుకుని తనకు కూడా తెలియకుండా పెళ్ళి చేసుకుని తమ ఇద్దరి మధ్య దూరాన్ని పెంచాడని మా నాన్నగారి అభిప్రాయం. అవకాశం చిక్కినప్పుడల్లా మా వారిని ఏదో ఒక నెపం మీద ఎగతాళిగా మాట్లాడుతూ ఎద్దేవా చేస్తూండేవారు. అయినా నామీద ఉన్న అభిమానంతో మావారు ఆ మాటలు పట్టించుకొనేవారు కారు.

"వారం క్రితం సెలవలకు మా అన్నయ్య కిషన్ రాజా ఫారిన్‌నుంచి వచ్చాడు. మా అన్నయ్య మాత్రం మావారితో అభిమానంగా ఉండేవాడు. మొన్న....మొన్న రాత్రి పడుకున్న మా నాన్నగారు నిన్న పది గంటలవరకూ క్రిందికి రాకపోయేసరికి మా అన్నయ్య అనుమానంతో పైకి వెళ్ళాడు. మా అన్నయ్య కేకలు విని మేమందరమూ పైకి వెళ్లాము. ప్రైవేటు రూమ్ సేఫ్టీ గాడ్రెజ్ బీరువా ముందు మానాన్నగారు నెత్తురు మడుగులో ఉన్నారు...."

"ప్రైవేటు రూమ్ అంటే" మధ్యలో అడిగాడు కిశోర్.

"మానాన్నగారి ప్రైవేటు రూమ్! ఆయనకు ప్రత్యేకంగా మూడు రూమ్‌లు ఉన్నాయి. ఒకటి బెడ్‌రూమ్. రెండ

సప్లిమెంట్ పోటీ [ఫలితాలు]

అక్టోబర్' 74 నెల "సప్లిమెంట్ పోటీ" కి సరియైన జవాబు:

A	B	D	C	G

పై విధంగా సరియైన జవాబు ఒకే ఒక్కరు వ్రాశారు. వారికి జనవరి' 75 నెలనుండి ఒక ఏడాది పాటు "సప్లిమెంట్" ఉచితంగా పంపగలము. ఒక వేళ విజేత పత్రిక పొందగోరితే ఆ విషయం ఈ నెల 15 వ తేదీలోగా మాకు తెలియజేయవలసి వుంటుంది.

బహుమతి పొందిన విజేత:—

శ్రీమతి ఆర్. చక్రవేణి,

కేరాఫ్—ఆర్. సూర్యనారాయణ,

రామమోహన్ రాయ్ రోడ్,

కాకినాడ-3

(తూ. గో. జిల్లా.)

వది కన్సల్టింగ్ రూమ్, మూడవది ప్రైవేటు రూమ్. ఒకటి, రెండు రూమ్‌లు ఆయన్ను కల్సుకొనే వారికోసం. ప్రైవేటు రూమ్ మాత్రం ఆయన సొంతం. ఆ రూమ్ లోకి చివరికి మమ్మల్ని కూడా రానివ్వరు ఆయన. ఆ ప్రైవేటు రూమ్‌లో ఉన్న సేఫ్టీ గ్యాద్రెజ్ బీరువాలో రకరకాల అరలూ, అందులో ఎన్నో వింత వింత విలువైన వస్తువులూ ఉన్నాయని వినడమేగాని ఎన్నడూ నాటిని మేము చూళ్ళేదు. ఆయన ఆ గదిలోకి ఎవరినీ రానిచ్చేవారు కారు.

"మరి బెడ్‌రూమ్, కన్సల్టింగ్ రూమ్‌లు ఆ ప్రైవేట్ రూమ్‌కు ఎంత దూరంలో ఉన్నవి?" ప్రశ్నించాడు కిశోర్.

"బెడ్‌రూమ్, కన్సల్టింగ్ రూమ్‌లు రెండో అంతస్థులో ఆ చివర, ఈ చివరా ఉన్నవి" అన్నది యామిని.

"తరువాత" ప్రశ్నించాడు కిశోర్.

"తరువాత పోలీసులు వచ్చారు. పరీక్ష చేశారు. సేఫ్టీ బీరువాలో ఏ ఒక్క వస్తువూ లేదు. అన్నీ దొంగలించబడ్డాయి. శవం ప్రక్కనే .32 కాలిబర్ రివాల్వర్ పడి ఉన్నది. దానితోనే హత్య జరిగిందని నిర్ణయించారు. దానికి దగ్గరగా ఒక జేబురుమాలు, ఒక పర్సు కనిపించాయి. పోలీసులు అవి కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ రోజు ఉదయం వచ్చి మా వారిని అరెస్టు చేసి తీసుకు వెళ్ళారు" యామిని దోసిట్లో మొహం దాచుకుంది.

రెండు నిముషాలు మౌనంగా ఉండిపోయాడు కిశోర్.

ఇంతలో యామిని తేరుకుని వ్యానిటీ బ్యాగ్‌లోనుంచి రుమాలు తీసుకుని కళ్ళు, మొహం తుడుచుకుంది. "ప్లీజ్! మీరు వారిని రక్షించాలి. ఆయన అటువంటి వారు కారు" అంది దీనంగా.

"మీ వార్ని విడిపించాలి. హంతకుడ్ని పట్టుకోవాలి.

అంతేగా!" అన్నాడు కిశోర్ యామిని వైపు చూస్తూ.

"అవును. ఎలాగైనా మా వారిని విడిపించాలి. ప్లీజ్!" అంది యామిని.

"ఒకవేళ మీవారే ఈ హత్య చేసి ఉంటేనో? అయినా పోలీస్‌లు అంత తెలివి తక్కువగా నేరాన్ని ఆరోపించరు" అన్నాడు కిశోర్.

"లేదు. లేదు. అలా ఎప్పటికీ జరుగదు. మా వారి మనసు నాకు తెలియదా! వారు చీమకు కూడా హాని చేయరు. వారు అలాంటివారు కాదు. పోలీస్‌లు ఏదో పొరపాటుపడ్డారు. మీరీ కేస్ తప్పకుండా టేకప్ చేయాలి. ఎంత ఖర్చయినా ఫరవాలేదు మీ ఫీజుకు రెట్టింపు ఫీజు నేనిస్తాను" ఆవేశంగా అన్నది యామిని.

ఒక్క క్షణం యామిని వైపు చూసి రిసీవర్ అందుకుని పోలీస్‌స్టేషన్‌కు డైల్ చేసి "హలో!" అన్నాడు కిశోర్. అవతలి వైపు నుంచి యస్. ఐ. గోవిందరావు కంఠం పలికింది.

"హలో! కిశోర్ స్పీకింగ్! కుమార్ రాజాగారి కేసు ఎవరు పరిశోధిస్తున్నారు?" ప్రశ్నించాడు కిశోర్.

"ఆ కేసు నా దగ్గరకే వచ్చింది. అవును! ఈ కేసులో మీకేమిటి ఇంట్రస్టు? ఎవరి తరపున పని చేస్తున్నారు?" గోవిందరావుకి కిశోర్ చాలా కాలంగా తెలుసు. దేశంలో అతనికి ఉన్న ఇన్‌ఫ్లుయన్సూ తెలుసు.

"నేను యామినీ జయరాజ్‌గారి తరపున పని చేస్తున్నాను" అన్నాడు కిశోర్.

"యామినీ జయరాజ్? అంటే మర్డర్ ఛార్జి మీద లాకప్‌లో ఉన్న జయరాజ్ సతీమణి?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు గోవిందరావు.

"అవును" అన్నాడు కిశోర్.

"అయినా నో హోప్స్!" అన్నాడు గోవిందరావు.

"అవి తరువాత. మీరే బేస్‌మీద జయరాజ్‌గారిని జైల్లో పెట్టారు?" ప్రశ్నించాడు కిశోర్.

"నిజానికి ఇంత సులభమైన కేసు నా సర్వీసులో ఇంత వరకూ తగలలేదు. హత్యకు ఉపయోగించిన రివాల్వర్ .32 కాలిబర్. దానిమీద హంతకుడి వేలిముద్రలు-సారీ-అదే జయరాజ్‌గారి వేలిముద్రలు వున్నవి. అక్కడే పడి ఉన్న జేబురుమాలు మీద, పర్సుమీదా అవే వేలిముద్రలు దొరికాయి. హత్య రాత్రి ఒంటిగంటా, మూడుగంటల మధ్య జరిగినట్లు డాక్టర్ రిపోర్టు" అన్నాడు అవతలినుంచి యస్. ఐ. గోవిందరావు.

"థాంక్స్!" అంటూ రిసీవర్ని క్రెడిల్‌మీద ఉంచేశాడు కిశోర్.

యామిని కిశోర్ ఏమి చెప్తాడోనని ఆత్రుతగా చూడ సాగింది.

రెండు నిముషాలు దీర్ఘంగా ఆలోచించి, "శవాన్ని మీ అన్నయ్య, ప్రైవేట్ రూమ్‌లో చూశాడా" ప్రశ్నించాడు కిశోర్.

"అవును."

"ప్రైవేట్ రూమ్ ఎక్కడ ఉంది?" సూటిగా ప్రశ్నించాడు కిశోర్.

"రెండో అంతస్తులో మధ్యలో వున్నది."

"తరువాత మీరు చూసినప్పుడు బెడ్‌రూమ్, కన్సల్టింగ్ రూమ్‌ల తలుపులువేసి ఉన్నవా? తీసి ఉన్నవా?" అడిగాడు కిశోర్.

"వేసే ఉన్నవి."

ఒక్కక్షణం కళ్లుమూసుకున్నాడు కిశోర్. తరువాత మెల్లిగా కళ్లు తెరిచాడు. "అల్‌రైట్। కేస్ టేకప్ చేస్తాను. వీలైనంత త్వరలో హంతకుడ్ని పట్టుకుంటాను" అన్నాడు.

యామిని సంతోషంతో లేచి నిలుచుంది. "మీ ఫీజు ఎంతో చెబితే...." అంటూ వ్యానిటీ బ్యాగ్‌లో చేయి పెట్టింది.

"పని పూర్తి కానీయండి" అన్నాడు కిశోర్.

ఆమె కిశోర్, రాజులకు నమస్కారంచేసి స్వింగ్‌డోర్ తెరుచుకుని వెళ్ళిపోయింది.

* * *

"ఇవి శవాన్ని రకరకాల ఏంగిల్స్‌లో తీసిన ఫోటోలు. చూడండి" అంటూ యస్. ఐ. గోవిందరావు కొన్ని ఫోటోలను టేబుల్‌పైకి త్రోశాడు.

డిటెక్టివ్ కిశోర్ వాటిని అందుకున్నాడు. పరిశీలనగా చూడసాగాడు.

సేఫ్టీ గాద్రెజ్ బీరువా పూర్తిగా తెరవబడి వున్నది. లోపలి అరలన్నీ ఖాళీగా వున్నవి. హతుడు కుమార్‌రాజా బీరువాకు ఎదురుగా ఒకటి రెండు అడుగులదూరంలో వెల్లకిలా పడివున్నాడు. అతడి రెండు చేతులూ గుండెమీద వున్నవి. ఆయన వేసుకున్న నైట్ గౌను గుండె దగ్గర ఎఱ్ఱని మరకలతో భయంకరంగా ఉన్నది.

కిశోర్ ఫోటోలో ఉన్న ఆయన పైపు పరిశీలనగా చూశాడు. అతడి పెదవులు చిఱునవ్వుతో కొద్దిగా విచ్చుకున్నవి. రెండు నిముషాలు ఆ ఫోటోను పరిశీలనగా చూసి ప్రక్కకు తిరిగి అసిస్టెంటు రాజు చేతికిచ్చాడు ఆ ఫోటోను.

రాజు ఆ ఫోటోను బాగా పరిశీలించాడు. "సార్ హతుడు చావబోయే ముందు ఏదో ఆశ్చర్యకరమైన విషయాన్ని

చూశాడు. అందుకే అతని ఫేస్‌లో ఆ ఫీలింగ్ బలంగా కన బడుతోంది'' అన్నాడు.

''యస్! యు ఆర్ కరెక్ట్ రాజూ! తన అల్లుడే తనను చంపబోతున్నాడని కుమార్ రాజాగారు చివర్లో గ్రహించారు. అందుకే ఆయన కళ్లల్లో ఆ ఆశ్చర్యం తాలూకు మెరుపు కనిపించింది'' అన్నాడు యస్. ఐ. గోవిందరావు.

''అతడే చంపి వుంటాడని ఎలా భావిస్తున్నారు? అతడి పరిచయస్తులలో వేరే ఎవరైనా కావచ్చు గదా!'' అన్నాడు కిశోర్.

''నో. నో. అలా జరగటం ఇంపాసిబిల్! ఎందుకంటే ఆయన ప్రైవేట్ రూమ్‌లోకి అందరూ రాలేరు. అసలు ఎవరికీ ఆ స్కోప్ లేదు. ఇంట్లో వాళ్లకు కూడా ఆ అవకాశం లేనపుడు ఎవరో పరిచితులు ప్రవేశించడం అన్నది సంభవం కాదు. అంతే గాక హతుడి ప్రక్కన ఉన్న రివాల్వరూ, జేబు రుమాలూ, పర్సూ మూడూ జయరాజ్‌వే అన్న విషయం పూర్తిగా రుజువైంది.

''అదీ గాక మామకూ, అల్లుడుకూ ఏమాత్రం పడేది కాదు. కూతురి భర్తగా జయరాజ్ ఆ ఎస్టేట్‌లో ప్రవే శించాడే గాని, అల్లుడిగా రాజాగారి మనసులో అతడికి స్థానం లేదు. కుమార్ రాజాగారు అతడ్ని పూర్తిగా ద్వేషించే వాడనే విషయం మనం ఏమాత్రమూ మర్చిపోకూడదు.

''ఈ ద్వేషంతో జయరాజ్‌కు మామగారిపై పగ రగిలి ఉంటుంది. మాటల సందర్భంలో యామినిగారు ఎప్పుడో ఆ ప్రైవేట్ రూమ్‌ను గురించి, అందులో వున్న విలువైన నగలను గురించి జయరాజ్‌కు చెప్పి ఉంటుంది. జయరాజ్ ఆ నగలను అపహరించాలనే ప్లానుతో అవసరమైతే మామ

గారిని చంపాలనే ప్లానుతో ప్రైవేట్ రూమ్‌లో ప్రవేశించి ఉంటాడు.

"ప్రైవేట్ రూమ్‌లోనికి ఎవరూ ప్రవేశించ కూడదనే నిబంధన జయరాజ్‌కు అనుకూలించింది. నగలను దొంగిలించే ముందో, లేక మొట్టమొదటనో రాజాగారిని హత్య చేశాడు. తరువాత నగలతో పారిపోయాడు. రెండో అంతస్తులో రాత్రి పూట ఎవరూ ఉండరు గనుక అతడి పని సులభం అయింది. తనను చంపే సమయంలో రాజాగారు జయరాజ్‌ను గుర్తించి ఉంటారు. గదిలో కనీసం కలబడినట్లు గూడా ఏ ఆధారమూ లేదు. అందుకే హతుడి మొఖంలో ఆ ఆశ్చర్యం చెరిగిపోకుండా ఉన్నది" అన్నాడు గోవిందరావు

"అది సరే! కానీ సేఫ్టీ గాడ్రెజ్ బీరువా పైన గాని లోపల గాని జయరాజ్ వేలి ముద్రలు ఏవైనా దొరికినవా?" ప్రశ్నించాడు కిశోర్.

"లేవు. ఒక్క జయరాజ్‌వే గాదు. ఆ అరలో ఎవరి వ్రేలి ముద్రలూ దొరకలేదు. అదే కొంత ఆశ్చర్యంగా ఉన్నది" అన్నాడు యస్. ఐ. గోవిందరావు.

"పిస్టల్ మీదా, మిగిలిన వస్తువుల మీదా ఉన్న ముద్రలు అదే సమయంలో దొంగిలించ ప్రయత్నించిన నగలున్న బీరువా మీదా లోపలా ఎందుకు లేవు? వ్రేలి ముద్రలు పడకుండానే బీరువాను తెరిచి నగలు అపహరించాడా హంతకుడు?" చిన్నగా నవ్వుతూ ప్రశ్నించాడు కిశోర్.

ఒక్క క్షణం అయోమయంలో పడ్డాడు గోవిందరావు. వెంటనే సర్దుకుని "బహుశా పోలీసులను తికమక పరిచేందుకు అలా జేసి ఉండవచ్చు. లేదా మరో విధంగా జరిగి వుండవచ్చును. మొదట ఆ గదిలోనికి ప్రవేశించి గ్లోవ్స్ తొడు

క్కని రాజాగారి వద్దనుండి తాళాలు దొంగిలించి వాటితో బీరువా తెరిచి లోపలి నగలన్నీ మూట కట్టుకుని పారిపోవ డానికి ప్రయత్నించి వుండవచ్చును. ఆ సమయంలో చేతికి వున్న గ్లోవ్స్ తీసివేసి వుండవచ్చును. తను పారిపోయే సమయంలో అనుకోకుండా కుమార్ రాజాగారు మేల్కొని హంతకుడ్ని గమనించి అడ్డుపడి వుంటారు. ఆ ప్రమాదాన్ని ఊహించని హంతకుడు గ్లోవ్స్‌ను తీసి వేసుకుని వుండడం వలన, వెంటనే గ్లోవ్స్ తొడుక్కునే అవకాశం చిక్కక పోవడంతో ఆ తొందరలో రివాల్వర్‌ను తీసి ఆయన్ని కాల్చి వుంటాడు, ఆ తొందరలో జేబు రుమాలూ, పర్సూ జారి క్రిందపడి వుంటవి. నగలు తీసుకుని పారిపోయే సమయంలో రివాల్వర్ కూడా అక్కడే పడిపోయి వుంటుంది. ఇదేమీ గమనించని హంతుకుడు తొందరలో పారిపోయి వుంటాడు'' అన్నాడు గోవిందరావు అంతే జరిగి వుంటుందన్నట్లుగా.

''ఇంతకూ దొంగిలించబడిన నగలు ఏవైనా దొరికాయా మీకు?'' అని ప్రశ్నించాడు కిశోర్ మాటమారుస్తూ.

''లేదు ఒక్క నగకూడా దొరకలేదు. జయరాజ్‌గారి గది మొత్తం వెతికాము. అంగుళం అంగుళం వెతికాము. అయినా ఒక్క నగకూడా దొరకలేదు. పోలీస్ వాటిని గురించి చాలా తీవ్రంగా పరిశోధిస్తూంది. అవి దొరకగానే జయరాజ్ మీద హత్యకేసు ఛార్జి చేస్తాము'' అన్నాడు గోవిందరావు.

''ఆల్‌రైట్! మీ పనిలో మీరుండండి. నేను ఒకసారి జయరాజ్‌గారిని కలుసుకోవాలి'' అన్నాడు కిశోర్.

''దానిదేముంది. ఇప్పుడే ఆ ఏర్పాటు చేస్తాను'' అంటూ బెల్ నొక్కాడు గోవిందరావు. ఒక పోలీసు లోపలికి వచ్చి గోవిందరావుకు సెల్యూట్ చేసాడు.

"వీరిని 34 నంబరు గదిలో ఉన్న జయరాజ్ దగ్గఱకు తీసుకువెళ్లు" అన్నాడు గోవిందరావు.

కిశోర్, రాజులు ఆ పోలీస్ వెనుక నడిచారు. కొన్ని గదులు దాటిన తరువాత "ఆ గదిలోనే సార్ జయరాజ్‌ను ఉంచింది" అన్నాడు పోలీస్.

"కమాన్ రాజూ!" అంటూ అయిదారు అడుగులువేసి జయరాజ్ ఉన్న గదిని చేరుకున్నాడు కిశోర్. కటకటాల గుండాలోపలికి తొంగి చూశాడు.

లోపల చిన్న అఱుగులాటి దానిమీద కూర్చుని ఉన్న జయరాజ్ కనిపించాడు. ఒక్క రోజులోనే ఎన్నో రోజులుగా తిండిలేని వాడికి మల్లే పిచ్చివాలకంలో పడిపోయి ఉన్నాడు జయరాజ్. తల పూర్తిగా చెదిరిపోయి బుట్టలా తయారయివుంది. మనిషి చాలానీరసంగా కనిపిస్తున్నాడు.

"జయరాజ్!" గంభీరంగా పిలిచాడు కిశోర్.

జయరాజ్ ఉలిక్కిపడి వాళ్లవైపు తిరిగాడు. మెల్లిగా లేచి వాళ్ళ దగ్గఱకు వచ్చాడు, ఇనుప చువ్వలకు ఇటు కిశోర్ రాజూలు, అటు జయరాజ్ ఉన్నారు.

"నేను డిటెక్టివ్ కిశోర్‌ను.ఇతడు నా అసిస్టెంటు రాజు. మిమ్మల్ని విడిపించవలసిందిగా, అసలైన హంతకుడిని పట్టుకోవలసినదిగా మీ భార్య యామినిగారు నన్నుకోరారు. నేనడిగే ప్రశ్నలకు సరిగ్గా, సూటిగా సమాధానాలు చెప్పగలిగితే నా ప్రయత్నంలో సహాయపడిన వారవుతారు. అబద్ధంచెపితే మీకే నష్టం" అన్నాడు కిశోర్ జయరాజ్ కళ్ళల్లోకి చూస్తూ.

ఒక్క క్షణంసేపు జయరాజ్ కళ్లు సంతోషంతో మెరిశాయి.

"యామిని తెలివైన పనిచేసింది. మిమ్మల్ని గురించి చాలాసార్లు పత్రికల్లో చదివాను. మీరు పూనుకుంటే హంతకు

లెవరో క్షణంలో బయటపడుతుంది. నన్నే ప్రశ్నలడగ దల్చుకున్నారో అడగండి. నేను నిజంగా నిర్దోషిని. అబద్ధం చెప్పవలసిన అవసరం ఏమిటి?'' సంతోషంగా అడిగాడు జయరాజ్.

''హత్యాప్రదేశంలో దొరికిన రివాల్వరూ, మిగతా వస్తువులూ మీవేనా?'' ప్రశ్నించాడు కిశోర్.

''నావే.''

''రివాల్వర్ మీ దగ్గర ఎందుకుంది?'' ప్రశ్నించాడు కిశోర్.

''నేను యామినిని వివాహం చేసుకుని బ్యూటీ ఎస్టేట్స్లోనికి రాకముందు ఒక ఐరన్ కంపెనీలో పనిచేస్తూండే వాడిని మేనేజరుగా. అప్పుడు నా చేతుల్లో పెద్ద పెద్ద మొత్తాలు మారుతుండేవి అంత డబ్బును దగ్గర ఉంచుకోవడం వలన ఏదైనా ప్రమాదం సంభవిస్తుందేమోనని సేఫ్టీకోసం రివాల్వర్‌ను కొనుక్కున్నాను'' అన్నాడు జయరాజ్.

''మీ వస్తువులు హత్యాప్రదేశంలోకి ఎలా వెళ్లాయి?'' సూటిగా అడిగాడు కిశోర్.

''అదే నాకూ అర్థం గాకుండా ఉన్నది. అసలు బ్యూటీ ఎస్టేట్స్‌కు వచ్చిన తరువాత రివాల్వర్‌ను ఎప్పుడూ ఉపయోగించలేదు. దానిని నా డ్రాయర్‌లో వుంచేశాను'' అన్నాడు జయరాజ్.

''మీ రెప్పుడైనా మీ మామగారి ప్రైవేట్ రూమ్‌లోకి వెళ్ళారా? ఆయనకూ మీకూ మధ్య మనస్పర్థలు ఉన్నవని తెలిసింది'' ప్రశ్నించాడు కిశోర్.

''ఆయనకు నా మీద కొంత ద్వేషం ఉండేది. కానీ నే నెన్నడూ ఆయన్ను విరోధ భావంతో చూడలేదు. పెద్దవారు....ఏదో అంటుంటారు అనుకునే వాడ్నేగాని ఆయన

మీద ఏనాడు ద్వేషం పెట్టుకోలేదు నేను. ఇక ప్రైవేట్ రూమ్. దాన్ని గురించి వినడమేగాని నేనెప్పుడు లోనికి వెళ్ళలేదు. అసలు ఎవరూ వెళ్ళగూడదని యామిని చెబుతుండగా ఒకసారి విన్నాను. అసలు నేను మామగారిని కలుసుకోవడమే తక్కువ. ఆ అవసరం పెద్దగా వుండేదికాదు'' అన్నాడు జయరాజ్.

* * *

''ఇదే మా నాన్నగారి ప్రైవేటు రూమ్! ఆయన శవాన్ని మార్చ్యురీకి తీసుకువెళ్ళే ముందు ఈ గదికి పోలీస్ సీల్ వేసింది. అయినా ఈ గది వెతకడంవలన ఏమీ ప్రయోజనం ఉంటుందనుకోను. హంతకుడు చిక్కాడుగా! ఇంకా ఎందుకు ఈ పరిశోధన'' అయిష్టంగా అన్నాడు కిషన్ రాజా.

''ప్రయోజనం లేకుండా పని ఉండదు కిషన్‌రాజాగారూ! పోలీసులు సీలువేశారనే విషయం మాకు తెలుసు. పైనుంచి ఆర్డర్స్ తీసుకునే వచ్చాము!'' అన్నాడు గంభీరంగా కిశోర్.

కిషన్‌రాజా మాట్లాడలేదు. యామినికేసి ఒకసారి తీక్షణంగా చూశాడు.

కిశోర్ అసిస్టెంటు వైపు చూసి ''తలుపులు తెరువ్ రాజూ:'' అన్నాడు.

రాజు సీల్ తీసి తాళం తెరిచాడు. ఇద్దరూ గదిలోకి వెళ్ళగానే కిశోర్ లోనుంచి తలుపులువేసి ''రాజూ! నువ్వు బ్రెయిన్ స్పెషలిస్టు నారాయణరావుగారి దగ్గరకు వెళ్ళి తెలుసుకున్నదాన్నిబట్టి రాజాగారి చావు మరణ రహస్యం ఈ గదిలోనే ఉన్నట్లు తేలుతుంది. జాగ్రత్తగా వెతుకు'' అన్నాడు.

ఇదువురూ మిషన్లలా ఆ గది అంతా వెతకడం ప్రారంభించారు. మంచం, అల్మారా, పరుపులూ, పుస్తకాలు

అన్నీ తిరగేయడం ప్రారంభించారు. అరగంటసేపు వెతికి వెతికి అలిసిపోయారు. ఏమీ కనిపించలేదు.

"రాజూ! ఆ టేబిల్ పైన ఫైళ్ళున్నవి వెతకాల్సినవి. నువ్వు అటువెతుకు. నేను ఇటు వెతుకుతాను" అంటూ ఆ ప్రక్కకు అడుగులు వేశాడు కిశోర్.

రాజు టేబిల్ దగ్గరకు నడిచాడు. అతడు టేబిల్ పైన వెతుకుతూ చెయ్యి కొంచెం ప్రక్కకు జరిపాడు. అనుకోకుండా అతడి చెయ్యి పెన్‌స్టాండుకు తగిలి స్టాండు క్రింద పడింది. పెన్‌లు క్రింద పడ్డాయి.

రాజు క్రిందికి ఒంగి అవి ఏరసాగాడు. కేపు జారిపోయిన గ్రీన్ కలర్ పెన్ విచిత్రంగా కనిపించింది. రాజు పరీక్షగా చూశాడు. దానికి పాళీ ఉన్న స్థానంలో పాళీకి బదులుగా ఏదో తాళంచెవి కనిపించింది.

"సార్!" అంటూ రాజు, కిశోర్‌ను పిలిచాడు. "ఇదేదో తాళం చెవిలాగా ఉన్నది సార్" అన్నాడు.

కిశోర్ ఆ పెన్‌ను పట్టుకుని పరిశీలించి, "అవును రాజూ! ఇది తాళం చెవే! ఏ దొంగైనా తాళం చెవికోసం జేబులు వెతుకుతాడేగాని పెన్‌లు వెతకడు. మొత్తానికి కుమార్ రాజా మంచి ఐడియా వేశాడు. బహుశా దీని అటాచ్‌మెంటు ఆ సేఫ్టీ బీరువాలోనే ఉంటుంది" అంటూ బీరువా వైపు నడిచాడు.

పది నిముషాలు ఆ బీరువాను శల్యపరీక్షచేసిన తరువాత బీరువాకు ఒక మూలగా సన్నని రంధ్రం కనిపించింది. తాళం దానిలోపెట్టి త్రిప్పాడు. చిన్నగా శబ్దంచేస్తూ బీరువా ప్రక్కకు తొలగింది.

అడుగున పెద్ద స్టెయిన్‌లెస్ స్టీల్ బాక్సు ఉన్నది. కిశోర్ మూత తెరిచాడు. ఒక్కసారి కళ్ళు జిగేలు మన్నవి. అత్యంత విలువైన బ్యూటీ ఎస్టేట్సు జమీందారు జవ్హారీ ఉన్నది

అందులో.

"ఇందుకే ఎవ్వరికీ నగలు దొరకలేదు. అవి అసలు దొంగలింపబడలేదు గనుక" అంటూ పైకి లేచాడు కిశోర్.

*　　*　　*

అర్ధరాత్రి పన్నెండు గంటలు కావస్తూ ఉన్నది. బ్యూటీ ఎస్టేట్సునుంచి బ్లాకు కలర్ ఫియట్ ఒకటి బయలుదేరింది. దాని వెనుకనే కొద్ది దూరంలో మరొక కారు దానిని అను సరిస్తూ బయలుదేరింది.

ముందు కారు ఎన్నో సందులు, గొందులు తిరిగి చివరికి ఊరుబయటనున్న ఒక పెద్ద మేడ ముందు ఆగింది. దానిలో నుంచి ఒక వ్యక్తి క్రిందకు దిగి మేడలోకి వెళ్లాడు.

ఆ కారుని అనుసరిస్తూ వచ్చిన మరొక కారు ఆ కారుకు కొద్ది దూరంలో ఆగింది. అందులో నుంచి డిటెక్టివ్ కిశోర్ క్రిందికి దిగాడు.

"రాజూ! నువ్వు వెనక్కు వెళ్లి వీలైనంత త్వరలో పోలీసును వెంటబెట్టుకునిరా" అన్నాడు.

"అలాగే సార్!" అన్నాడు రాజు. క్షణంలో ఆ కారు రివర్సు గేర్‌లో వెనక్కు తిరిగి ఊరివైపు వెళ్ళిపోయింది.

రెండు నిముషాలు అక్కడే నిలబడి తరువాత ఆ మేడ వైపు తిరిగాడు కిశోర్. కొద్దిగా ముందుకు కదిలి ఆ మేడ దగ్గరికి వచ్చాడు.

గేటు దగ్గర ఎవరో ఇద్దరు కాపలా కాస్తున్నారు. కిశోర్ చప్పుడు చేయకుండా గోడవారగా నడుస్తూ ఆమేడ వెనక్కు వచ్చాడు. చప్పుడు చేయకుండా కాంపౌండు వాల్ ఎక్కి లోనికి దూకాడు.

చుట్టు ప్రక్కల చీకటిగా ఉన్నది. అంతా నిశ్శబ్దంగా ఉన్నది. చిన్నగా నడుస్తూ వరండా దగ్గరికివచ్చాడు. మెల్లెక్కి

వరండా మీదికి చేరుకున్నాడు. పైన లైట్లు వెలుగుతున్నాయి. వరండాలో లైటులేదు.

వరండాలోనుంచి లోపలికి నడిచాడు. ఆ గదిలో ఒక ప్రక్కగా పైకి వెళ్ళేందుకు మెట్లున్నాయి. చప్పుడు చేయకుండా మెట్లమీదుగా ఎక్కి పైకి చేరుకున్నాడు. పైన లైట్లు వెలుగుతున్నాయి.

పొడుగాటి కారిడార్ ఉన్నది. ఆ కారిడార్‌కు ఆచివర ఒక మనిషి కనిపించాడు. బహుశా కాపలావాడు కావచ్చు.

కిశోర్ ఆ వ్యక్తి అటునుంచి ఇటు వైపు వచ్చేవరకు కాచుకుని ఉన్నాడు.

ఆవ్యక్తి ఈ చివరకి వచ్చాడు. తిరిగి అటువైపు వెళ్లేందుకు వెనక్కు తిరిగాడు.

కిశోర్ క్షణంలో అతడి మీదికి దూకాడు. అరవకుండా ఒక చేత్తో నోరుమూసి రెండో చేతిని చాకులా బిగించి బలంగా మెడ మీద కొట్టాడు. ఆవ్యక్తి అరవకుండా క్రిందికి ఒరిగిపోయాడు.

అతన్ని ఒక ప్రక్కకు లాగి, జేబులోనుంచి రివాల్వర్ బయటికి తీసి సిద్ధంగా పట్టుకుని ముందుకు నడిచాడు.

అతడు పదడుగులు నడిచేసరికి ఒక గదిలోనుంచి ఏవో మాటలు వినబడినవి. కిశోర్ త్వరత్వరగా ఆగదిని చేరుకుని మాటలు వినసాగాడు.

"జహ్వారీ ఎక్కడ దాచావో మర్యాదగా చెప్పు. లేకపోతే నీ ప్రాణాలు తీస్తాను" ఎవరిదో గొంతు కఠినంగా వినిపించింది.

"నాకు తెలియదు. నాకు తెలియదు"

"లేదు. నీకు తెలుసు. అది నా చేతికి చిక్కలేదు. ఎక్కడ ఉంచావో నీకు తెలుసు. ఆ విషయం చెప్పావా బ్రతుకుతావు. లేదా కుక్క చావు ఛస్తావు. జాగ్రత్త."

"లేదు....లేదు....నిజంగా నాకు తెలియదు. ఒకవేళ తెలిసినా నీలాటి గజదొంగకు చెప్పను."

"చెప్పవా? ఎలా చెప్పవో నేనూ చూస్తాను" క్షణంలో సగం సేపట్లో ఏదో ఛెళ్‌మన్న శబ్దము, ఆ వెంటనే "అబ్బా!" అన్న మూలుగు విన్పించాయి.

కిశోర్ ఇంక ఆగదలుచుకోలేదు. కాలుతో బలంగా తలుపులపై తన్నాడు. అవి బార్లా తెరుచుకున్నాయి. పిస్టల్‌తో లోపలికి ఎగిరి దూకి "హేండ్సప్" అంటూ అరిచాడు.

కొరడా పట్టుకున్న వ్యక్తి తటాలున వెనక్కు తిరిగాడు. అతడు కిషన్ రాజా! కిశోర్‌ను చూడగానే మెరుపులా పారిపోబోయాడు.

కిశోర్ కుడికాలుబలంగా డొక్కలో తగిలింది. "అబ్బా!" అంటూ క్రిందకి కూలబడ్డాడు.

అటూ ఇటూ ఉన్న ముగ్గురు వ్యక్తులలో ఒకడు కిశోర్ పైకి దూకాడు. కిశోర్ విసురుగా చేతిని గాలిలోకి విసిరాడు. "అబ్బా!" అంటూ ఆ మనిషి క్రింద కూలబడ్డాడు. మిగిలిన ఇద్దరూ అలాగే నిలబడి పోయారు.

"మిష్టర్ నాగరాజా! కిషన్ రాజాను మోసంచేసి ఆ వేషంలో బ్యూటీ ఎస్టేట్సులో ప్రవేశించి ఆ జహ్వారీ కాజేయాలనుకున్న నీ ప్లాను తునాతునకలయింది. కిషన్ రాజాతో చిన్నప్పటినుండీ పరిచయం ఉన్న బ్రెయిన్ స్పెషలిస్టు నారాయణరావు నిన్ను బజారులో పోతూ ఉంటే పిలిచాడు గుర్తుందా. కాని నీకు ఆయనెవరో తెలియదు. వినిపించనట్లు ఇంటికి వచ్చేశావు. తరువాత ఆయన ఎస్టేట్సుకు వచ్చినా ఆయనతో నిజంగా పరిచయం లేకపోవడంతో ఎలా మసలుకోవాలో తెలియక ఆరోగ్యం బాగాలేదని వంకపెట్టి ఆయన్ని

పంపేశావు. ఆయన కప్పుడే నీమీద అనుమానం కలిగింది. కానీ ఎటూ తేల్చుకోలేక మౌనంగా ఉండిపోయాడు.

“నిన్న నా అసిస్టెంటు రాజును, కిషన్ రాజా పరిచయస్తుల దగ్గరికి పంపినప్పుడు నీ గురించి తనకున్న అనుమానం బయట పెట్టేడు నారాయణరావు. తరువాత రాజు నిన్ననుసరించి నీ 'వెల్‌డన్' హోటల్‌కు ప్రవేశించాడు. అక్కడ నిన్ను చూశాడు. 'వెల్‌డన్' హోటలు ప్రొప్రైటర్ నాగరాజూ, బ్యూటీ ఎస్టేట్సులో ప్రస్తుతం ఉన్న కిషన్‌రాజా ఇద్దరూ ఒకరేనని తెలుసుకున్నాడు.

“కాని మాకు నిజమైన కిషన్‌రాజా ఎక్కడున్నాడో తెలియలేదు. కనుకనే ఇప్పటివరకూ నిన్ను వదిలిపెట్టాల్సి వచ్చింది. పాపం! బ్రెయిన్ స్పెషలిస్టు నారాయణరావే కిషన్‌రాజా ఫారిన్‌వెళ్ళి బ్రెయిన్ స్పెషలైజు చేయడానికి కారకుడు. ఆ విషయం నీకు తెలియదు. అదే నిన్ను పట్టించింది. ఎంతవేషం మార్చుకున్నా నేరానికి సంకెళ్లు తప్పవే!” అంటూ కిశోర్ అసలు బ్యూటీ ఎస్టేట్సు కుమార్‌రాజాగారి కుమారుడు కిషన్ రాజాకు కట్టిన కట్లు విప్పదీశాడు.

ఇంతలో క్రిందనుంచి పోలీస్ విజిల్స్ వినిపించాయి మరో నిమిషంలో పోలీసులు ఆ గదిలోకి జొరబడి నేరస్థులకు సంకెళ్ళు తగిలించారు.

★

కొడుకు:- నాన్నా! ఇప్పుడే లేడీ డాక్టర్ పరీక్ష చేసి నిన్ను త్రాగొద్దని చెపితే, మళ్ళీ త్రాగుతున్నావా?

తండ్రి:- అది అంతేలేరా! ఆడవాళ్ళ మాటలకు అర్థాలే వేరని, వెనుకటనే ఓ మహానుభావుడు చెప్పాడు!

—డి. సి. హెచ్. వెంకటేశ్వర్లు, ఖమ్మం.



(బహుమతి రు. 50/-లు నగదు)

1

కలకత్తాలో ఉన్న రాజేష్, ఢిల్లీలోని కపూర్‌కు ఏజెంట్. ఢిల్లీ నుండి కపూర్, రాజేష్‌కు పంపే డబ్బును, కపూర్ ఆదేశాల ప్రకారం రాజేష్ ఇన్వెస్టు చేయాలనే ఒప్పందం వారి మధ్య ఉంది.

ఒకసారి కపూర్, రాజేష్‌కు లక్ష రూపాయలు పంపుతూ, ఆ డబ్బుతో బెంగాల్ బాంక్ షేర్లు కొనమని కోరాడు. కాని ఆ సమయంలో ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ షేర్లు లాభదాయకంగా కనిపించటం వల్ల రాజేష్, కపూర్ ఆదేశాన్ని ధిక్కరించి ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు షేర్లు కొన్నాడు. అలా కొనటంలో కపూర్‌కు లాభం కలగజేయాలనే తప్ప రాజేష్‌కు మరే దురుద్దేశమూ లేదు.

కాని విధి ఎదురు తిరిగింది.

బాంక్ ఆఫ్ బెంగాల్, ఇండియన్ ఓవర్‌సీస్ బాంక్

కన్నా ఎక్కువ డివిడెండ్ ఇచ్చింది. అందువల్ల కపూర్‌కు కొంత నష్టం కలిగింది.

కోపంతో కపూర్, రాజేష్‌పై క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్ట్ నేరాన్ని మోపాడు.

కలకత్తా స్టాక్ ఎక్స్ఛేంజి ప్రకారం ఆ సమయంలో లాభ సాటిగా ఉన్న మరో షేర్లలో తా నా డబ్బు పెట్టించానసీ, ఇందువల్ల కపూర్ లాభం పొందుతాడనే సదుద్దేశ్యంతోనే తనలా చేశాననీ, రాజేష్ వాదించాడు.

మీరెలా తీర్పు చెప్తారు?

2

సంధ్యారాణి, సుధారాణి రూమ్ మేట్స్. వారిద్దరి ఇంటి పేరు ఒకటే. ఒక రోజు సంధ్యారాణికి ఒక కవరు వచ్చింది. దానిలో ఏ. ఎస్. రాణి పేరిట రు. 100/-లకు చెక్ ఉంది. ఆ కవరు రావటం సంధ్యకు తెలియదు.

సుధారాణికి ఆ సమయంలో డబ్బు ఇచ్చిందిగా ఉంది. అందువలన ఆ చెక్కు మీద ఏ. ఎస్. రాణి అని తన సంతకం చేసి బ్యాంక్‌లో వేసుకుంది.

ఈ విషయం ఎలాగో తెలిసి పోలీసులు సుధారాణిని ఫోర్జరీ నేరం క్రింద అరెస్టు చేశారు.

"అది నా చెక్కే అనుకున్నాను. నా పేరు నేను సంతకం పెట్టాను. అది ఫోర్జరీ ఎలా అవుతుంది!" అంది సుధారాణి.

మీరేమంటారు?

3

మంజుల బీద పిల్ల. ఒక రోజామె జాహ్నవి తోటలో ప్రవేశించి, ఆమె అనుమతి లేకుండా ఒక అంటాకు కోసి

తీసుకు పోతూంది. ఇది చూసి తోటమాలి ఆమెను పట్టుకొని పోలీసులకు అప్పజెప్పాడు.

"ఇంత చిన్న విషయానికి కేసెందుకండీ?" అని పోలీసు లన్నా జాహ్నవి వినలేదు.

చివరకు మంజులపై దొంగతనం నేరంపై కేసు పెట్టారు.

అతి బీదపిల్ల అయిన మంజుల డిఫెన్సు ఆఫర్ చెయ్య లేక గ్రుడ్ల నీరు కుక్కుకుని డాక్‌లో నిలుచుని మీ తీర్పుకు వేచి చూస్తూంది.

ఆమె నేం చేస్తారు?

* * *

[పై మూడు కేసులకు మీరేమని తీర్పు ఇస్తారో, వివ రంగా ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, యీ నెల 20వ తేదీ లోగా మాకు చేరేటట్లు పంపండి. సరియైన తీర్పు చెప్పిన హోం. డె. పాఠకుల పేర్లు ఫిబ్రవరి '75 నెల సంచికలో ప్రకటిస్తూ, అత్యుత్తమ తీర్పు నిచ్చిన పాఠక న్యాయ నిర్ణేతకు రు. 50/-లు నగదు బహుమతి పంప గలము. తుదినిర్ణయం సంపాదకులదే. —ఎడిటర్.]

అక్టోబరు '74 నెల వివా తీర్పు?

(1) వెంకటేశ్‌ను కోర్టు శిక్షిస్తుంది!

వెంకటేశ్ కత్తి తీసుకొని నారాయణ మీదకు వెళ్ళినందు వల్ల, నారాయణ వెనక్కు వెళ్ళి కత్తిపీట మీద పడి మర ణించాడు. నారాయణ చావుకు కారణం వెంకటేశ్. అందు వలన కోర్టు వెంకటేశ్‌ను శిక్షిస్తుంది.

(2) మణికి శిక్ష తప్పదు!

అత్తగారు బాధలు పెట్టినప్పటికీ ఆత్మహత్య చేసుకో బూనటం నేరం. కావున మణికి శిక్ష తప్పదు.

(3) సుందరం నేరస్తుడు!

సుందరం తనకు రావలసిన జీతం లా ప్రకారం రాబట్టు కోవలెనే గాని, యజమాని లేని సమయంలో డ్రాయరులోని డబ్బు తీసుకోవడం నేరం. అది దొంగతనమే అవుతుంది.

పై విధంగా అత్యుత్తమ తీర్పు నిచ్చిన పాఠక న్యాయ నిర్ణేత-శ్రీ కొండపల్లి వెంకటేశ్వరరావు, బి. ఏ. హోం. డె. నెం: 31. పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, 3-5-107 నారాయణ గూడ, హైద్రాబాదు, గారికి బహుమతి పైకం రు. 50/-లు యీ నెలాఖరులోగా అందజేయబడుతుంది.

సరియైన తీర్పు చెప్పిన ఇతర పాఠక న్యాయ నిర్ణేతలు:

1. పి. లక్ష్మి, టోనాయ్‌కెల్లా 2. వై. బ్రహ్మయ్యగుప్త, మదనపురం. 3. టి. పద్మశేఖరరావు, సూర్యాపేట. 4. ఎన్. సుధాకరరెడ్డి, హైద్రాబాదు. 5. ఎన్. వాసుదేవాచార్, ఆలూరు. 6. షేక్ మహబూబ్ పీరా, కర్నూలు. 7. కడలి వీరవెంకట సత్యనారాయణ, పుల్లేటికుర్రు 8. బి. రామగోపాల్, తణుకు. 9. జి. నాగరాజు, రవివలస. 10. హెచ్. వి. ఎస్. సుబ్రహ్మణ్యం, మౌలాలి.

11. చెరుకుమిల్లి భాస్కరరావు, చిక్కడపల్లి. 12. పీస పాటి నవనీతం, కటక్. 13. కె. మోహన్‌రావు, జటావహర్. 14. కొమ్మూరి జె. స్టాలిన్, కడప. 15. కోనే నాగ వెంకట ఆంజనేయులు, ఏలూరు. 16. గాదె నర్సిములు, ఆదిలాబాదు. 17. యం. శంకరరెడ్డి, బెల్లంపల్లి. 18. టి. రామమూర్తి, చిత్తూరు. 19. మద్రి సూర్యనారాయణ, పుల్లేటి కుర్రు, 20. సి.ఎస్.ఆర్. మూర్తి, కాకినాడ.

21. ఎమ్. వి. సుబ్బలక్ష్మి, హైద్రాబాదు. 22. కె. వి. ప్రసన్నం, సునాబేడా 23. ఎన్. రాజు, రుద్రంపూర్. 24. వై. తులసీ రామప్రసాద్, రాజమండ్రి. 25. వి. రాజా, కడప. 26. జే. కృష్ణారావు, అశ్వారావుపేట. 27. షేక్ గౌస్ బాషా, కావలి. 28. బి. సారాశ్రీ, రుద్రంపూర్. 29. ఎమ్. ఏ. గోపాల్, కూచనపల్లి. 30. రోజారాణి, జగిత్యాల.

31. అలిశెట్టి ప్రభాకర్, జగిత్యాల. 32. జి. శివలక్ష్మి, గుంటూరు. 33. కేశిరాజు క్రిష్ణ, దొడ్డిపట్ల. 34. శ్యామలా జ్యోతి, కందకుర్తి. 35. ఎమ్. వీరరాఘవయ్య, తిమ్మాపురం. 36. ఏ. సన్యాసి నాయుడు, కశింకోట. 37. పోకా తిరుపాలు, పూనా. 38. కె. పురుషోత్తం పాత్రో, విశాఖపట్టణం. 39. ఏ. సత్యనారాయణ, సోమాజిగూడ. 40. ముద్దార మేష్, కాకినాడ.

41. కొల్లా అరుణ, విశాఖపట్టణం. 42. కురుమద్దాలి విజయలక్ష్మి, విజయవాడ. 43. వహీద్ ఖన్నా, హైద్రాబాదు. 44. కూచిపూడి కోటేశ్వరరావు, ఓలేటివారిపాలెం. 45. ఎమ్. జి. మూర్తి, విశాఖపట్టణం. 46. పి. గోపాలరావు, నెల్లూరు. 47. పి. శ్రీనివాసరావు, శ్రీశైలం ప్రాజెక్ట్. 48. మామిడి రామసూర్యనారాయణ, వసంతవాడ. 49. భీమవరపు విజయ కుమార్, నెల్లూరు. 50. కోనే హరిబాబు, చంద్రాయణగుట్ట.

51. హవంతీ రఘువిమల్ ప్రసాద్, జోర్గాం. 52. డాక్టర్ ఎమ్. ధర్మదానం, హైద్రాబాదు. 53. కొండవీటి సుధాకర్‌రెడ్డి, సుల్తాన్ బజార్. 54. జి. కె. శైలా, రాజమండ్రి. 55. సి. హెచ్. ప్రకాశరావు, కరీంనగర్. 56. ఎమ్. హనుమంతరెడ్డి, జాట్లపల్లి. 56. సి. సురేంద్రబాబు, గద్వాల. 58. ఏ. షఫీవుల్లా, కడప. 59. బి సూర్యనారాయణ, వైజాగ్. 60. పి. రత్నకుమారి, అకివీడు — తదితరులు.

★

రక్తం పీల్చే రాక్షసి
'సంపత్'

డాక్టరు రామచంద్రరావుగారు లేచి నిలబడి గొంతు సవ
రించుకున్నారు. కరతాళధ్వనులు మారుమ్రోగాయి. చిన్నగా
నవ్వి, చెప్పడం మొదలెట్టారు.

"డియర్ ఫ్రెండ్స్! ఈ రోజు నాకెంతో సంతోషంగా వుంది. నేను మరల జన్మఎత్తాను. సుమారు రెండు నెలల క్రితం జపాన్‌కు బయలుదేరిన విమానం అస్సాం అడవుల సమీపంలో కూలిపోయిందని మీకు గుర్తు ఉండేవుంటుంది. ఆ విమానంలో నేనూ ప్రయాణికుణ్ని. అయితే భగవంతుడి దయవల్ల నేను మాత్రం కొద్దిగాయాలతో బ్రతికి బయట పడ్డాను. ఆ గాయాలు మానాక తిరిగి మిమ్మల్నిరోజే కలుసు కున్నాను. అందుకు నాకెంతో సంతోషంగా వుంది.

ఈ సందర్భంలోనే నేనొక విషయాన్ని బయట పెడు తున్నాను. విమానప్రమాదం జరిగిన తరువాత మమ్మల్ని దగ్గర్లో ఉన్న హిస్పిటల్‌లో చేర్చారు. మా ప్రాణాలకేం భయంలేదనుకున్నాక మమ్మల్ని మంచి వైద్య సదుపాయా లున్న హాస్పిటల్‌కు తీసుకువచ్చారు విమానంలో. విమానా శ్రయానికి మమ్మల్నొక అంబులెన్స్‌లో తీసుకువచ్చాడు. ఆ అంబులెన్స్‌లో నేనెన్నడు చూడని, బహుశ ఇంతవరకు ఎవరూ వినిగాని, చూసి గాని ఉండని మొక్క ఒకటివచ్చింది. నేను దానిని పట్టి ఒక చిన్నపెట్టెలో బంధించాను. ఇదుగో అది" అంటూ ఒక గాజు పెట్టెను చిన్న పెట్టెలోనుండి బయటకు తీశారు.

ఆ గాజు పెట్టె సుమారు పది అంగుళాల పొడవు. ఆ రంగుళాల వెడల్పు వుంటుంది. ఆ పెట్టెలోపల ఒక చిన్న మొక్క వుంది. అది సుమారు ఎనిమిదంగుళాల పొడవు వుంటుంది. కాండం ఒకటే వుంది. సన్నగా, పొడవుగా

వుంది. అడుగుభాగాన వ్రేళ్లులేవు. నాలుగయిదు కొంకీలు వున్నాయి. పై భాగాన గొడుగు ఆకారంలో చిన్న చిన్న తొడిమలు వేలాడుతున్నాయి. వాటి మధ్యలో, పై భాగాన సన్నగా, సూదిమొనగా రెండు కొంకీలు వుండి అటూ ఇటూ తిరుగుతున్నాయి.

ప్రేక్షకులందరూ ఆశ్చర్యంతో దానిని చూశారు.

"దీనిని గురించి వివరాలు యింకా తెలియలేదు. స్టడీ చేసిన పిదప వివరాలు తెలియజేస్తాను. అంతేకాదు! ఈ మొక్కను గురించి అందరినీ సంప్రదించాను. ఎవ్వరూ ఇంతవరకు దీనిని చూడలేదట. అందుచేత ప్రథమంగా దీనిని నేనే స్టడీ చేయబోతున్నాను."

ఆయన కళ్లల్లో కించిత్ గర్వం తొంగి చూపింది. అంతా చప్పట్లు కొట్టారు. తరువాత టీ-పార్టీ జరిగింది.

అభినందన సభ ముగిసింది. అందరికీ వీడ్కోలు యిచ్చారు రామచంద్రరావుగారు. అంతా వెళ్ళిపోయాక నేను ఆయన దగ్గరకు వెళ్ళాను.

"వెల్ డన్ మైబోయ్! ఏర్పాట్లన్నీ సరిగా చూసినందుకు థాంక్స్!"

"నో మెన్షన్ సర్! అసిస్టెంటునైన నాకు అదేమి భారంగాదు." ఆయన చిరునవ్వు నవ్వి నా భుజం తట్టారు.

"ఆ మొక్క గురించి నాకింతవరకు చెప్పనేలేదు?" అన్నాను నేను.

"డోంట్ థింక్ అదర్ వైజ్! ఎందుకో అందరిముందు వెల్లడి చేద్దామని...."

"నెవర్ మైండ్ సర్! నేనింక వెళ్ళిరానా?"

"యస్! రేపు ఉదయం ఎనిమిది గంటలకల్లా వచ్చేయి."

నేను నా స్కూటర్ ఎక్కాను.

2

డాక్టరు రామచంద్రరావుగారు గొప్ప శాస్త్రవేత్తలు. అమెరికాలో డాక్టరేట్ పుచ్చుకున్నారాయన. ఆయన నిరంతరం మొక్కలమీద పరిశోధనలు చేస్తూనే వుంటారు. ఆయన దగ్గర అసిస్టెంటుగాచేరే అదృష్టం నన్ను వరించింది. నన్నాయన కన్నబిడ్డలాగా చూసుకుంటారు.

వారి బంగళా, సిటీకి దూరంగా, ప్రశాంత వాతావరణంలో వుంది. హైవే ప్రక్క, బంగళాకు ఎడమవైపున సుమారు రెండెకరాల స్థలంలో ఒక తోట వుంది ఆయనకు. ఆ తోట మధ్యలో లేబరేటరీ వుంది. వారా తోటలో రకరకాల మొక్కలను పెంచుతూ, పరిశోధనలు సాగిస్తుంటారు.

మరునాడు ఉదయం ఎనిమిదిగంటలకల్లా, సిటీకి 2 మైళ్ళ దూరంలో వున్న రామచంద్రరావుగారి బంగళాకు చేరాను.

తోటలోకి నడిచి, లేబరేటరీలోకి ప్రవేశించాను. ఆయన అప్పటికే ఏదో మైక్రోస్కోప్‌లో చూస్తున్నారు. నేను విష్ చేశాను.

"గుడ్‌మార్నింగ్ అశోక్! తోటలోకి పద" అన్నారాయన.

మేమిద్దరం తోటలోకి నడిచాము. తోటలో ఒక మూల కొద్దిగా ఖాళీవుంది. తోటలోకి వెళ్ళాలంటే బంగళాలోనుండే దారి. విడిగా లేదు. చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడవుంది.

రామచంద్రరావుగారు మూలగా నున్న ఖాళీ స్థలంలోకి నడిచారు.

తనవెంట తెచ్చిన గాజుపెట్టెలోనుండి, నిన్నటి రోజున

చూపించిన మొక్కను బయటకు తీసి, నేలపై ఉంచారు నిలువుగా.

ఆ మొక్క వెంటనే ప్రక్కకు వంగింది. నెమ్మదిగా క్రిందకువంగి, పైనున్న తొడిమను క్రిందకు జార్చి, నేలపై ఆనుకుంది. రెండోవైపు నెమ్మదిగా పైకి లేచింది. అది మరల రెండో ప్రక్కకు వాలింది. ఈ విధంగా పల్టీలు కొట్టి నట్లు మా కళ్ళఎదుటే నాలుగయిదు గజాలదూరం నడిచి, గోడప్రక్కగల నీడలో ఆగిపోయింది.

నిర్ఘాంతపోయాను నేను. మనుషులు పల్టీలు కొట్టడం చూశాను. హైడ్రా అనే ఒక్క మొక్కకూడా ఇలానే చలి స్తుంది. కాని ఇంత వేగంగా కాదు. పది నిమిషాలలో ఇది అయిదు గజాల దూరం చలించింది.

''రియల్లీ వండ్రఫుల్!'' అప్రయత్నంగానే అన్నాను.

రామచంద్రరావుగారు నవ్వి, లేబ్‌లోనుండి రెండు సన్నటి గొలుసులు తెచ్చి, ఆ మొక్కను బంధించి, గోడకు బిగించి, మేకులు కొట్టారు. ఆయన చేస్తున్న పని నాకాశ్చర్యం కలి గించింది.

రామచంద్రరావుగారు లాబ్‌లోకి నడిచారు. క్రితం రోజు ఆపిన ప్రయోగాన్ని కొనసాగించాము పావుగంట గడిచింది. ఖటేల్‌మన్న శబ్దం విని, మేమిద్దరం బయటకు పరుగెత్తాము. రామచంద్రరావుగారు ఆ మొక్క దగ్గరకు పరుగెత్తారు. నేనూ అనుసరించాను.

అక్కడి దృశ్యంచూసి అదిరిపడ్డాను. ఆ మొక్క ఇప్పుడు స్వేచ్ఛగా నిలబడివుంది. తనకు ఉన్న బంధాలను ఎలా వది లించుకుందో అర్థంకాలేదు మాకు.

''నా ఊహ తప్పయింది అశోక్! దీనిని గురించి

జాగ్రత్తపడాలి మనం" గంభీరంగా అన్నారాయన. నాకు మాటలు కరువయ్యాయి.

"అయితే దీనిని గాజుపెట్టెలోనే ఉంచుదాం సర్!" అన్నాను చివరికి.

"ఆ పనే మంచిదిలా తోస్తుంది నాకు."

"కాని....దీనిని గురించిన వివరాలు ఎలా తెలుస్తాయి మనకు? ఇది భూమిలో పాదుకోలేదు. అన్ని మొక్కల వంటిదికాదిది. దీని ఆహారం ఏమిటి? భూమినుండికాక ఆహారాన్ని ఎలా గ్రహిస్తుంది. దీనికి చలనంకూడా ఉంది. వెలుతురంటే పడదు కాబోలు, నీడలో నుంచుంది. మనం దీనిని బంధించితే ఈ ప్రశ్నలకు జవాబులెలా తెలుస్తాయి సర్?"

ఉద్రేకంగా అన్నాను నేను.

"యు ఆర్ కరెక్ట్ అశోక్! దీనిని స్వేచ్ఛగానే ఉంచుదాం. అయితే ఒకకంట కనిపెట్టి ఉండాలి మనం. లేకపోతే తప్పించుకు పోయే ప్రమాదం ఉంది."

నేను తల ఊపాను. "దీనికి ఒక పేరు పెడితే....?" అన్నాను.

"తొందరపడకు. నామకరణ మహోత్సవం త్వరలోనే ఉంది" నవ్వుతూ అన్నారు. రకరకాల పేర్లని ఊహించుకుంటూ ఆయనవెంట నడిచాను.

3

మరునాడు ఉదయం బంగాళాకు చేరేసరికి, వాకిట్లో జీప్ చూసి అదిరిపడ్డాను. పోలీస్ జీప్ అది. గబగబ లోనికి నడిచాను. లోపల రామచంద్రరావుగారు, ఇన్‌స్పెక్టర్ కూర్చొని ఉన్నారు.

"వాట్ సర్? వాట్ హేపెన్డ్?" కంగారుగా అడిగాను కూర్చుంటూ.

ఇన్‌స్పెక్టర్ నావంక తిరిగి చూశాడు. "ఇతనిపేరు అశోక్! నా అసిస్టెంటు" రామచంద్రరావుగారు అన్నారు. ఇన్‌స్పెక్టర్ చిన్నగా నవ్వాడు. షేక్‌హాండిస్తూ.

"ఏమి జరిగింది?" అన్నాను నేను.

"రాత్రి మీ బంగళా ప్రాంతంలో హత్య జరిగింది. హతుణ్ని బాగా కొట్టారు కాబోలు ఒంటినిండా గాయాలు. సన్నని వైరుతో కొట్టినట్లు ఒళ్ళంతా చీరుకుపోయి ఉంది. రక్తం పోవడంవలన వెంటనే మరణించాడు. హంతకుడు లేక హంతకుల జాడ దొరకలేదు. హతుడు కేకలు మీకు విన్పించినాయేమోనని వచ్చాను."

"హంతకులు, అతణ్ని ఇక్కడే చంపారని ఋజువేమిటి? ఎక్కడో చంపి, ఇక్కడ పారవేసి ఉండవచ్చుగా?" తీవ్రంగా అన్నాను.

"ఋజువు ఉంది. ఆ హతుడు సుబ్బారావుగారు రాత్రి పదిగంటల ప్రాంతంలో రామచంద్రరావుగారి దగ్గరకు బయలుదేరారట కారులో."

నేను నిర్ఘాంతపోయాను. "సుబ్బారావుగార్ని హత్య చేశారా?" ఆశ్చర్యంగా అడిగాను నమ్మలేనట్లు.

"ఆయన మీ దగ్గరకే బయలుదేరాడని నౌకరు చెబుతున్నాడు. మీరేమో అతను రాలేదంటున్నారు. అంటే వచ్చే టప్పుడే మధ్య దారిలో చంపి ఉండాలి. సుబ్బారావుగారు మీ దగ్గర కెందుకు బయలుదేరాడో తెలుసా?"

"సారీ ఇన్‌స్పెక్టర్! ఆ విషయాలేవీ నాకు తెలియవు. రాత్రంతా లేబ్‌లోనే ఉండిపోయాను" విసుగ్గా అన్నారు

రామచంద్రరావుగారు.

ఇన్‌స్పెక్టర్ లేచాడు. "హంతకులెవరయింది త్వరలోనే కనుక్కుంటాను" వెళ్ళిపోయాడు. ఆయనను సాగనంపి వచ్చేసరికి రామచంద్రరావుగారు తోటలోకి వెళ్ళిపోయారు. నేనూ వెంటనే వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఆయన ఆ మొక్క దగ్గరే నిలబడి దానివంకే చూడసాగారు. నేనా మొక్కని చూసి అదిరిపడ్డాను. నిన్న తెల్లగా ఉన్న మొక్క, ఈ రోజు ఎర్రగా ఉంది.

"సర్? ఏమిటలా అయిపోయిందీ మొక్క?"

"అదే అర్థం కావడంలేదు. ఆహారం లేక ఎండి పోతోందా?" గొణుక్కుంటూ లాబ్‌లోకి నడిచారు. నేనూ అనుసరించాను.

4

ఎండాకాలం. లోపల ఉక్కగా ఉంది. మంచాన్ని బైట వేసుకుని పడుకున్నాను.

అమావాశ్య కాబోలు చీకటిగా ఉంది. ఇంకా పెళ్ళికాక పోవడం వలన ఒంటరితనంలోని బాధ నన్ను మరింత బాధపెడుతూంది. మంచంమీద వెల్లకిలా పడుకొని, ఆకాశం లోని చుక్కల్ని చూస్తూ, ఆ మొక్క గురించే ఆలోచించ సాగాను. ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది ఆ మొక్క గురించి.

ఆకాశాన్నే చూస్తున్న నాకు బుర్రలో ఏదో మెరిసింది. ఉలిక్కిపడ్డాను. కంగారుగా బట్టలు వేసుకుని, రామచంద్ర రావుగారి దగ్గరకు బయలుదేరాను స్కూటర్‌మీద. బయట గూర్ఖా సల్యూట్ చేశాడు నన్ను చూసి.

నేను లోనికి పరుగెత్తాను. తోటలోకి నడిచాను. లాన్‌లో రామచంద్రరావుగారు గిలగిలా కొట్టుకుంటున్నారు నేలమీద. నా గుండె ఆగిపోయినట్లయింది.

"సార్!" పెద్దగా అరిచాను.

రామచంద్రరావుగారు నావంక చూసి, ఏదో చెప్పాలనుకున్నారు. కాని పెదాలు విడివడలేదు. నా అరుపు విని వచ్చాడు కాటోలు గూర్ఖా "సాబ్!" అన్నాడు కంగారుగా.

"నువ్వు చూస్తుండు. నేను డాక్టరుకి ఫోన్‌చేసి వస్తాను" గబగబ లోనికి పరుగెత్తాను.

కాని నా ప్రయత్నం వృధా అయిపోయింది. రామచంద్ర రావుగారు మరణించారు. పోలీసులకు ఫోనుచేశాను. నేననుకున్నంత అయినందుకు వ్యథచెందాను.

ఇన్‌స్పెక్టర్ హడావుడిగా వచ్చాడు. జరగవలసిన తతంగమంతా జరుగుతూంది.

"హంతకులెవరో నాకు తెలుసు!" కళ్ళు తుడుచుకుంటూ అన్నాను.

"ఎవరూ?" అదిరిపడి అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మొన్న సుబ్బారావుగారిని, ఈ రోజు రామచంద్రరావుగారిని హత్యచేసింది ఒకరే!" అన్నాను.

"వాట్?"

"అవును. చూపిస్తాను రండి" తోటలోకి దారితీశాను.

"మిస్టర్ అశోక్! మీరు మతి ఉండే మాట్లాడుతున్నారా? ఆ రోజు హంతకు లెవరో తెలియదన్నారు? ఈ రోజు చూపుతామంటున్నారు? అంటే హంతకులిక్కడే ఉన్నారా?"

చిన్నగా నవ్వుకున్నాను నేను. ఏమి మాట్లాడలేదు. ఖాళీ స్థలంలోకి నడిచి ఆ మొక్కకోసం చూశాను. నా గుండాగి

పోయినంత పనయింది. అక్కడ ఆ మొక్కలేదు. నా వెనకే వచ్చిన ఇన్‌స్పెక్టర్ అటూ ఇటూ చూస్తున్నాడు.

"సారీ ఇన్‌స్పెక్టర్! తప్పించుపోయింది."

"తప్పించుకు పోయిందా? అంటే హంతకురాలా?" నిర్ఘాంతపోతూ అడిగాడు.

"కాదు ఇన్‌స్పెక్టర్! మొక్క గురించి మీరు వినే వుంటారు. రామచంద్రరావు అస్సాం నుండి తెచ్చారు దానిని. అదే...! అదే సుబ్బారావుగారిని, రామచంద్రరావుగారిని హత్యచేసింది" ఉద్రేకంగా అరిచాను.

ఇన్‌స్పెక్టర్ భ్రమాస్పదిపోయి నా వంకే చూస్తుండి పోయాడు.

"నిజం ఇన్‌స్పెక్టర్! నేను చెప్పేది నిజం. ఆ రాక్షసి... ఆ మొక్కే..... ఈ పనులన్నీ చేసిందదే! అదొక రక్త పిసాసి. దాని ఆహారం రక్తం" చెప్పసాగాను ఉద్రేకంగా.

"ఆ రోజు సుబ్బారావుగార్ని తొడిమలతో బంధించి ఉంటుంది. ఉదయం చూస్తే ఎర్రగా ఉంది. మాకు దానిని గురించి ఏమీ తెలియదు. అది మామూలుగా నడుస్తుంది. వెలుతురంటే దానికి భయం. అంటే చీకటిఅంటే యిష్టం. మొన్న అమావాశ్య. అందుచేతనే అది విజృంభించి, సుబ్బారావుగారి రక్తాన్ని, ఈ రోజు రామచంద్రరావుగారి రక్తాన్ని పీల్చుతుంది. బహుశా ఈ చీకటి రోజుల్లో రక్తాన్ని పీల్చుకుని, తరువాతి రోజుల్లో ఆహారం లేకుండా వుంటుంది కాబోలు" ఆగాను.

"మీరు చెప్పేది నిజమేనా?" అనుమానంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"యస్ ఇన్‌స్పెక్టర్! ఇది పూర్తిగా నిజం. నెపెంథిస్,

యుట్రిమ్‌లేరియా, డ్రాసిరా అనే కొన్ని రకాల మొక్క లున్నాయి. అవి మాంసాహార మొక్కలు. చిన్న చిన్న కీట కాల్ని, పురుగుల్ని ఆహారంగా స్వీకరిస్తాయి. వాని నోట్లోకి వెళ్ళిన కీటకంగాని, పురుగుగాని తిరిగిరాదు. అటువంటిదే ఈ మొక్క. కాని యిది రక్తాన్ని పీల్చుకుంటుంది. ఈ విషయాలన్నీ ఊహించాను. జరిగిన సంఘటనలు బట్టి చూస్తే నిజమనిపిస్తోంది."

5

"సెర్చ్‌లైట్లతో ఆ బంగళాచుట్టు ప్రక్కలా వెదికాము. కాని ఆ మొక్క కన్పించలేదు" అన్నాడొక పోలీస్ కానిస్టేబుల్.

"ఈ పాటికి సిటీలోకి వెళ్ళిపోయి వుంటుంది" కంగా రుగా అన్నాను.

అపాటికే పోలీసులు రక్తం పీల్చే ఆ మొక్కని గురించి నగరంలో ప్రచారం చేయడం మొదలు పెట్టారు. మైకుల్లో చెబుతూ, పోలీసు వ్యానులు తిరుగుతున్నాయి.

"ఈ రాత్రి పూట మన మేమీ చేయలేమనుకుంటా" ఇన్‌స్పెక్టర్ అన్నాడు.

"నో! ఇన్‌స్పెక్టర్! మన ప్రయత్నం మనం చేయాలి. లేకపోతే ఎందరి ప్రాణాలు పోతాయో. ఈ విషయాన్ని ఐ. జి. తో చెప్పారా?" అన్నాను నేను.

"చెప్పాను. వెంటనే అదనపు బలగాన్ని పంపుతా మన్నారు."

ఇంతలో ఒక కానిస్టేబుల్ మా దగ్గరకు వచ్చాడు పరు గెత్తుకుంటూ.

"సార్! ఆ మొక్కను తొండియార్ పేటలో చూశారట

మనవాళ్ళు. వెంటనే కాల్చారట. కాని అది చావలేదట. రెండు భాగాలుగా విడిపోయిందట. ఆ రెండు కూడా రెండు మొక్కల్లాగా మారాయిట'' చెప్పాడు అతను.

మేము నిర్ఘాంతపోయాము. వెంటనే బయలుదేరి, జీపులో తొండియార్‌పేటకు చేరుకున్నాము. అప్పటికే కొంతమంది పోలీసులు అక్కడ వెదుకుతున్నారు.

"ఏం జరిగింది?'' అడిగాను నేను.

"మేము ఎనౌన్సుచేస్తూ యిటు వచ్చాము సార్? ఎవరిదో కేక విన్పించినది. వెంటనే పరుగెత్తుకుంటూ వచ్చాము. ఆ మొక్క ఎవరినో చుట్టేసి రక్తం పీలుస్తూంది. మాకు ఏం చేయాలో తోచలేదు. కాల్చితే మనిషికి గుళ్ళుతగులుతాయి. అందుకని ఏం చేయలేకపోయాము. ఆ మొక్క రక్తం పీల్చి వదిలివేసింది. వెంటనే కాల్పులు సాగించాము. ఆ మొక్కకు దెబ్బలు తగిలి రెండు ముక్కలుగా విడిపోయి పడిపోయింది. మేము భయం కొద్ది దాని దగ్గరకు వెళ్ళలేదు. ఇంతలో ఆ రెండు భాగాలు లేచి, మాయమయిపోయాయి.''

"అవి లేచి వెళ్తుంటే మీరుచూస్తూ ఎందుకు నుంచు న్నారు?'' కోపంగా అడిగాను నేను. పోలీసులు తలవంచు కున్నారు.

"మైగాడ్! నేననుకున్న దానికంటే ప్రమాదకరంగా ఉన్నదీ మొక్క.''

"యిప్పుడొక్కటే మొక్కకాదు సార్! రెండు!!'' అన్నారెవరో. నేను మరో విషయం ఆలోచిస్తున్నాను.

'ఆ మొక్క ఏడెనిమిది అంగుళాలకంటె ఎత్తుఉండదు. తొడిమలు కూడా చిన్నవే. అటువంటి మొక్క ఒక మనిషి శరీరాన్ని ఎలా చుట్టేయ గలిగింది.'

ఆ సంగతే అడిగాను పోలీసులను.

"ఏమోసార్! మొక్క మాత్రం చిన్నదేగాని, తొడిమలు నాలుగయిదు అడుగులు ఉన్నాయి."

త్రుళ్ళిపడ్డాను నేను. తొడిమలు 4 అడుగులున్నాయంటే అర్థం ఏమిటి? దానికి తన తొడిమలను పెంచగలిగే శక్తి ఉండి ఉండాలి.

"ఇటువంటి రక్త పిపాసిని డాక్టర్ ఎలా తెచ్చారు?" ఇన్‌స్పెక్టర్ అడిగాడు.

"ఆయన కిటువంటిదని తెలియదు గదా?"

"అదిగాదు నేనడిగేది. ఇది రక్తాన్ని పీల్చి బ్రతికేది కదా? డాక్టర్ రక్తాన్ని ఎందుకు పీల్చలేదు వెంటనే? ఆయన్నేమి చేయలేదే అప్పుడు?!"

ఉలిక్కిపడ్డాను. ఇన్‌స్పెక్టర్ చెప్పిందీ నిజమే! కళ్ళు మూసుకొని ఆలోచించాను ఆయన అభినందన సభలో చెప్పిన విషయాన్ని. అడవుల సమీపంలో దొరికిన ఆ మొక్కను. వెంటనే పెట్టిలోపెట్టి తెచ్చారు. నా బుర్రలో వెంటనే మెరిసింది. ఈ మొక్కను డాక్టర్ స్వయంగా తనంత తానే తీసుకురాలేదు. అంబులెన్స్‌లోకి వచ్చిన దన్నారు. అంటే రక్తాన్ని పీల్చటానికివచ్చి ఉంటుంది. వెంటనే దానిని బంధించారు. అదే చెప్పాను ఇన్‌స్పెక్టర్‌తో.

ఇంతలో వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది మాకు. అప్పటికే పదిమందివరకు చనిపోయారట ఆ మొక్కలవల్ల.

నేను నిర్ఘాంతపోయాను ఆ వార్త విని. ఆ మొక్కల్ని ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. కాలిస్తే ఒక్క క్క నాలుగయిదు మొక్కలవుతున్నాయి. ఇన్‌స్పెక్టర్ సంగతి సరేసరి! కంగారు పడిపోతున్నాడు.

"ఇన్‌స్పెక్టర్! ఆ మొక్క కన్పిస్తే కాల్చవద్దని ఆదేశాలు జారీ చెయ్యండి. ఈ విషయం వెంటనే సైంటిస్టు

లకు తెలిపి, వారి సలహా తీసుకోండి. నాకేం తోచటంలేదు'' అన్నాను నేను నిరాశగా.

''ఐ. జి. దగ్గరకు వెడదాం పదండి'' అన్నాడు ఇన్‌స్పెక్టర్. నేను నడిచాను.

6

తెల్లవారింది. సుమారు యాభై మంది ప్రాణాలు కోల్పోయారు అప్పటికే. జరిగినది నమ్మబుద్ధి కావడంలేదు. చిన్న మొక్క యింత పనిచేస్తుందని ఊహించలేకపోతున్నాను.

పోలీసులకు ఏం చేయాలో తోచలేదు. వీరి మెసేజ్ అందుకుని కొంత మంది సైంటిస్టులు దిగారు ప్లేన్‌లో. మద్రాసు నగరం అట్టుడికి పోయింది. పత్రికల నిండా ఈ వార్తలే. కొన్ని పత్రికలు మనిషిని చుట్టివేసి, రక్తం పీల్చుతుండగా తీసిన ఫోటోలు ప్రచురించాయి. ఆ ఫోటోలుచూసి వెర్రెత్తిపోయారు ప్రజలు. నా మెదడులో ఏ ఆలోచనాలేదు. శూన్యం అయిపోయింది.

ప్రజలు కదలడానికే భయపడుతున్నారు. పగలంతా సైంటిస్టుల దగ్గరే గడిపాను. వారికి వివరాలన్నీ చెప్పాను. ఏంచేయాలో వారికీ తోచలేదు. రాత్రి ఎనిమిది గంటలయింది.

''ఇక నేను వెళ్లొస్తాను'' ఇన్‌స్పెక్టర్‌తో అన్నాను కుర్చీలోనుంచి లేస్తూ.

''ఇప్పుడా? వద్దు'' కంగారుగా అన్నాడతను.

''నాకేమీ భయంలేదు. ఆ మొక్కలను ఎదుర్కోవటానికి సిద్ధపడే ఉన్నాను. నాకొక రివాల్వర్ ఇవ్వండి.''

ఇన్‌స్పెక్టర్ రివాల్వర్ ఇచ్చాడు. నాకు షూట్ చేయటం వచ్చు.

''కానిస్టేబుల్‌ను పంపనా తోడు?''

"వద్దు" బయటకు నడిచి స్కూటర్ ఎక్కాను. రివ్వున బయలుదేరాను. నా కళ్ళు రోడ్లను పరిశీలిస్తూనే ఉన్నాయి. కాని ఎక్కడా మొక్కలు కనిపించలేదు.

మా ఇంటికి చేరాను. చుట్టూ ప్రహరీ ఉంది. ఇంటిముందు రకరకాల మొక్కలున్నాయి. కీచురాళ్ళ రొద వినిపిస్తోంది. ఎక్కడా జనసంచారం లేదు. అన్ని ఇళ్ళలోనూ దేదీప్యమానంగా లైట్లు వెలుగుతున్నాయి.

స్కూటర్ దిగి నడిపించుకుంటూ లోనికి నడిచాను. తలుపు తాళం తెరచి, లైట్లు వేశాను. బయట ఏదో బరబరమన్న శబ్దం అయింది. ఉలిక్కిపడ్డాను.

ఒకవేళ ఆ మొక్కలు ఇక్కడికి రాలేదుగదా? వెనుదిరిగి చూశాను. నా ఊహ నిజమయింది. రెండు మొక్కలు పొదలచాటున ఉన్నాయి. వాటి పైభాగం కనిపిస్తూంది నాకు.

రెండు మొక్కల్ని ఎలా ఎదుర్కోవాలో తోచలేదు.

జేబులో రివాల్వర్ తడుముకుని, డ్రాయర్‌లోనుండి బ్యాటరీ లైటు తీసుకున్నాను చేతిలోకి. గదిలో లైటు ఆర్పి, చీకట్లోకి కళ్ళు చికిలించుకొని చూడసాగాను.

నా ఊహ నిజమయింది. అయిదు నిమిషాల తరవాత ఆ రెండు మొక్కలు నా గదిలోకి వచ్చాయి.

లోపలికి, మధ్యలోకి రాగానే బ్యాటరీ లైటు వేశాను. అవి రెండూ బయటకు పోటోయాయి.

చటుక్కున దూకి, తలుపులు మూసేశాను.

నా బుర్ర చురుగ్గా పనిచేయసాగింది. నా ప్రాణాలమీద ఆశ వదులుకున్నాను. ఆ రెండు మొక్కల్ని ఎలాగయినా నాశనం చేయాలి. అదే నా ధ్యేయం.

స్విచ్ నొక్కి, లైటువేశాను. గదినిండా కాంతి అలుముకుంది.

ఆ మొక్కలు క్షణక్షణానికి పెద్దవి కాసాగాయి. తొడిమలు మాత్రం పెరుగుతున్నాయి.

నేను వణికిపోయాను. ప్రక్కనే ఉన్న బల్ల ఎక్కాను.

అవి కదలకుండా ఆగి, పెరుగుతున్న తొడిమలను నా వైపు పంపసాగాయి.

ముచ్చెమటలు పోశాయి నాకు. పైకిచూశాను. సీలింగ్ ఫ్యాన్ కన్పించింది. అప్పటికే గదంతా తొడిమలతో నిండి పోయింది. ఇక తప్పదనుకొని, బలంకొద్దీ పైకి ఎగిరి, సీలింగ్ ఫ్యాన్‌ని పట్టుకున్నాను.

నా కాళ్ళు క్రిందకి వేలాడుతున్నాయి. గిర్రున తిరుగు తున్నాను నేను. ఏ మాత్రము పట్టుతప్పినా సరిగ్గా ఆ మొక్కలమీదే పడతాను.

ఆ మొక్కలు తమ తొడమలను పైకి లేపాయి. నా చేతులు నొప్పి పుడుతున్నాయి. ఒక చేతిలో బ్యాటరీ లైటు ఉంది. పైగా తిరుగుతున్నాను గిర్రున ఫ్యానుతోపాటు.

క్రిందకు చూశాను.

తొడిమలు మెల్లగా పైకి రాసాగాయి. బ్యాటరీలైటు వదిలాను. దానిని ప్రక్కకు తోసేసాయి అవి.

అప్పుడు చూశాను ఆ తొడిమల మధ్య భాగం. ఎర్రగా ఉంది.

ఎడమ చేత్తో రివాల్వర్ తీశాను జేబులోనుండి. కుడిచేత్తో గట్టిగా ఫ్యానును పట్టుకున్నాను. బ్యాలన్స్ కుదరటంలేదు. అయినా ప్రయత్నించసాగాను.

రివాల్వర్‌ను ఎడమచేత్తో కాల్చటం రాదు. రివాల్వర్‌ని కుడిచేతిలోకి మార్చుకుంటే, ఆ చేత్తో ఫ్యానుని ఎక్కువసేపు పట్టుకోలేను. అందుచేత ఎడమచేతితోనే కాల్చడానికి నిర్ణ యించుకున్నాను.

గురిచూపి, ఆ తొడిమల మధ్య పేల్చాను. గురితప్పింది. ఆ మొక్కలు అప్పటికే నా కాళ్ళను చుట్టుకుపోసాగాయి. రెండోసారి పేల్చాను.

అంతే! ఒక మొక్క కుప్పగా కూలిపోయింది. అది గిలగిలా కొట్టుకోసాగింది. నాకు ఉత్సాహం వచ్చింది.

కాని నా చేతుల్లో శక్తి క్షీణించిపోయింది. రివాల్వర్ జారి క్రిందకు పడిపోయింది. ఎగిరి డ్రాయర్ మీదకు దూకాను.

రివాల్వర్‌ని అందుకోవాలని నా తాపత్రయం. కాని ఆ మొక్క తొడిమలతో ఎత్తి విసిరేసింది బయటకు దానిని.

మెరుపులాగా నాకొక అయిడియా వచ్చింది.

వెంటనే డ్రాయర్‌ని ముందుకు జరిపాను. తొడిమలమీద వెల్లకిలా పడవేశాను.

సగం తొడిమలు బల్లక్రిందే ఉండిపోయాయి. మిగిలిన సగం నా మీదకు రాసాగాయి.

వెంటనే ఆ మొత్తాన్ని బలంగా వాటేసుకున్నాను. నా చుట్టూ అల్లుకుపోసాగాయి. బయటకు దొర్లాను. అవి నన్ను డ్రాయరువైపు లాగటానికి ప్రయత్నిస్తున్నాయి.

నా శక్తికొద్దీ బయటకు పొర్లాను. నా శ్రమ ఫలించింది. ఆ మొక్క మధ్యకు చీలిపోయింది.

రక్తం ప్రవహించింది వరదలై!

నన్ను పట్టుకున్న తొడిమలు జారిపోయాయి. నా షర్ట్ రక్తంతో తడిసింది.

దానిని విప్పి, మరొకటి వేసుకున్నాను. పాంటు కూడా మార్చుకొని, స్కూటర్ ఎక్కి ఇన్‌స్పెక్టర్ దగ్గరకు బయలు దేరాను.

★

ఈనెల జోక్స్

—ఆడారి
వెంకటరమణ

ఓ ఎన్. జి. ఓ తో—

"ఏమండీ నా సిగరెట్ల బాకీ...."

"ఫస్టు"

"ఏమండీ నా చాక్‌లెట్ల బాకీ?"

"ఫస్టు"

"మరి నా బొగ్గుల బాకీ?"

"ఫస్టు"



"మరి నా రగ్గుల బాకీయో?"

"ఫస్టు"

"ఏమండీ నాకు కొత్త చీర?"

"ఫస్టే"

"మరి నీ శ్రాద్ధం" విసిగిపోయిన ఆసామి.

"ఫస్టు" అలవాటయిన సమాధానం.

* * *

"కాలికిముల్లు దిగిందని బాధ పడకు
కంటిలో దిగలేదని సంతోషించు
భార్య నీకన్యాయం చేసిందని బాధ పడకు
దేశాని కన్యాయం చేయలేదని సంతోషించు"
"బాధ" పత్రికలో ప్రచురించారీ కవితను.
తరువాత నెల ఉత్తరాల శీర్షికలో—
"బాధ-సంతోషం" కవిత చదివాం. ఆ రచయితను తిడుతున్నందుకు బాధ పడొద్దనండి.
జోళ్లతో కొట్టలేదని సంతోషించ మనండి."

—"బాధ" పాఠకులు.

* * *

శంకర్రావు కలం స్నేహ సంఘాన్ని స్థాపించాడు విజయవాడలో. నా చిరునామా ఒక మిత్రుని ద్వారా సంపాదించాడు. తొలి వెలుగు పుస్తకంలో స్నేహితుల చిరునామాలు ప్రచురించాడు. ప్రచురించేటప్పుడు కంపోజింగులో 'రమణ'కు బదులు 'రమ' అని అచ్చయి ఊరుకుంది.

నా పేరు వివరాలు చూసిన ఓ కాలేజి యువతి సరళ నాకు వుత్తరం వ్రాసింది పొంగిపోతూ మీరు వ్రాసిన రచనలు చదివానంటూ.

నాకు తెలుసున్నంత వరకూ 'రమ' అనే పేరుతో ఏ రచయిత్రీ లేదు. మరేమిటి చదివిందో, వుత్తరం చదూకొని, నవ్వుకొని తమాషాగా నేను 'రమ' గానే వుత్తరం రాశాను.

ఓ సారి మద్రాసు వెళ్తూ ఆమెను కల్సుకుందామని విజయవాడలో దిగాను. ఆమెను ఆశ్చర్య పరచడానికి.

నేనే ఆశ్చర్య పడ్డాను.

సరళ పేరుతో ఉత్తరాలు వ్రాసింది ఓ హరినారాయణ.

*　　　　*　　　　*

"అ.ప.న. అని అంటారేమిటి?"

"అపరాధ పరిశోధన. పేరు పెద్దదని చిన్నగా ఉండడానికి అలా పిలుస్తారు."

"అయితే నా పేరు కూడా ఆలానే మూడక్షరాలతో పిలుస్తే?"

"బాగానే ఉంటుంది. ఇంతకీ నీ పేరు?"

"వెలగబోయిన ధనుంజయ వర్మ."

"ఒద్దులే. మీకు పూర్తి పేరే బావుంటుంది" అంటూ చక్కా లేచి పోయాడతను.

*　　　　*　　　　*

రైలులో అందమయిన అమ్మాయి వెనుక కూర్చున్న రమేష్‌కి కవిత్వ పిచ్చి మహా జాస్తి.

ఆ అమ్మాయిని పలకరించబోతే పలుకలేదు.

"పలకవే చిలక

ఉన్నాను నీ వెనుక

ముదిరిందా నీ గిలక?
వేస్తాను నే కిలక!'' అన్నాడు.
రమేష్ పైత్యం విన్నాడు ఆ అమ్మాయి అన్నయ్య.
''ఒరేయ్ నక్కా
ఊడ్తుంది నీ పిలక
వాలుస్తా నీ తొక్కా
విరుగుతుంది నీ మక్కా'' అన్నాడు.
అంతే రమేష్ కొయ్యబారిపోయాడు.

*　　　*　　　*

గాడిదలను కాస్తూన్న తిప్పడు గాడిదను రాయితో కొట్టాడనే నెపంతో కాలికొద్దీ తన్నాడో కుర్రాడ్ని. ఈ దృశ్యాన్ని చూసిన ఓ కారాకిళ్లీ అసామి తిప్పడును సమీపించి:

''మీరు కాలితో ఈ కుర్రాడ్ని తన్నారంటే తప్పు మీదికాదు. గాడిదలది. మీరు పాపం! ఎప్పుడూ గాడిదలు వెనకాళ్లతో తన్నడం చూస్తుంటారుగాబట్టి, ఆవేశంలో అలా తన్నారు. కరెక్టేనా?'' అని ఆగాడు.

''చాల్లేవయ్యా! పెద్ద చెప్పొచ్చావ్. అయితే తవరు కిళ్ళీ ఆకులేసుకున్నారు మేకల్నిగాని కాస్తున్నేవిటి?''

*　　　*　　　*

ఓ పల్లెటూరు నాస్తికుడు పట్టణం బయలుదేరి వెళ్ళి అక్కడ దేవుడి గురించి వాదనవచ్చి ఒక ఆసామితో:—

''అయితే దేవుడున్నాడా?''
''ఉన్నాడు.''

"ఏది?"

"మీకు ఇల్లుందా?"

"ఉంది."

"ఏది?"

"మా వూర్లో వుంది."

"అలాగే వాళ్ళింట్లో వున్నాడు దేవుడు. దేవుడిని నీకు చూడాలనుంటే చెప్పు మా రంగయ్య టిక్కెటిస్తాడు స్వర్గానికి."

*　　*　　*

"ప్రపంచమొక పద్మవ్యూహం."

"కవిత్వం ఒక తీరనిదాహం."

"నోనో. నే నొప్పుకోను. వుప్పునీరు తాగిన కొలదీ దాహం ఎక్కువవుతుంది. అందువలన వుప్పునీరొక తీరని దాహం. సరిచేసుకో కవిత్వమే ఒక తీరని దాహం అయితే ఈ కవులందరూ ఎప్పుడో దాహంతో నాలుక ఎండిపోయి చచ్చి వూరుకునేవారు."

*　　*　　*

విడాకులు ఎందుకు తీసుకుంటారన్న సమస్యకు సమాధానం చెపుతూ లాయరు ఓ కుర్రాడితో—

"చూడబ్బాయ్! నా దగ్గర రెండుపెన్నులు ఉన్నవనుకో, రెండూ మొదట్లో బాగానే రాస్తాయి. కొంతకాలానికి ఓ పెన్ను పాళీ విరిగిపోతుంది. రెండో పెన్ను పాళీ విరగదు. అయితే యిదెలా జరిగింది. రాయడంలో తేడావా? రెండూ

నా చేతితోనే రాస్తున్నాను. మరి పాళీలు తేడావా? కాదు ఒకే కంపెనీవి. అయితే ఎలా జరుగుతుంది ఇలా?''

విసిగిపోయిన కుర్రాడు ఆఖరికి సహనం కోల్పోయి ఇలా అన్నాడు:

"అయామ్ సారీ! మీరు రెండు పెళ్ళిళ్లు ఒకేసారి చేసుకున్నారని తెలియక....'' అంటూ వెళ్ళిపోయాడు.

* * *

''ఏమిటండీ ఆ కాగితాలకట్ట. నవలలాగుందే.''

''కాదండీ ఈ నెల జోక్స్.''

"ఈ నెల జోక్స్ పది, పదిహేను కంటె ఎక్కువ వేసు కోరుగా? మొత్తం ఎన్ని జోక్సండీ?''

''మొత్తం నేను పంపేవి పన్నెండు వందల జోక్స్. కనీసం పన్నెండయినా ప్రింటవుతాయి.''

''ఏం?''

"అరుమాసాల క్రితం నూరు జోక్స్ పంపితే ఒక జోక్ ప్రచురించారు. ఆ లెక్కన ఇప్పుడు పన్నెండు వందలు పంపుతున్నాను.''

★

"హోమ్ డెలివరీ"

"హోమ్ డెలివరీ" సభ్యులకు నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/- లకే వి. పి. ద్వారా పంపబడతాయి. నేడే మీరూ సభ్యులుగా చేరండి.

1. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 3/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందజేయబడుతుంది.

2. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5/- లకే ప్రతినెలా వి. పి. పి. ద్వారా పంపబడతాయి. మీ ఇంటిదగ్గరనే పోస్టుమెన్‌కు రు. 5-20 పై. లు (మనియార్డరు రుసుముతో సహా) చెల్లించి, కాపీలు పొందవచ్చును. కాపీలు మీకు త్వరితంగాను, గ్యారంటీగాను చేరుతాయి. పోస్టులో పోయే సమస్య ఎంతమాత్రం లేదు.

3. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఎప్పుడైనా వి.పి. త్రిప్పితే మాత్రం మీ సభ్యత్వం రద్దవుతుంది. మీ చిరునామాలు మారినప్పుడల్లా ముందుగా తెలుపవచ్చును.

4. సభ్యులకు ఏవైనా పాత కాపీలు కావలిస్తే వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపుతాము. ఎక్కువ కాపీలు కావలసిన వారికి కొంత కన్సెషన్ కూడా లభిస్తుంది.

5. అన్ని పోటీలలో పాల్గొనటానికి హో. డె. సభ్యులకు మాత్రమే అర్హత వుంటుంది. సభ్యుల పేర్లు వీలునిబట్టి "అపన" లో ప్రచురిస్తాము. ఇప్పటికే వందలాది పాఠకులు సభ్యులుగా చేరారు. మీరూ చేరండి.

నేడే మీ సభ్యత్వం తీసుకోండి!

మృగంలాంటి మనిషి

పెండ్యాల మాధవరెడ్డి

"నాకు ఒక ఆడది కావాలి" సోఫాలో వెనక్కువాలి డన్ హిల్ సిగరెట్ పొగ వదులుతూ అన్నాడు మధుమూర్తి. ఎదురుగా నిలబడ్డ లాడ్జిబాయ్ నవ్వి "అదెంత పని సార్. నిమిషాలమీద తెస్తాను."

"సానికాదు-సంసారి కావాలి" మధుమూర్తి అన్నాడు.

"అలాగే సార్. సంసారం చేసుకునే ఆడదాన్నే తెస్తాను. కాని వచ్చిన దాన్ని వివరాలు అడగకూడదు. ఖరీదు కొంచెం ఎక్కువవుతుంది."

"ఫర్వాలేదు." అంటూ యాభై రూపాయలు అందించి "ఇది అడ్వాన్స్. తరువాత మనిషినిబట్టి యిస్తాను. వెళ్ళు" అన్నాడు. లాడ్జిబాయ్ వెళ్ళిపోయాడు.

క్షణాలు గడిచాయి, నిమిషాలు జరిగాయి, కాలం గంట నడచింది.

రూంబోయ్ ఒకమ్మాయితో సహా రూంలోనికి వచ్చాడు. వచ్చినమ్మాయిని నఖశిఖ పర్యంతం పరీక్షగా చూశాడు. యిరవై ఏళ్ళ అందమయిన శరీరం నిండా పైట కప్పుకొని, కాస్త బిడియంగా మరి కాస్త సిగ్గుపడుతూవుంది. ఆమె చూపులు నిశితంగా వున్నాయి. పెదవులు చిలిపిగా వున్నాయి. రొమ్ములు ఎత్తుగా పైటలోనుండి కనిపిస్తున్నాయి.

"నీవు వెళ్లు" అన్నాడు. రూంబోయ్ వెళ్ళిపోయాడు.

మధుమూర్తి తలుపులువేసి ఆమె దగ్గరకు నడిచి పైట తీసి చీరెను మెల్లిగా లాగి మంచంపై వేశాడు. బొడ్డుకు దిగువుగా వున్నలంగా, పొట్టి జాకెట్టు మధ్య శరీరాన్ని చేతితో నిమిరి ముద్దు పెట్టుకున్నాడు. గబాలున రెండు చేతులతో ఎత్తుకొని మంచం పైకి తీసుకువెళ్ళాడు.

గడియారం పన్నెండుగంటలు కొట్టింది.

* * *

"లోపల గడియవేసి వుంది ఇనస్పెక్టర్" అన్నాడు హోటల్ మేనేజర్.

ఇనస్పెక్టర్ విక్రాంత్ తలుపులు పగలకొట్టించాడు. లోపల అడుగు పెట్టటంతోనే ఇనస్పెక్టర్ శరీరం జలదరించింది.

ఎదురుగా బెడ్‌మీద మూలగా పడివున్న నగ్న స్త్రీ. జుట్టు నేలపైకి పడుతోంది. కళ్ళు తెరిచే వున్నాయి. పెదవులు నెత్తురు ముద్దల్లా వున్నాయి. రొమ్ములమీద కొరికిన గాట్లు రక్తపు చారికల్లా వున్నాయి. రెండు కాళ్లు అస్తవ్యస్తంగా వున్నాయి.

ఫొటోగ్రాఫర్లు ఫోటోలు తీశారు. ఫింగర్‌ప్రింట్ నిపుణుడు వేలిముద్రలు తీసుకున్నాడు. "యీ రూం బుక్ చేసిన వ్యక్తి తెలుసా?"

"క్రితంలో ఒకటి రెండుసార్లు వచ్చాడు. రూంబాయ్‌కి పరిచయం. పేరు మధుమూర్తి. వ్యాపారపు పనిమీద వస్తున్నట్లు వ్రాశాడు."

"లోపల గడియవేసి వుంది. హంతకుడు బయటకు ఎలా వెళ్ళివుంటాడు?" ఇనస్పెక్టర్ ప్రశ్న. హోటల్ మేనేజర్ తటపటాయించాడు.

"సార్ బాత్‌రూంలో శవం వుంది" సార్జంటు చెప్పాడు. గబగబ వెళ్లాడు ఇనస్పెక్టర్. అది మధుమూర్తి శవం. తలుపుకు ప్రక్కగా నగ్నంగా కూర్చోబెట్టినట్లుంది. టాప్‌లో నుండి నీళ్లు చుక్కలుగా పడుతున్నాయి.

అంతలో ద్వారం దగ్గర బూట్ల శబ్దం వినిపించింది. ఆ శబ్దం ప్రఖ్యాత డిటెక్టివ్ పి. జె దని విక్రాంత్ గ్రహించాడు.

"హలో! గుడ్‌మార్నింగ్ ఏమిటి ఇలా వచ్చారు?" ఇనస్పెక్టర్ అన్నాడు.

"పిక్చర్‌నుండి ఇంటికి వెళుతున్నాను. యిక్కడేదో మీ

జీపు అడ్డుగావుంటే ఇలా వచ్చాను'' అన్నాడు డిటెక్టివ్ పి. జె.

''మీ సలహా కావాలి. దాదాపు సహాయం లాంటిది.''

''దేని విషయంలో?'' అన్నాడు డిటెక్టివ్ పి. జె.

''యీ రెండు హత్యల విషయంలో. లోపల గడియవేసి వుంది. హతుడు బలవంతుడు. హతురాలు, హతుడు లోపలే వున్నారు. ఏ విధమయిన అరుపులు వినిపించలేదు. హత్య ఎప్పుడు జరిగిందో పోస్టు మార్టమ్ ద్వారా తెలుస్తుంది.''

''మీ దర్యాప్తు ప్రారంభంలోనే వుందిగా, కానివ్వండి'' అన్నాడు పి. జె.

*   *   *

''ఈ కేసు చాలా విచిత్రమైంది. హతురాలు జానకి దారుణంగా ఒక పురుషుడితో భంగపరచ బడింది. ఆ పురుషుడు త్రాగలేదు. కాని వికృతమైన వాంఛతో ఆమెను యిష్టమొచ్చినట్లు కొరికి వేశాడు. హతుడు మధుమూర్తి ఆ స్త్రీ విషయంలో ఉద్రేక పడ్డాడు కాని అనుభవించ లేదు. హంతకుడు తాలూకు వేలి ముద్రలు మనకు లభించ లేదు. అంతే కాదు. యే యితర ఆధారాలు లభించలేదు.''

''జస్ట్ ఏ మినిట్'' అంటూ లేచి డిటెక్టివ్ పి. జె. లాడ్జి రికార్డు చూశాడు. హత్య జరిగింది రూం నెంబరు ఆరు. ఏడో నెంబరు రూము తాళం వేసి వుంది. ఐదో నెంబరు రూంకి మహేష్ అనే వ్యక్తి మధుమూర్తి వచ్చిన గంట తరువాత వచ్చాడు. తిరిగి ఎప్పుడు వెళ్లాడో ఎవరికీ తెలీదు.

అంతలో రూం బోయ్ వచ్చాడు. ''జానకిని తెచ్చిన రూం బోయ్‌వి నీవే కదూ!''

''అవును సార్.''

"ఆమెకు భర్త వున్నాడా?"

"తెలీదు సార్. ఆమె అప్పుడప్పుడు రాత్రి పది గంటలప్పుడు బస్‌స్టాపులో వుంటుంది. తీసుకొస్తుంటాను. అంతకంటె వివరాలు తెలియవు సార్" అన్నాడు హోటల్ బోయ్ పాండురంగం.

"ఎన్నాళ్లుగా ఆ అమ్మాయి నీకు తెలుసు."

"షుమారు నెల రోజులుగా. ఈ లాడ్జికి మూడోసారి తెచ్చాను."

"రూం నెంబరు ఐదుకు వచ్చిన మహేష్‌ను నీవు గుర్తించ గలవా?"

"ఆ గుర్తించగలను. కనిపిస్తే తప్పక గుర్తిస్తాను."

"అతను నీకు లాడ్జి తాళాలు యిచ్చి వెళ్లాడు కదూ! టైమెంత."

"రాత్రి ఒంటి గంట అయివుంటుంది."

"దట్సాల్ నువ్వెళ్లు." అన్నాడు డిటెక్టివ్ పి. జె. ఇనస్పెక్టర్ విక్రాంత్ దగ్గరకు వచ్చాడు. దొరికిన సాక్ష్యాలు బట్టి "హత్య పన్నెండు, ఒకటి మధ్య జరిగింది. హత్య జరిగిన గదిలోనికి ఐదో నెంబరు రూం నుండి తప్ప వేరే రావటానికి దారి లేదు. హత్య జరిగిన వెంటనే మహేష్ రూం ఖాళీ చేశాడు. అతని వివరాలు తెలియవు. మధుమూర్తి, లేదా జానకికి యితను విరోధి అయి వుండాలి. గుర్తుంచుకోండి. ఏది ఏమయినా జానకి గురించి, మధుమూర్తి గురించి వివరాలు తెలియనిదే దర్యాప్తు ముగింపు కాదు. హంతకుడు లభించడు."

* * *

రాత్రి పది గంటలయింది.

మంచు దట్టంగా పడుతోంది. వీధి దీపాలు గుడ్డిదీపాలుగా వెలుగుతున్నాయి. అది సినిమాహాలు వెనుక ఇరుకుగా ఉన్న సందు. పగలు తిరిగే మర్యాదస్తులు, రాత్రి ఆ వీధులలో వున్న యువతులకు దర్శనమిస్తూ వుంటారు. పలకరింపులు పులకరింపులు, నలిగిన మల్లెల వాసనలు, కిలకిల నవ్వులు ఆ వీధిలో వినిపిస్తూ వుంటాయి.

ఆ సందు మొదట్లో చెత్త ప్రోగుచేసి వేడి కాచుకుంటు న్నాడు సీతడు. సీతడు రోగిష్టి అడుక్కునేవాడు. ఆ మంట దగ్గరకు మరొకడొచ్చాడు గంగులు. వాడు కొత్త చెత్తవేసి మంట పెద్దది చేశాడు.

"జానకి అంతులేకుండా పోయిందిరా" అన్నాడు సీతడు.

"చిత్రంగానే వుంది. అది ఇన్నాళ్ళు పడుపు పనిచేయవే అంటే మాటయిన్నది కాదు. ఆ పాండురంగంగాడు ఏ నిమి షంలో తగిలాడో కథ గుప్పున తిరిగి చిల్లర బదులు, చెక్కులే సంపాదించింది."

"తెలివంటే దానిదే పచ్చి సానిముండ. సంసారిలా నమ్మించింది."

"నువ్వేంది పాండురంగంగాడు నమ్మలా. నమ్మికదూ ఖరీదయిన హోటల్లోకి పరిచయం చేసింది" అంటుండగానే గలగలమంటూ ఓ యువతి నలిగిపోయిన తెల్లచీరె, వాడి పోయిన మల్లెపూలతో మంటదగ్గర కొచ్చింది.

"ఏమే ఎంత సంపాదించావు" గంగులన్నాడు అరుం ధతితో.

"ఆఁ ఏదో సంపాదించాను. తాగుబోతు సచ్చినో డొచ్చాడు" అంది విసుకుగా. కుడివేపుగా తెల్ల బట్టలు వేసు కున్న యువకుడు మంటదగ్గర కొచ్చాడు.

"మీరేమీ అనుకోకపోతే యీ మంటలో కాస్త వేడి కాచుకుంటాను."

సీతడు నవ్వి ప్రక్కకు జరిగి "దాందేముంది బాబు కాగండి."

"మంటతో ఏమి వళ్లు వేడవుద్ది...." అంది పైట జార్చిన అరుంధతి.

అతను నవ్వాడు. "నేనలాంటి వాడిని కాదు. అలా అని ఆడదంటే తెలియని అమాయకుడ్ని కాదు."

"అందుకే యీ రాత్రికి నన్ను వేడివేసి మీరు కాగండి" అంది. అతను ఆలోచిస్తున్నాడు. ఆమె అప్పటికే చేయి పట్టుకొని వీధిలో నుండి యింటికి తీసుకు వెళ్ళింది. అది చిన్న గుహలాంటి యిల్లు. నులక మంచం, గుడ్డి దీపం. గోడలకు నలిగిన కాలండర్లు.

అతడు మంచంపై కూర్చున్నాడు. "ఎంత?"

"మీకు తోచినంత" అంది నవ్వి. "బట్టలన్నీ విప్పితే" అడిగాడు.

"ఆలస్యమవుతుంది."

"అందుకే ఎంత. పదిస్తాను, బట్టలన్నీ విప్పు" అన్నాడు. పది రూపాయల నోటు చేతికి అందించి.

అరుంధతికి యిరవై ఏళ్ళుంటాయి. సన్నగా, పొడవుగా. వుంటుంది. పిరుదలు, రొమ్ములు గాలి పోసుకున్నట్లు ఎత్తుగా వుంటాయి. ఉరకలు వేస్తున్న యవ్వనం ఎందరి చేతుల్లోనో నలిగిపోయినా మిగిలిన అదరాల అందం పెదతీర్చుకోటానికి పనికి వచ్చేలా వుంటుంది. దారిమారితే అరుంధతిని సాని అని ఏవరూ అనలేరు.

తలుపువేసి ప్రక్కన వచ్చి కూర్చొని రవిక విప్పింది.

లోపల బ్రాసియర్‌లేదు. చీరె విప్పింది లోపల లంగాలేదు. తను పూర్తి దిగంబరి అయినా తన ఒంటిమీద ఏమీలేక పోయినా అన్ని వున్నట్లు అతని చుట్టూ చేతులువేసి చొక్కా, పాంటు గుండీలు విప్పసాగింది.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

* * *

డిటెక్టివ్ పి. జె. సిగరెట్టు వెలిగిస్తూ శవాన్ని చూశాడు. నులక మంచంమీద అస్తవ్యస్తంగావున్న శవం కళ్లు తెరిచే వున్నాయి. పెదవులు నెత్తురు ముద్దల్లా ఎవరో కొరికి వేసి నట్లున్నాయి. రొమ్ములమీద రక్తపు చారికలేకాక, రొమ్ముల చివర నల్లని భాగం కోసి తీసినట్లో, కొరికి తినేసినట్లో వుంది. రెండు కాళ్లు సగం మడచి దూరంచేసి వున్నాయి.

ఇన్‌స్పెక్టర్ విక్రాంత్ వివరాలు సేకరించాడు.

"చనిపోయిన అరుంధతికి భర్త వున్నాడా?"

"లేడండి. అది ఎప్పుడో వచ్చి యిక్కడే వుండి పోయింది. సొంత సంపాదనే" అన్నాడు గంగులు.

"రాత్రి చివరసారిగా వచ్చిన మనిషిని చూశారా?"

"మంట వెలుగు. అయినా కొంత గుర్తే యిరవై ఏడేళ్లుంటాయి. ఎరుపు, బలంగల శరీరం, మీసాలు, తెల్ల అద్దాల కళ్లజోడు."

"అతను తిరిగి వెళ్ళటం చూశారా?"

"గమనించలేదు ఎప్పుడెళ్లాడో చూడలేదు" సీతాలు అన్నాడు.

ఇనస్పెక్టర్ విక్రాంత్‌కు అరుంధతి హత్యచేయబడ్డ గదిలో ప్రత్యేకించి ఆధారాలు ఏమీ దొరకలేదు.

* * *

గడియారం పదిగంటలు కొట్టింది.

ఫ్లోరోసెంట్ దీపాలకాంతి మంచు కురవటంతో తెల్ల తెరలా కనిపిస్తుంది. దీపంక్రింద చలికాచుకుంటున్నాడు గుడ్డి రాజయ్య. అది నల్లని తారురోడ్డు. కుడివేపు పార్కు, ఎడమ వేపు మహాభవంతులు రెండు. మరి కాస్త దూరంలో హోటళ్ళున్నాయి.

ఫుట్‌పాత్ మీద టకటక నడచి వస్తున్న యువకుడు. సెంటువాసన. "బాబు టైమెంతయింది?" రాజయ్య ప్రశ్న.

"పదింపావు. గుడ్డి వెధవకు టైమెందుకు" అన్నాడు చివరకు ఆ యువకుడు. రాజయ్య నవ్వాడు ఆ అడుగులు దూరమయ్యాయి.

వీధి కుక్క మొరుగుతోంది. "రా రా ముసలాడా పోదాం" అంది మంగి. రాజయ్య కదిలాడు. ఇద్దరు పార్కు గేట్ మీద నుండి వారగా వేసిన గోనె క్రిందకు వెళ్ళారు. తెచ్చిన అన్నం యిద్దరు తిన్నారు. రాజయ్య నడుం వాల్చాడు.

నగరం సద్దు మణుగుతోంది. "ఒసేయ్ మంగా?" మంగి పలకలేదు. నీళ్లు మీద పోసుకుంటున్న చప్పుడు, చెంబు కుండ అంచుకు తగులుతోంది.

అదే బూటుల చప్పుడు. అదే సెంటు వాసన. టైము అడగా లనుకున్నాడు. కాని బూటుల శబ్దం ఆగిపోయింది. మళ్లీ నాలుగు అడుగులు.

"మంగి....మంగి" పిలిచాడు రాజయ్య. మంగి పలకలేదు. ఎవరో ఆయాస పడుతున్నట్లు. ఎవరో మూలుగుతున్నట్లు శబ్దం.

కంగారుగా అరిచాడు. తల మీద బలంగా దెబ్బ తగిలింది.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

* * *

రాజయ్య కళ్ళు తెరిచాడు. ఎప్పుడులాగే ఏమీ కనిపించ లేదు. పడుకున్న పక్క మెత్తగా వుంది. "ఎక్కడున్నాను?" కంగారుగా అడిగాడు. "నా మంగి ఏది?"

డిటెక్టివ్ పి. జె. గొంతు సవరించుకున్నాడు.

"నీవు ఆస్పత్రిలో వున్నావు. నీ పేరేమిటి?"

"రాజయ బాబు."

"రాజయ్యా! రాత్రి నిన్నెవరో తలమీద బలంగా కొడితే పడిపోయావు. బీట్ కానిస్టేబుల్స్ నిన్ను, నీ మంగిని చూశారు."

"నా మంగి ఏది బాబు?"

"బాధ పడక. మనిషికి నిగ్రహం అవసరం."

"అంటే నా మంగి ఏమయింది?"

"నీ మంగి చనిపోయింది."

బావురుమన్నాడు రాజయ్యా.

భుజం తట్టాడు డిటెక్టివ్ పి.జె. గబాలున ఏదో గుర్తుకు వచ్చింది. "వాడే వాడే చంపాడు. వాడే."

ఇనస్పెక్టర్ విక్రాంత్ చూశాడు.

"ఎవరు? ఎవరు చంపారు?"

"ఎవడో తెలీదు బాబు. నడిచిన బూట్ల గుర్తు. సెంటు వాసన. టైమడిగితే చెప్పాడు. వాడు తిరిగి వచ్చేసరికి నా మంగి గోడ ప్రక్క నీళ్ళు పోసుకుంటోంది, వాడి అడుగులు ఆగిపోయాయి. ఆ తరువాత దెబ్బ తగిలింది."

"ఆ అడుగులు, ఆ సెంట్ వాసన గుర్తుంచుకో. నీ పొట్టను పెట్టుకున్న హంతకుడ్ని పట్టుకు తీరతాం" భుజం తట్టాడు పి. జె.

* * *

"గుడ్‌మార్నింగ్ డాక్టర్!"

"గుడ్‌మార్నింగ్, కూర్చోండి" డాక్టర్ సంఘమిత్ర కుర్చీ చూపాడు. ఎదురుగా కూర్చున్నాడు డిటెక్టివ్ పి.జె. "చూడండి డాక్టర్! మంగి శవాన్ని పోస్ట్‌మార్టం చేశారు కదూ!"

"యస్. చేశాను."

"క్రితంలో జరిగిన జానకి, అరుంధతి, హత్యలకు దీనికి పోలికలున్నా యంటారా?" డిటెక్టివ్ పి. జె. ప్రశ్న.

"యస్. యీ మూడు హత్యల గురించి క్షుణ్ణంగా మీకు చెపుతాను. జాగ్రత్తగా వినండి. హంతకుడు చాలా బల వంతుడు. హంతకుడు గొంతు నొక్కి- అపస్మారక దశలో వున్నప్పుడు భంగపరచటం- ఆ తరువాత గొంతు పిసికి చంపటం జరిగింది. రేప్ చేసి చంపడమే గాక రొమ్ములు ఐమీన్ మెత్తగా వున్న భాగాల్ని కొరికి తిన్నట్లు తెలుస్తుంది. నా ఉద్దేశ ప్రకారం యిలాంటి హత్య యింకొకటి జరిగితే ఆ శవం రొమ్ములు పూర్తిగా తినివేసే రాక్షస ప్రవృత్తి హంతకుడికి వుంది."

"మనిషి మనిషి మాంసం తినటమా డాక్టర్."

"యస్ శవ పరీక్షలో అదే కనిపిస్తోంది."

"ఐ. సీ. వస్తాను. అవసరం అయితే మళ్లీ కలుస్తాను."

* * *

డిటెక్టివ్ పి.జె. బరువుగా నిట్టూర్చాడు. "ప్రతి హత్యకు ఒక మోటివ్ వుంటుంది. కాని యీ హత్యకు మోటివ్, మానభంగం చేయటం ఆ తరువాత హత్య. ఇది కేవలం సైకాలజీ ఎఫెక్టా లేక మరేదయినానా?"

ఇనస్పెక్టర్ విక్రాంత్ ఆలోచిస్తున్నాడు. "ఎవర్ని అను

మానించాలి. ఎందుకు అనుమానించాలి. మానభంగం చేసిన వాడు ఎందుకు హత్య చెయ్యాలి?''

"సార్ మీ కొరకు జమిందార్ మదన్ మోహన్ వచ్చారు" అన్నాడో సార్జంటు. ఇనస్పెక్టర్, డిటెక్టివ్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. రమ్మనమన్నారు. జమిందార్ రావ డంతో యిద్దరూ లేచి వినయంగా నిలబడి నమస్కరించారు.

"ఫోన్ చేస్తే మేమే వచ్చేవాళ్ళం కదా! యింత పెద్ద వయసులో మీరు రావటం."

జమిందార్ నవ్వాడు. "మీరు మానభంగాల గురించి పేపరులో ప్రకటించాక రాక తప్పలేదు. నేను వూహించినట్లు హంతకుడు మహేషే! అతనొక్కడే యింత రాక్షసుడిలా ప్రవర్తించ గలడు.''

"ఏమిటి మీరనేది?''

"యస్. అతను మనిషి కాదు. మనిషి లాంటి రాక్షసి, రాక్షసి లాంటి మనిషి. మనిషి లాంటి మృగం. అతనిది మనిషి శక్తి కంటె మించిపోయింది."

"ఏమిటి మీరనేది.''

"ఇది అతని ఫోటో. వయసు యిరవై కి పైన వుంటాయి. అరచేతిలో రోమాలుంటాయి. చేతి గోళ్లు తోడేలు గోళ్లలా వుంటాయి. నోటిలో రెండు కోరపళ్ళు కుక్క పళ్ళలా వచ్చి వుంటాయి.''

"అతను అలా వుండటానికి కారణం?''

"చాలా పెద్ద కారణం హంతకుడ్ని పట్టుకోటానికి ఆ కారణం అనవసరం యీ ఆధారాలతో ఆ దుర్మార్గుడ్ని పట్టు కొని అమాయకపు యువతులను కాపాడండి, మరొకసారి

అవకాశం వచ్చినపుడు అతని కథ చెపుతాను" అంటూ మదన్ మౌనంగా లేచి శెలవు తీసుకుని వెళ్ళిపోయాడు.

* * *

ఆ రాత్రే వల వేసి మహేష్‌ను మరో హత్య చేస్తుండగా బంధించారు పోలీసులు.

"షుమారు యాభై సంవత్సరాల క్రితం మా జమిందారు వంశానికి చందమామలాంటి బిడ్డ కలిగింది. ఆ ఆస్తి రాదని భావించిన దాయాదులు, ఆ పసివాడ్ని చంపడానికి భైరవ్‌ను వినియోగించారు. భైరవ్ డబ్బుకు ఆశించి నిర్దయగా ఆ బిడ్డను చంపడంతో, మా నాన్నగారు వాడ్ని పట్టుకొని ఒక చీకటి గదిలో బంధించి రోజూ పచ్చి మాంసం పెట్టించారు.

ఆకలితో పచ్చి మాంసం తిన్న వాడి శరీరంపై రోమాలతో పాటు రాక్షసుడి బలం వచ్చింది. పది సంవత్సరాల పచ్చి మాంసం తిన్న వాడి శరీర బలం పెరిగి ఇనప గేటును విరిచి పారేశాయి. ఆ గదిలో నుండి పారిపోతూ తోటలో వున్న నౌకరు కూతురును బలవంతంగా అనుభవించాడు. వాడ్ని తుపాకితో చంపివేశాం.

కాని నౌకరు కూతురు గర్భవతి అయింది. ఆమె తొమ్మిది నెలలకు ఒక బిడ్డను కని కన్ను మూసింది. ఆ బిడ్డే యీ మహేష్. చిన్నప్పటినుండి రక్తమన్నా, పచ్చి మాంసమన్నా వీడికి చాలా యిష్టం. వయసు పెరిగేకొద్ది వీడిలో యిలాంటి లక్షణాలు కనిపించటంతో, జాగ్రత్త వహించాను. అయినా నా చేయి దాటి పోయింది" అంటూ ముగించాడు జమిందారు.

★

47

1

తన పేరులో దీపాన్ని, ధనాన్ని దాచుకొన్న తెలుగు నటి; ఓ దిక్కును, అడవిని దాచుకొన్న ఇంగ్లీషు నటుడు ఎవరు?

—ముద్దా సురేష్, కాకినాడ-2.

2

టీచర్:—ఒరేయ్! రెండు మూళ్లు ఎంతర్రా?

రాజు:—ఎనిమిది.

టీచర్:—అదెలా?

రాజు వెంటనే బోర్డుమీద చేసిచూపించాడు. టీచర్ తెల్లబోయాడు. పిల్లలు గొల్లుమన్నారు.

ఎలా? మీరు చేయగలరా?

—కె. విజయలక్ష్మి, విజయవాడ-11.

3

నాకు రెండు కాళ్ళున్నాయి. కాని మనిషిని కాను. నాకు తల ఉన్నది, నోరున్నది. కాని మాట్లాడలేను. నోటితో వస్తువులు చిక్కించుకుంటే మరి వదలను. అయితే నా పేరేమిటో చెప్పుకోగలరా?

—కె. వి. వి. సత్యనారాయణ, పుల్లేటికుర్రు.

4

ఓ ఇద్దరు తండ్రులున్నారు. ఒక తండ్రి తన కొడుకుకు రు. 150 లు ఇవ్వగా. రెండో తండ్రి తన కొడుకుకు రు. 100 లు ఇచ్చాడు. కాని ఇద్దరు కొడుకుల దగ్గరున్న మొత్తం డబ్బు చూస్తే రు. 150 లు మాత్రమే వున్నది. అదెలా సాధ్యం?

—జి. దుర్గా బాబ్జీ, రూర్కెలా.

* * *

[ఇవి యీ నెల సమస్యలు. వీటికి మీరు జవాబులు కనుక్కోగలరేమో ప్రయత్నించండి? మీకు జవాబులు దొరక్కపోతే వచ్చేనెల పత్రిక చూడండి. ఎడిటర్.]

గతనెల సమాధానాలు

(1) A హత్యచేసాడు.

(2) REVIVER.

(3) కత్తుల రత్తయ్య. (ఇవ్వబడిన పూర్ల పేర్లను మూడు భాగాలుగా విభజించాలి. ప్రతి భాగంలోని మొదటి పేరునుండి మొదటి అక్షరం, రెండవ పేరునుండి రెండవ అక్షరం తీసుకోవాలి.)

★

ఒక దోమ:– ఏమిటో, మనుషుల రక్తం రానురాను మరీ చప్పబడిపోతున్నది?

రెండో దోమ:– పాపం! వాళ్ళు మాత్రం ఏంచేస్తారు? తినేదంతా కల్తీ సరుకాయె!

—ఆలపాటి రమేష్, రాజమండ్రి.

త్రలంతా భారంగా వుంది.

పెన్ను వ్రాస్తున్న కాగితాలమీద పడేసి, చేత్తో కణతలను నొక్కుకుంటూ ఈజీచైర్‌లో వెనక్కి వాలాను. ఎదురుగా అపరకాళికాదేవి....నా భార్య చంచల చేత్తో పేపరుతో, నడుముమీద చేయి వేసుకొని నిల్చుని నావైపే చూస్తున్నది దీర్ఘంగా. ఆవిడను చూడగానే నన్ను ఆవహించిన అలసటంతా వేటగాడిని చూసిన లేడిపిల్లలా బెదిరిపోయి తుర్రుమంది.

కంగారుతో పెన్నుని తీసుకొని కాగితాలమీద పెట్టాను. చంచల చేతిలోంచి పేపరు విసురుగా రాకెట్‌లా వచ్చి నా మొహాన్ని తాకి కాళ్ళదగ్గర పడింది. అలనాటి శ్రీకృష్ణ భగవానుని కాళ్ళతో తన్ని ధన్యుర్ని చేసిన సత్యభామాదేవి గుర్తుకొచ్చింది నాకు.

"ఏమిటే చంచలా! పేపరుతో ముఖంమీద కొట్టావు" అన్నాను భయంతో బిక్కుబిక్కుమంటూ.

ఆ మాట వినగానే చంచల అగ్గిగుగ్గయిపోయింది. గబగబ నాదగ్గరకొచ్చి, నా తలను పేపర్లోకి వంచి—"చూడవయ్యా! చూడు! కథలపోటీకి నాల్గురోజులే గడువుంది. ఇంకా నువ్వు నాల్గు లైనులుకూడా రాయలేదు! పదిరకాల నవలలను చదివి, మాంచి ప్లాట్‌ను తయారు చేసిస్తే—కథ కూడా వ్రాయలేకపోతున్నారు. ఇంకెలా?" అంది.

నేనేమీ మాట్లాడకుండా రాసిన నాల్గు లైనుల వైపే చూస్తూ కూర్చున్నాను.

"పుణ్యంకొద్దీ పురుషుడు - దానంకొద్దీ బిడ్డలు అన్నారు. ఏనాడు చేసుకొన్న పుణ్యఫలమో కాని ఉద్యోగం సద్యోగం లేని మొగుడ్ని కట్టుకొన్నాను. ఖాళీగా కూర్చుంటే ఎంతకాలమని అయిదేళ్ళు నోట్లోకి వెడతాయి? కొత్త కథలు వ్రాయడ

మయినా నేర్చుకోమంటే.........ప్చ్....ఏం లాభం—" తల బాదుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

చంచల నా కుద్యోగం లేదని రోజూ నారపీకులా సాగ దీస్తూనే వుంటుంది. నాపేరు ప్రక్కన డిగ్రీలు ఏమీ లేక పోయినా ఉద్యోగం వేటకై నాలుగుజతల చెప్పులు అరగ దీసాను. ఫలితం శూన్యం. అత్తగారిచ్చిన మామిడితోటే ప్రస్తుతం తిండి పెడుతున్నది మాకు. అందుకే మా ఆవిడ నన్ను దెప్పటం ఎక్కువ.

చిన్నప్పు డెప్పుడో 'అనగనగా రాజు' కథలు వ్రాస్తే అవి స్కూలు మేగజైన్‌లో పడ్డాయన్నాను మా ఆవిడతో ఎప్పుడో బుద్ధిపొరపాటున. దానితో పట్టుకొంది నన్ను— 'ఖాళీగా కూర్చునే బదులు కథలు వ్రాయి! రచయిత అయితే బోలెడంత పేరు, డబ్బు' అంది. 'కొంపకో రచయిత తయారయిన ఈ రోజుల్లో రచనా వ్యాసంగము ఏమంత మంచిది కాదు' అని మొత్తుకొన్నాను. అయినా అది నా మాట వింటే కదా! దాన్ని తృప్తిపరచడాన్కి కాగితం, కలం తీసుకొన్నాను. కలం మాత్రం కాగితంమీద నుంచి ముందుకు జరగనని మొండిపట్టు పడుతున్నది.

"ఇంకా ఆలోచనలతోనే గడుపుతున్నారా?" అంటూ వంటింట్లోంచి మళ్ళీ బయటకొచ్చింది. మళ్ళీ ఏమి తుఫాను సృష్టించుతుందోనని హడలి చచ్చాను.

నాముందు పాపఖాబిన్న పడేసి—"వెళ్ళి టీ త్రాగి రండి! పాపం ప్రొద్దుటనుంచి టీ త్రాగక ముఖం కళగా లేదు" అంది చిరునవ్వుతో.

మా ఆవిడను ఎలా అర్థం చేసుకోవాలో భగవంతునికే తెలియదు.

దాని తల్లితండ్రులు దానికి తగట్టుగానే పేరెట్టారు

'చంచల' అని. ఖచ్చితంగా దానిది చంచలమైన స్వభావమే!

ఉబ్బితబ్బిబ్బయిపోతూ ఆ పావలా బిళ్ళను జేబులో వేసుకొన్నాను కళ్ళ కద్దుకుని. పేపరు చదివి వెళ్ళొచ్చు ననుకొన్నాను.

పేపరు విప్పి ముందు పరచుకొన్నాను.

'కొద్దికాలంలో దేశంలో నూతన విద్యావిధానం అమలు'

'ప్రధానమంత్రి విదేశాంగ పర్యటన....'

'ప్రధాన మంత్రికి వీడ్కోలు ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఢిల్లీ పయనం.'

ఇంకా....'సినిమాలు—ఎడ్వర్టయిజ్ మెంటులు.'

ఓహ్! ఏమిటో ఈ పేపరు చదివితే ఉన్న మతి కూడా చక్కగా పోతుంది. ప్రధానమంత్రిగారు విదేశ మెడుతుంటే—ఆయనకు వీడ్కోలు ఇవ్వడానికి ముఖ్యమంత్రిగారు పనిగట్టుకుని ఢిల్లీ పరుగెడుతున్నాడు.

'కనబడుట లేదు' అని తాటికాయంత అక్షరా లున్నాయి. వెధవది! కుర్ర వెధవలు మతుల్లేక ఇళ్ళలోంచి వెళ్ళిపోతుంటారు. పరీక్షలు తప్పితే, ప్రేమించిన అమ్మాయిని తల్లితండ్రులు పెళ్ళి చేయకపోతే ఇంట్లోంచి పారిపోతుంటారు. ఇదొక ఫ్యాషన్ అయిపోయిం దీ మధ్య. ఏమిటో వెధవ బుద్ధులు!!

'వయస్సు 16 సం. ఎత్తు 5 అడుగుల 3 అంగుళాలు. నల్లగా వుంటాడు. కుడిచెంపమీద పెసరబద్దంత పుట్టుమచ్చ. ఎడమచేతికి ఆరువేళ్లు.' ఇవన్నీ ఆనవాళ్లు. ఆ ప్రక్కగా ఆ కుర్రవాడి ఫోటో వుంది. ఆ కుర్రవాణ్ని పట్టుకొని అప్పగించిన వారికి వేయినూట పదహారు రూపాయిల బహుమతి. దారి ఖర్చులు ఇస్తారట! ఆ మహానుభావుడు ఎవడికి దొరుకుతాడో కాని—వాడి రొట్టె విరిగి నేతిలో పడినట్లే!

జేబులో నున్న పావలా బిళ్ళను తడుముకొని టీకి బయలు దేరాను. ఇరవై పైసలు టీకి పోతుంది. అయిదుపైసలు మిగులుతుంది సిగరెట్టు కొనుక్కుంటే సరి! అనుకొన్నాను.

అంతలో జ్ఞాపకం వచ్చింది చంచలాదేవి.

'అయ్యబాబోయ్! సిగరెట్టు కాల్చుకుని ఇంటికెడితే వాసన నను పసిగట్టి చంపేస్తుంది. ఈ పూట కూడు పెట్టకుండా మాడ్చేస్తుంది' అనుకొన్నాను.

నా దారి కడ్డుగా కుర్రవా డెవడో వచ్చాడు.

ఠక్కున ఆగాను.

"బాబూ! అయిదుపైసలు దానం చేయండి! తిండి తిని నాల్గురోజు లయింది' అన్నాడు దీనంగా చేతులు ముందుకు చాచి.

వాడి ఆకారం చూసి నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. కళ్ళు లోతుకుపోయి, ముఖమంతా వాడిన పుష్పంలా వుంది. మాటలు నూతిలోంచి వస్తున్నట్లున్నాయి. 'భారతమాత బిడ్డ వురా నాయనా!' అనుకున్నాను మనస్సులో జాలిగా.

వాడ్ని కాస్త పరిశీలగా చూస్తే ఎక్కడో చూసినట్లుంది. ఎక్కడా....? ఓ! ...భలే! ఇందాక పేపర్లో "కనబడుటలేదు' అని ఫోటోపడ్డ కుర్రవాడిలా వున్నాడు. అయితే... ముఖం నీర్సంగా వుండటం వలన గుర్తుపట్టలేక పోతున్నాను.

నావైపే చూస్తున్నాడు దీనంగా.

మళ్లీ ముఖాన్ని పరిశీలించాను.

తప్పకుండా ఆ కుర్రవాడే! 'అదృష్టం నన్ను వెదుక్కుంటూ వచ్చింది' అనుకొన్నాను.

"టీ త్రాగుదువుగాని రా!" అన్నాను.

అనుకోని ఆహ్వానానికి అతని ముఖంలో ఆనందం ఆశ్చర్యం కనిపించాయి. మంత్రించిన వానిలా నా వెనకాల

నడిచాడు. క్రీ గంట అతన్ని చూస్తూ ముందుకు నడిచాను.

టీ తెప్పించి త్రాగమని ఇచ్చాను. ఎత్తిన కప్పును దింప కుండా ఆతృతగా వేడి వేడి టీని గడగడ నోట్లో పోసు కొంటున్నాడు. మళ్ళీ అతన్ని ఒకసారి పరీక్షించాను. ఆ కుర్రవాడే! తేడా యేమీలేదు. కుడి బుగ్గమీద పెసర బద్దంత పుట్టు మచ్చ. ఎడమ చేతికి ఆరువ్రేళ్లు వున్నాయి.

కప్పును క్రిందపెట్టి నావైపు కృతజ్ఞతగా చూసాడు.

"ఏవూరు మనది?" అని అడిగాను నెమ్మదిగా.

భయంతో చూసాడు నా వైపు.

"ఫర్వాలేదు చెప్పు....భయమేమీలేదు"అన్నాను అభయ మిస్తున్నట్టుగా.

"బ్రా .. హ్మణ....గూడెం."

ఇందాక పేపర్లో ఆ అబ్బాయిది 'బ్రాహ్మణ గూడెం'అని చదివినట్లు జ్ఞాపక మొచ్చింది నాకు.

"ఇంట్లోంచి పారిపోయి వచ్చేవు కదూ....?" అన్నాను చిరునవ్వుతో.

'ఔ' నన్నట్లు తలూపాడు.

"ఎందుకొచ్చేశావు ఇంట్లోంచి?"

"నేను రెండుసార్లు పరీక్ష తప్పాను. ఈ సంవత్సరం కూడా ఫెయిలయ్యాను. మా నాన్నగారు ఇంట్లోవుంటే బ్రతక నివ్వరు. అందుకని .. "

"ఏం చేస్తారు మీ నాన్నగారు?"

"న్యూస్ పేపరు ఏజంటు."

"మా ఇంటి కెడదాం పద!" అన్నాను.

"మీ ఇంటికా ....? నేను రాను" అన్నాడు మొండిగా.

"నువ్వు పారిపోయేవని మీ నాన్న పోలీసు రిపోర్టు

యిచ్చాడు. నిన్ను పోలీసులకు అప్పజెపితే-రెండు తన్ని మీ బాబు దగ్గరకు తీసుకెడతారు?''

''మీకు దణ్ణం పెడతాను. నన్ను మాత్రం పోలీసోళ్ళ చేతిలో పడేయొద్దు'' అన్నాడు వాడు.

''నీతో పనుంది! మా ఇంటికి రా! నిన్ను పోలీసులకు అప్పజెప్పను'' అని హామీ ఇచ్చాను.

దానితో మాట్లాడకుండా నా వెంట బయలుదేరాడు. దారిలో పారిపోతాడేమోననే భయంతో చేయిపట్టుకుని తీసుకెళ్ళాను.

ఇంటికి తీసుకొచ్చి చంచల కంతా చెప్పాను. ''బహుమతి వేయి నూట పదహారులే! వెంటనే తీసు కెళ్ళి తల్లి తండ్రుల కప్పజెప్పండి. ఈ నాటికి మీరూ సంపాదనా పరు లయ్యారు'' అంది.

మా మాటలు విని ఆ కుర్రవాడు ఏదో అర్థం చేసు కొన్నాడు. కుర్చీలోంచి ఠక్కున లేచి బయటకు పరుగెట్ట బోయాడు. షర్ట్ కాలర్ పట్టుకొని ఆపుచేశాను. ''పారిపోవ డాన్కి ప్రయత్నించావంటే పోలీసు స్టేషన్‌లో పడేస్తాను. మక్కెలు విరగ తన్నుతారు'' అన్నాను.

'వీడెవడురా? నాకు యముడులా దొరికాడు' అన్నట్లు నా వైపు కొరకొర చూసాడు.

ఆ రాత్రంతా నేను చంచలా నిదుర లేకుండా ఆ కుర్ర వాడ్ని జాగ్రత్తగా కాపలా కాసాం.

మరునాడుదయం కాఫీ త్రాగిన వెంటనే జాగ్రత్తగా బ్రాహ్మణ గూడెం తీసుకెళ్ళి తల్లితండ్రుల కప్ప జెప్పాను.

బహుమతి సొమ్ము వేయి నూట పదహారులతో ఇంటికి తిరిగొచ్చాను. కొడుకును తీసుకెళ్ళి అప్పజెప్పినందుకు ఆ అబ్బాయి తల్లితండ్రులు నన్ను ఎంత గొప్పగా పొగిడారో అంతా కూడా సగర్వంగా చెప్పాను చంచలకు.

"భలే బాగుందండీ! అయిదు పైసలు పెట్టుబడిలేకుండా వేయి నూట పదహారులు సంపాదించాం. మీరొక పని చేయండి? మీకెలాగూ ఉద్యోగం లేదు కనుక తప్పిపోయిన వాళ్ళ గురించి వేటాడి, ప్రకటించిన వాళ్ళ కప్పజెప్పండి! బ్రహ్మాండమైన వ్యాపారం" అంది క్రొత్త విషయాన్ని కనుగొన్న సైంటిష్టులా ఫోజెట్టి.

"ఏడిసినట్లుంది నీ తెలివి! ఆ కుర్రవాడు అనుకోకుండా అదృష్టం కొద్దీ దొరికాడు. అందరూ అలాగే దొరుకుతా రనుకొంటున్నావా?" అన్నాను.

"ఊ! మీ కసలు ఏ విషయంలో తెలివి తేటలున్నాయి? ఆ తప్పిపోయినవాడు ఏ ప్రాంతంవాడో తెలుసుకొని-దానిని బట్టి ఏ ప్రాంతంలో తిరుగుతుంటాడో ఊహించి గాలి స్తే వాడే కంట బడతాడు. వాడు దొరికితే మనం ఖర్చులతో సహా వసూలు చేయొచ్చు! అసలు దేనికైనా తెలివి తేటలు, తెగింపూ ఉండాలిలే" అంది మూతిని ముప్పై మూడు వంకర్లు తిప్పుతూ.

చంచల మాటల్లోని నిజం నాకు బోధపడింది. పైసా ఖర్చు లేకుండా బహుమతి సొమ్ములు కొట్టవచ్చు. "సరే" నని అంగీకరించాను.

రోజూ అన్నిరకాల పేపర్లు తెప్పించి-వాటిలో 'తప్పి పోయారు' అని ప్రకటింపబడ్డ వాళ్ళందరి ఫొటోలు, గుర్తులు జ్ఞాపకం వుంచుకునేవాణ్ణి. ఆ తర్వాత వేటాడడాన్కి బయలు దేరేవాడ్ని.

రెండు మూడు చిన్న కేసులలో విజయం పొంది చిన్న చిన్న మొత్తాలు పొందాను. నా పేరు నెమ్మదిగా చుట్టుప్రక్క లకు వ్యాపించింది-'పారిపోయే వాళ్ళని పట్టుకొంటున్నాన'ని.

నా బుర్రలో ప్రస్తుతం ఒక ఫొటోవుంది. బాగా పెద్ద

మొత్తం. జమిందారు కొడుకు కాబోలు-చిన్నవాడే పన్నెండు సంవత్సరాలు వయసు వాడు. అతన్ని గురించి నెమ్మదిగా ఆరా తీసి రాజమండ్రి ప్రాంతంలో వుండొచ్చునని ఊహించాను.

తక్షణం రాజమండ్రి బయలుదేరాను. తూర్పు గోదావరి అంతా పిచ్చి కుక్కలా తిరిగాను. కనిపించిన ప్రతీ కుర్రాడిని ఎగాదిగా చూసాను. ఆ రూపు రేఖలు గలవాడు ఎక్కడా తటస్థ పడలేదు.

విసుగుతో తిరుగు ప్రయాణం తలపెట్టాను. అనుకోకుండా రైల్వే కేంటీన్‌లో అటువంటి రూపు రేఖలు గలవాడు దొరికాడు. 'వాడు ఇంట్లోంచి పారిపోయొచ్చిన బాపతే! తెచ్చిన డబ్బులు అయిపోవడంతో హోటల్‌లో సర్వర్‌గా చేరాడు!' అని తెలిసింది ఇంకొక పెద్ద సర్వర్‌ను అడిగితే.

వెంటనే నా డైరీలో నున్న ఎడ్రసు ప్రకారం తండ్రికి ఫోను చేసాను. "మీ అబ్బాయి ఇక్కడ రైల్వే కేంటీన్‌లో వున్నాడు. వెంటనే రావాలి" అని ఫోను చేసొచ్చి నేను కేంటీన్‌లోనే కూర్చున్నాను. ఆ కుర్రవాడు సర్వ్ చేస్తుంటే గమనిస్తున్నాను! అలాగ సుమారు ఒకపూట గడిచిపోయింది. ఆ అబ్బాయి డ్యూటీ అయిపోయింది కాబోలు కేంటీన్‌కు వెనుకనున్న రూమ్‌లోకెళ్ళి భోజనంచేసి పడుకున్నాడు. నేను కేంటీన్‌లోనే కూర్చుని చూస్తున్నాను. సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తున్నాను. కాలం గడవటంలేదు.

నాకు విసుగెత్తి కేంటీన్‌లోంచి బయట కొచ్చాను. అంతలో పెద్ద మనిషి తరహాగల నలుగురు వ్యక్తులు కేంటీన్‌లో కెడుతూ నాకెదురయ్యారు. నేను వాళ్లను కాస్తంత పరిశీలనగా చూస్తూ-"ఏ వూరండి మీది?" అని అడిగాను.

నేనడిగిన దానికి జవాబు చెప్పకుండా-"కుర్రవాడు ఇక్కడున్నాడు, వెంటనే రమ్మని ఫోను చేసింది మీరేనా?" అని

ఎదురు ప్రశ్న వేశారు. ''నేనే'' అన్నాను.

నేను కేంటీన్ వెనుకనున్న రూమ్‌లోకి నడిచాను. వాళ్ళూ నా వెనుకే వచ్చారు.

కుర్రవాడి జాడ తెలిపినందుకు పావుగంట సేపు నన్ను భట్రాజు పొగడ్తలతో ముంచెత్తి బహుమతి సొమ్ము ప్లస్, దారి ఖర్చులు నా చేతిలో పెట్టారు. వెంటనే ట్రైన్ ఎక్కాను. ఇంటికి రాగానే 'నేనూ మగాడినే' అని ఒక ఫోజుకొట్టి-డబ్బు చంచల చేతికిచ్చాను.

నా వ్యాపారం దినదినాభివృద్ధి పొందుతోంది. కొంతమంది ఇంటికొచ్చి కేసు లప్పగించసాగారు. ప్రతీ కేసుకు పదో పరకో సంజుతూనే వున్నాను. నాల్గయిదు వేలు వెనకవేసాను. చంచలకు రెండు బంగారు వస్తువులు కొన్నాను. ఎందుకైనా మంచిదని ఒక ఐరన్ సేఫ్‌కొని, డబ్బు అందులో భద్ర పరిచాను.

''జాడ తప్పినవారి ఆచూకీ తీయబడును. ఫీజు అతి స్వల్పం'' అని ఒక చిన్నబోర్డు పెట్టాను ఇంటి బయట. దారంటా వెళ్ళేవాళ్లు ఆగి అది చదువుతుంటే-నా ముఖంలో గర్వం తొంగి చూసేది.

* * *

పడక కుర్చీలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తున్న నా దగ్గరికి నాభార్య చంచల చేతిలో పేపరుతో, పరుగులాంటి నడకతో వచ్చింది.

''ఏమండోయ్! ఇది చూసారా? కలవలపల్లి జమిందారు గారబ్బాయి రఘువీర్ ఇంట్లోంచి పారిపోయేడట. వయస్సు ఇరవై సంవత్సరాలట....'' అని ఆనవాళ్ళన్నీ గడగడ చదివేసింది. నాకు చిర్రెత్తుకొచ్చింది. ''బహుమానమెంతో తగులడు ముందు'' అన్నాను.

''అయిదు వేల రూపాయి''లంది చేతులూపుతూ.

ఆ మాట వినగానే నా చెవులు చేటంతయ్యాయి! కళ్ళు గుండ్రంగా తిరిగాయి. పట్టుకుంటే అయిదు వేలు....అయిదు వేలు....జమిందారు కొడుకు అనుకున్నాను మనస్సులో.

చంచల చేతిలోంచి పేపరు లాక్కొని ఆ కుర్రవాడి ఫోటోను మనస్సులో గాఢంగా ముద్రించుకొని, గుర్తులన్నీ కంఠస్థంచేసి, జేబులో కొంత డబ్బు వేసుకొని వేటకు బయలుదేరాను.

ఇరవై రోజులపాటు ఉభయ గోదావరులు తిరిగాను. ప్రతీ సందు గాలించాను. ఆ రెండు జిల్లాలలోను రెండు వందలు ఖర్చుచేసుకొని కృష్ణాజిల్లాలో కడుగెట్టాను. చిన్న చిన్న వూళ్లు సయితం తిరిగాను.

వాడు జమిందారు గారబ్బాయి. ఇరవై ఏళ్ళ వయసు వాడు. బహుశా విలాస పురుషుడయి వుండొచ్చు ననుకొని ప్రతీ హోటలు, ప్రతీ లాడ్జిoగు వెదికాను. ఏమూలా కని పించలేదు. ఎక్కడున్నాడో శ్రీకృష్ణ భగవానుడు.

విరామం లేకుండా తిరగడం వలన విసుగెత్తి విజయవాడ చేరాను. రెండు రోజులు విజయవాడంతా వేటాడి, తిరుగు టపా కట్టేద్దామనుకొన్నాను.

ఆదివారం సాయంకాలం. విజయవాడ రోడ్లన్నీ కళకళ లాడుతున్నాయి. సినిమాల కెళ్ళే జంటలు, రోడ్డు ప్రక్క నిల్చుని అమ్మాయిలకు ఫోజుకొట్టే కుర్రకారుని చూస్తూంటే భలే చూడముచ్చటగా వుంది.

తాపీగా సిగరెట్టు కాల్చుకుంటూ, కృష్ణా తరంగాలమీద నుంచి వచ్చే చల్లగాలులను పీల్చుకొంటూ, ఇంటి దగ్గర చంచల ఏమి చేస్తున్నదోనని ఆలోచిస్తూ 'గాంధీ హిల్' ఎక్కాను.

ప్రతీ అబ్బాయి ప్రక్కన ఒక అజంతా శిల్పం.

ప్రతీవాడి నోట్లోను రైలింజన్లలా పొగలు కక్కుతూ సిగరెట్టు.

రంగు రంగుల చీరలు గుబాళించే సెంటు వాసనతో ఒంటిగానున్న మగాడ్ని మత్తెక్కిస్తున్నారు.

"సార్! అగ్గిపెట్టె ...."

ప్రక్కకు తిరిగి చూసాను.

నా ముఖంలోకి విద్యుచ్ఛక్తి ప్రవహించి విద్యుల్లతలా వెల్లి విరిసింది

మనసు ఆనందంతో పగ్గాలు తెంచుకొని ఎక్కడెక్కడకో పరుగులు తీసింది.

ఎన్నో యుగాలుగా తపస్సు చేస్తున్న భక్త శిఖామణికి భగవంతుడు హఠాత్తుగా ప్రత్యక్షమయితే కలిగినంత ఆనందం కలిగింది నాలో.

అప్పటివరకు ఆవహించిన అలసట, అసహనం పోయి దానిస్థానే ఉత్సాహం వచ్చింది.

'దొరికావురా! దొంగ వెధవా' అనుకున్నాను మనస్సులో. ఒకసారి కాదు. వేయిసార్లు.

గబగబ జేబులో చేయిపెట్టి శిథిలావస్థలో నున్న పేపరు తీసి, కంగారుగా విప్పి ఫొటో చూసాను. కళ్లు మరింత పెద్దవైనాయి.

ఆ కుర్రవాడే---

ఏమీ తేడాలేదు---

అదే నొక్కుల జుత్తు. నుదిటిమీద మచ్చ. అందమైన పిల్లి కళ్లు. అతనే! .... అతనే!! ఫొటోను అతన్ని మార్చి మార్చి చూసాను. సెంట్ పర్సెంటు ఆ కుర్రవాడే....రఘు

వీరే! నా ప్రవర్తనకు బిత్తరపోతూ చూసాడు నా వైపు.

అగ్గిపెట్టె ఇచ్చాను. విలాసంగా సిగరెట్టు వెలిగించుకుని రింగు రింగులుగా పొగ వదిలాడు గాలిలోకి.

"మిష్టర్ మనదేవూరు....? ఏం పేరు....?" అన్నాను మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.

ఒకసారి తల ఎగరేసి-"ఏ వూరయితేనేం? ఎందుకా విషయం?" అన్నాడు కాస్తంత ఘరానాగా.

'వీడు జమిందారు కొడుకు. అందులోనూ యువక మహాశయుడు. కనుక కాస్తంత ధైర్యం, దానికి తగ్గట్టు పెంకి తనం జాస్తి. నెమ్మదిగా మాటలతో టోనులోకి లాక్కోవాలి' అనుకొన్నాను.

"ఏమీలేదు! నువ్వు ఇంట్లో చెప్పకుండా వచ్చేశావు కదూ! నీ గురించి నీ మనుష్యులు, పోలీసులు దేశమంతా గాలిస్తున్నారు" అన్నాను చావు కబురు నెమ్మదిగా చెవిని వేసినట్లు.

ఆమాట వినగానే అతని ముఖం నల్లగా కుమిలిపోయింది. పెదవుల మధ్యనున్న సిగరెట్టు జారి నేలమీద పడింది. మనిషి గుడ్లప్పగించి నావైపు చూస్తుండి పోయాడు.

కాస్సేపటికి తేరుకుని నా చేతులు గట్టిగా పట్టుకొని-"దయచేసి పోలీసులకు మాత్రం తెలియజేయకండి! పోలీసులు నన్ను తీసుకెళ్ళి మా మేనమామ కప్ప జెపుతారు. మామామయ్య చింతపండులాంటి తన కూతురు మొద్దును నా మెడకు గుదిబండగా తగలేస్తాడు. నా జీవితం పాడు చేయకండి" అన్నాడు ఆడదానిలా ఏడుస్తూ.

మేనమామ కూతురును పెళ్ళిచేసుకోవడం ఇష్టం లేక

ఇంట్లోంచి వచ్చేశాడని గ్రహించాను.

"మీ మామయ్యా నేను చిన్నప్పుడు ఒకే బెంచీమీద కూర్చుని, ఒకే పుస్తకంలో చదువుకొన్నాం. ఒకే ఆకులో తిని, ఒకే మంచంమీద పడుకొన్నాం. వాడికి నేను చెప్పి ఈ పెళ్ళి తప్పిస్తాను. నాకూడా రా!" అన్నాను.

"నిజంగా!" అన్నాడు.

"తప్పకుండా? నీకేం భయంలేదు. నాతో బయలుదేరు" అన్నాను.

గొర్రె కసాయివాడిని నమ్మినట్లు రఘువీర్ నామీద విశ్వాసంతో, నా స్వార్థం తెలియక నా వెనకబడ్డాడు, పాపం.... లోకజ్ఞానం తెలియనివాడు.

మేము స్టేషన్‌కి వచ్చేటప్పటికి బండి సిద్ధంగా వుంది.

ఇంటి కొచ్చేటప్పటికి రాత్రి ఏడు గంటలయింది.

"ఈ రాత్రికి మా ఇంటి దగ్గర పడుకుని-రేపుదయం మీవూరు వెడదాం" అన్నాను.

"సరే" నన్నాడు రఘువీర్.

అయిదువేల రూపాయిల పట్టు దొరికిందని మా ఆవిడ ఊళ్ళోవున్న అమ్మవార్లందరికీ అప్పటి కప్పుడు డజను టెంకాయలు కొట్టింది భక్తితో.

"రఘువీర్ జమిందారులబ్బాయి. రేపు నేను స్వయంగా తీసుకెళ్ళి అప్పజెప్పొస్తాను. ఇక్కడున్నంతసేపు అతని జమిందారీ నడవడకు లోపం రాకుండా బ్రహ్మాండమైన మర్యాద చేయాలి" అని చెప్పాను పంచలకు.

కోడి వేపుడుతో, మేక పులావుతో భోంచేసాం రఘువీర్, నేను.

"తెల్లవారగట్ల లేపు! రఘువీర్‌ను తీసుకెళ్ళాలి" అన్నాను.

రఘువీర్‌కు నా గదిలో ప్రక్క ఏర్పాటుచేసి, గది బయట చల్లని నేలమీద పడుకొన్నాను నేను. ఇరవై రోజులనుంచి ఇంటిపట్టున లేకుండా తిరుగుతున్నానేమో-కటిక నేలమీద పడుకున్నా, వెంటనే నిద్రాదేవి నన్ను కౌగలించుకుంది.

* * *

"ఏమండోయ్! చప్పున లేవండి! దొడ్డి గుమ్మం తలుపులు తీసున్నాయి. రఘువీర్ లేడు" చంచల కంగారుగా అరుస్తున్నది.

"రఘువీర్ లేడు" ఆమాట వినగానే నా నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది.

ఊడిపోతున్న లుంగీ పంచెను మొలకు గట్టిగా చుట్టుకొని బయటకు పరుగెత్తాను. దొడ్డి తలుపులు బార్లాతీసున్నాయి.

గబగబ లోనికొచ్చి రఘువీర్ పడుకున్న నా గదిలో కెళ్ళాను.

నా గుండె గుభేలు మంది. నెత్తిమీద పిడుగుపడినట్లు డిరిపడ్డాను. బుర్రగిర్రున తిరిగింది.

ఐరన్ సేఫ్ తెరచివుంది ... రఘువీర్ దొంగా ....? జమిందారు కొడుకు దొంగా ....?

ఐరన్ సేఫ్‌లో ఉండవలసిన ఐదువేలు, చంచల నగలు లేవు. రఘువీర్ మోసంచేసి పట్టుకుపోయాడు.

నిల్చున్న పళంగా బస్టాండుకు పరుగెట్టి స్టార్టవుతున్న బస్‌లో కెగిరి కూర్చున్నాను.

కలవలపల్లిలో దిగి రఘువీర్ గురించి వాకబుచేసాను.

ఆ వూరి జమిందారు లెవ్వరికీ రఘువీర్ పేరుగల కుర్ర

వాడెవరూలేరు. ఆరూపు రేఖలు గల యువకు లెవ్వరూ ఆ ఊరిలోలేరు. అసలు ఆ వూరి జమిందారు కొడుకులెవ్వరూ ఈ మధ్య ఇళ్ళ నుంచి పారిపోలేదని తెలిసింది.

నాకంతా అయోమయ మయిపోయింది.

ఈ రఘువీర్ ఎవ్వరో కాని నన్ను నట్టేటిలోముంచేసాడు.

నన్ను, నా వ్యాపారాన్ని సర్వనాశనం చేసేసాడు.

పోలీస్ స్టేషన్‌కెళ్ళి రఘువీర్ ఫొటోవున్న పేపరు ఇచ్చి జరిగినదంతా వివరంగా చెప్పాను ఇనస్పెక్టరుకు.

ఆ ఫొటోను గంటసేపు పరీక్షించి! ఏవో పాత రికార్డులు వెదికాడు ఇనస్పెక్టరు. ఊపిరి బిగపట్టి కూర్చున్నాను నేను.

"వీడు కలవలపల్లి జమిందారు కొడుకుకాడు. 'రఘునాథ్' అనే పాతకేడీ మీ వ్యాపారం సంగతి మీరు ఇంటి ముందు బోర్డుకట్టి, పారిపోయే వాళ్ళని వెదుకుతా మనడం, అన్నీ గ్రహించి, మిమ్మల్ని బుట్టలో పెట్టడాన్కి- తన ఫొటోను కలవలపల్లి జమిందారు గారబ్బాయిలా పేపర్లో వేయించు కొన్నాడు. మీరు వాడ్ని నిజంగా మిస్సింగ్ పెర్సన్ అనుకుని వెదికి పప్పులో కాలేసారు" అన్నాడు.

ఏం చేస్తానిపుడు? నాకు నేనుగా వెళ్ళి ఊబిలో దిగబడ్డాను.

పోలీసులు రంగంలోకి దుమికారు.

నేను కూడాలేని ఓపికను తెచ్చుకుని రఘువీర్ ఉరఫ్ రఘునాథ్ కోసం వెదకడం ప్రారంభించాను.

రఘునాథ్ గురించి దినపత్రికలలో చిన్న ప్రకటన వేయించాను—"కనబడుటలేదు!" అని. ఈ దొంగను పట్టి అప్పగించిన వార్కి 'తగిన' బహుమతి ఇవ్వబడును అన్నాను.

ఎంత కాలానికి రఘువీర్....సారీ! రఘునాథ్ మాత్రం కంటపడలేదు.

★


అంతరిక్ష
యాత్ర
రమణశ్రీ
INDIA

సీరియల్

(గత సంచిక తరువాయి)

3

విండ్ స్క్రీన్‌లగుండా బయటి దృశ్యాల్ని తిలకించ సాగారు ఏస్ట్రోనాట్స్ కమలాకర్, పద్మాకర్ యిద్దరూ.

ఆకాశం నీలంగా, లేత నీలంగా, ముదురు నీలంగా తరువాత ముదురు ఊదారంగులోకి క్రమేపీ ముదురు బూడిద రంగులోకి మారిపోయి చివరకు జెట్‌బ్లాక్‌గా మారిపోయి అలాగే వుండిపోయింది.

చూస్తున్న ఏస్ట్రోనాట్స్‌కు వింత రంగుల మార్పులు వింతవింత అనుభూతుల్ని కల్గించాయి.

క్రిందకు, భూమివైపు చూశారు ఏస్ట్రోనాట్స్. క్రింద కన బడిన వింత దృశ్యం వారిని ఆశ్చర్యంలో ముంచివేసింది.

భూమిలో సగభాగం క్రిందనుండి మనం చూసే శుక్ల పక్ష చంద్రుడిలా మెరిసిపోతూ కన్పించింది. మిగిలిన సగ భాగం ఎయిర్ పార్టికల్స్, ధూళికణాలు, నీటి ఆవిరి తుంప రులు మొదలగువాటితో కప్పబడి 'డిమ్' గా కనబడుతోంది.

కొద్ది నిమిషాలలోనే స్పేస్‌షిప్ భూమ్యాకర్షణ శక్తి నుండి తప్పించుకొని శూన్యంలోకి ఎగసి భూ కక్ష్యలో పరిభ్రమించసాగింది.

భూమ్యాకర్షణ శక్తినుండి విడుదలయిన కారణంగా తమ శక్తిలో విపరీతమైన మార్పులు రావడం గమనించా రిద్దరూ.

తమ కాట్స్‌మీదనుండి లేచి కూర్చున్నారు. వెంటనే కుషన్ ఛెయిర్‌లా మారాయి కాట్స్.

"పద్మాకర్, మీరు విండ్ స్క్రీన్‌లలోనుండి ఫొటోస్ తీస్తారా?" అడిగాడు కమలాకర్.

"ఎస్ మిష్టర్ కమలాకర్. మీరు గ్రౌండ్ కంట్రోల్‌ను కాంటాక్టు చేయండి."

"అలాగే" అంటూ ముందుకు వంగి టి. వి. సెట్ ఆన్ చేసి రేడియో ట్రాన్స్‌మిటర్ ద్వారా వైర్‌లెస్ సంకేతాలు పంపసాగాడు.

ఓ నిమిషం గడిచింది. రేడియో రిసీవర్‌కు కనెక్టు చేయబడిన హెడ్ ఫోన్‌లోంచి కమలాకర్‌కు వినబడుతున్న గురగుర శబ్దాలు క్రమేపీ తగ్గి గ్రౌండ్ కంట్రోల్ సిగ్నల్స్ రాసాగాయి. ఆ సిగ్నల్స్ వింటూ టి. వి. సెట్ స్క్రీన్ వైపు దీక్షగా చూడసాగాడు కమలాకర్.

స్క్రీన్‌లో అప్పటివరకు 'జిగ్ జాగ్' గా కనబడుతున్న అస్పష్టమైన గీతలు క్రమేపీ అదృశ్యమై మెల్లగా కొన్ని ఆకారాలు లీలగా కన్పించసాగాయి.

పద్మాకర్‌గూడా ఆతృతగా టి. వి. సెట్‌వైపు చూడసాగాడు, మూవీ కెమెరా స్విచ్ ఆఫ్ చేసి.

అరనిమిషం గడిచింది.

"హియర్ గ్రౌండ్ కంట్రోల్....హియర్ గ్రౌండ్ కంట్రోల్...." సిగ్నల్స్ ఆగిపోయి సురేష్ కుమార్ కంఠం గంభీరంగా విన్పించింది హెడ్ ఫోన్స్‌లోనుండి యిద్దరికీ. అదే సమయంలో టెలివిజన్ స్క్రీన్‌పై గ్రౌండ్ కంట్రోల్ రూంలో కూర్చొనివున్న సురేష్‌కుమార్ చిత్రం స్పష్టంగా కన్పించింది.

సురేష్‌కుమార్ని స్క్రీన్‌పై చూడగానే యిద్దరిలో ఆనందం గంతులు వేసింది.

"మిష్టర్ సురేష్‌కుమార్!" సంతోషంగా అరిచారిద్దరూ.

"ఎస్, మిష్టర్ కమలాకర్ అండ్ పద్మాకర్!" చిన్నగా నవ్వి అన్నాడు సురేష్‌కుమార్.

"హౌ ఆర్ యు డియర్ ఏస్ట్రోనాట్స్!"

"ఉయ్ ఆర్ వెరీ వెల్ సార్" అన్నాడు కమలాకర్ చిన్నగా నవ్వుతూ.

"మిష్టర్ కమలాకర్, ఇప్పుడు మీ రిద్దరూ స్పష్టంగా గ్రౌండ్ కంట్రోల్‌లోని టి. వి. స్క్రీన్‌పై కనబడుతున్నారు. గగనంలో పరిభ్రమిస్తున్న స్పేస్‌షిప్‌కూడా మాకు స్పష్టంగా కనబడుతూనే వుంది. మీ టెలివిజన్ స్క్రీన్‌పై నేను స్పష్టంగా కనబడుతున్నానని, నా సిగ్నల్స్ మీకు అందేవుంటాయని భావిస్తున్నాను" అన్నాడు సురేష్‌కుమార్.

"కరెక్ట్ సార్. మీ రిప్పుడు స్పష్టంగా, మా ఎదురుగా వున్నట్లు కనబడుతున్నారు. మీరు మాట్లాడుతున్న మాటలు చాలా క్లియర్‌గా వినబడుతున్నాయి" అన్నాడు పద్మాకర్ రిస్ట్‌మిర్రర్‌ను సర్దుకుంటూ.

"మిష్టర్ సురేష్‌కుమార్! ఇప్పుడు మేం పరిభ్రమిస్తున్న కక్ష్య భూమికి ఎంత దూరంలో వుందో చెప్పగలరా?" అడిగాడు కమలాకర్ ఉత్సాహంగా ముందుకు వంగుతూ.

"ఎస్ మిష్టర్ కమలాకర్! మీరు భూమికి మూడువేల మైళ్ళ దూరంలో గల కక్ష్యలో పరిభ్రమిస్తున్నారు" చెప్పాడు గ్రౌండ్ కంట్రోల్‌నుండి సురేష్‌కుమార్.

"డియర్ సురేష్‌కుమార్, ఇప్పుడు మేం వున్న లొకేషన్ పసిఫిక్ మహాసముద్రం మధ్యభాగం కదూ?" తన కుడిచేతివైపు బిగింపబడి వున్న మాప్‌పై కదులుతున్న నీడిల్‌ను చూస్తూ అడిగాడు కమలాకర్.

"ఎగ్జాక్ట్లీ!" తలూపాడు సురేష్‌కుమార్.

"మిష్టర్ సురేష్‌కుమార్, యీ కక్ష్యలోనే మేం ఎంత కాలం పరిభ్రమించాలి" అడిగాడు పద్మాకర్.

"ఇంకా స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. విశ్వంలో సంభవించే వాతావరణ మార్పులనుబట్టి మా నిర్ణయం మారుతూ వుంటుంది. వాతావరణం అనుకూలమైనప్పుడు మేమే తెలియచేస్తాం. అప్పుడు మరో రాకెట్‌ను ప్రేల్చి యీ కక్ష్యను అధిగమించి శూన్యంలో ప్రయాణించాలి" చెప్పాడు సురేష్‌కుమార్.

"థాంక్యూ మిష్టర్ సురేష్‌కుమార్" చెప్పాడు పద్మాకర్.

"మిష్టర్ కమలాకర్ అండ్ పద్మాకర్, బాస్ మీతో మాట్లాడుతారట! ప్లీజ్ లిజన్ టు హిమ్" చెప్పి కుర్చీలో నుండి లేచాడు సురేష్‌కుమార్.

"ఉయ్ ఆర్ రెడీ" ఉత్సాహంగా సర్దుకు కూర్చున్నారు వ్యోమగాము లిద్దరూ.

మరుక్షణం స్పేస్‌షిప్ కాప్‌స్యూల్‌లోని టి. వి. స్క్రీన్ పై చిరునవ్వు నవ్వుతూ మిశ్రా ప్రత్యక్షమయ్యాడు.

"గుడ్ ఈవినింగ్ బాస్!" అరిచా రిద్దరూ మిశ్రాను స్క్రీన్‌పై చూడగానే.

చిన్నగా నవ్వాడు మిశ్రా.

"కంగ్రాచులేషన్స్ మైడియర్ బాయిస్! మన మొదటి రాకెట్ ప్రయోగం విజయవంతంగా జరిగింది. ఇంతవరకు అన్ని విధులు సక్రమంగా నిర్వర్తించబడ్డాయి. నా కెంతో తృప్తిగా వుంది. నాకే కాదు, భారతావని యావత్తు ఆనంద డోలికలలో ఊగిసలాడుతోంది. థాంక్స్ టు గాడ్" ఆనందంగా అన్నాడు మిశ్రా.

మిశ్రా కళ్లు విజయగర్వంతో తళతళ మెరుస్తూ కన బడ్డాయి టి. వి. స్క్రీన్‌లో.

"థాంక్యూ బాస్!" అన్నాడు పద్మాకర్.

"లుక్ హియర్ మిస్టర్ పద్మాకర్, మీరు మరో వారం యీ కక్ష్యలోనే పరిభ్రమించవలసి వస్తుంది. ఆ సమయంలో ఆసియా ఖండంమీదుగా పరిభ్రమిస్తున్నప్పుడు భారత్‌ను సెంటర్‌గా తీసుకొని భూమిని కొన్ని ఫోటోలు తీయండి. భూమిలో నిక్షిప్తంగా వున్న కొన్ని లోహపు గనులను వెలికి తీయడానికి ఆ ఫోటోలు భూగర్భ శాస్త్రజ్ఞులకు చాలా ఉపయోగపడతాయి" చెప్పాడు కంట్రోల్ రూంనుండి మిశ్రా.

"అలాగే బాస్!" అన్నాడు పద్మాకర్.

"మిష్టర్ కమలాకర్, హౌ ఆర్ యు?"

"వెరీ ఫైన్ బాస్!" చిన్నగా నవ్వాడు కమలాకర్.

"డియర్ యంగ్ బాయిస్! సరిగ్గా యిప్పటికి మీరు బయలుదేరి పదిహేను నిమిషాల యిరవై సెకన్లు అయింది. మరో నలభై అయిదు నిమిషాలలో మీరు కాప్స్యూల్‌కు సంబంధించిన ఎయిర్ ప్రెజర్, ఆక్సిజన్ పొజిషన్, ఫ్యూయల్ కండిషన్ మొదలగు వివరాలు తెలియచేయాలి. డోంట్ ఫర్‌గెటిట్!"

"ఎస్ బాస్! మాకు యింకా మీరు చెప్పిన సూచనలు చెవులలో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి" అన్నాడు కమలాకర్.

"థాంక్సు మిస్టర్ కమలాకర్. బై దిబై యింకా కొద్ది క్షణాలలో డాక్టర్ థామస్ మిమ్మలను చూస్తారు. వారికి కావలసిన వివరాలు అందచేయండి" చెప్పాడు మిశ్రా.

"అలాగే బాస్" తలూపారు యిద్దరు వ్యోమగాములు.

మరుక్షణం కాప్స్యూల్‌లోని స్క్రీన్‌పై రాకెట్ కేంద్రం

డైరెక్టర్ మిశ్రా ఆకారం తొలగిపోయి డాక్టర్ థామస్ ఆకారం కనబడింది.

"హల్లో, గుడ్ యీవెనింగ్ డాక్టర్!" విష్ చేశారు ఏస్ట్రోనాట్స్ యిద్దరూ.

"వెల్ డియర్ ఏస్ట్రోనాట్స్! మీ సంతోషాన్నిబట్టి మీ ఆరోగ్యాన్ని చాలావరకు ఊహించగలుగుతున్నాను" చిన్నగా నవ్వుతూ అన్నాడు డాక్టర్.

"థాంక్యూ డాక్టర్!" అన్నాడు పద్మాకర్.

"ఆల్‌రైట్, యిప్పుడు మిమ్మల్ని మెడికల్ ఎగ్జామ్ చేస్తాను. సరి అయిన వివరాలు యివ్వండి" చెప్పాడు డాక్టర్.

"విత్ ప్లెజర్ సర్!" సమాధానమిచ్చాడు కమలాకర్.

"థాంక్యూ మిష్టర్ కమలాకర్, నౌ ప్లీజ్ టెల్ యువర్ నంబర్ ఆఫ్ హార్ట్ బీట్స్!"

"85 పర్ మినిట్ సర్!" మాస్క్‌కు ఎటాచ్ చేయబడిన కార్డియోగ్రాం రీడింగ్ చూసి చెప్పాడు కమలాకర్.

"ఫర్వాలేదు. అక్కడి వాతావర్ణానికి వుండవల్సిన విధంగానే వుంది.

"ప్లీజ్, మీ బ్లడ్‌ప్రెషర్ కండిషన్ కూడా చెప్పండి" అడిగాడు డాక్టర్ థామస్.

"ఎస్. సార్. 200/100 బి.పి. పొజిషన్ డాక్టర్!" బి.పి. ఆపరేటర్ రీడింగ్ చూసి చెప్పాడు కమలాకర్.

"కొంచం ఎక్కువగానే వుంది. అయినా ప్రమాదం లేదు" అన్నాడు డాక్టర్.

'థాంక్యూ." సంతోషంగా సమాధానం యిచ్చాడు కమలాకర్.

"మానసికంగా గానీ, శారీరకంగా గానీ మీ కేమైనా

మార్పులు కన్పిస్తున్నాయా?"

"నో డాక్టర్. గుండె కొట్టుకొనడంలో కొంచెం మార్పు కన్పించినా శారీరకంగా పెద్ద అసౌకర్య మేమీ లేదు" చెప్పాడు కమలాకర్.

"గుడ్ - అది సహజం. నెక్స్ట్ పద్మాకర్‌ని లైనులోకి రమ్మని చెప్పండి."

"థాంక్యూ డాక్టర్" టి. వి. కి కొంచం ప్రక్కకు జరురుతూ పద్మాకర్‌ను అటెండ్ అవమని చెప్పాడు.

"ఎస్ డాక్టర్! అయామ్ రెడీ" చిన్నగా నవ్వాడు పద్మాకర్.

"వెల్. మీ హార్ట్ బీట్స్ ఎలా వుంది?"

"84 పర్‌మినిట్ సర్!"

"గుడ్, బ్లడ్ ప్రెజర్ రీడింగ్?"

"210/100 సార్!"

"నెవర్ మైండ్! నార్మల్ బి. పి. అయినా అక్కడి వాతావర్ణానికి ఆ బ్లడ్ ప్రెజర్ వుంటుంది. మరేం కంగారు పడకండి."

"థాంక్యూ డాక్టర్!" చిన్నగా నవ్వాడు పద్మాకర్.

"వెల్ డియర్ ఎస్ట్రోనాట్స్! మళ్ళీ రేపు కలుస్తాను" విష్‌చేసి సీట్‌లోంచి లేచాడు డాక్టర్ థామస్.

"గుడ్‌బై డాక్టర్!" అన్నాడు పద్మాకర్.

మరి కొద్ది క్షణాలలో రాకెట్ సెంటర్ డైరెక్టర్ మిశ్రా ఫీల్డ్‌లోకి వచ్చాడు.

టి. వి. స్క్రీన్‌పై మిశ్రా కనబడగానే "వాట్ బాస్?" అని అడిగా రిద్దరు వ్యోమగాములు.

"డియర్ బ్రైట్ చాప్స్, మీకు భారతప్రజనుండి, దేశీయ, విదేశీయ ప్రముఖులనుండి అభినందనల పరంపర ఏవిధంగా

వస్తున్నదో చూడండి''

గ్రౌండ్ కంట్రోల్ రూంలోని వైర్‌లెస్ సెట్‌ముందు టేప్ రికార్డర్ స్విచ్ ఆన్ చేస్తూ అన్నాడు మిశ్రా.

ఉత్సాహంగా చెవులు రిక్కించారు యిద్దరు వ్యోమ గాములూ.

''హార్టీ కంగ్రాచులేషన్స్ డియర్ యంగ్ ఏస్ట్రోనాట్స్! మీ ప్రయాణం దిగ్విజయంగా కొనసాగాలని జాతి తరపున ఆకాంక్షిస్తున్నాను'' రాష్ట్రపతి కంఠం గంభీరంగా వినబడింది.

''మిష్టర్ కమలాకర్ అండ్ పద్మాకర్, మీనుండి యావద్భారతజాతి మహత్తర విషయాలను తెలుసుకోవాలని ఆతృత చెందుతోంది. విష్ యు గ్రాండ్ సక్సెస్!'' ప్రధాని కంఠం మృదుమధురంగా వినబడింది.

ఆవెంటనే వరుసగా వివిధనాయకులు, సైంటిస్టులు, దేశీయ, అంతర్జాతీయ ప్రముఖులు అందచేస్తున్న శుభాభినందనలు వైర్‌లెస్‌లోనుండి పరంపరగా వస్తున్నాయి.

అందరికీ మౌనంగా థాంక్స్ చెబుతున్నారు కమలాకర్, పద్మాకర్‌లు.

4

మార్స్-2 స్పేస్ షిప్ గగనంలోకి ప్రయోగింపబడి ఆరు రోజులు గడిచాయి. ఇంతవరకు ఏలోటు లేకుండా తృప్తికరంగా సాగిపోతోంది రాకెట్ గమనం.

ప్రతిరోజూ ఏస్ట్రోనాట్స్ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా గమనిస్తూ తగిన మార్పులను సూచిస్తున్నారు గ్రౌండ్ కంట్రోల్ వైద్యాధికారులు.

గ్రౌండ్ కంట్రోల్‌లో పనిచేసే ప్రతి సైంటిస్ట్ ముఖం

లోనూ విజయగర్వం తాండవిస్తోంది.

టెలివిజన్ స్క్రీన్‌పై స్పేస్‌షిప్ గమనాన్ని పరిశీలిస్తున్న మిశ్రా, చకచక ఏవో రెండుమీటలు నొక్కి చీఫ్ సురేష్ కుమార్‌ని పిలిచాడు.

గబగబ సురేష్‌కుమార్ అక్కడకు వచ్చాడు.

"మిష్టర్ సురేష్‌కుమార్, యీ కక్ష్యలో వాతావర్ణ విశేషాలు ఎలా వున్నాయ్. ఈ కక్ష్యను అధిగమించడానికి యిదే మంచి సమయమని భావిస్తున్నాను," అన్నాడు మిశ్రా.

"ఎస్ బాస్! మరో రెండు నిమిషాలలో మీకు రిపోర్ట్ యిస్తాను" గబగబ మరోయంత్రం దగ్గరకు నడిచాడు సురేష్ కుమార్.

"మిష్టర్ కిషోర్, స్పేస్‌షిప్ వేగం ఎంత?" స్పీడ్ కంట్రోలర్ కిషోర్‌ను అడిగాడు మిశ్రా.

"ఒన్ థౌజండ్ మైల్స్ పర్‌మినిట్ బాస్" మరో యంత్రం ముందున్న కిషోర్ చెప్పాడు.

"థాంక్యూ. వెంటనే ఆ వేగాన్ని సగానికి తగ్గించండి. వేగం తగ్గించడంలో కేర్ తీసుకోండి."

"అల్‌రైట్ బాస్" గబగబ తన పనిలో నిమగ్నుడై పోయాడు కిషోర్.

"వాతావర్ణం మనకు చాలా అనుకూలంగా వుంది బాస్!" తన రిపోర్ట్ చెప్పాడు సురేష్‌కుమార్.

"థాంక్యూ మిష్టర్ సురేష్! బై ది బై స్పేస్ షిప్‌ను ఆ కక్ష్య నుండి శూన్యంలోకి పంపే రాకెట్‌ను రీ చెకప్ చేయండి."

"ఓ. కె. బాస్!" అంటూ చకచక ముందుకు నడిచాడు కిశోర్‌కుమార్.

టి. వి. స్క్రీన్‌లో నుండి స్పేస్‌షిప్ గమనాన్ని చూస్తూ

వైర్‌లెస్ సెట్ ఆన్ చేశాడు మిశ్రా.

"అటెన్షన్ ప్లీజ్ డియర్ ఏస్ట్రోనాట్స్!" గంభీరంగా అన్నాడు మిశ్రా.

"ఎస్ బాస్!"

"బి రెడీ! మరి కొన్ని నిమిషాలలో మీ స్పేస్ షిప్ ప్రస్తుతం పరిభ్రమిస్తున్న కక్ష్యను ఛేదించుకొని శూన్యంలోకి మళ్లీ ప్రయాణం కొనసాగించబోతూంది. స్పుత్నిక్ వేగం కూడా సగానికి తగ్గించ బడింది" అన్నాడు మిశ్రా.

"ఆల్ రైట్ బాస్! థాంక్యూ!" పల్కారు వ్యోమగాము లిద్దరూ.

"డియర్ కమలాకర్!" తిరిగి గంభీరంగా చెప్ప సాగాడు మిశ్రా.

"స్పేస్‌షిప్ ఫ్లోర్ ప్లేట్ తొలగించి కక్ష్యాంతరవేధి రాకెట్ కండిషన్‌లో వున్న విషయం చెకప్ చేసి చెప్పండి. మిష్టర్ పద్మాకర్, మీరు వైర్‌లెస్ ముందే కూర్చుని జాగ్రత్తగా విడవకుండా సిగ్నల్స్ పంపిస్తూండండి. కక్ష్యను ఛేదించే సమయంలో ఓ రెండు నిమిషాల పాటు వార్తా సంబంధాలు విచ్ఛిన్న మవుతాయి. ఆ సమయంలో మీకూ మాకూ రేడియో టి. వి. సంబంధాలు వుండవు. అయినా మీరు నిరంతరంగా సిగ్నల్స్ పంపిస్తూండటం వలన, కక్ష్యను ఛేదించిన వెన్వెంటనే వార్తా సంబంధాలు మెరుగయ్యే అవ కాశం వుంటుంది."

"ఓ.కె. బాస్!" పల్కాడు పద్మాకర్.

"మిష్టర్ కమలాకర్, మరో విషయం. రాకెట్ ప్రేల్చ గానే, కక్ష్యను ఛేదించేటప్పుడు మీ స్పేస్ షిప్ రెండు నిమి షాలు మాకు కన్పించదు. ఆ సమయంలో స్పేస్ షిప్ సంరక్షణ భారం కేవలం మీదే! కక్ష్యను ఛేదించగానే

వెంటనే కాలింగ్ చేయి'' అన్నాడు మిశ్రా.

"విత్ ప్లెజర్ బాస్!" వుత్సాహంతో అన్నాడు కమలాకర్.

ఒక నిమిషం గడిచింది. రాకెట్ చెక్ చేయడం ముగించాడు కమలాకర్.

"రాకెట్ నెంబర్ టూ ఓ. కె. బాస్!" చెప్పాడు కమలాకర్.

"ప్లీజ్ పే అటెంక్షన్! సరిగ్గా మరో తొంభై సెకన్లకు రాకెట్ ప్రేలుతుంది. గుడ్‌లక్'' చెప్పాడు మిశ్రా. వెంటనే మిశ్రా రూపం కాప్స్యూల్ లోని టి. వి. స్క్రీన్ పైనుండి తొలగిపోయింది.

"మిష్టర్ సురేష్‌కుమార్, క్విక్. మరో నిమిషంలో రాకెట్ ప్రేలాలి. కౌంట్ బిగిన్ చేయండి'' చెప్పాడు మిశ్రా తన చేతులను మెషిన్లపై నాట్యం చేయిస్తూ.

కౌంట్ బిగిన్ చేశాడు సురేష్‌కుమార్. గ్రౌండ్‌కంట్రోల్ లోని అందరూ తమ తమ పనులలో నిమగ్నులై పోయారు.

"సిక్స్టీ....ఫిఫ్టీనైన్....టూ....ఒన్...ఫైర్'' బిగ్గరగా అరిచాడు సురేష్‌కుమార్.

మిశ్రా చేయి సెకండ్ లిఫ్ట్ ఆఫ్ బటన్‌ను బలంగా ప్రెస్ చేసింది.

అంతే, మరుక్షణం కంట్రోల్ లోని టెలివిజన్ స్క్రీన్‌పై గగనంలో వేగంగా పయనిస్తున్న స్పేస్ షిప్ అదృశ్యమయిపోయింది.

5

స్లో అయిన కారులోనుండి బలంగా డోర్ తోసుకుని వుండలా చుట్టుకొని క్రింద పడిపోయిన నరేందర్ చటు

క్కున లేచి నిలబడ్డాడు.

క్రింద మేకుల్లా వున్న రాళ్ళు పరుచుకొని వుండడంతో శరీరం చాలాచోట్ల గీరుకుపోయింది. సూట్ అంతా చిరిగి పోయింది. అతను కారాగిన శబ్దానికి వెనక్కి తిరిగి చూశాడు. అతని గుండెలు దడదడ లాడాయి. జేబులో నుండి రివాల్వర్ తీశాడు.

కారునుండి దిగిన ఆ ఇద్దరు వ్యక్తులు, రివాల్వర్లు పుచ్చుకొని నరేందర్ వైపు పరుగెత్తుకొస్తున్నారు.

క్షణకాలం వస్తున్న ఆ ఇద్దరివైపు చూశాడు నరేందర్.

చటుక్కున ఆ ఇద్దరిలో పొట్టివాడివైపు చూసి రివాల్వర్ పేల్చాడు. పొట్టివాడు పిల్లిలా ప్రక్కకు గెంతాడు. మరో సారి కాల్చాడు. మళ్ళీ గురి తప్పింది.

పొడుగు వ్యక్తి రివాల్వర్ నరేందర్ వైపు గురిపెట్టాడు. నరేందర్ వేగంగా ముందుకు పరుగెత్తసాగాడు.

ధన్ మంటూ ప్రేలింది వెనకనుండి రివాల్వర్. నరేందర్ చెవుల ప్రక్కనుండి దూసుకుపోయింది బుల్లెట్.

మరింత వేగంగా పరుగెత్తసాగాడు నరేందర్. అతని ధ్యేయం ఒక్కటే. ఎస్. బి. డైరెక్టర్ని కలుసుకోవాలి. తనకు తెలిసిన రహస్యాన్ని ఆయనకు తెలియజేసిన తరువాత తన ప్రాణాలు పోయినా ఫర్వాలేదు.

పరుగెత్తుతూనే వెనక్కి తిరిగి చూశాడు. పొట్టివాడు పరుగెత్తలేక ఆయాసపడుతున్నాడు. పొడుగు వ్యక్తి అతన్ని ఎంకరేజ్ చేస్తున్నాడు.

ముగ్గురూ అలసిపోయారు. ఆ రోడ్డులో కారేదైనా వస్తుందేమోనని నరేందర్ ఆశ. మళ్లీ ఎవరైనా వస్తే తమ పని సానుకూలమవదని, ఎవరూ రాకుండానే అతని వద్దనుండి రహస్యం రాబట్టాలని ఆ ఇద్దరి వ్యక్తుల దీక్ష.

ముగ్గురూ పరుగెత్తుతున్నారు. పొలాల కడ్డంబడి పరుగెడుతున్న నరేందర్ చటుక్కున మెయిన్‌రోడ్ వైపు తిరిగాడు.

దూరంగా కారు హారన్ వినిపించింది. మరింత ఉత్సాహంగా పరుగెత్తసాగాడు నరేందర్. కారు హారన్ విన్న వాళ్ళిద్దరి గుండెలు దడదడలాడాయి. పొట్టి వ్యక్తి, పొడుగు వానివైపు క్రూరంగా చూశాడు.

"షూట్ హిమ్ ఎక్సాక్ట్లీ" అరిచాడు.

పొడుగు వ్యక్తి చేతిలోని రివాల్వర్ ధన్‌మంటూ ప్రేలింది.

పరుగెడుతున్న నరేందర్ చటుక్కున ఆగిపోయాడు. అతని కుడిభుజంలో కాల్చిన ఇనుపగుండు పెట్టినట్లయింది.

"అమ్మా" చిన్నగా మూల్గాడు నరేందర్. రివాల్వర్ చేసిన గాయంనుండి రక్తం స్రవించసాగింది.

చటుక్కున వెనక్కి తిరిగి రివాల్వర్ ప్రేల్చబోయాడు నరేందర్.

సాధ్యపడటంలేదు. చెయ్యి కొలిమిలో పెట్టిన ఇనుప కడ్డీలా మాడసాగింది. అప్రయత్నంగా రివాల్వర్ క్రిందకు జారింది.

ఎడం చేతితో రివాల్వర్ అందుకోబోయాడు వంగొని.

"వెరి వెల్, మళ్లీ కాల్చు" ఎంకరేజ్ చేశాడు పొట్టి వ్యక్తి పొడుగువాడిని.

నరేందర్ చటుక్కున వంగోబోతున్న వాడల్లా లేచి నిలబడ్డాడు. అతని చెవుల్లో పొట్టి వ్యక్తి మాటలు గింగురుమన్నాయి. గుండెల్లో కర్తవ్యం గరగరమంది.

మొండి ధైర్యంతో ముందుకు పరుగెత్తసాగాడు, శక్తినంతా కూడదీసుకుని.

"హమ్మయ్య." మెయిన్ రోడ్ మీదకు వచ్చి నిట్టూర్చాడు నరేందర్. అతని చేతినుండి చాలా రక్తం స్రవిస్తోంది. ఎలాగైనా ఇక్కడినుండి తప్పించుకోవాలి. పోలీసుల దగ్గరకన్నా చేరాలి! అతని మస్తిష్కం తీవ్రంగా ఆలోచిస్తోంది.

వెనక్కి తిరిగి చూశాడు. ఎవరూ వస్తున్నట్లు అతనికి అలికిడి వినిపించలేదు.

రోడ్పై దూరంగా కారు హెడ్లైట్ల కాంతి కనిపించింది.

"థాంక్ గాడ్" గబగబా రోడ్డుకు అడ్డంగా పరుగెత్తాడు నరేందర్.

చటుక్కున కారాగింది. డ్రైవింగ్ సీటులోవున్న వ్యక్తి తలపైకెత్తి చూశాడు.

"సార్, ప్లీజ్ హెల్ప్ మి."

"ఎవరు మీరు? అరే! అదేమిటి, చేతికి గాయమైనట్లుంది. కమాన్ కారెక్కండి."

"థాంక్యూ సర్. నా కంత సహాయం అక్కరలేదు. నేను ఇండియన్ సీక్రెట్ బ్రాంచి ఏజెంటును. కొన్ని రహస్యాలు నా దగ్గరనుండి తెలుసుకోడానికి శత్రువులు నన్ను వెంబడించారు. వాళ్లుచేసిన గాయమే అది!"

"మైగాడ్. మీరు సీక్రెటు ఏజెంటా? వెరీ గ్లాడ్ టు మీట్ యు. కారెక్కండి. మీరు ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్తాను."

"నో థాంక్స్. శత్రువుల దగ్గర మారణాయుధాలు చాలా వున్నాయి. నేను మీ కారులో రావడం అంత మంచిదికాదు. కానీ నేను మీ కారులో ఎక్కినట్లు భ్రమింపచేయాలి. అదిగాక మీరు పట్నం చేరిన వెంటనే ఏ పోలీస్ స్టేషన్లోనైనా ఈ విషయం రిపోర్ట్ చేయండి. వెంటనే 48 వ మైలు రాయి

దగ్గరకు రమ్మని చెప్పండి.''

''విత్ ప్లెజర్ సర్. వాళ్ళను నమ్మించి నా వెంట పడేట్లు చేసుకోవాలి. అంతే కదా! ఇటీజ్ ఈజీ.''

''థాంక్యూ'' మెరుస్తున్న కళ్ళతో అన్నాడు నరేందర్.

అంతలో వెనుకనుండి హెడ్ లైట్ల కాంతి అస్పష్టంగా కన్పించింది.

''థాంక్యూ బ్రదర్. వెంటనే పోలీస్ స్టేషన్‌లో రిపోర్ట్ చేయండి'' చీకటిలో కలిసిపోయాడు నరేందర్.

ఎదురుగా వస్తున్న కారు దగ్గరయింది.

గిర్రున కారును బాక్ చేశాడా వ్యక్తి. ఎవరోకారు ఎక్కినట్లుగా డోర్ తెరిచి బలంగా మూశాడు. మరుక్షణం చిన్న జర్క్‌తో కారు ముందుకు దూకింది.

వెనక వస్తున్న కారు ముందు కారును చూడగానే స్పీడందుకుంది. రెండు కార్లూ పోటీ పడ్డట్లుగా రోడ్ మీద పరుగెత్త సాగాయి.

నరేందర్ గబగబ ముందుకు నడక సాగించాడు. భుజం మీది గాయం విపరీతమైన బాధపెడుతోంది.

రెండు నిమిషాలలో 48 వ మైలురాయి చేరుకున్నాడు. ఇక ముందుకు నడుద్దామన్నా ఓపికలేదు. అక్కడే కూలబడి పోయాడు.

చుట్టూ గాఢాంధకారం. కీచురాళ్ళు వికృతంగా అరుస్తున్నాయి. రోడ్ ప్రక్కన చెట్లు దయ్యాల్లా తలలు విరబోసుకుని కనబడుతున్నాయి.

క్షణక్షణానికి భుజానికేర్పడిన గాయం బాధ అధికం కాసాగింది. మైలు రాయికి ఆనుకొని కూర్చుండిపోయాడు.

అయిదు నిమిషాలు గడిచాయి.

దూరంగా రోడ్ మీద హెడ్‌లైట్స్ కాంతి కన్పించింది.

ఎక్కడలేని ఉత్సాహం తెచ్చుకొని లేచాడు. బాధగా నడుచుకుంటూ ముందుకు కదిలాడు.

హెడ్ లైట్సు కాంతి దగ్గరయింది.

ఎదురుగా చూస్తున్న నరేందర్ వులిక్కిపడ్డాడు. ఆ హెడ్ లైట్సు పోలీస్ వెహికిల్ ఏకావు. చిన్నకారువి. ఆ కారువైపు చూసి గిరుక్కున వెనక్కి తిరిగి పరుగెత్త సాగాడు.

అప్పటికే ఆలస్యమయి పోయింది. కారులోని పొట్టి వ్యక్తి చేతిలోని రివాల్వర్ పొగలు గ్రక్కింది.

6

గ్రౌండ్ కంట్రోల్ కేంద్రమంతా నిశ్శబ్ద వాతావర్ణం అలుముకొని వుంది. అందరి ముఖాల్లోనూ, గంభీరం చోటు చేసుకొని వుంది.

మిశ్రా, సురేష్ కుమార్‌లు చెరొక టెలివిజన్ స్క్రీన్‌ల ముందు కూర్చొని వున్నారు. వారిద్దరి తలలకు హెడ్ఫోనులు బిగింపబడివున్నాయి. సైంటిస్టులు అందరూ వివిధ యంత్రాల ముందు తమ పనిలో నిమగ్నులై వున్నారు.

అణుశక్తితో పనిచేసే గడియారంవైపు ఆతృతగా చూస్తూన్నాడు కిషోర్‌కుమార్.

"టు మినిట్స్ ఓవర్ బాస్!" అరిచాడు కిషోర్.

అంతా ఆతృతగా టి. వి. స్క్రీన్‌వైపు చూడసాగారు.

అప్పటివరకు తెల్లగా కనబడుతున్న టెలివిజన్ స్క్రీన్ పై తెలుపుదనంపోయి, నల్లటి పరదాలు కనబడసాగాయి. క్రమేపీ పరదాలు తప్పుకొని, మళ్ళీ తెల్లటి మేఘాలు, అవి కనుమరుగయిపోయి శూన్యం. మరికొద్ది క్షణాలలో ఏదో అస్పష్టమైన ఆకారం కనబడసాగింది.

"సక్సెస్" అరిచాడు మిశ్రా.

స్క్రీన్‌పై అప్పటివరకు అస్పష్టంగా కనబడుతున్న ఆకారం క్రమేపీ ఒక స్థిరంరూపం దాల్చింది. మరో రెండు క్షణాలలో స్పేస్‌షిప్ వాయువేగ, మనోవేగాలతో ప్రయాణిస్తూ గ్రౌండ్ కంట్రోల్ టెలివిజన్ స్క్రీన్‌పై ప్రత్యక్షమయింది.

స్పేస్‌షిప్‌లో వున్న పద్మాకర్ వైర్‌లెస్ ద్వారా సిగ్నల్స్ పంపిస్తూ కనబడుతున్నాడు. కమలాకర్ యంత్రాలన్నింటినీ పరీక్షిస్తున్నాడు.

గ్రౌండ్ కంట్రోల్‌లోని రేడియో ట్రాన్స్‌మిటర్ సెట్ నుండి మీటలు నొక్కి స్పీకర్‌లో "హల్లో....హల్లో.... స్పీకింగ్ ...." అని పల్కాడు వుత్సాహంగా.

"కాలింగ్ ఫ్రంమార్స్-2....కాలింగ్ ఫ్రంమార్స్2...." అస్పష్టంగా వినబడసాగాయి రేడియోలోనుండి పద్మాకర్ మాటలు.

"హియర్ గ్రౌండ్ కంట్రోల్....బాస్ స్పీకింగ్.... హియర్ గ్రౌండ్ కంట్రోల్...." మీటలు సవరిస్తూ అన్నాడు మిశ్రా.

"బాస్!" సంతోషంగా పల్కిన కంఠం యీసారి స్పష్టంగా విన్పించింది.

"ఎస్ మిష్టర్ పద్మాకర్! హియర్ గ్రౌండ్ కంట్రోల్! హౌ ఆర్ యు?" వుత్సాహంగా అరిచాడు మిశ్రా.

"మేం చాలా సంతోషంగా వున్నాం బాస్! ఈ రెండు నిమిషాలు అంతులేని యీ శూన్యంలో మానవ దర్శనభాగ్యం లేక అల్లాడిపోయాం. ఇప్పుడు మళ్ళీ అంతా మామూలే! మీరు యిక్కడి టి. వి. స్క్రీన్‌లో స్పష్టంగా కన్పిస్తున్నారు."

"హార్టలీ కంగ్రాచులేషన్స్ డియర్ ఎస్ట్రోనాట్స్! రెండవ రాకెట్ గూడా విజయవంతంగా ప్రయోగించబడింది. మీ ప్రయాణం యిక నిరాటంకంగా సాగిపోగలదని నా ఆశ!" చెప్పాడు మిశ్రా.

"థాంక్యూ బాస్!" పల్కారిద్దరు ఎస్ట్రోనాట్స్.

"డియర్ ఎస్ట్రోనాట్స్. యిప్పుడు మీరు భూమికి లక్ష మైళ్ళ దూరంలో వున్నారు. ఇదే వేగంతో మీరు పురోగమిస్తే, మరో నలభై ఆరు గంటలలో అతిముఖ్యమైన మరో కక్ష్యను చేరుకుంటారు" చెప్పాడు బాస్.

"ఓ. కె. బాస్! కమలాకర్ మీతో మాట్లాడతాడట!" చెప్పాడు పద్మాకర్.

"హల్లో కమలాకర్?"

"ఎస్ బాస్! అయామ్ క్వయిట్ ఓ. కె. బాస్!"

"థాంక్యూ. స్పేస్ షిప్ కండిషన్ ఎలా వుంది? ఫ్యూయిల్ రియాక్టర్స్ బాగా వర్కు చేస్తున్నాయా? రాడార్ స్క్రీన్‌పై పరిసరాలు బాగా కనబడుతున్నాయా?"

"స్పేస్ షిప్ కండిషన్ వెరీవెల్ బాస్! రాడార్ స్క్రీన్‌పై పదిమీటర్ల వ్యాసంలోగల పరిసరాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి బాస్. వ్యాసపరిమితిని పెంచే అవకాశం వుందా బాస్?" అడిగాడు కమలాకర్.

ఓ నిమిషం ఆలోచించాడు మిశ్రా.

"మిస్టర్ కమలాకర్, మీకు ప్రాక్టికల్స్‌లో యీ విషయం చాలాసార్లు చెప్పాం. ఇలాంటి చిన్న విషయాలను మరింత జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి. ఆల్‌రైట్, మీకు ఎక్కువ దూరం చూడవలసిన అవసరంవస్తే, రాడార్‌కు ఎడమవైపు షెల్ఫ్‌లోవున్న పరికరాలను వుపయోగించండి. మీకు అవసరమయినంత మేర శూన్యంలోకి చూడవచ్చు. బై ది బై

చెప్తా వినండి?

1. మన శరీరంలో 222 ఎముకలు ఉన్నాయి. మన శరీరపు బరువులో 15% ఎముకల బరువే. ఎముకలు చాలా గట్టిగా ఉంటాయి. కొయ్యకంటే మూడురెట్లు గట్టిగా ఉంటాయి ఎముకలు. మన శరీరంలోని ఎముకలన్నింటిలో మిక్కిలి గట్టిది మోకాలి దిగువన ఉండే ఎముక.

2. గుండె రక్తాన్ని శరీరమంతా ప్రసారం చేస్తుంది. గుండె విరామం లేకుండా పని చేస్తుందనుకుంటాము. కాని ప్రతి స్పందనానికి స్పందనానికి మధ్య సెకండులో ఆరోవంతు కాలం ఇది విశ్రాంతి తీసుకుంటుంది.

3. అప్పుడు పుట్టిన బిడ్డ మెదడు 20 తులాల బరువుంటుంది. పూర్తిగా పెరిగిన మనిషి మెదడు వీశె కన్నా ఎక్కువ బరువు ఉంటుంది.

4. మనిషి తలమీద లక్షకుపైగానే వెంట్రుకలు వుంటాయి. నల్లని జుట్టుగల వాళ్ళకంటే రాగిరంగు జుట్టుగల వాళ్ళ తలలో ఎక్కువ వెంట్రుకలుంటాయి. తల వెంట్రుకలు చాల బలంగా ఉంటాయి. వెంట్రుకలన్నిటిపైనా బరువు సమంగా పడినట్లయితే ఒక్క మనిషి తల వెంట్రుకలతో అయిదు టన్నుల బరువును ఎత్తవచ్చును.

5. మన రక్తం నీటికంటే ఆరురెట్లు ఎక్కువ చిక్కగా ఉంటుంది.

— కోనే నాగవెంకట అంజనేయులు.

ఆ పరికరాలను వుపయోగించే విధం కూడా ఆ షెల్ఫ్‌లోనే వున్న పుస్తకంలోని రేఖా చిత్రాల ద్వారా తెలుసుకో వచ్చు.''

"థాంక్యూ బాస్!"

"మిష్టర్ కమలాకర్. మీ హెల్త్ ఎలావుంది? ఆక్సిజన్ వుపయోగించడంలో అవరోధాలు ఏమీ లేవుకదా?"

"లేవుబాస్! కానీ పద్మాకర్ బాగా అలిసిపోయాడు. అతనికి కొంచం విశ్రాంతి కావాలని భావిస్తున్నాను."

"ఆల్‌రైట్. వెంటనే విశ్రాంతి తీసుకోమను" అని ఓ నిమిషం ఆగి ప్రక్కనేవున్న డాక్టర్ థామస్‌కు విషయం తెలియచేశాడు మిశ్రా. వెంటనే థామస్ ఏం చేయవలసిందీ చెప్పాడు.

మళ్ళీ వైర్‌లెస్‌లో మాట్లాడుతూ, "మిష్టర్ కమలాకర్, పద్మాకర్‌ని అతని మాస్క్‌లోని 102 వ పాకెట్‌లో వున్న టేబ్లెట్సులో ఓ టేబ్లెటును మ్రింగమను. సరిగ్గా 20 గంటలు పూర్తి నిద్రపడుతుంది" చెప్పాడు మిశ్రా.

7

మార్స్-2 కమాండ్ మాడ్యూల్ (స్పేస్‌షిప్) అంతరిక్షంలో వాయువేగ, మనోవేగంతో ప్రయాణిస్తోంది.

వ్యోమగామి పద్మాకర్ పూర్తిగా కోలుకున్నాడు. ఏరోజు కారోజు డాక్టర్ థామస్‌కు తమ మెడికల్ రిపోర్టును పంపుతూనే వున్నారు.

స్పేస్‌షిప్ కాప్స్యూల్‌లో బిగింపబడివున్న 'ఏస్ట్రో అల్టిమేటర్' వైపు చూశాడు పద్మాకర్.

ఏస్ట్రో అల్టిమేటర్ స్పేస్‌షిప్ భూమికి ఎంత ఎత్తులో

వున్నదీ తెలియచేస్తుంది. అల్టివేటర్‌లో మీటర్ రీడింగ్, స్పేస్ షిప్ శూన్యంలో ప్రయాణిస్తున్నప్పుడు నిమిష నిమిషానికి మారుతూ వుంటుంది. ఒక కక్ష్యలో పరిభ్రమిస్తున్నప్పుడు మాత్రం రీడింగ్ మారకుండా స్టాండర్డుగా వుంటుంది.

అప్పటికి సరిగ్గా స్పేస్‌షిప్ భూమికి రెండు లక్షలమైళ్ల దూరంలో వుంది. ఏస్ట్రో అల్టివేటర్‌లో రీడింగ్ మారడం ఆగిపోయి, ఒక స్టాండర్డ్ రీడింగ్ నిలిచి పోయింది.

'అంటే, స్పేస్‌షిప్ కక్ష్యలో ప్రవేశించి పరిభ్రమిస్తోందన్న మాట!' అనుకున్నారు యిద్దరు వ్యోమగాములూ కలిసి.

గ్రౌండ్ కంట్రోల్ నుండి సిగ్నల్స్ వచ్చాయి.

గబగబ రెండు మీటలు నొక్కి- "స్పీకింగ్ ఫ్రం మార్స్-2 స్పీకింగ్ ఫ్రం మార్స్-2" అని పల్కాడు పద్మాకర్ వైర్ లెస్‌లో.

"డియర్ ఏస్ట్రోనాట్స్! ప్రస్తుతం మీరు ఎక్కడ వున్నారో తెలుసా?" అడిగాడు గ్రౌండ్ కంట్రోల్‌నుండ డైరెక్టర్ మిశ్రా.

"ఎస్ బాస్! సరిగ్గా భూమికి రెండు లక్షల మైళ్ళ దూరంలోవున్న కక్ష్యలో పరిభ్రమిస్తున్నాం" చెప్పాడు కమలాకర్.

"అంతేకాదు మిష్టర్, చంద్రుని కక్ష్యకు 40 వేల మైళ్ళ దూరంలో వున్నారు మీరు, మరో నాలుగు గంటలలో మీరు చంద్ర కక్ష్యలో ప్రవేశించబోతున్నారు."

"ఎస్ బాస్, ప్రొసీడ్..." ఉత్సాహంగా అన్నాడు పద్మాకర్.

"మీరు చంద్ర కక్ష్యలో రెండు రోజులు పరిభ్రమిస్తారు. ఆ రెండు రోజులలో మీరు చేయవలసిన పనులు చాలా

వున్నాయి. అయినా మరోసారి చెప్తాను, మీకు బాగా గుర్తుండటానికి!''

''బాస్, మూన్‌పై లిటిల్ మాడ్యూల్ ద్వారా లాండ్ అవమంటారా?'' అడిగాడు పద్మాకర్.

''నో మిష్టర్! ప్లీజ్ పే ఎటెన్షన్! చెప్పిన పని జాగ్రత్తగా చేయండి. ఏమాత్రం తొందర పడొద్దు'' హెచ్చరించాడు మిశ్రా.

''ఎస్ బాస్!'' అన్నాడు పద్మాకర్ క్షమార్పణ అర్థిస్తూ.

''ఆల్ రైటు, జాగ్రత్తగా వినండి. మీ దగ్గర అస్ట్రాలజీ సెంటర్ ప్రొఫెసర్సు తయారుచేసిన చంద్రుని గురించిన మాప్స్ వున్నాయి. వాటిలో కొన్ని ప్రదేశాలు మార్కు చేయబడి వుంటాయి. బాగా గుర్తు తెచ్చుకోండి. మీకు లాబ్‌లో అన్నీ ప్రాక్టికల్‌గా చూపించాం. ఆ మార్కు చేయబడివున్న భాగాలను ఫొటోస్ తీయండి.''

''ఎస్ బాస్!''

''నెక్ట్స్ మీరు చేయవలసిన ముఖ్యమైన పనిని మరోసారి గుర్తు చేస్తున్నాను. చంద్ర కక్ష్యలోకి చేరిన మరుక్షణం మీ రా కర్తవ్యాన్ని నిర్వర్తించవలసి వుంటుంది. లిటిల్ మాడ్యూల్ ద్వారా లూనార్ రిఫ్లెక్టర్ అనే పరికరాన్ని చంద్రుని పైకి మీరు దింపాలి. ఆ రిఫ్లెక్టర్ ద్వారా చంద్రుని గురించిన అనేక వివరాలు తెలుస్తాయి.''

''ఓ. కె. బాస్!''

''వెల్. విష్ యు గుడ్ లక్. ఓవర్ ....'' బాస్ మిశ్రా రూపం కాప్స్యూల్‌లోని టి. వి. స్క్రీన్‌పైనుండి తొలగిపోయి, సురేష్ కుమార్ కన్పించసాగాడు.

(సశేషం)

క్రైమ్‌లో తమాషాలు

రచయిత్రి?

"పోస్టుసార్!"

కేక వింటూనే మమ్మి వాకిట్లోకి రయ్యిన పరుగెత్తింది.

"పరిశోధన. మాసపత్రిక వచ్చింది" మమ్మి మాటలు వింటూనే డాడీ చటుక్కున మమ్మి చేతిలోంచి పరిశోధన లాక్కున్నారు.

మమ్మి మూతి ముడుచుకు కూర్చుంది.

మరోసమయంలో అయితే మమ్మికి కోపంవస్తే కనీసం గంట బ్రతిమిలాడుతారు డాడీ.

పరిశోధన చేతిలోవుంటే మమ్మి కోపానికి విలువలేదు.

మమ్మి, డాడీ తరువాతే 'పరిశోధన' నాచేతికి వచ్చేది.

ఎంత ముద్దుల కూతురు నయినా "పరిశోధన" మాస పత్రిక తరువాతే నేను.

"యీనెల పోటీలో హంతకుడిని చక్కగా పట్టిచ్చినందుకు మన బాబీకి మొదటి బహుమతి రూ. 50 వచ్చిందేవ్, రాణీ!" డాడీ ఆనందంతో చెప్పారు.

మమ్మి కోపం మరచిపోయి సంతోషంతో డాడీ దగ్గరకు వెళ్ళింది.

"అబ్బా, ఆరునెలల బట్టీ హంతకుడిని పట్టుకొనే పోటీకి పంపినా ఒక్కసారీ గెలిపించలేదు. యీనెల గెలిచాను" అనుకుంటూ మమ్మి చేతిలో పుస్తకం లాక్కున్నాను.

యీవిషయం తెలిపిన అందరూ నన్ను ఓసారి మెచ్చుకొని వెళ్ళారు యిరుగు పొరుగు.

పరిశోధనలో గెలవటం ఓపక్క సంతోషం మరోవైపు చిరాకు కలిగించింది.

కారణం. గత ఏడాది బట్టీ 'పరిశోధన'లో మిస్ బాబీ పేరుతో ఏడు కధలు పడ్డాయి. చదివిన పాఠకులు బాగున్నాయి కధలు అన్నారు. కాని....నా ఎడ్రస్ లేనందున ఇంటికి లెటర్స్ రాలేదు.

పరిశోధన పోటీలో గెలిచిన సందర్భంలో నా అడ్రస్ పుస్తకంలో వెయ్యటం జరిగింది. అంతే, ఇంటికి రోజుకు అరడజను లెటర్స్ రావటం మొదలయాయి పెన్‌ఫ్రెండ్స్ మంటూ....

అన్నీ ఒకేరకం. వ్రాసిన అందరూ పురుష పుంగవులే. ఆ లెటర్స్‌లో....

"మిస్ బాబీగారూ! మీ అసలుపేరు ఏమిటి? మీరు డింపుల్ కపాడియాలాగా వుంటారా?" అని ఒకడు.... "మిస్ బాబీ! నాలెటర్ చదివి రిప్లయి యివ్వకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటాను" అని మరొకడు. "బాబీ! నేను ధర్మేంద్ర అంత అందంగా వుంటాను. ఎస్. పి. బి. కన్నా చక్కగా పాడతాను. బి. యి. చదువుతున్నాను. రమ్మంటే మీ ఇంటికి వస్తాను. వెరీ వెరీ అర్జంటుగా రిప్లయి యిస్తావు కదూ స్వీట్ బాబీ!" అంటూ వేరొకరు. అన్నీ తమాషా లెటర్సు.

ఒక్క జాబుకీ రిప్లయి 'నో' అంతే. యిలాటి పెన్‌ఫ్రెండ్స్ అంటే చిరాకు నాకు.

పదిరోజుల తరువాత ఒకతను "రచయిత్రి బాబీగారి హౌస్ యిదేనా?" అంటూ సరాసరి మా ఇంటికి వచ్చాడు.

హిప్పిబాబు అవతారంతో.

డాడీ మర్యాదగా ఆహ్వానించి టీ యిచ్చారు. నసుగుతూ, నసుగుతూ బాబీని చూస్తానని అడిగాడు.

అప్పుడు డాడీ నన్ను పిలిచారు. గదిలోకి అడుగు పెట్టాను అతగాడిని చూడటానికి.

డాడీ పక్క-కెళ్ళి కూర్చున్నాను వినయంగా.

"మిష్టర్! మిస్ బాబీ మా ఏకైక సంతానం. మొన్ననే పదో ఏడు వచ్చింది మా బాబీపేరుతో పరిశోధనలో వ్రాసేది నేనే" "అంటూ అంకుల్‌కు నమస్తేచెప్పు బాబీ!" అన్నారు డాడీ నాతో.

తెల్లబోయి చూస్తున్న కొత్త అంకుల్‌కు నవ్వుతూ నమస్తే చెప్పాను.

—మిస్. కోహినూర్, గుంటూరు-2

పిరికివాని ధైర్యము

బాగా త్రాగి తూలుతూ ఇంటికొచ్చాడు తిప్పడు. ఇంటి ముందరున్న గుంపునుచూసి ఏమయిందని అడిగాడు. "పాము, పాము" అని అరచి ఒక మూల చూపించారు.

అంతే, తిప్పడికి ఎక్కడ లేని ధైర్యమువచ్చి, ఆ పాము తోక పట్టుకొని గిర, గిర త్రిప్పి నేలకేసి కొట్టి, దాన్ని చంపి యింటిలోకి వెళ్ళిపోయాడు.

బాగా త్రాగియుండుటవలన వెంటనే నిద్రవచ్చింది.

మర్నాడు ఉదయము నిద్రలేస్తూనే అతని భార్య ఇలా అన్నది-"ఎంత ధైర్యమండి మీకు? ఆ పాముని అవలీలగా చంపేశారు!"

తిప్పడు భయపడి "పామా? నేనా? ఎప్పుడు? ఎక్కడా?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

అతని భార్య పాము పడివున్న చోటు చూపించింది.

అంతే! ఆ పెద్ద త్రాచు పామును తాను చంపానని తెలియగానే గుండాగి చచ్చిపోయాడు, ఆ పిరికి తిప్పడు.

—ఎస్. వాసుదేవాచార్, ఆలూరు.

ప్రాణ భయం?

రాజు భయభయంగా. తన ఎదురుగా నిలబడివున్న ఆ మాంత్రికుడికేసి చూసాడు

ఆరడుగుల ఎత్తు. తల నిండుగా జుత్తు పేరుకొని జడలు, జడలుగా వ్రేలాడుతున్నాయ్. కాషాయ రంగులోవున్న దుస్తులు, నుదుటిమీద పెద్ద కుంకుమ బొట్టు, నల్లని పెద్దపెద్ద కళ్లు, మహాభయంకరంగా వున్నాడు. దూరంగా ఒక బలి పీఠం. దానిమీద ఒక గొడ్డలి.

అతను అడుగులు వేసుకుంటూ రాజు దగ్గరికి వచ్చాడు. బల్లమీద పేర్చి పెట్టబడివున్న వస్తువుల వంక చూపించాడు.

బల్ల మీద విషద్రావకంలా కనిపిస్తున్న నల్లని మందు సీసా ఒకటి, పెద్ద తామరాకుమీద రెండు మాత్రలు, వాటి ప్రక్కనే లావుగావున్న పొడుగాటి త్రాడు వున్నాయి.

"ఈ మూడింటిలో నీ కిష్టమైనది ఎన్నుకో....ఆ చాన్స్ నీకే వదలి పెడుతున్నాను....నా దృష్టిలో ఏదైనా ఒకటే....తప్పీమని ఎగిరిపోవడానికి!"

మాంత్రికుడు గలగలా నవ్వాడు.

రాజు గుండెలు దడ, దడ లాడాయి.

"మాత్రలు మింగావంటే బహుశా ఒక గంటయినా కావాలి పనిచేయడానికి. లేదు ఈ చేంతాడతో అయిదు నిమిషాలు పని. ముళ్లువేసి ఉచ్చు బిగించాలి. అంతే! కాదనుకుంటే ఆ సీసా తీసుకో ఏది వద్దాన్నావంటే, ఇదుగో నా

చేతుల వంక చూడు!" మాంత్రికుడు డొడ్డు కర్రలా వున్న తన చేతుల్ని అతని కంఠం దగ్గరకు తీసుకు వచ్చాడు.

రాజు అటూ ఇటూ చూసి, తటాలున గుమ్మం వైపుకి మెరుపు వేగంతో పరుగెత్తాడు.

"అదో!....బుల్లోడు పారిపోతున్నాడు వాణ్ణి పట్టుకొని లాక్కురండి ..." అన్నాడు మాంత్రికుడు కోపంతో. అతని అనుచరులు రాజుని పట్టుకొని లోపలకు లాక్కువచ్చారు.

మాంత్రికుడు తటాలున రాజుని ఒడిసి పట్టుకొని మరో బల్ల మీద పడుకోబెట్టాడు. ముక్కుమూసి, నోరు బలవంతాన తెరిపించి, తామరాకు మీదున్న మాత్రల్ని నోట్లోవేసి నీళ్ళు పోసాడు. వాటిని మింగీ మింగగానే మాంత్రికుడు తాడును అందుకొని రాజు నడుము చుట్టూ బిగించి, గట్టిగా మెలి పెట్టాడు.

రాజు భయంతో, బాధతో నడుము కదిలిస్తూ కేకలు వేసాడు.

మాంత్రికుడు నిర్లక్ష్యంగా అతనికేసి చూసి, సీసా తెరిచి లోపలవున్న ద్రావకాన్ని అతని వొంటిమీద కుమ్మరించాడు. అతని చేతులు ఆ నూనెతో అద్ది కండరాల్ని తోమడం ప్రారంభించాడు.

"దొడ్డ దొరా. ఆయుర్వేద వైద్యుడిగా నీకున్న పేరుని విని మా అబ్బాయిని తోడుకుని ఇంత దూరం వచ్చాము. వారం రోజుల క్రితం మేడమీదినుండి క్రింద పడినప్పుడు వాడి నడుము బెణికింది ఒకటే బాధపడుతున్నాడు," అన్నారు అంతవరకు అక్కడే ఒక మూలనిలబడి అతని చర్యలు గమనిస్తున్న రాజు తల్లిదండ్రులు.

"మీరేం భయపడకండమ్మా! నా దెబ్బపడితే దయ్యమైన ఎగిరి పోవలసిందే. మాత్రలు మింగింపడమేకాదు. వురితాడు

వైద్యంచేసి, నడుముకూడ తోమాను కదా?'' అన్నాడు ఆ వైద్యుడు, విజయగర్వంతో.

రాజు మాత్రం నొప్పితో ఇంకా అరుస్తూనే వున్నాడు.

—కర్నాటి నాగభూషణం, హైద్రాబాదు.

రెండు విజిల్స్!!

భార్యకి మంచి ప్రెజెంట్ కొందామని నగలషాపు కెళ్ళి ఒక వుంగరం సెలక్టు చేసాడు రావ్.

''ధర ఎంత'' అడిగాడు రావ్.

''వెయ్యిరూపాయలు'' సమాధాన మిచ్చాడు సేల్స్‌మేన్.

అంత చవకగా వున్నందుకు వుత్సాహంగా విజిల్ వేసాడు రావ్.

బయటకి రాబోతూ మూలగావున్న ఇంకో వుంగరాన్ని చూసి, దాని ధర అడిగాడు రావ్.

''రెండు విజిల్స్'' చెప్పాడు సెల్స్‌మన్.

—కరుణ, విజయవాడ-11.

హత్య?

కోర్టులో ప్లీడరు హంతకుడిని ప్రశ్నలతో విసిగిస్తున్నాడు—

ప్లీడరు: నీవు హత్యచేసింది ప్లీడరని తెలుసా?

హంతకుడు: తెలుసు?

ప్లీడరు: ఆయన్ని ఎందుకు హత్యచేశావ్?

హంతకుడు: క్రిందటసారి కోర్టుకు వచ్చినప్పుడు నీలాగే విసిగించినందుకు!?

—ఎస్. వి. సురేష్, విజయవాడ-4 ★